
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+4 వెల: ₹ 5.50


సంపుటి: 17
సంచిక: 284



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


R.S. Brothers
సంక్రాంతి సంబరాలకై
సరికొత్త కలెక్షన్
ఛాలెంజ్ ఆఫర్స్
అబ్బురపరిచే ఆఫర్లు... అత్యధిక సేవింగ్స్
₹14850 ₹10995 KALYANA PATTU
SILK SAREES
₹10650 ₹7995 MEENAKSHI PATTU
₹17350 ₹12995 SWARNA PATTU
UPTO 68% OFF ₹14850 ₹10995 ARNI PATTU
SAVE 4755/– ₹14850 ₹10995 PASIDI PATTU
సంక్రాంతి
వేడుకలు
₹350 ₹225 PATOLA SILK
₹350 ₹225 VIVANTA PATTU
₹450 ₹295 ROYAL GARDEN
₹550 ₹399 MANBHARI
₹550 ₹395 KANJIVARAM COOPER
₹650 ₹499 ANAMIKA SILK
₹650 ₹499 PATOLA SILK
₹650 ₹495 LINAN KICHA RP
₹650 ₹495 CHIKANKARI COTTON
₹950 ₹495 GANGA PATTU
₹795 ₹550 SAFARI SILK
₹450 ₹295 SAVITRI SILK
₹795 ₹550 FOREST SILK
₹750 ₹550 ABHISHA SILK
₹995 ₹650 JESSICA SILK
₹450 ₹295 DHARMVARAM SILK
₹995 ₹750 PURE SILK
₹995 ₹750 NAVYA
₹1150 ₹795 MUSHROOM SILK
₹1150 ₹795 TURTLE SILK
₹1150 ₹795 MELONI SILK
₹1150 ₹798 CUSTARD SILK
₹1150 ₹798 MAHELE SILK
₹1195 ₹850 DIOR SILK
₹1250 ₹998 PINDHORI SILK
₹1295 ₹950 CHINON DHARTI
₹1450 ₹995 CHINON RP BUTTA
₹1595 ₹1250 SHIPHIRE SILK
₹1650 ₹1125 CROPE BENTEX
₹1650 ₹1125 SATIN MIX
₹1650 ₹1195 SREE SILK
₹1750 ₹1195 UNIQUE GEORGETLE
₹1895 ₹1350 ARMANI SILK
₹1950 ₹1495 LEONE SILK SILVER
₹4850 ₹3995 BANARASI KHADI MEENA JALL
SAREES
₹995 ₹750 DOLA BORDER
₹1250 ₹895 MASHROO CRAPE
₹1750 ₹1295 KAVERI PATTU
₹1750 ₹1295 IKKAT PATTU SAREES
₹2895 ₹2150 SAMPOORNA SILVER MEENA
2 pcs ₹2795 TIMVA PATTU SAREES
₹4150 ₹2995 VANAJAKSHI PATTU
₹4650 ₹3495 LEPAKSHI PATTU
₹4925 ₹3850 BANARASI KHADI BUTTA
SPOT GIFTS
50% OFF CASUAL KURTHIS
50% OFF JEANS & WOMEN PANTS
buy 3 ₹555 PALAZO
buy 3 ₹444 NIGHTY
buy 3 ₹1199 NIGHT DRESS
starts @ ₹295 ONWARDS T-SHIRTS
buy 2 ₹799 DRESS MATERIALS
LEHANGAS UPTO 50% OFF
buy 2 combo ₹1499 PATIYALA SET
buy 1 @ ₹349 buy 2@ ₹595 CUTE COLOUR LEGGINGS
LADIES WESTERN, TRADITIONAL WEAR
ప్రతి ₹1000 కొనుగోలు పై
ఆకర్షణీయమైన
బహుమతులు పొందండి
Shop on EMI
UPTO ₹10,000/- Instant Discount
MENS WEAR
ON ALL MAJOR BRANDS
UPTO 40% OFF
KIDS WEAR
50% OFF
₹495 GIRLS SKIRTS
₹795 BOYS SHIRTS
M TO XL ₹595 BOYS COTTON CAPRIS
6 TO 18 ₹895 BOYS COTTON CAPRIS
₹645 BOYS SHIRTS
₹695 BOYS SHIRTS
6 TO 18 ₹795 BOYS COTTON CAPRIS
₹995 GIRLS PALAZO SET
₹895 BOYS SHIRTS
₹1195 BOYS PANTS
₹1295 BOYS PANTS
₹1395 BOYS PANTS
3 PCS ₹645 GIRLS COTTON FROCKS
4 PCS ₹600 BOYS SHORTS
4 PCS ₹500 GIRLS T-SHIRTS
4 PCS ₹600 GIRLS SHORTS
3 PCS ₹845 GIRLS COTTON FROCKS
4 PCS ₹600 BOYS HOUSRY CAPRIS
4 PCS ₹500 GIRLS SHORTS
4 PCS ₹550 GIRLS& BOYS SHORTS
KIDS WEAR
R.S. Brothers™
బందరు రోడ్, విజయవాడ.
ఫోన్ : 0866 249900
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net
Follow us on : RSBrothersIndia rsbrothersindia



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 284

శనివారం 4-1-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




బౌలింగ్‌పైనే భారం

సిడ్నీలోనూ మారని భారత్ ఆటతీరు.. తొలి ఇన్నింగ్స్‌లో 185కు ఆలౌట్ - 11లో

బ్యాంక్‌నెట్ పోర్టల్ ప్రారంభం

BAANKNET Bank Asset Auction Network

బ్యాంకులు స్వాధీనం చేసుకున్న ఆస్తులన్నీ ఈ పోర్టల్‌లోనే వేలం - 11లో



చైనాలో మరో వైరస్ పంజా

చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ పంజా విసురుతోంది. వందల మంది ఆస్పత్రులపాలైన దృశ్యాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.

వివరాలు 6లో ▸



మోదీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

ఆప్ అంటే అవినీతి, ఆపద అంటూ ప్రధాని మోదీ చేసిన విమర్శలపై ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



షినవత్ర ఆస్తులు 3,431 కోట్లు

థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర తనకు రూ. 3,431 కోట్ల ఆస్తులున్నట్లు అవినీతి నిరోధక కమిషన్‌కు డిక్లరేషన్ ఇచ్చారు.

వివరాలు 6లో ▸



అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

సంధ్య థియేటర్ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీనటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది.

వివరాలు 9లో ▸

'సుప్రీం' కేసులో ఇంత నిర్లక్ష్యమా..?

'మార్గదర్శి'పై మరెన్నాళ్లు?



ఇంకెన్నాళ్లకు కౌంటర్లు దాఖలు చేస్తారు?.. ఇది ఎంత మాత్రం సహించరానిది

ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

కౌంటర్లు వేస్తామని గత విచారణ సమయంలోనే చెప్పారు

అయినా కూడా ఎందుకు దాఖలు చేయలేదు?

ఇప్పటి వరకు 13 సార్లు విచారణ వాయిదా వేశాం

మూడు వారాల్లో కౌంటర్లు వేయాల్సిందే.. ఇదే చివరి అవకాశం.. లేదంటే కోర్టు ముందు హాజరు కావాలి

ఇరు ప్రభుత్వాల ముఖ్య కార్యదర్శులకు స్పష్టీకరణ

200కిపైగా పేజీలతో మార్గదర్శి, కిరణ్ దాఖలు చేసిన రిప్లైపై అదనపు కౌంటర్ వేస్తామన్న ఆర్బీఐ

అందుకు అంగీకరిస్తూ మూడు వారాల గడువునిచ్చిన ధర్మాసనం.. రిప్లై కాపీని ఉండవల్లికి ఇవ్వాలని మార్గదర్శికి హైకోర్టు ఆదేశం

తదుపరి విచారణ ఈ నెల 31కి వాయిదా

2లో

"మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక అవకతవకలపై ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్ దాఖలు చేస్తారు? స్వయంగా సుప్రీం కోర్టు విచారణకు పంపిన కేసులో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత మాత్రం సహించరానిది. గత జూన్‌లో విచారణ ప్రారంభించి ఇప్పటి వరకు 13 సార్లు వాయిదాలు వేశాం. కౌంటర్లు దాఖలు చేస్తామని గత విచారణ సమయంలోనే చెప్పారు. అయినా కౌంటర్ దాఖలు చేయపోవడానికి కారణాలేంటో చెప్పండి. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాల్సిందే. ఇదే చివరి అవకాశం. లేకపోతే తదుపరి విచారణకు ఇరు రాష్ట్రాల సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు కోర్టు ముందు హాజరవ్వాల్సి ఉంటుంది.

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

- రామోజీరావు 1972లో హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు.
- 1997లో కేంద్రం తెచ్చిన చట్టం ప్రకారం హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్ కార్పొరేటెడ్ సంస్థలు వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషేధం.
- అయినా మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి 2006 మార్చి నాటికి దాదాపు రూ.2,610.38 కోట్లు వసూలు చేసింది.
- ఆర్బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)ను మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘించిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఇప్పటికే కోర్టుకు తెలిపింది.
- మార్గదర్శి డిపాజిట్ల వ్యవహారం నిగ్గు తేలాల్సిందేనని సుప్రీంకోర్టు సైతం తేల్చి చెప్పింది.

ఏ బ్యాంక్‌లో అయినా ఈపీఎఫ్ పెన్షన్

11లో

డాలర్ డ్రీమ్స్‌పై మరో పిడుగు?

- అంతర్జాతీయ విద్యార్థులకు 'వర్క్ పర్మిట్'ను రద్దు చేయాలని అమెరికన్ల డిమాండ్
- ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేదని ఆరోపణ

6లో

దివ్యాంగుల పింఛన్లలో కోత!

8.18 లక్షల పింఛన్‌దారులకు చంద్రబాబు సర్కారు అర్హత పరీక్షలు

తొలి విడతలో పక్షవాతం, కండరాల జబ్బులతో కదల్లేని వారికి పరీక్షలు

- ఇంటికే వచ్చి పరీక్షలు చేయనున్న వైద్య బృందం
- ఆ సమయానికి ఇంట్లో లేకపోతే పింఛను నిలిచి పోయినట్టే.. మలి విడతలో ఇతర రోగులు, దివ్యాంగులకు ఆస్పత్రుల్లో పరీక్షలు
- నిర్ణీత తేదీలో పరీక్షలకు హాజరుకాకపోతే అనర్హత వేటే.. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు నుంచి పింఛన్లలో కోతలకు రకరకాల యత్నాలు

2లో





రౌడీ సర్కార్!

- బలవంతంగా కృష్ణా జిల్లా మల్లవల్లిలో భూముల స్వాధీనం
- ప్రభుత్వ ముఖ్య నేత కనుసైగతో కొనసాగిన దౌర్జన్యకాండ
- తెల్లారక ముందే పోలీసుల మోహరింపు
- ఒక్క నిర్వాసితుడూ బయటకు రాకుండా గృహ నిర్బంధం
- పారిశ్రామికవాడ భూముల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు
- పరిహారం చెల్లించకుండానే లాక్కోవటంపై రైతుల ఆగ్రహం

7లో



కొత్తగా ఏడు విమానాశ్రయాలు

- రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై సీఎం చంద్రబాబు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, తుని-అన్నవరం, ఒంగోలులో కొత్త ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చెప్పారు. శ్రీసిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

- వివరాలు 8లో



మా ముందు చెప్పులతో

నడవొద్దు!

- మా వీధుల్లో తిరగొద్దు.. ఊర్లోనే ఉండొద్దు.. దళితులపై రెచ్చిపోయిన టీడీపీ రౌడీమూకలు
- ఎదురు తిరిగినందుకు దాడి.. ఎనిమిది బైక్‌లు దహనం
- బాధితులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలపైనా దాడి.. కేసులు
- వైఎస్సార్‌సీపీ వారే మాపై దాడి చేశారంటూ టీడీపీ రివర్స్ గేర్
- కలెక్టర్, ఎస్పీలు మాకు న్యాయం చెయ్యాలి : దళిత మహిళలు

9లో

రక్షణ వ్యయంలో 4వ స్థానం



ప్రపంచంలో 2023లో రక్షణ రంగానికి అత్యధిక వ్యయం చేసిన దేశాల జాబితాలో మనదేశం నాలుగో స్థానంలో నిలిచింది. 2023లో మనదేశం 83.6 బిలియన్ డాలర్లు రక్షణ రంగానికి ఖర్చు చేసింది. ఇది జీడీపీలో 2.4 శాతం. మొత్తంగా ప్రపంచ దేశాలు చేసిన వ్యయంలో ఇది 3.4 శాతం. ప్రపంచంలో రక్షణ రంగానికి అత్యధిక వ్యయం చేస్తున్న దేశం అమెరికా. ఆ తరవాతి స్థానంలో చైనా, రష్యా ఉన్నాయి. టాప్ - 5 దేశాల మొత్తం వ్యయం.. 1,481 బిలియన్ డాలర్లు. ఇది ప్రపంచ వ్యయంలో 61 శాతం. టాప్ - 10 దేశాల్లో.. జీడీపీలో అత్యధికంగా 37 శాతం ఖర్చు చేసిన దేశం ఉక్రెయిన్ కాగా, తరవాతి స్థానంలో సౌదీ అరేబియా (7.1 శాతం) ఉంది.

దేశం	2023 వ్యయం (బిలియన్ డాలర్లలో)	ప్రపంచ వ్యయంలో శాతం
అమెరికా	916	37
చైనా	296	12
రష్యా	109	4.5
భారత్	83.6	3.4
సౌదీ అరేబియా	75.8	3.1
యూకే	74.9	3.1
జర్మనీ	66.8	2.7
ఉక్రెయిన్	64.8	2.7

ఆధారం : స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

దివ్యాంగుల పింఛన్లలో కోత!

8.18 లక్షల పింఛన్‌దారులకు అర్హత పరీక్షలు

- తొలి విడతలో పక్షవాతం, కండరాల జబ్బులతో కదల్లేని వారికి పరీక్షలు
- ఇంటికే వచ్చి పరీక్షలు చేయనున్న వైద్య బృందం
- ఆ సమయానికి ఇంట్లో లేకపోతే పింఛను నిలిచిపోయినట్టే
- మలి విడతలో ఇతర రోగులు, దివ్యాంగులకు ఆస్పత్రుల్లో పరీక్షలు
- నిర్ణీత తేదీలో పరీక్షలకు హాజరుకాకపోతే అనర్హత వేటే
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు నుంచి పింఛన్లలో కోతలకు రకరకాల యత్నాలు

సాక్షి, అమరావతి: పింఛన్‌దారుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం కనికరం చూపడంలేదు. సాధ్యమైనంత మంది లబ్ధిదారులకు పింఛను రద్దు చేయడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దివ్యాంగులు, వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారినీ వదలడంలేదు. అంగ వైకల్యం, వివిధ రకాల వ్యాధులకు గురై పింఛన్లు పొందుతున్న మొత్తం 8,18,900 పింఛన్‌దారుల అర్హత, అనర్హతలను మరో విడత ప్రభుత్వ వైద్యుల ద్వారా పరిశీలన చేసేందుకు ప్రభుత్వం శుక్రవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. వీరిలో పక్షవాతం, తీవ్ర కండరాల బలహీనత వంటి జబ్బులతో పింఛను పొందుతున్న 24,091 మందినీ పరీక్షించాల్సిందేనని స్పష్టం చేసింది. ఇందుకు ఇచ్చిన మార్గదర్శకాలూ కఠినంగా ఉన్నాయి. నిర్ణీత సమయానికి వారికి పరీక్ష జరగకపోతే పింఛను రద్దయినట్లే. పక్షవాతం, కండరాల వ్యాధులతో బాధ పడుతున్న వారిని వైద్య బృందాలు ఇంటికి వెళ్లి పరీక్షించాలని ఆదేశించింది. ప్రభుత్వ వైద్యులు ఇంటికి వచ్చిన సమయంలో వీరు అందుబాటులో లేకపోతే పింఛను రద్దయినట్లే. దివ్యాంగులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 7.95 లక్షల మంది ప్రభుత్వం నిర్ణయించిన తేదీన వైద్యుల కమిటీల ముందు పునః పరీక్షలు చేయించుకోవాలని మార్గదర్శకాలలో పేర్కొంది. వీరు



నిర్ణీత తేదీన వైద్యుల బృందం ముందు హాజరు కాకపోతే పింఛను నిలిపివేస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మెమో జారీ చేశారు.

నేటి నుంచే తొలి దశ పరీక్షలు

తొలి దశలో శనివారం నుంచే పక్షవాతం, తీవ్ర కండరాల బలహీనత తరహా వ్యాధులతో బాధపడుతూ పింఛన్లు తీసుకుంటున్న 24,091 మందికి ఇంటింటికీ వెళ్లి అర్హత పరీక్షలు చేస్తారు. ఇందుకోసం 112 వైద్య బృందాలను నియమించారు. ప్రతి బృందంలో ఎముకల డాక్టర్, జనరల్ మెడిసిన్, లబ్ధిదారుని ఏరియా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. 88 రోజుల పాటు తొలి దశ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత మిగిలిన 7.95 లక్షలమంది దివ్యాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులు, ఇతర రోగాల కారణంగా పింఛన్ పొందుతున్న వారికి ప్రభుత్వాసుపత్రుల వద్ద కొత్తగా వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది.

పరీక్షల నిర్వహణకు కమిటీలు

- ఈ పరీక్షల నిర్వహణకు ప్రతి జిల్లాలో ఆ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డీఆర్‌డీఏ పీడీ కన్వీనర్‌గా 11 మంది జిల్లా స్థాయి అధికారులతో కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ జిల్లా కమిటీలు మండలాలు, మున్సిపాలిటీల వారీగా లబ్ధిదారుల వైద్య పరీక్షలకు షెడ్యూల్ రూపొందిస్తాయి.
- ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని పింఛనుదారులకు ఏ తేదీలో పరీక్షలు చేయాలో నిర్ణయించి, ఆ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ముందుగా లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తారు. వైద్య బృందం ఇంటికి వెళ్లినప్పుడు పక్షవాతం లేదా కండరాల వ్యాధితో పింఛను పొందుతున్న లబ్ధిదారు లేకపోతే పింఛను నిలిపివేస్తారు. అదేవిధంగా దివ్యాంగులు, ఇతర వ్యాధుల పింఛనుదారులు నిర్ణయించిన తేదీకి నిర్ణీత వైద్య బృందం ఎదుట హాజరు కాకపోయినా తని పింఛన్‌ను హోల్డ్‌లో పెట్టాలని ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది.
- ఒక్కో వైద్య బృందం రోజుకు 25 మంది పింఛనుదారులకు అర్హత- అనర్హతల పరిశీలనతో పాటు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టారు. లబ్ధిదారునికి గతంలో పింఛను పొందేందుకు వైద్య పరీక్షలు చేసిన వైద్యులు కాకుండా కొత్త వారి ద్వారా ఇప్పుడు పరీక్షలు చేస్తారు.
- ఈ మొత్తం కార్యక్రమం పర్యవేక్షణకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తారు. వైద్య బృందాలు పరీక్షలు చేసే పింఛన్‌దారులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. పునఃసమీక్షలో నిర్ధారించిన వాటిలో కనీసం 5 శాతం లబ్ధిదారులను కలెక్టర్లు సోషల్ ఆడిట్ చేయడానికి అదనంగా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేస్తారు.

‘సుప్రీం’ కేసులో ఇంత నిర్లక్ష్యమా..?
‘మార్గదర్శి’పై మరెన్నాళ్లు?

ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

మూడు వారాల్లో కౌంటర్లు వేయాల్సిందే.. ఇదే చివరి అవకాశం



సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ ఆర్థిక అవకతవకలపై కౌంటర్లు దాఖలు చేయాలన్న తమ ఆదేశాలను పట్టించుకోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్ దాఖలు చేస్తారని ఇరు ప్రభుత్వాలను నిలదీసింది. స్వయంగా సుప్రీంకోర్టు విచారణకు పంపిన కేసులో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత మాత్రం సహించరానిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత జూన్‌లో విచారణ ప్రారంభించి ఇప్పటి వరకు 13 సార్లు వాయిదాలు వేశామని గుర్తు చేసింది. కౌంటర్లు దాఖలు చేస్తామని గత విచారణ సమయంలోనే చెప్పారని, అయినప్పటికీ కౌంటర్ దాఖలు చేయపోవడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని తేల్చి చెప్పింది. లేని పక్షంలో తదుపరి విచారణకు తమ ముందు హాజరు కావాలని ఇరు రాష్ట్రాల సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి మూడు వారాల గడువునిచ్చింది. అంతేకాక రిప్లై కాపీని మాజీ ఎంపీ, కోర్టు సహాయకుడు ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందచేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త చెరుకూరి కిరణ్‌లను హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

‘సుప్రీం’ ఆదేశాలతో హైకోర్టు విచారణ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టేస్తూ 2018 డిసెంబర్ 31న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తెలప్రోలు రజనీ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశాయి. అదే విధంగా హైకోర్టు తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రామోజీ, మార్గదర్శి వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ అప్పీళ్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ దాన్ని రద్దు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై తిరిగి విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, రిజర్వ్ బ్యాంక్, ఏపీ సర్కార్‌తో సహా అందరి వాదనలు వినాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. గతేడాది నవంబర్ 7న విచారణ సందర్భంగా మార్గదర్శి ఆర్థిక అవకతవకలపై పూర్తి వివరాలతో నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేస్తామని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులు హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే. అయితే ఇరు ప్రభుత్వాలు కౌంటర్లు దాఖలు చేయలేదు. తాజాగా ఈ వ్యాజ్యాలపై జస్టిస్ సుజోయ్ పాల్ ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకుడిగా మాజీ ఎంపీ అరుణ్‌కుమార్, ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ్ రవిచందర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది (ఎస్‌జీపీ) బి.రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

6వ తేదీ కల్లా ఉండవల్లికి ఆ కాపీలు ఇవ్వండి..


ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణన్ రవిచందర్ స్పందిస్తూ 200కిపైగా పేజీలతో మార్గదర్శి ఫైనాన్సియర్స్, చెరుకూరి కిరణ్ గత నెల 19న రిప్లై దాఖలు చేశారని, దీనిపై తాము పూర్తి వివరాలతో అదనపు కౌంటర్ దాఖలు చేస్తామని నివేదించారు. ఇందుకు మూడు వారాల గడువునివ్వాలని కోరారు. అయితే కోర్టు ఆదేశాలు జారీ చేసినా కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పటి వరకు కౌంటర్లు దాఖలు చేయలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశించినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన రిప్లై కాపీని తనకు ఇవ్వలేదని ధర్మాసనానికి నివేదించారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ ఈ నెల 6వ తేదీలోపు ఆ రిప్లై కాపీని ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ని ఆదేశించింది.

కోర్టు ఆదేశాలను ఇలాగేనా అమలు చేసేది?

విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఇరు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకెన్నాళ్లకు కౌంటర్లు దాఖలు చేస్తారని నిలదీసింది. సుప్రీంకోర్టు పంపిన వ్యాజ్యాల్లోనూ ఇలా చేస్తే ఎలా? అంటూ మండిపడింది. కోర్టు ఆదేశాలను అమలు చేసేది ఇలాగేనా? అని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు ప్రభుత్వాలను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్‌కి మూడు వారాల గడువునిచ్చేందుకు ఇరుపక్షాలు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. దీంతో ధర్మాసనం ఉత్తర్వుల జారీకి సిద్ధమైంది. ఈ సమయంలో మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అడ్డుకుని మాట్లాడటంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. అనంతరం విచారణను ఈ నెల 31కి వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ల దాఖలు విషయంలో తమ ఆదేశాల అమలు నిమిత్తం ఉత్తర్వుల కాపీని అడ్వొకేట్ జనరల్ కార్యాలయానికి సోమవారం లోగా పంపాలని హైకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

రూ.వేల కోట్లు కొల్లగొట్టిన మార్గదర్శి ఫైనాన్షియర్స్

రామోజీరావు 1972లో హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు. 1997లో కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం తెచ్చింది. హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్‌కార్పొరేటెడ్ (చట్టపరంగా ఓ కంపెనీగా రిజిష్టర్ కాకుండా వ్యాపారం చేసేవి) సంస్థలు వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడాన్ని అది నిషేధించింది. అయినప్పటికీ రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి 2006 మార్చి నాటికి దాదాపు రూ.2,610.38 కోట్లు వసూలు చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా రామోజీరావు ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించడంపై అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ 2006 నవంబర్ 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. చట్ట విరుద్ధంగా మార్గదర్శి సేకరించిన డిపాజిట్ల వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని ఆర్‌బీఐ చేతులెత్తేయడంతో డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావులపై అప్పటి ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది.



RESERVE BANK OF INDIA
DEPARTMENT OF SUPERVISION
Secretariat Road, Saifabad,
HYDERABAD - 500 004.

DoS (FCM) H.No./ 554 /AP/MNBC/M-1/97-98 24.12.1997

M/s. Margadarsi Financiers,
Margadarsi House,
4-1-833/2, Abid Centre,
HYDERABAD - 500 001.

Dear Sir

Prohibition of acceptance of deposits by unincorporated bodies - RBI (Amendment) Act, 1997

It has been brought to our notice that your firm is accepting deposits from public which is in violation of the provisions of Section 45 S of the RBI (Amendment) Act, 1997. In this connection we invite your attention to the penal provisions contained in Section 58 B of the said Act for contravention of the provisions of Section 45 S. We advise you to comply with the relevant provisions of the RBI Act.

చట్టవిరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేస్తున్నారంటూ మార్గదర్శికి స్పష్టం చేసిన రిజర్వు బ్యాంక్ కాపీ

అక్రమాలను నిర్ధారించిన రంగాచారి

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలు, అవకతవకలను నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎస్.రంగాచారిని నియమిస్తూ 2006 డిసెంబర్ 19న జీవో 800 జీవో జారీ అయింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమిస్తూ అదే రోజు జీవో 800 వెలువడింది. దీంతో తమ అక్రమాలు బయటపడటం ఖాయమని పసిగట్టిన మార్గదర్శి, రామోజీరావులు.. రంగాచారి, కృష్ణరాజు నియామకాలను సవాలు చేస్తూ సుదీర్ఘ కాలం న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే రామోజీరావుకు అటు హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. ఈ క్రమంలో తాము కోరిన వివరాలు మార్గదర్శి ఇవ్వకపోవడంతో రంగాచారి ఆదాయ పన్ను శాఖ నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సేకరించి పరిశీలించారు. 2007 ఫిబ్రవరి 19న తన నివేదికను ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించడం నిజమేనని తేల్చారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అది డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో లేదని ఆయన అందులో స్పష్టంగా పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తన విచారణ ద్వారా తేల్చారు.

అధీకృత అధికారి ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008 జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) చేశారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధమని, అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ అందుకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి నేరం చేసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 58 ప్రకారం శిక్షార్హమని తెలిపారు. దీంతో రామోజీరావు ఈ ఫిర్యాదు విషయంలో మళ్లీ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించారు. చివరకు హైకోర్టు 2018 డిసెంబర్ 31న రామోజీరావుపై అధీకృత అధికారి చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు

ఈ తీర్పుపై అటు ఉండవల్లి అరుణ్ కుమార్, అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలాగే హైకోర్టు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. వీటన్నింటిపై సుప్రీంకోర్టు 2020 నుంచి విచారిస్తూ వచ్చింది. అటు తరువాత ఈ వ్యాజ్యాల్లో ఆర్బీఐని కూడా ప్రతివాదిగా చేర్చింది. విచారణ సందర్భంగా ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా మార్గదర్శి, రామోజీరావు చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డారని మౌఖికంగా కోర్టుకు తెలిపారు. చివరగా గతేడాది ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యాలన్నింటిపై విచారణ జరిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇదే సమయంలో డిపాజిట్లు తిరిగి ఇచ్చేశాం కాబట్టి తనపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా సేకరించిన డిపాజిట్లపై నిగ్గు తేలాల్సిందేనని తేల్చి చెప్పింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు విచారణ నిర్వహిస్తోంది.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

పలుచోట్ల గ్రామ, వార్డు వలంటీర్లు నిరసన దీక్షలు

సాక్షి నెట్‌వర్క్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండు చేస్తూ గ్రామ, వార్డు వలంటీర్లు శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. తక్షణం వలంటీర్లను రెన్యువల్ చేసి, ఆరు నెలలుగా పేరుకుపోయిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన దీక్షలకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చాక మరోమాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటేనని విమర్శించారు. అల్లూరి జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ఎదుట వలంటీర్లు నిరసన దీక్షలు ప్రారంభించారు. వలంటీర్లను రెన్యూవల్ చేయకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోసంచేసిందని ఆరోపిస్తున్న టీడీపీ నాయకులు.. లిక్కర్ టెండర్లు, ఇసుక టెండర్లు ఇచ్చినట్లుగానే వలంటీర్లను కూడా రెన్యువల్ చేస్తూ ఎందుకు ఆదేశాలివ్వరని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తమను రోడ్డునపడి అడుక్కునే పరిస్థితికి తీసుకొచ్చిందని విజయవాడలో వలంటీర్లు ఆవేదన వ్యక్తంచేశారు. తమ దుస్థితికి ప్రభుత్వమే కారణమంటూ వారు దుమ్మెత్తి పోశారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం తమను రోడ్డున పడేసిందని, ఈ దుస్థితికి కారణం ప్రభుత్వమేనని ఆరోపించారు.



విజయవాడలో వలంటీర్ల భిక్షాటన

మంచి ప్రభుత్వమని స్టిక్కర్లు వేసుకోవడం కాదు, వలంటీర్లకు మేలుచేసే మంచి జీఓలు తెచ్చి రాష్ట్రంలోని 2.60 లక్షల వలంటీర్ల కుటుంబాలను ఆదుకోవాలని వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు కోరారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తామని.. అలా చంద్రబాబు ఇంటికీ వెళ్తామన్నారు. ఇక విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూడా ఈ నిరసన దీక్ష జరిగింది.

2047కి తెలుగుజాతి నంబర్ వన్‌గా నిలవాలి

ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో సీఎం చంద్రబాబు

హైదరాబాద్: 2047నాటికి తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలని సీఎం చంద్రబాబు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభల్లో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరల్డ్ తెలుగు ఫెడరేషన్ సావనీర్ , తెలుగు ఏంజిల్స్ పేరుతో స్టార్టప్ లోగోను ఆయన ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన తెలుగువారికి బిజినెస్ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రపంచంలోని తెలుగువారంతా భాగస్వాములు కావాలని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారికంటే విదేశాల్లో ఉన్న తెలుగు వారే భాష, సంప్రదాయాలను కాపాడుతున్నారని చెప్పారు. అమెరికాలో ఎక్కువ తలసరి ఆదాయం పొందుతున్నది తెలుగువారేనని చెప్పారు. ఏ దేశం వెళ్లినా ఆ దేశంలో ఆమోదం రావాలంటే అక్కడి ప్రజలకు సేవలందించాలన్నారు. అయినా మాతృదేశాన్ని మరిచిపోవద్దని అన్నారు. పారిశ్రామికవేత్తగా సంపాదించిన డబ్బును మరింతమందికి ఉపాధి కల్పించేందుకు ఉపయోగించాలని అన్నారు.



జ్యోతి ప్రకాశనం చేస్తున్న చంద్రబాబు

క్లుప్తంగా...

పూలే సేవలను స్మరించుకుందాం
సావిత్రీ బాయికి వైఎస్ జగన్ నివాళులు



సాక్షి, అమరావతి: ప్రముఖ సంఘ సేవకురాలు, దేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే పోరాటాలను, ఆమె సేవలను స్మరించుకుందామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు వైఎస్ జగన్ ఘనంగా నివాళి అర్పించారు. ‘విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి, బాలికా విద్య ఉద్యమానికి పునాది వేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే. నేడు ఆమె పోరాటాలను, సేవలను స్మరించుకుంటూ సావిత్రీబాయి జయంతి సందర్భంగా నివాళులు’ అని వైఎస్ జగన్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

శేషాచలం అడవుల్లో దారితప్పిన విద్యార్థులు!
ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శేషాచలం అడవుల్లో శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు వాగేటికోన ప్రాంతంలో ఉన్న వాటర్‌ఫాల్స్‌ను చూడడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో శుక్రవారం రాత్రి దారితప్పినట్లు తెలిసింది. వారందరూ అడవిలో తిరుగుతూ చివరకు ఎస్ ఉప్పరపల్లి, ఎస్. కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే సెల్ సిగ్నల్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వారు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై నవీన్‌బాబు తమ సిబ్బందితో అడవిలో వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం
రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

సాక్షి, అమరావతి: బాల్య వివాహాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సావిత్రిబాయి పూలే అట్టడుగు వర్గాలు, మహిళల విద్య కోసం చేసిన కృషి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మంత్రి సవిత పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే మహిళలు, బాలికల విద్య కోసం చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.

ఖరీఫ్ సీజన్ నుంచి డిజిటల్ లైసెన్సింగ్ విధానం

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపార అనుమతుల కోసం ఆన్‌లైన్ లైసెన్స్ వ్యవస్థను తెస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు వెల్లడించారు. మంగళగిరిలోని వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. క్రయ విక్రయాలు మరింత సులభతరం చేయడానికి డిజిటల్ లైసెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు.



Kia Syros

Evolved by the future

The new Kia Syros is light years ahead of its contemporary SUVs. Right from an evolved design language with upright squared shoulders, to the future-forward autonomous safety tech and future-ready connected car tech with over-the-air updates, everything about the Kia Syros is a giant leap in automotive thinking. Settle into the first-in-segment 2nd row ventilated, reclining & sliding seats, and you'll agree that the future itself has evolved it. Experience the Syros today!

Innovative Technology | Future, reimagined



Dual Pane Panoramic Sunroof enhances the cabin's ambience for a seamless sense of spacious freedom



2nd Row Seat Reclining & Sliding with Seat Ventilation ensures every journey is in the lap of unparalleled comfort



76.20 cm (30") Trinity Panoramic Display Panel redefines innovation, offering a luxurious experience



Kia Connect 2.0# keeps your vehicle advanced and constantly evolving with Over-the-Air (OTA) Software updates and Kia Connect Diagnosis



Streamline Door Handles blend sleek design with innovative functionality



Harman Kardon Premium 8 Speakers Sound System delivers a truly immersive audio experience

Innovative Safety | ADAS Level 2 with 16 Autonomous Features~ + Robust 20 Standard Safety Features

Forward Collision Warning and Avoidance Assist (FCW & FCA)



Parking Collision Avoidance Assist - Reverse (PCA-R)



Lane Keep Assist (LKA)



Smart Cruise Control (SCC) with Stop & Go



High Beam Assist



360 Degree Camera with Blind View Monitor in Cluster



Robust 20 Hi-Safety Package STANDARD ACROSS ALL VARIANTS

Front Dual Airbags | Front Seat Side Airbags | Side Curtain Airbags | Highline Tyre Pressure Monitor | ABS (Anti-lock Brake System) with EBD | BAS (Brakeforce Assist System) | ESC (Electronic Stability Control) | VSM (Vehicle Stability Management) | HAC (Hill-start Assist Control) | ESS (Emergency Stop Signal) | Child Lock | Front Parking Sensors x4 | Rear Parking Sensors x4 | Speed Sensing Auto Door Lock | Impact Sensing Auto Door Unlock | Front & Rear All Seat 3-Point Seat Belts with Reminder | ISOFIX (Rear Anchors) | Front Passenger Airbag On/ Off Switch | Front Passenger Airbag On/ Off Indicator | Rear Occupant Alert

Host of other innovative features: Ice Cube MFR LED Headlamps with Starmap LED DRLs | Starmap LED Tail Lamps | Kia Signature Digital Tiger Face | R17 - 43.66 cm (17") Crystal Cut Alloy Wheels | Shark Fin Antenna and Integrated Spoiler | Electric Parking Brake with Auto Hold | 64 Color Ambient Mood Lighting | Wake-up Command | Kia Connect Diagnosis | Multilingual VR Commands | Call Center Assisted Navigation

Kia Service Connected • Adaptive • Responsive • Engage

3 Years Unlimited km Warranty | Extended Warranty** Up to 5 Years | My Convenience Plus* Best-in-class Cost of Ownership | Scratch Care Program^ | IoT Based Smart Services`` | 24x7 | 3 Years Nationwide RSA°

Pre-book now Call 1800 108 5000 | Visit www.kia.com/in | Kia Syros | Look for "Kia India" @

Terms & Conditions Apply. Segment is defined as vehicle with length between 3 990 mm – 3 999 mm and height - 1 680 mm. #Kia Connect 2.0 comes with 3 years free subscription. Amazon Alexa and any handheld device, mobile phone or/and smartwatch device are not standard car accessory & the customer needs to purchase from a third party. Kia Connect 2.0 features may vary depending on the variant, device compatibility, software and network availability in both vehicle and Alexa device. Kia Connect skill is only available in India and can be interacted with in English and Hindi. ~Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. **3 Years standard warranty and 2 years extended warranty. ``IoT based workshops for live vehicle tracking for digital experience. °RSA coverage across India except Andaman & Nicobar Islands and Lakshadweep. ^Scratch Care Program coverage includes repair of 1 scratch free of cost in an ownership period of 12 months from the date of sale, applicable on the new Syros retailed up to 30th June 2025. The product & feature images shown in this brochure is for representation purpose only. Features and specifications as shown may not be part of standard fitment and may vary. The colors shown are subject to availability and may not be available across all variants and may differ slightly from those shown in this brochure. The specifications and features may vary depending on models/ variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, Kia Connect 2.0 features and other details of any model as mentioned in this brochure or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. We do not endorse vandalism or illegal activities related to road safety. Safety is a top priority, and we urge responsible behavior regarding traffic regulations and road safety.

FOR INFORMATION CONTACT: ANDHRA PRADESH VIJAYAWADA: SIMHA KIA, PH: 8688836501, CASA KIA, PH: 8345959595, ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836542, CUDDAPPAHA: HOSHI KIA, PH: 8688829739, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7799740208, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, VISHAKHAPATNAM: LAKSHMI KIA, PH: 7997815777, ONGOLE: SANKAR KIA, PH: 88866624966, SIMHA KIA: KUNCHANAPALLI, PH: 8688836501, TELANGANA HYDERABAD: CAR KIA – FINANCIAL DISTRICT, PH: 7330888041, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, MALIK KIA, KUKATPALLY, PH: 7399346666, HIMAYATHNAGAR, PH: 8886488853, PROSPERA KIA, MALAKPET, PH: 08047361555, LANDMARK KIA, BODUPPAL, 7997722344, BOWENPALLY, PH: 7093589996, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 7995699908, NAGOLE, PH: 7995999404, RC PURAM, PH: PH: 6309908117, AS RAO NAGAR, PH: 6309908118, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 6309908110, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, NIZAMABAD: SUNRISE KIA, PH: 7995944482, SECUNDERABAD: AUTOMOTIVE KIA, PH: 7995999146, WARANGAL: MALIK KIA, PH: 9703433333, MANCHERIAL: SUNRISE KIA, PH: 7416662030

INNOCEAN-001/25



అందరిలోనూ ఉండే ఆత్మ ఒకటే కనుక
ఎవరిని ద్వేషించినా తనను తాను ద్వేషించుకోవటమే అవుతుంది.
- హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 4 జనవరి 2025

మానవాళికి ప్రకృతి శాపం!

'వాతావరణం కూడా ప్రభుత్వాల వంటిదే. అదెప్పుడూ చెడ్డగానే ఉంటుంది' అంటాడు బ్రిటిష్ వ్యంగ్య రచయిత జెరోమ్ కె. జెరోమ్. అది ముమ్మాటికీ నిజం. దేశంలో గత 123 ఏళ్లలో కనీవినీ ఎరగనంత స్థాయి ఉష్ణోగ్రతలు నిరుడు నమోదయ్యాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) చేసిన ప్రకటన హడలెత్తిస్తోంది. అంతేకాదు... వచ్చే ఏడాది సైతం రికార్డులు బద్దలయ్యే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తోంది. మనదేశం మాత్రమే కాదు... ప్రపంచవ్యాప్తంగా కూడా నిరుటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉన్నాయని వివిధ దేశాల వాతావరణ విభాగాల ప్రకటనలు చూస్తే అర్థమవుతుంది. మన పొరుగునున్న చైనాలో 1961 నుంచీ పోల్చిచూస్తే గత నాలుగేళ్ల ఉష్ణోగ్రతలు చాలా చాలా ఎక్కువని అక్కడి వాతావరణ విభాగం తెలియజేసింది. నిజానికి 2024లో ప్రపంచ ఉష్ణోగ్రతల స్థితిగతులపై ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) ఇంకా అధికారిక నివేదిక విడుదల చేయలేదు. అందుకు మార్చి వరకూ సమయం ఉంది. కానీ ఈలోగా కొన్ని కొన్ని అంశాల్లో వెల్లడైన వాతావరణ వైపరీత్యాలను అది ఏకరువు పెట్టింది. అవి చాలు... మనం ఆందోళన పడటానికి! వాటి ప్రకారం- నిరుడు జనవరి నుంచి సెప్టెంబర్ నెలలమధ్య ప్రపంచ ఉష్ణోగ్రతలు పారిశ్రామికీకరణకు ముందు కాలం నాటికంటే సగటున 1.54 డిగ్రీల సెల్సియస్ అధికం. అలాగే అంటార్కిటిక్ సముద్రంలో మంచు పలకలు మునుపటితో పోలిస్తే అధికంగా కరుగుతున్నాయి. ఉగ్రరూపం దాల్చిన వాతావరణం వల్ల నిరుడు మరణాలు, ఆర్థిక నష్టాలు కూడా బాగా పెరిగాయి. సాగర జలాల ఉష్ణోగ్రతలు అధికమయ్యాయి. సముద్ర మట్టాలు ఉన్నకొద్దీ పెరుగుతున్నాయి. నిరుడు ప్రపంచవ్యాప్తంగా రికార్డయిన 29 వాతావరణ ఘటనలను విశ్లేషిస్తే అందులో 26 కేవలం వాతావరణ మార్పులవల్ల జరిగినవేనని తేలిందని డబ్ల్యూఎంఓ తెలిపింది. ఈ ఉదంతాల్లో 3,700 మంది మరణించగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని వివరించింది.

స్వర్గనరకాలు మరెక్కడో లేవు... మన ప్రవర్తన కారణంగా ఆ రెండూ ఇక్కడే నిర్మితమవుతాయంటారు. వాతావరణం విషయంలో ఇది ముమ్మాటికీ వాస్తవం. మానవ కార్యకలాపాలే వాతావరణ వైపరీత్యాలకు మూలకారణం. నూతన సంవత్సర సందేశంలో గత దశాబ్దకాలపు వార్షిక ఉష్ణోగ్రతలన్నీ రికార్డు స్థాయివేనని సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ప్రకటించారు. ఈ వినాశకర దోవ విడనాడాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన శాస్త్రం విస్తరిస్తోంది. వినూత్న ఆవిష్కరణలు అందుబాటులోకొస్తున్నాయి. కానీ వీటిని చూసి విర్రవీగి, ప్రకృతి చేస్తున్న హెచ్చరికలను పెడచెవిన పెట్టిన పర్యవసానంగా అది ఉగ్రరూపం దాలుస్తోంది. ప్రకృతి చెప్పినట్టు వింటూ అది విధించిన పరిమితులను శిరసావహించాలి తప్ప దాన్ని నిర్లక్ష్యం చేస్తే వినాశనం తప్పదని ఏటా వెలువడే నివేదికలు హెచ్చరిస్తూనే ఉన్నాయి. కానీ వినేదెవరు? లాభార్జనే తప్ప మరేమీ పట్టని పరిశ్రమలు, అభివృద్ధి పేరిట ఎడాపెడా అనుమతులు మంజూరు చేస్తున్న పాలకులు, వాతావరణం నాశనమవుతున్నదని గ్రహించే చైతన్యం లోపించిన ప్రజలు పర్యావరణ క్షీణతకు దోహదపడుతున్నారు. అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో పర్యావరణ పరిరక్షణ అంశం ఏనాడూ ప్రస్తావనకు రాదు. మన దేశంలోనే కాదు... ప్రపంచంలో వాతావరణ శిఖరాగ్ర సదస్సుల వంటివి నిర్వహించినప్పుడు తప్ప మరెక్కడా పర్యావరణం గురించి చర్చ జరగటం లేదు. ఇది ప్రకృతి విధ్వంసానికి పాల్పడే పారిశ్రామికవేత్తలకూ, పాలకులకూ చక్కగా ఉపయోగపడుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరగాల్సిందే. అందుకవసరమైన చర్యలు తీసుకోవాల్సిందే. కానీ అభివృద్ధి అవసరాల కోసం పర్యావరణాన్ని బలిపెట్టే విధానాలు మొత్తంగా మానవాళికే ప్రమాదకరం.

పర్యావరణ ముప్పు ముంచుకొస్తున్నదనే విషయంలో ఎవరూ పెద్దగా విభేదించటం లేదు. కానీ దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలే నత్తనడకన ఉంటున్నాయి. ప్రపంచంలో కర్బన ఉద్గారాల తగ్గింపునకు 2015 పారిస్ శిఖరాగ్ర సదస్సు నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవు. చెప్పాలంటే ఆ దిశగా ఎంతోకొంత అడుగులేస్తున్నది మనమే. ఆ శిఖరాగ్ర సదస్సు 2050 నాటికి భూతాపం పెరుగుదలను 2 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ నిలువరించాలన్న సంకల్పాన్ని ప్రకటించింది. అయితే దాన్ని చేరుకోవటానికి వివిధ దేశాలు ఇచ్చిన హామీలు ఏమాత్రం సరిపోవన్నది శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. వాతావరణానికి తూట్లు పొడవటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న సంపన్న రాజ్యాలు బడుగు దేశాలకు హరిత ఇంధన సాంకేతికతలను అందించటంలో, అందుకవసరమైన నిధులు సమకూర్చటంలో ముఖం చాటేస్తున్నాయి. వాతావరణ మార్పుపై చెప్తున్నదంతా బోగస్ అనీ, పారిస్ ఒడంబడిక నుంచి తాము వైదొలగుతున్నామనీ అమెరికాలో క్రితంసారి అధికారంలోకొచ్చినప్పుడే ప్రకటించిన ట్రంప్... ఈసారి కూడా ఆ పనే చేస్తారు.

ప్రపంచ దేశాల మాటెలావున్నా ఈ ఏడాది సైతం ఉష్ణోగ్రతలు భారీగా నమోదుకావొచ్చన్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని రిజర్వ్ బ్యాంక్ మొదలుకొని అన్ని ప్రభుత్వ శాఖలూ, విభాగాలూ అట్టడుగు స్థాయివరకూ తగిన వ్యూహాలు రూపొందించుకోవాలి. మండే ఎండలు మాత్రమే కాదు... జనావాసాలను ముంచెత్తే వరదలు కూడా ఎక్కువే ఉంటాయి. ఈ ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను గరిష్ఠ స్థాయిలో ఉంచటానికి అవసరమైన కార్యాచరణను ఖరారు చేసుకోవాలి. బాధిత ప్రజానీకానికి సాయం అందించటానికి అవసరమైన వనరులను సమీకరించుకోవాలి.

ఎక్కువ ఉద్యోగాలు... తక్కువ పన్ను

విశ్లేషణ



శివమ్ విజ్

భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడింది. మహమ్మారి అనంతరం మనం చూసిన ఎకనామిక్ రికవరీ ఇక ముగిసినట్లే అనడానికి ఇది స్పష్టమైన సంకేతం. కోవిడ్ అనంతరం పరిస్థితి మెరుగుపడింది; వృద్ధి రేటు గణాంకాలు ఉత్తేజకరంగా నమోదు అయ్యాయని చాలా మంది సంబరపడ్డారు. నిజానికి ఇదో 'కె - షేప్డ్' రికవరీ అన్న వాస్తవాన్ని వారు విస్మరించారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిని తిరిగి కోలుకునే సమయంలో ఆ కోలుకోవటం ఒక్కో ప్రాంతంలో, ఒక్కో వర్గంలో ఒక్కో రకంగా ఉంటుంది. ధనికులు మరింత ధనవంతులవుతారు. కానీ పేద ప్రజలు అలాగే ఉంటారు లేదంటే ఇంకా కుంగిపోతారు. ఆంగ్ల అక్షరం 'కె'లో గీతల మాదిరిగానే ఈ రికవరీ ఉంటుంది.

కొత్త కేంద్ర బడ్జెట్ రాబోతోంది. తన రాబడి పెంచుకోడానికి వీలుగా గత బడ్జెట్‌లో ప్రభుత్వం క్యాపిటల్ గెయిన్స్ మీద పన్నులు పెంచింది. స్టాక్ మార్కెట్ జోరు మీద ఉండటంతో ఇన్వెస్టర్లు దీన్ని అంతగా పట్టించుకోలేదు. అయితే ప్రాపర్టీ విక్రయాల మీద క్యాపిటల్ గెయిన్స్ పన్ను విధింపు విధానంలో చేసిన మార్పులపై వ్యతిరేకత పెల్లుబికింది. దీంతో ప్రభుత్వం వెనుకడుగు వేసింది.

ఉద్యోగాలు లేవని, వేతనాలు తక్కువగా ఉన్నాయని పేద ప్రజలు విలవిల్లాడుతున్నారు. ధనికులు కూడా అధిక పన్నుల పట్ల గుర్రుగా ఉన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇదొక సంకట స్థితి. వృద్ధిరేటు పెరగాలంటే పట్టణాల్లో వినియోగాన్ని పెంచాలి. అలాచేస్తే ఆహార ధరలు రెక్కలు విప్పుకుంటాయి. ద్రవ్యోల్బణం పేదలకు అశనిపాతం అవుతుంది. ప్రభుత్వానికి ఇది కత్తిమీద సాము.

ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే కొత్త బడ్జెట్ ఆనవాయితీకి భిన్నంగా ఉండాలి. భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఒకటి మాత్రం వాస్తవం. 'ఇంక్రిమెంటల్ కంటిన్యూటీ'కి అవకాశం లేదు. అంటే అదనపు వ్యయాలు, అదనపు రాబడులు దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవడం కుదరదు. ఇంక్రిమెంటల్ ప్రిన్సిపుల్ అంటే వ్యయం పెంచే ఏ నిర్ణయం అయినా అంతకంటే ఎక్కువ ఆదాయం సమకూర్చాలి. ఈ దఫా నిర్ణయాలకు దీన్ని వర్తింప చేయడం కష్టం. కాబట్టి బడ్జెట్ నిర్ణయాలు జన జీవితాల్లో సమూల మార్పులు తెచ్చేవిగా ఉండాలి. ఈ దిశగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు మూడు ఐడియాలను ఇస్తాను.

ఉద్యోగాలు కల్పిస్తే ప్రోత్సాహకాలు

పారిశ్రామిక రంగం చేస్తున్న దీర్ఘకాలిక డిమాండుకు తలొగ్గి, 2019 బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గించారు. కార్పొరేట్ సంస్థలు ఈ ప్రోత్సాహకంతో మిగిలే నిధులతో కొత్త పెట్టుబడులను పెంచుతాయన్నది దీని ఉద్దేశం. అయితే జరిగిందేమిటి? పరిశ్రమలు తమ పన్ను తగ్గింపు లాభాలను బయటకు తీయలేదు. కొత్త పెట్టుబడులు పెట్టలేదు. సిబ్బంది వేతనాలు పెంచలేదు. పెట్టుబడులు పెట్టకపోవడానికి డిమాండ్ లేదన్న సాకు చూపించాయి. రెండోదానికి అవి చెప్పకపోయినా కారణం మనకు తెలుసు. చవకగా మానవ వనరులు దొరుకుతున్నప్పుడు కంపెనీల వారు వేతనాలు ఎందుకు పెంచుతారు?

భారత ఆర్థిక సవాళ్లను అధిగమించే మూడు ఐడియాలు



- ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల సంఖ్యను పెంచుతూ పోయే కంపెనీలకు రాయితీలు ఇవ్వాలి. 'ఎక్కువమందిని నియమించండి... తక్కువ పన్ను చెల్లించండి' అన్నది విధానం కావాలి.
- ప్రాథమిక విద్య నాణ్యత పెంచాలి. నాణ్యమైన విద్యమీద పెట్టుబడి పెట్టాలి. ప్రభుత్వం తన పెట్టుబడి వ్యయం రెట్టింపు చేయదగిన రంగం ఇది తప్ప మరొకటి ఉండదు.
- నైపుణ్య శిక్షణ ద్వారా కోట్లమంది జీవితాలను మార్చవచ్చు. పాఠశాలల్లో మరీ ముఖ్యంగా పేదపిల్లలు చదువుకొనే ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్య శిక్షణను ఒక ప్రధానాంశం చేయాలి.

ఎగువ మధ్యతరగతి ప్రజలు అప్పటికే 30 శాతం పన్ను చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు కార్పొరేట్ సంస్థల పన్నురేటు 25 శాతానికి తగ్గించటం అన్యాయం. ఈ సారి బడ్జెట్లో కంపెనీల గరిష్ఠ పన్నురేటు ఇంకా తగ్గించే సాహసం ఆర్థిక మంత్రి చేయలేరు. పేద ప్రజల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తుతుందనే భయం ఉంటుంది.

కార్పొరేట్ పన్ను రేట్లను అన్నిటికీ ఒకేమాదిరిగా కాకుండా వాటిలో మార్పులు చేర్పులు చేయవచ్చు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల సంఖ్యను పెంచుతూ పోయే కంపెనీలకు రాయితీలు ఇవ్వాలి. ఎక్కువ మందిని నియమించండి... తక్కువ పన్ను చెల్లించండి అన్నది విధానం కావాలి. వస్తూత్పత్తిని పెంచే విధంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తున్నప్పుడు, అదే తరహాలో జాబ్ క్రియేషన్ లింక్డ్ ఇన్సెంటివ్స్ మాత్రం ఎందుకు ఉండకూడదు?

విద్యానాణ్యతతోనే దేశ పురోభివృద్ధి

నాణ్యమైన విద్యమీద కూడా ఇన్వెస్ట్ చేయాలి. ముఖ్యంగా ప్రాథమిక విద్య నాణ్యత పెంచాలి. ప్రభుత్వం తన పెట్టుబడి వ్యయం రెట్టింపు చేయదగిన రంగం ఇది తప్ప మరొకటి ఉండదు. దీన్ని ఓ డబ్బు సమస్యగా చూడకూడదు. విధానపరమైన సమస్యగానూ పరిగణించకూడదు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలన్నింటిలోను విద్యానాణ్యత లోపించడం దేశ పురోభివృద్ధికి ఒక ప్రధాన అవరోధం. భారత్ సామర్థ్యం దిగువ స్థాయి ఉత్పత్తిలో కాకుండా సేవల రంగంలోనే ఉందని రఘురామ్ రాజన్ వంటి ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగాల కల్పనను ముఖ్య అంశంగా భావించినట్లయితే, సేవల రంగాన్ని ప్రోత్సహించడానికి తానేం చేయగలదో ప్రశ్నించుకోవాలి. దీనికి సమాధానం నాణ్యమైన విద్య అందించడమే.

అయితే ఎలా? పేద పిల్లల కోసం బళ్లు పెట్టే ప్రైవేట్ విద్యా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహకాలు అందించటం ఇందుకు ఒక సులభ మార్గం. ప్రాథమిక పాఠశాల విద్యార్థి వాస్తవంగా ఎంత నేర్చుకుంటున్నాడో తెలుసుకునేందుకు అఖిల భారత స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఒక స్వచ్ఛంద పరీక్షను ప్రవేశపెట్టాలి. ఈ ఫలితాల ఆధారంగా స్కూళ్లకు రేటింగ్ ఇవ్వాలి. దీనివల్ల తల్లిదండ్రులకు ఏ స్కూలు ఎంత మంచిదో తెలుసుకునే వీలు కలుగుతుంది. అలాగే నాణ్యమైన బోధన మీద పెట్టుబడి పెట్టే పాఠశాలలకు ప్రోత్సా హకాలు ఇవ్వడానికి ఈ టెస్ట్ ఉపయోగపడుతుంది.

నైపుణ్యాలపై పెట్టుబడి

నైపుణ్య శిక్షణ (స్కిల్ ట్రైనింగ్) ద్వారా కోట్లమంది జీవితాలను సమూలంగా మార్చేసే వీలుంది. ఈ దిశగా భారత్ ప్రయత్నాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదని చెప్పాలి. పేదపిల్లలు చదువుకొనే ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్య శిక్షణను ఒక ప్రధానాంశం చేసినపుడు మాత్రమే ప్రభుత్వం ఈ దిశగా ముందడుగు వేయగలదు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయాన్ని కేవలం 10 శాతం తగ్గిండం ద్వారా అపారమైన నిధులు అందుబాటులోకి వస్తాయి. వీటిని ఉద్యోగాలకు ఉపయోగపడే విద్య మీద పెట్టుబడి పెట్టి భారీ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించవచ్చు. వైద్య కళాశాలలతో పాటు కొత్త నర్సింగ్ కళాశాలలను విరివిగా పెట్టాలి. ఫార్మసిస్టులు, మెడికల్ టెక్నీషియన్లు పెద్ద సంఖ్యలో తయారయ్యే విధంగా విద్యాసంస్థలు ప్రారంభం కావాలి. తద్వారా దేశీయంగాను, అంతర్జాతీయంగాను వైద్యసిబ్బంది కొరతను భారత్ పూడ్చగలదు.

మానవ వనరులపై పెట్టుబడితో - ప్లంబర్ల నుంచి డాక్టర్ల వరకు - ప్రపంచానికి పనికొచ్చే భారతీయ ఉద్యోగుల సంఖ్య విశేషంగా పెరుగుతుంది. వారి నుంచి దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా నిధులు ప్రవహిస్తాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గడానికి వీలవుతుంది. ఈ ఐడియాలతోనే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయా? కావు. భారత్ ఆర్థిక వ్యవస్థకు ఒక 'న్యూ డీల్' కావాలి. (1929 నాటి మహా మాంద్యం నుంచి దేశాన్ని కాపాడేందుకు 1933-38 కాలంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ న్యూడీల్ పేరిట శరపరంపరగా అనేక కార్యక్రమాలు, సంస్కరణలు చర్యలు చేపట్టారు.)

వ్యాసకర్త జర్నలిస్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత
('గల్ఫ్ న్యూస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

పదండి ముందుకు



పేరు పెట్టటానికి లేకుండా (పర్‌ఫెక్షన్) పని చేయటానికి ప్రయత్నించటం, అందు కోసం ఆ పనిని వాయిదా వేస్తూ ఉండటం (ప్రొక్రాస్టినేషన్) ఒకేలా కనిపించే తోబుట్టువులు. పర్‌ఫెక్షన్ కోసం చూస్తూ వాయిదాలు వేయటాన్ని మనుమలు ఇష్టపడతారు. సరిగా చేయటం కన్నా, ఎంత వరకు చేయగలిగామన్నదే ప్రధానం.

- నీతూ ఖండేల్వాల్, ఇన్వెస్టర్

రెండు కళ్లు చాలవు



మహా కుంభమేళకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది. 1977లో స్టూడెంట్ ఫిల్మ్ మేకర్‌గా ఆ ఏడాది కుంభ మేళాకు వెళ్లాను. అత్యద్భుతమైన ఆ ఏర్పాట్లు చూసి అదిరిపోయాను. ఇప్పుడైతే ఇక చెప్పాలా! ఈ మహోత్సవాన్ని శాంతియుతంగా, సమర్థంగా నిర్వహిస్తున్న వారందరికీ వందనాలు.

- ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

నేనున్నాను



ప్రపంచం మనల్ని చూసి నవ్వుకుంటోంది. బలహీనమైన నాయకత్వం సరిహద్దులను తెరిచి కూర్చుంది. లోపలికి చొరబడిన అసమర్థులు, అవినీతిపరులు అమెరికాను ధ్వంసం చేశారు. శక్తిమంతమైన నాయకత్వమే ఇప్పుడీ విపత్తును ఆపగలదు. జనవరి 20న కలుద్దాం.

- డోనాల్డ్ ట్రంప్, ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు

డబ్బు భద్రం!



మీ డబ్బుతో 2025లో మీరు భిన్నంగా ఏం చేస్తారు? ఏమీ లేదు! ఇప్పటికే మీరు ఆర్థిక ప్రణాళికలో ఉన్నట్లయితే ఆ పనిని ముందుకు సాగనివ్వండి. ప్రణాళికలో స్థిరత్వం ముఖ్యం. లేదంటే అప్పుల కుప్పల్లో పడిపోతారు.

- మోనికా హలన్, 'లెటజ్ టాక్ మనీ' పాడ్‌కాస్టర్

ఖేల్ ఖతమ్



మను భాకర్ ముందునుండే 'ఖేల్ రత్న' జాబితాలో ఉన్నారా? లేనని అనుకుని ఆమె తొందరపడి ఆవేదన చెందారా? ఆమె స్పందించిన తర్వాతే ఆమె పేరు చేర్చారా? ఎప్పటికీ తెలియని విషయాలివి.


- గార్గి రావత్, యాంకర్

ఇన్ బాక్స్

అంధుల అక్షర శిల్పి

అంధులు సైతం సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందేనన్న ఆశయంతో వారి విద్యార్జన కోసం ప్రత్యేక లిపిని రూపొందించిన అక్షర శిల్పి లూయీ బ్రెయిలీ. ఫ్రాన్స్‌లో ఒక మారుమూల గ్రామమైన కూప్‌వ్రేలో సైమన్, మోనిక్ దంపతులకు 1809 జనవరి 4న ఆయన జన్మించాడు. నలుగురు సంతానంలో చివరివాడు బ్రెయిలీ. ఆయన తల్లిదండ్రులు వృత్తి రీత్యా చర్మకారులు.

లూయీ తన తండ్రితో కలిసి ఒక రోజు గుర్రపు జీన్లు తయారు చేసే దుకాణానికి వెళ్లాడు. అక్కడున్న పదునైన చువ్వ, కత్తులతో తండ్రిని అనుకరిస్తూ ఉండగా చువ్వ ఎగిరి వచ్చి లూయీ కంటిలో గుచ్చుకుంది. పేదరికం కారణంగా మంచి వైద్యం అందించలేక పోవటంతో కంటిచూపు మొత్తం పోయింది. తర్వాత కొంతకాలానికే ఇన్‌ఫెక్షన్ ఎక్కువై రెండవ కంటిచూపు కూడా పోయింది.



లూయీ బ్రెయిలీ

అప్పుడు పిల్లాడి వయసు ఐదేళ్లు. అయితే అందరిలాగానే తన కొడుకు చదువుకోవాలనే ఆశతో తల్లిదండ్రులు తమ పెద్ద పిల్లలతో పాటుగా లూయీని గ్రామంలో ఉన్న పాఠశాలకు పంపించారు. అక్కడ కొడుకు కనబరిచిన అద్భుత ప్రతిభను గమనించిన తండ్రి... చెక్కపై మేకులను అక్షరాల రూపంలో బిగించి వాటిని తాకడం ద్వారా అక్షర జ్ఞానం కలిగించాడు. అతడిలోని చదువుకోవాలనే పట్టుదలను, తెలివితేటల్ని చూసి ఉపాధ్యాయులే ఆశ్చర్యానికి లోనయ్యేవారు.

1821లో చార్లెస్ బార్బియర్ అనే సైన్యాధికారి తన సైనికులకు 12 చుక్కలతో నిగూఢ లిపిలో శిక్షణ ఇచ్చేవాడు. దాన్ని లూయీ అభ్యసించాడు. దానితో సంతృప్తి చెందకుండా ఆ లిపిపై పరిశోధనలు ప్రారంభించాడు. దాదాపు 11 సంవత్సరాల కృషి అనంతరం 1832లో సరళమైన విధానంలో చుక్కల లిపిని కనుగొన్నాడు. దానికి ఆయన పేరుమీదనే తర్వాత బ్రెయిలీ లిపి అని పేరొచ్చింది. ఇది ప్రస్తుతమున్న కంప్యూటర్ భాషకు వీలుగా ఆనాడే రూపొందిందంటే ఆయన ముందుచూపు ఎంతో అర్థమవుతుంది.

బ్రెయిలీని క్షయ మహమ్మారి పట్టి పీడించటంతో నాలుగు పదుల వయసులోనే 1852 జనవరి 6న కన్నుమూశారు. ఆ తర్వాత రెండేళ్లకు ఆయన లిపి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎంతోమంది అంధ వికలాంగులను విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, పత్రికాధిపతులుగా, సంగీత కళాకారులుగా, చిత్రకారులుగా అనేక రంగాల్లో బ్రెయిలీ లిపితో అగ్రభాగాన నిలిచేట్లు చేసిన లూయీ బ్రెయిలీ అంధుల అక్షర ప్రదాతగా ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటారు.

- పి. రాజశేఖర్ I ఆలిండియా జనరల్ సెక్రెటరీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (నేడు లూయీ బ్రెయిలీ జయంతి; జనవరి 6న వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి.
ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే
వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇంగ్లిష్‌పై 'తీర్పు' వివక్షాపూరితం!

అభిప్రాయం



ఈదర గోపీచంద్

విజయవాడలో జరిగిన మొన్నటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించడమే కాక, తత్సంబంధ జీవో నం.85ను రద్దు చేయాలని కూడా ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరడం ఏ కోణం నుండి చూసినా సమంజసనీయమైనది కాదు. గౌరవనీయ సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తిగా ఆయనకిది ఏమాత్రం తగినట్లుగా లేదు. అందుకే ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయి.

మోదీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానంలో 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాలలోనే విద్య నేర్పాలని సూచించారు. అయితే నేటి పోటీ ప్రపంచంలో దీని అమలు అసాధ్యమని తెలిసినప్పటికీ, జస్టిస్ రమణ దీనిని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఎక్కడా కోరలేదు. కానీ స్వరాష్ట్రానికి వచ్చేటప్పటికి తెలుగు మాధ్యమానికి మాత్రమే, అందునా ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే తెలుగు మాధ్యమానికి తావివ్వాలని మాట్లాడుతున్నారు!



ప్రైవేట్ స్కూళ్లలో కూడా తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని నామమాత్రంగానైనా ఆయన ఎందుకు అడగటం లేదు? అంటే సంపన్నుల పిల్లలకు ఒక న్యాయం, పేద దళిత గ్రామీణ పిల్లలకు మరొక న్యాయం! ఇదేనా ఎవరైనా ఇవ్వవలసిన 'తీర్పు'? ఇంగ్లిష్ మీడియంతో ప్రైవేట్ విద్యారంగం కళకళలాడాలనీ, కేవలం తెలుగు మీడియంతో నడిచే ప్రభుత్వ పాఠశాలలు వెలవెల పోవాలనీ; 'ప్రభుత్వం వేస్ట్.. ప్రైవేట్ రంగం బెస్ట్' అనీ... ఆయన, ఆయన వెనుక ఉన్న రాజకీయ నేతల ఉద్దేశంలా కనిపిస్తోంది.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేస్తూ తెలుగు భాషపై ప్రేమ వెలిబుచ్చుతూ ఉంటారు. వీరి పిల్లలందరూ ఇంగ్లిష్ మీడియంలోనే చదవాలి! విదేశాలకు వెళ్లి వచ్చి, గొప్పగా సంపాదించుకోవాలి. కానీ పేదవాళ్లకు మాత్రం ఆ అవకాశం ఇవ్వకూడదు, వాళ్లు రాష్ట్రం దాటి వెళ్లకూడదు.

జగన్ సంస్కరణలు చరిత్రాత్మకం

గత ఐదేళ్లలో జగన్ దేశంలోకెల్లా అత్యధికంగా పాలనలో, పలు రంగాలలో, ముఖ్యంగా విద్యారంగంలో అద్భుతమైన సంస్కరణలు తెచ్చి చరిత్రకెక్కారు. రాజకీయంగా జగన్ మోహన్‌రెడ్డితో విభేదిస్తే, రాజకీయంగానే ఎదుర్కోవాలి తప్ప, ఆయన మీది ద్వేషంతో ఆయన ప్రవేశపెట్టిన అన్ని పథకాలను రద్దు చేస్తూ పోవడం ఏమాత్రం సమంజసం కాకపోగా విపరిణామాలకు దారి తీస్తుంది.

ద్విభాషా పాఠ్యపుస్తకాలను, ఇంగ్లిష్-తెలుగు నిఘంటువులను ఇచ్చినప్పటికీ, ఏ మీడియంలోనైనా చదువుకునే, పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ, 90 శాతం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంనే కోరుకున్నప్పటికీ, లక్షలాదిగా ఉన్న వారి అభీష్టానికి, హక్కుకు వ్యతిరేకంగా ఈ న్యాయమూర్తి ఇలా మాట్లాడటం సరైనది కాదు. ఆయన మాట విని, ఆంగ్ల మాధ్యమంలో 9వ తరగతి వరకు వచ్చిన విద్యార్థులను నట్టేట ముంచి, తిరోగమన దిశలోకి మరల్చడం చంద్రబాబు చారిత్రక తప్పిదంగా నిలిచిపోతుంది.


దీనికి బదులు, తెలుగు భాషపై తెలుగు మాధ్యమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగిస్తూనే, కేజీ టు పీజీ తెలుగు మాధ్యమ బోధనా విద్యాసంస్థలను సమాంతరంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధులలో రిజర్వేషన్ కల్పించాలని కోరడం సముచితంగా ఉంటుంది. స్థానిక ప్రభుత్వాలు స్థానిక ప్రజల భాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని, న్యాయస్థానాలు ప్రజల భాషలోనే తీర్పులు ఇవ్వాలని ఆదేశిస్తే, నిర్దేశిత రాజ్యాంగ ఆశయాలు కూడా తద్వారా నెరవేరుతాయి. ఇలాంటి విశాల దృక్పథంతో ఆంగ్ల లేక తెలుగు మాధ్యమ అంశాలను పరిశీలించినప్పుడే ఆమోదయోగ్యమైన పరిష్కారం దొరుకుతుంది.

అలా కాని పక్షంలో ఎన్నో వేల ఏళ్లుగా వివక్షకు గురైన అట్టడుగు పేద బడుగు వర్గాల నుండి ప్రతిఘటనను, ఇంగ్లిష్ మీడియం పరిరక్షణ ఉద్యమాలను కూటమి పాలకులు ఎదుర్కోవలసి వస్తుంది.

వ్యాసకర్త సామాజిక ఉద్యమ కార్యకర్త
మొబైల్: 94403 45494

విద్యాధనం

'విద్య నిగూఢ గుప్తమగు విత్తము' - ఇతరుల కళ్ళకు కనిపించకుండా, వ్యక్తి లోపలనే గుప్తంగా దాగి ఉండే ధనరాశి వంటిది విద్య అని భర్తృహరి సుభాషితం చెప్పింది. విద్య వలన ప్రయోజనం అదొక్కటి మాత్రమే కాదనీ, మనిషి విద్యావంతుడు కావడం వలన సమకూరే ఉత్తమమైన ప్రయోజనాలు మరి కొన్ని వున్నాయనీ తెలుగు కవులు చెప్పారు. వారిలో, విక్రమార్కుడి సింహాసనపు సాలభంజికలు భోజరాజుకు చెప్పిన కథలను తెలుగులో 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యంగా రచించిన కొఱవి గోపరాజు ఒకరు. 'పరులకు, సోదరులకు, భూమిని పాలించే భూవరులకు నిలువెత్తు ధనం వెచ్చించైనా ఒక వ్యక్తి నుండి కొనలేనిది అతడి విద్య అని, ఏ వ్యక్తిలో ఉంటే ఆ వ్యక్తికి మాత్రమే నూటికి నూరుపాళ్ళు వశ్యమై ఉండేది విద్య ఒక్కటే అని, ఒకరు తనలోని విద్యను మరొకరికి బోధించినపుడు, ఆ బోధనను గ్రహించిన వ్యక్తిలో తిరిగి అదే రకమైన వృద్ధికి ఆ విద్య దారితీస్తుందని ఆయన చెప్పిన మాటలు చిరస్మరణీయాలు. పరాయి ఊరికి వెళ్ళినప్పుడు వ్యక్తి లోపల ఉన్న విద్యా ధనం ఒక్కటే దొంగలకు కనపడకుండా ఉంటుందని, విద్య ఒక్కటి మాత్రమే ఒక్కొకసారి వ్యతిరేక పరిస్థితులలో సైతం స్నేహితులను పుట్టించగలిగే సామర్థ్యం కలిగి ఉంటుందని, కాబట్టి విద్యను పోలిన ధనం మరొకటి ఉంటుందనుకోవడం అవివేకమే అవుతుందని కూడా చెప్పాడు కొఱవి గోపరాజు.



జ్యోతిర్మయం

విద్యను గురించి కావ్యాంతర్గతమైన వివరణ అలా ఉండగా, భారతీయుల ఆధ్యాత్మిక చింతనకు ముఖ్యమైన మార్గదర్శకాలుగా భావించే అష్టాదశ పురాణాలలో ఒకటైన 'శ్రీవిష్ణుపురాణం' పంచమ అంశం, పదవ అధ్యాయం, 30వ శ్లోకంలో విద్యను గురించిన అత్యంత ప్రాచీన ఆధ్యాత్మిక భావన కనపడుతుంది.

విద్యయా యో యయా యుక్తస్తస్య సా దైవతం మహత్,
సైవ పూజ్యార్చనీయా చ సైవ తస్యోపకారికా.

ఏ విద్య ఆసరాతో ఒక వ్యక్తి తన జీవనాన్ని సాగిస్తుంటాడో, ఆ విద్యయే అతడికి ఇష్టదైవం వంటిది. ఆ విద్యయే ఆ వ్యక్తికి పూజనీయమైనది. ఆ విద్యయే ఆ వ్యక్తికి చిరకాలం ఆనందాన్ని కలిగించేదిగా కూడా ఉంటుంది అని పై శ్లోకంలో చెప్పబడింది.

- భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.పంచమి రా.11.14 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: శతభిషం రా.10.59 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.6.59 నుండి 8.27 వరకు, తదుపరి తె.5.02 నుండి 6.30 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.39 నుండి 8.08 వరకు, అమృతఘడియలు: సా.4.01 నుండి 5.33 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.35.


DMart®
Daily Discounts Daily Savings
సంక్రాంతికి షాపింగ్ మొత్తం ఇప్పుడు బడ్జెట్‌లో ఉంది
పండుగ స్పెషల్
₹36* మాత్రమే లూజు గోధుమపిండి 1 కిలో
₹114* మాత్రమే లూజు మినుములు 1 కిలో
₹40* మాత్రమే లూజు చక్కెర 1 కిలో
₹49* మాత్రమే లూజు సోనా మసూరి కర్నూలు రైస్ 1 కిలో
₹35* మాత్రమే లూజు ఇడ్లీ రవ్వ 1 కిలో
₹159* మాత్రమే లూజు తెల్ల నువ్వులు 1 కిలో
₹85* మాత్రమే లూజు శనగపప్పు 1 కిలో
₹111* మాత్రమే లూజు వేరు శనగ 1 కిలో
₹70* మాత్రమే లూజు బిర్యానీ బియ్యం 1 కిలో
₹52* మాత్రమే లూజు అటుకులు 1 కిలో
₹109* మాత్రమే లూజు పుట్నాలపప్పు 1 కిలో
₹67* మాత్రమే లూజు శనగపిండి 1 కిలో
₹59* మాత్రమే లూజు గుండ్రని బెల్లం 1 కిలో
₹479* మాత్రమే జీడిపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 692
₹129* మాత్రమే దేశావర్ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 182
₹399* మాత్రమే బాదం 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 577
₹399* మాత్రమే స్వాద్ పిస్తా 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 586
₹37*/₹89* మాత్రమే ఇలాచి గ్రీన్ ఇకో 10 గ్రాములు /25 గ్రాములు ఎంఆర్‌పి ₹ 60/ ₹ 145
₹45* మాత్రమే ప్రీమియా రైస్ ఆటా 1 కిలో ఎంఆర్‌పి ₹ 71
నిత్యావసర సరుకులు
₹129* మాత్రమే సూపర్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 లీ ఎంఆర్‌పి ₹ 162
₹490* మాత్రమే దొడ్ల ఆవు నెయ్యి జార్ 1 లీ ఎంఆర్‌పి ₹ 760
₹49* మాత్రమే దావత్ పులావ్ బాస్మతి రైస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 90
₹99* మాత్రమే ఆశీర్వాద్ గోధుమ పిండి ఎంపీ 2 కిలో ఎంఆర్‌పి ₹ 131
₹149* మాత్రమే ఆశీర్వాద్ మిరప పొడి 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 250
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ఈస్టర్న్ చికెన్ మసాలా 100 గ్రాములు ఎంఆర్‌పి ₹ 63*
₹409* మాత్రమే బ్రూక్ బాండ్ తాజ్ మహల్ టీ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 470
₹390* మాత్రమే బ్రూ ఇన్‌స్టంట్ కాఫీ 200 గ్రాములు ఎంఆర్‌పి ₹ 600
₹219* మాత్రమే పారీస్ వైట్ లేబుల్ షుగర్ 5 కిలో ఎంఆర్‌పి ₹ 300
₹105* మాత్రమే బాంబినో వెర్మిసెల్లి 1.4 కిలో ఎంఆర్‌పి ₹ 145
₹149* మాత్రమే లోట్టె చాకో పై బిస్కెట్ 504 గ్రాములు ఎంఆర్‌పి ₹ 220
₹75* మాత్రమే సన్‌ఫీస్ట్ మామ్స్ మేజిక్ జీడిపప్పు మరియు బాదం బిస్కెట్లు 584 గ్రాములు ఎంఆర్‌పి ₹ 135
₹79* మాత్రమే థమ్స్ అప్ 1.75 లీ ఎంఆర్‌పి ₹ 100
కొనండి 1 పొందండి 1 ఉచితంగా మంగళదీప్ మొగ్రా పూజ అగర్బత్తి 108 U ఎంఆర్‌పి ₹ 76*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా శుభకార్య దర్శన కర్పూర పూజ ఆయిల్ 900 మి.లీ ఎంఆర్‌పి ₹ 220*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ఫాగ్ మార్కో 1000 స్ప్రే 150 మి.లీ ఎంఆర్‌పి ₹ 275*
₹289* మాత్రమే పారాచూట్ కోకోనట్ ఆయిల్ 1 లీ ఎంఆర్‌పి ₹ 455
₹235* మాత్రమే డాబర్ రెడ్ టూత్ పేస్టు వ్యాల్యూ ప్యాక్ 600 గ్రాములు ఎంఆర్‌పి ₹ 360
కొనండి 1 పొందండి 1 ఉచితంగా వేసలిన్ డీప్ మాయిశ్చర్ బాడీ లోషన్ 400 మి.లీ ఎంఆర్‌పి ₹ 435*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా నివియా బాడీ మిల్క్ నరిషింగ్ లోషన్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹ 699*
₹247* మాత్రమే పియర్స్ ప్యూర్ జెంటిల్ సోప్ బార్ 4x125 గ్రాములు + 125 గ్రాములు ఉచితం ఎంఆర్‌పి ₹ 372
₹210* మాత్రమే లైజోల్ సిట్రస్ ఫ్లోర్ క్లీనర్ 1 లీ ఎంఆర్‌పి ₹ 246
₹200* మాత్రమే హార్పిక్ పవర్ ప్లస్ ఒరిజినల్ టాయిలెట్ క్లీనర్ 1 లీ ఎంఆర్‌పి ₹ 225
₹235* మాత్రమే గుడ్ నైట్ గోల్డ్ ఫ్లాష్ 4x45 మి.లీ ఎంఆర్‌పి ₹ 325
కిచెన్‌వేర్
₹29** నుంచి స్టీల్ పండుగ స్పెషల్
₹39** నుంచి ప్లాస్టిక్ కంటెయినర్ అసార్టెడ్
₹99* మాత్రమే ఈజీ లాక్ 300 మి.లీ 6 పీసులు ఎంఆర్‌పి ₹ 150
₹29** నుంచి మెలమైన్ ట్రేలు 19.05 సెం.మీ x15.24 సెం.మీ
₹29** నుంచి గ్లాస్ జార్ 275 మి.లీ
₹179** మాత్రమే క్రిస్టలాన్ నాన్-స్టిక్ కడాయ్ 165 మి.మీ ఎంఆర్‌పి ₹ 220
₹1,499** మాత్రమే బటర్‌ఫ్లై స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ 3 లీ ఎంఆర్‌పి ₹ 3,646
₹1,699** నుంచి బ్రాండెడ్ మిక్సర్లు BAJAJ Crompton USHA
వివాహ సీజన్‌కి సిద్ధమవ్వండి
వింటర్ వేర్ అందుబాటులో ఉన్నాయి
₹199** నుంచి గర్ల్స్ ఫ్యాషన్ ఫ్రాక్
₹79** నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్
₹299** నుంచి గర్ల్స్ కుర్తీ
₹199** నుంచి బాయ్స్ షర్ట్
₹99** నుంచి లేడీస్ టీ-షర్ట్
₹149** నుంచి లేడీస్ ఫ్యాన్సీ టాప్
₹349** నుంచి లేడీస్ జీన్స్
₹199** నుంచి లేడీస్ శాండిల్స్ అండ్ స్లిప్పర్
₹299** నుంచి బాయ్స్ డెనిమ్
₹199** నుంచి లేడీస్ లాంగ్ కుర్తీలు
₹99** నుంచి లేడీస్ దుపట్టా
₹199** నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచ్ లెగ్గింగ్స్
₹599** నుంచి కుర్తీ సెట్
₹399** నుంచి మెన్స్ స్వెటర్
₹299** నుంచి మెన్స్ ఎత్నిక్ కుర్తా అండ్ పైజామా
₹449** నుంచి మెన్స్ కాటన్ చినోస్
₹499** నుంచి మెన్స్ జాగర్స్ అండ్ కార్గో
ఎంఆర్‌పిపై 25% తగ్గింపు అన్నీ బ్రాండెడ్ మెన్స్ అండర్‌గార్మెంట్స్
₹99** నుంచి మెన్స్ ఫ్యాన్సీ టీ-షర్ట్
₹199** నుంచి మెన్స్ ఫార్మల్/ క్యాజువల్ షర్ట్
₹349** నుంచి మెన్స్ ఫార్మల్ ట్రౌజర్
₹349** నుంచి మెన్స్ ఫ్యాషన్ జీన్స్
₹299** నుంచి మెన్స్ క్యాజువల్ షూస్
₹399** నుంచి మెన్స్ ఫార్మల్ షూస్
విజయవాడ: 0866-2434671 • విజయవాడ -2 ఎయిర్‌పోర్ట్ రోడ్: 0866-2841026 • బెంజ్ సర్కిల్: 0866-2473752 • గొల్లపూడి: 0866-2410021 • నున్న: 0866-2411080 • మచిలీపట్నం: 0867-2254001 • గుడివాడ: 9989903522 • కుంచిపల్లి గుంటూరు డిమార్ట్: 7794946598
నాజ్ సెంటర్ గుంటూరు: 0863-2228329 • గుంటూరు రింగ్ రోడ్: 0863-2335002 • మధురవాడ (వైజాగ్ 1): 0891-2524270/ 275 • మర్రిపాలెం: 0891-2976630 • గాజువాక: 0891-2744230 • సూర్యబాగ్: 0871-265188 • విజయనగరం: 8922294861 • కాకినాడ: 0884-2371630
ఏలూరు(గోదావరి): 08812-242993 • రాజమండ్రి (పాయకంపేట): 7416271451 • రామదాసుపేట: 0883-2475777 • తుని-వైజాగ్: 8985251174/9440552385 • భీమవరం: 812106325 • తణుకు: 08819-295903 • తూరంగి కాకినాడ: 088-2944895
కర్నూలు: 08518-256670 • అనంతపురం: 0855-4249980 • కంచెరపాలెం, వైజాగ్: 9154837509 • జోహారాపురం, కర్నూలు-2: 8333998757 • అనకాపల్లి: 9063793582 • ఖమ్మం (తెలంగాణ): 08742-220003 • ఒంగోలు: 0859-2234057
గోపాలపట్నం వైజాగ్: 8125038242 • గంగూరు: 0866-2580018 • నరసరావుపేట: 0864-7231077
**విజయవాడ మరియు విశాఖపట్నంలో మాత్రమే లభిస్తోంది
1N
Impulse/01/25

డాలర్ డ్రీమ్స్‌పై మరో పిడుగు!

ఓపీటీ రద్దు చేయాలని అమెరికన్ల డిమాండ్
- దొడ్డి దారి ప్రవేశమంటూ విమర్శలు
- భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం

హెచ్‌-1బీ వివాదంతో సతమతమవుతున్న భారత విద్యార్థుల డాలర్ కలలపై మరో పిడుగు పడబోతుందా? విద్యార్థుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని అమెరికాలో స్థానిక విద్యార్థులు గొంతెత్తుతుండటం ఈ అనుమానానికి తావిస్తోంది. గ్రాడ్యుయేషన్ తర్వాత అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో పనిచేయడానికి అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌ను రద్దు చేయాలని అమెరికా టెక్ వర్కర్లు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇది అమెరికాలో అత్యధికంగా ఉండే భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

గతేడాది లక్ష మంది విద్యార్థులు

అంతర్జాతీయ విద్యార్థులు, ముఖ్యంగా ఎఫ్‌-1 వీసాలపై ఉన్నవారు ఓపీటీ ప్రోగ్రామ్‌ను ఎంచుకుంటున్నారు. తొలుత తాత్కాలిక నైపుణ్యాభివృద్ధి కోసం ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమం ఎఫ్‌-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు స్టెమ్ డిగ్రీ కలిగి ఉంటే మూడేళ్ల వరకు అమెరికాలో పనిచేసేందుకు అనుమతిస్తుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం (స్టెమ్) రంగాల్లోని గ్రాడ్యుయేట్లకు 36 నెలల వరకు ఈ పొడిగింపు ఉంటుంది. అమెరికా లో అత్యధికంగా అంతర్జాతీయ విద్యార్థులైన భారతీయ విద్యార్థులు వృత్తిపరమైన అవకాశాలు, చివరికి హెచ్‌-1బీ వీసాల కోసం ఈ కార్యక్రమంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. చాలా మంది విద్యార్థులు స్టెమ్ ఓపీటీ ఎక్స్‌టెన్షన్‌ను ఉపయోగిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో సుమారు 97,556 మంది భారతీయ విద్యార్థులు ఓపీటీలో చేరారు.

కోర్టు చెప్పినా...

విదేశీ ఉద్యోగులను పెంచే ఓపీటీ ప్రోగ్రామ్‌ను అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఇది దీర్ఘకాలిక వలసకు ఉపయోగపడుతోందని అమెరికన్లు వాదిస్తున్నారు. అమెరికన్ల నుంచి ఉద్యోగాలను దూరం చేయడమేనని యూఎస్ టెక్ వర్కర్స్ గ్రూప్స్ విమర్శిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని సవాలు చేస్తూ 2023లో వాషింగ్టన్ అలయన్స్ ఆఫ్ టెక్నాలజీ వర్కర్స్ (వాష్టెక్) కోర్టుకెళ్లింది. అయితే, కేసును సమీక్షించడానికి అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. కార్యక్రమానికి ఆమోదం తెలిపే దిగువ కోర్టు తీర్పును సమర్థించింది.

మరోసారి చర్చలు..

జనవరి 20న ట్రంప్ ప్రమాణ స్వీకారానికి సిద్ధమవుతున్న తరుణంలో నైపుణ్యం కలిగిన కార్మికుల వలసలపై ఈ చర్చలు తీవ్రమయ్యాయి. ''ఓపీటీ ప్రోగ్రామ్ విదేశీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తరహాలో గెస్ట్ వర్కర్ స్కీమ్. విశ్వవిద్యాలయాలు విద్యకు బదులుగా వర్క్ పర్మిట్లను విక్రయిస్తున్నాయి. డీఏసీఏ (డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్) తరహాలో చట్టవి రుద్ధం. ఈ పోటీ నుంచి అమెరికన్ కాలేజీ గ్రాడ్యుయేట్లను రక్షించడానికి ఈ ఓపీటీని రద్దు చేయాలి'' అని యూఎస్ టెక్ వర్కర్స్ గ్రూప్.. ఎక్స్‌లో పేర్కొంది. కాంగ్రెస్ ఆమోదం లేకుండా సాగుతున్న ఈ కార్యక్రమం.. యూఎస్ జాబ్ మార్కెట్లలోకి దొడ్డిదారి ప్రవేశమని విమర్శించింది.



ప్రశ్నార్థకంగా భవిష్యత్...

అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ మద్దతుదారులు సైతం.. హెచ్‌-1బీ వీసాలపై మండిపడుతున్నారు. హెచ్‌-1బీ వీసా హోల్డర్లు, ప్రధానంగా భారతీయులు అమెరికన్ కార్మికుల స్థానాన్ని భర్తీ చేస్తున్నారని, పాశ్చాత్య నాగరికతకు ముప్పుగా పరిణమిస్తున్నారని వారు వాదిస్తున్నారు. అమెరికాలో ఇంజనీర్ల కొరత నేపథ్యంలో నైపుణ్యం కలిగిన విదేశీ ప్రతిభా వంతులను ఆకర్షించాల్సిన అవసరం ఉందని ట్రంప్‌తోపాటు.. ఎలన్ మస్క్, వివేక్ రామస్వామి వంటి ప్రముఖులు చెబుతు న్నారు. ఈ ఓపీటీ కార్యక్రమాలను వారు సమర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓపీటీ కార్యక్రమం భవిష్యత్ ఏమిటనేది ప్రశ్నా ర్థకంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

వణికిస్తోన్న మరో వైరస్

బీజింగ్/న్యూఢిల్లీ: ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్‌కు పుట్టినిల్లుగా భావించే చైనాలో మరో ప్రాణాంతక వైరస్ భయందోళన సృష్టిస్తోంది. హ్యూమన్ మెటా పిన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) పంజా విసురుతోంది. వందలాది మంది బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఈ వైరస్‌తో ముప్పేమీ లేదని చైనా ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఎంపీవీ అనేది ప్రధానంగా మనుషుల్లో శ్వాస వ్యవస్థపై దాడి చేసే వైరస్. డ్రాగన్ దేశంలో గత ఏడాది ఏప్రిల్ నుంచే హెచ్‌ఎంపీవీ కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల చలికాలం ప్రారంభం కావడంతో వైరస్ వ్యాప్తి ఉధృతమవుతోందని, ఎక్కువగా పిల్లలు, వృద్ధులు దీని బారినపడుతున్నారని, నిత్యం వందలాది కేసులు బయటపడుతున్నాయని స్థానిక మీడియా చెబుతోంది. బాధితులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయని, పెద్ద సంఖ్యలో మరణాలు సైతం సంభవిస్తున్నాయని చైనా ప్రజలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. హెచ్‌ఎంపీవీని చైనా ప్రభుత్వం ఇంకా మహమ్మారిగా గుర్తించలేదు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి నిర్దిష్టమైన ప్రోటోకాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. హెచ్‌ఎంపీవీ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోతుండడంతో ప్రభుత్వం ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించిందని ఓ పౌరుడు పోస్టు చేశాడు.

వేగంగా హెచ్‌ఎంపీవీ వ్యాప్తి
- వందల సంఖ్యలో కేసులు
- నిండిపోతున్న ఆసుపత్రులు..
- పెద్ద సంఖ్యలో మరణాలు

ఏమిటీ హ్యూమన్ మెటాపిన్యూమో వైరస్?

→ హెచ్‌ఎంపీవీ అనేది మనుషుల్లో శ్వాస వ్యవస్థను ప్రభావితం చేసే వైరస్.

→ ఈ వైరస్ బాధితుల్లో సాధారణ జలుబు లక్షణాలే ఉంటాయి. జలుబు, దగ్గు, జ్వరం, ముక్కు నుంచి స్రావాలు కారడం, గొంతు నొప్పి, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

→ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులకు హెచ్‌ఎంపీవీ ముప్పు అధికంగా ఉంటుంది. వారికి ఈ వైరస్ సోకితే తీవ్రమైన అనారోగ్య లక్షణాలు ఉంటాయి. సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తలెత్తవచ్చు.



బాధితులతో కిక్కిరిసిన ఆస్పత్రి

→ హ్యూమన్ మెటాపిన్యూమో వైరస్ తొలుత 2001లోనే గుర్తించినట్లు అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్(సీడీసీ) వెల్లడించింది.

→ హెచ్‌ఎంపీవీ బారినపడితే 3 నుంచి 6 రోజులపాటు లక్షణాలు కనిపిస్తాయి.

→ ఇన్ఫెక్షన్ క్రమంగా బ్రాంకైటీస్ లేదా న్యుమోనియా మారే అవకాశం ఉంటుంది.

నివారణ ఎలా?

→ హెచ్‌ఎంపీవీ ఇప్పటిదాకా కచ్చితమైన చికిత్స లేదు. వ్యాక్సిన్(టీకా) కూడా అభివృద్ధి చేయలేదు. నివారణే ముఖ్యం. చేతులను తరచుగా శుభ్రం చేసుకోవాలి. సబ్బుతో కడుక్కోవాలి. శుభ్రంగా లేని చేతులతో కళ్లు, ముక్కు, నోటిని తాకరాదు.

→ హెచ్‌ఎంపీవీ వైరస్ సోకిన బాధితులకు దూరంగా ఉండాలి.

→ జలుబు లక్షణాలు ఉన్నవారు బయటకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం మంచిది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతిరుమాలు అడ్డు పెట్టుకోవడం ఉత్తమం.

→ బాధితులకు ఇప్పటికైతే సాధారణ చికిత్సే అందిస్తున్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా లేనివారు త్వరగానే కోలుకుంటున్నారు. తీవ్రత అధికంగా ఉంటే మాత్రం ఆసుపత్రిలో చాలా రోజులు ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు.

శ్వాస సంబంధిత వ్యాధులే: చైనా

తమ దేశంలో కొత్త వైరస్ కేసులు విపరీతంగా పెరిగాయంటూ వస్తున్న వార్తలను చైనా ప్రభుత్వం శుక్రవారం కొట్టిపారేసింది. ఆ వార్తలో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. సాధారణంగా చలి కాలంలో నమోదయ్యే శ్వాస సంబంధిత వ్యాధులు గత ఏడాది కంటే ఈసారి స్వల్పంగా పెరిగాయని, అవి హెచ్‌ఎంపీవీ కేసులు కాదని తేల్చిచెప్పింది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, హెల్త్ ఎమర్జెన్సీ విధించలేదని తెలియజేసింది.

ఇండియాలో ఆందోళన అవసరం లేదు

చైనాలో హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తిని నిశితంగా పరిశీలిస్తున్నామని భారత ప్రభుత్వ అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. మన దేశంలో ఈ వైరస్ ఆనవాళ్లు ఇప్పటిదాకా బయటపడలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించాయి. చలికాలంలో తలెత్తే శ్వాస సంబంధిత అనారోగ్యానికి తగిన చికిత్స, సదుపాయాలు మన దేశంలో అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్‌ఎస్) డాక్టర్ గోయల్ చెప్పారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే ఆసుపత్రిలో చేరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేను అద్దాల మేడ కట్టుకోలేదు



కొత్త ఇంటిని పరిశీలిస్తున్న మోదీ

- పదేళ్లలో నాలుగు కోట్ల మంది పేదలకు ఇళ్లు కట్టించాం
- ప్రజలకు శాశ్వత నివాసం ఉండాలన్నదే నా స్వప్నం
- ఆది ఆప్ కాదు.. ముమ్మాటికీ ఆపద
- విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారు.
- ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: ''నేను అద్దాల మేడ(శీష్ మహల్) కట్టుకోలేదు. కానీ, పదేళ్లలో నాలుగు కోట్ల మందిపైగా పేదల సొంతింటి కల నెరవేర్చాను. వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చాను'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. తన కోసం విలాసవంతమైన భవనం కాకుండా పేదలకు శాశ్వత నివాసం ఉండాలన్నదే తన స్వప్నం అని వివరించారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో పర్యటించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అశోక్ విహార్‌లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం నిర్మించిన 1,675 ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. వారితో ముచ్చటించారు. నౌరోజీ నగర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినీ నగర్‌లో జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ (జీపీఆర్ఏ)టైప్‌-2 క్వార్టర్స్ ప్రాజెక్టులను ప్రారంభించారు. ద్వారకలో రూ.300 కోట్లతో నిర్మించిన సీబీఎస్ఈ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఢిల్లీ యూనివర్సిటీలో రూ.600 కోట్ల విలువైన మూడు కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)పై నిప్పులు చెరిగారు. అది ఆప్ కాదు, ఆపద అంటూ మండిపడ్డారు. ప్రధానమంత్రి ఏం మాట్లాడారంటే...

ఢిల్లీని ఆపదలో పడేశారు

''మోదీ ఎప్పుడూ తన కోసం ఇల్లు నిర్మించుకోలేదన్న విషయం దేశానికి తెలుసు. గడచిన పదేళ్లలో నాలుగు కోట్ల కంటే ఎక్కువగా ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేశాం. నేను కూడా శీష్ మహల్(అద్దాల మేడ) నిర్మించుకొనేవాడినే. కానీ, అది నాకు ఇష్టం లేదు. నా దేశ ప్రజలకు పక్కా ఇళ్లు ఉండాలన్నదే నా కల. కొందరు వ్యక్తులు(కేజ్రీవాల్) అబద్ధపు ప్రమాణాలు చేసి ప్రజల సొమ్ముతో అద్దాల మేడలు నిర్మించుకున్నారు. గత పదేళ్లలో ఢిల్లీ పెద్ద ఆపదలో పడిపోయింది. అన్నా హజారేను ముందు పెట్టి పోరాటాలు చేసిన కొందరు కరడుగట్టిన అవినీతిపరులు ఢిల్లీని ఆపదలో పడేశారు. మద్యం, పాఠశాలలు, వైద్య చికిత్స, కాలుష్య నియంత్రణ, ఉద్యోగ నియామకాల్లో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారు. వీళ్లా ఢిల్లీ అభివృద్ధి గురించి మాట్లాడేది? ముంచుకొచ్చిన ఆపదకు వ్యతిరేకంగా ఢిల్లీ ప్రజలు యుద్ధం చేయాలి. ఆపద నుంచి విముక్తి పొందాలని ఢిల్లీ ప్రజలు సంకల్పించారు. ఆదపను సహించం.. మార్చి చూపిస్తాం అని ఢిల్లీలోని ప్రతి గల్లీలో ప్రతి ఒక్కరూ అంటున్నారు. యమునా నది శుద్ధి చేస్తే ఓట్లు పడవని అంటున్నారు. ఓట్ల కోసం యమునను వదిలేస్తామా? యమునను శుద్ధి చేయకపోతే ఢిల్లీ ప్రజలకు తాగునీరు ఎలా వస్తుంది? అవినీతిపరుల కారణంగా ప్రజలకు కలుషితమైన నీరు అందుతోంది. ఈ ఆపద తెచ్చిపెట్టిన వ్యక్తులు ఢిల్లీ ప్రజల జీవితాలను వాటర్ ట్యాంకర్ల మాఫియాకు వదిలేశారు. ఈ ఆపద ఇలాగే కొనసాగితే మరిన్ని కష్టాలు తప్పవు. ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయకుండా వాళ్లు అడ్డుకుంటున్నారు. ఈ పథకం కింద ప్రజలకు ప్రయోజనం అందకపోవడానికి కారణం ఆ వ్యక్తులే. ప్రజల జీవితాల కంటే తమ స్వార్థం, విజయం, అహంకారమే ప్రధానంగా భావిస్తున్నారు. జాతీయ పథకాల ప్రయోజనాలు ఢిల్లీ ప్రజలకు చేరేలా చేయడమే మా లక్ష్యం. ఆపద నుంచి తప్పించుకోవాంటే బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి'' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

మోదీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- రూ.10 లక్షల సూట్ ధరించి అద్దాల మేడ గురించి మాట్లాడుతారా?
- ఢిల్లీ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఫైర్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. ఆప్ అంటే అవినీతి, ఆప్ అంటే ఆపద అంటూ మోదీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. ఆపద ఢిల్లీలో లేదని, బీజేపీలో ఉందని స్పష్టంచేశారు. ఢిల్లీలో బీజేపీకి ముఖ్యమంత్రి అభ్యర్థి లేరని, ఆ పార్టీకి ఒక నినాదం గానీ, ఎన్నికల అజెండా గానీ లేదని ఎద్దేవా చేశారు. రూ.10 లక్షల విలువైన సూట్ ధరించి, రూ.8,400 కోట్ల విలువైన విమానంలో తిరుగుతూ, రూ.2,700 కోట్లతో నిర్మించిన ఇంట్లో ఉంటున్న నాయకుడు శీష్‌మహల్(అద్దాల మేడ) గురించి మాట్లాడడంసిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. 2020 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిలో ఎన్ని నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజలందరికీ పక్కా ఇళ్లు ఇస్తామని నరేంద్ర మోదీ స్వయంగా చెప్పారని, కానీ ఐదేళ్లలో 4,700 ఇళ్లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఢిల్లీలో 4 లక్షల మురికివాడలు ఉన్నాయని, అక్కడ 15 లక్షల మంది నివసిస్తున్నారని చెప్పారు. బీజేపీ మేనిఫెస్టోను చూస్తే అది 200 ఏళ్లకు ఇచ్చినట్లుగా ఉందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మోదీ మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదన్నారు. కేజ్రీవాల్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో పర్యటనలో మోదీ 43 నిమిషాలు మాట్లాడితే అందులో 39 నిమిషాల పాటు ఢిల్లీ ప్రజలను శాపనార్థాలు పెట్టారని, ఆమ్ ఆద్మీ ప్రభుత్వాన్ని దూషించారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అవహేళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని, వ్యక్తిగతంగా మాటల దాడికి దిగుతోందని విమర్శించారు. ఢిల్లీలో తమ ప్రభుత్వం గత పదేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేసిందని, ప్రజల సంక్షేమమే పరమావధిగా పని చేసిందని వెల్లడించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఢిల్లీకి చేసిందేమీ లేదు కాబట్టి ప్రధానమంత్రి దాని గురించి మాట్లాడలేదని ఆక్షేపించారు.



చెప్పుకోవడానికి ఏమీ లేక ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ అనైతిక పద్ధతుల్లో ముందుకెళ్తోందని చెప్పారు. ప్రజలను బెదిరించి ఓట్లు దండుకోవాలని కుట్రలు చేస్తోందని అన్నారు. నిజంగా ప్రజలకు మంచి చేసి ఉంటే ఈ తప్పుడు విధానాలు ఎందుకని నిలదీశారు.

ఆస్తి హక్కు రాజ్యాంగ హక్కు

భూమి తీసుకుంటే సరైన పరిహారం చెల్లించాలని సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ: పౌరులు ఆస్తిని కలిగి ఉండే హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ప్రజల నుంచి భూమిని సేకరిస్తే చట్టప్రకారం వారికి సరైన పరిహారం చెల్లించాలని ఆదేశించింది. తగిన పరిహారం చెల్లించకుండా వారికి ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. బెంగళూరు–మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణానికి చేపట్టిన భూసేకరణ విషయంలో 2022 నవంబర్‌లో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. తీర్పు వెలువరించింది. రాజ్యాంగ(44 సవరణ) చట్టం–1978 ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించారని ధర్మాసనం వెల్లడించింది. అయినప్పటికీ సంక్షేమ రాజ్యంలో అది మానవీయ హక్కు అని ఉద్ఘాటించింది. ఆస్తి హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏ కింద రాజ్యాంగ హక్కేనని వెల్లడించింది. ఆర్టికల్ 300ఏ ప్రకారం.. ప్రజలను వారి ఆస్తి నుంచి దూరం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాలను ఆదేశించింది.

'కాస్‌గంజ్' కేసులో 28 మందికి యావజ్జీవం



లక్నో: సంచలనం సృష్టించిన కాస్‌గంజ్ హింసాకాండ కేసులో 28 మంది దోషులకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అలాగే రూ.80 వేల చొప్పున జరిమానా చెల్లించాలని దోషులను ఆదేశించింది. న్యాయస్థానం ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. 2018 జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో నిర్వహించిన తిరంగా యాత్రలో హింస చోటుచేసుకుంది. మత కలహాలు చెలరేగాయి. తిరంగా యాత్రను కొందరు అడ్డుకున్నారు. యాత్రలో పాల్గొన్న చందన్ గుప్తా అనే వ్యక్తిని కాల్చి చంపారు. దీంతో హింస మరింత ప్రజ్వరిల్లింది. కాస్‌గంజ్ మూడు రోజులపాటు అట్టుడికిపోయింది. ఈ ఉదంతం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. చందన్ గుప్తాను హత్య చేయడంతోపాటు హింసకు కారణమైన దుండుగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య, హత్యాయత్నం, అల్లర్లకు పాల్పడడం, జాతీయ జెండాను అవమానించడం వంటి ఆరోపణలతో వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఈ కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు ప్రభుత్వం అప్పగించింది. ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు గురువారం 28 మందిని దోషులుగా తేల్చింది. శుక్రవారం శిక్ష ఖరారు చేసింది. నసీరుద్దీన్, ఆసీమ్ ఖురేషీ అనే నిందితులపై తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిర్దోషులుగా గుర్తించింది.

డేరా బాబాకు సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: 2002 నాటి హత్య కేసులో డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్‌రహీం సింగ్‌తోపాటు మరో నలుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పు విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ తీర్పును క్షుణ్నంగా పరిశీలించాలంటూ సీబీఐ చేసిన విజ్ఞప్తి పట్ల సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. సీబీఐ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని డేరా బాబా రామ్‌రహీం సింగ్‌తోపాటు మరో నలుగురిని ఆదేశించింది. నోటీసులు జారీ చేసింది. 2002 జూలై 10వ తేదీన డేరా సచ్చా సౌదా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. రామ్‌రహీం సింగ్‌తోపాటు నలుగురిపై కేసులు నమోదయ్యాయి. సీబీఐ విచారణ సుదీర్ఘంగా జరిగింది. 2024 మే 28న పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు తీర్పు వెలువరించింది. రామ్‌రహీం సింగ్‌తోపాటు నలుగురు నిందితులను నిర్దోషులుగా గుర్తించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కింది కోర్టు తీర్పును పరిశీలించేందుకు అంగీకరించింది.

అతిశీపై అల్కా లాంబా పోటీ



న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దూకుడు ప్రదర్శిస్తోంది. అభ్యర్థుల ప్రకటనలో ముందంజలో ఉంది. కేవలం ఒక్క అభ్యర్థి అల్కా లాంబా పేరుతో శుక్రవారం మూడో జాబితా విడుదల చేసింది. కల్కాజీ నియోజకవర్గంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి అతిశీపై కాంగ్రెస్ అభ్యర్థిగా సీనియర్ నేత అల్కా లాంబా పోటీ చేయబోతున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఖరారు చేసింది. ప్రస్తుతం అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న అల్కా లాంబా 2015లో చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి ఆమ్ ఆద్మీ అభ్యర్థిగా నెగ్గడం గమనార్హం.

ఎంపీపై కేసు కొట్టివేయలేం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో నవంబర్ 24వ తేదీన మసీదులో సర్వే సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జియాఉర్ రహ్మాన్ బర్క్‌పై కేసును కొట్టివేసేందుకు అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. అయితే, ఎంపీని ప్రస్తుతానికి అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఆలయం స్థానంలో మొఘలుల హయాంలో షాహి జామా మసీదును నిర్మించారంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన స్థానిక కోర్టు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ప్రయత్నించిన క్రమంలో చెలరేగిన హింసాకాండలో నలుగురు చనిపోయారు. ఎంపీ జియాఉర్ రహ్మాన్ రెచ్చగొట్టేలా ఎంపీ చేసిన ప్రసంగమే హింసకు కారణమంటూ పోలీసులు ఆయన్ను ప్రధాన నిందితుడిగా చేర్చారు. స్థానిక ఎమ్మెల్యే ఇక్బాల్ మహమ్మద్ కుమారుడు సొహైల్ ఇక్బాల్ తదితరులు నిందితులుగా ఉన్నారు. మరో 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

చైనాకు నిరసన తెలిపిన భారత్

న్యూఢిల్లీ: లద్దాఖ్‌లోని కొన్ని ప్రాంతాలను చైనా తమ భూభాగాలుగా ప్రకటించడంపై భారత్ తీవ్ర నిరసన తెలిపింది. చైనాలోని హొటాన్ ప్రిఫెక్చర్‌లో కొత్తగా రెండు కౌంటీలు ఏర్పాటయ్యాయి. ఇవి రెండూ మన కేంద్ర పాలితప్రాంతంలోని లద్దాఖ్‌లోనివే'అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. లద్దాఖ్‌లోని భారత్ భూభాగాన్ని చైనా అక్రమంగా ఆక్రమించుకోవడాన్ని భారత్ ఎన్నడూ అంగీకరించదని చెప్పారు. సుదీర్ఘకాలంగా మన ఆధీనంలో ఉన్న ఈ భూభాగాలపై మనకు తిరుగులేని సార్వభౌమాధికారం ఉంది. మ్యాప్‌లో చూపడం ద్వారా ఆ అధికారంపై ఎలాంటి ప్రభావం చూపదు. దీనిపై అధికారం తమదేనంటూ చైనా అక్రమంగా ప్రకటించుకున్నప్పటికీ చట్టబద్ధత లభించదు. ఈ విషయమై చైనాకు దౌత్యపరమైన మార్గాల్లో తీవ్ర నిరసన తెలిపాం'అని రణధీర్ జైశ్వాల్ వివరించారు. చైనా ఇలా ప్రకటించుకోవడం ఇదే మొదటిసారికాదు. గతంలో, 2017లో కూడా భారత్‌లోని ప్రాంతాలను తమ దేశ మ్యాప్‌లో చూపుకుంది.

థాయ్‌లాండ్ ప్రధాని షినవత్రకు రూ.3,431 కోట్ల ఆస్తులు



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పెటొంగ్‌తర్న్ షినవత్ర తన ఆస్తుల వివరాలు ప్రకటించారు. తనకు 400 మిలియన్ డాలర్ల (రూ.3,431 కోట్లు) ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు థాయ్‌లాండ్ జాతీయ అవినీతి నిరోధక కమిషన్(ఎన్ఏసీసీ)కు శుక్రవారం డిక్లరేషన్ సమర్పించారు. షినవత్రకు దేశ విదేశాల్లో పెద్ద సంఖ్యలో స్థిరచరాస్తులతోపాటు అత్యంత ఖరీదైన హ్యాండ్‌బ్యాగ్‌లు, చేతి గడియారాలు, విలాసవంతమైన వాహనాలు ఉన్నాయి. ఆమె వద్ద 200కుపైగా డిజైనర్ హ్యాంగ్‌బ్యాగ్‌లు ఉన్నాయి. వీటి విలువ 2 మిలియన్ డాలర్లు(రూ.17.15 కోట్లు). అలాగే 75 లగ్జరీ చేతి గడియారాల విలువ 5 మిలియన్ డాలర్లు (రూ.42.88 కోట్లు). షినవత్ర 2023 సెప్టెంబర్‌లో 37 ఏళ్ల వయసులో థాయ్‌లాండ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దేశంలో అత్యంత పిన్నవయస్కురాలైన ప్రధానిగా రికార్డు సృష్టించారు. ఆమె తండ్రి థక్సిన్ షినవత్ర సహా కుటుంబంలో నలుగురు ప్రధానమంత్రులుగా పనిచేశారు. థక్సిన్ థాయ్‌లాండ్‌లో అత్యంత సంపన్నుడిగా రికార్డుకెక్కారు.

కాలిఫోర్నియాలో కూలిన విమానం

ఇద్దరు మృతి, 18 మందికి గాయాలు

కాలిఫోర్నియా: వరుస విమాన ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. కాలిఫోర్నియాలో విమాన ప్రమాదం జరిగింది. డిస్నీల్యాండ్‌కు సమీపంలోని ఆరెంజ్ కౌంటీలో ఉన్న ఫుల్లర్టన్ మున్సిపల్ విమానాశ్రయంలో టేకాఫ్ అయిన నిమిషంలోనే విమానం కుప్పకూలింది. ఓ వాణిజ్య భవనం పైకప్పుపై పడింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం 2.09 గంటలకు ఈ ఘటన జరిగింది. సింగిల్ ఇంజన్ కలిగిన నాలుగు సీట్ల చిన్న విమానమే అయినప్పటికీ.. ఫర్నిచర్ గోదామ్‌పై కుప్పకూలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. విమానం కూలగానే గోదాములో మంటలు చెలరేగాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేసి సమీప భవనాలను ఖాళీ చేయించారు. గతేడాది నవంబర్‌లో మరో చిన్న విమానం టేకాఫ్ అయిన వెంటనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తుండగా విమానాశ్రయానికి అర మైలు దూరంలో ఉన్న చెట్టును ఢీకొట్టింది. విమానంలో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి.

కేంద్ర అధికారులపై కేసు నమోదుకు.. సీబీఐకి రాష్ట్రాల అనుమతి అవసరం లేదు

ఏపీ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రాష్ట్రాల్లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. జస్టిస్ సీటీ రవి కుమార్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌ల ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'ఏ హోదాలో ఉన్నాసరే, ఆ ఇద్దరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు/ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, కేంద్ర ప్రభుత్వ చట్టాల ప్రకారం వారిపై తీవ్ర అభియోగాలున్నాయి'అని ధర్మాసనం కుండబద్దలు కొట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసే ఇద్దరు కేంద్ర అధికారులపై అవినీతి ఆరోపణలకు సంబంధించి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1946 కింద సీబీఐకి గతంలో అనుమతిచ్చిందని, రాష్ట్రం వేరు పడినందున మళ్లీ అనుమతులు అవసరమన్న నిందితుల వాదనతో హైకోర్టు ఏకీభవిస్తూ వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. దీనిని తప్పుబట్టిన సుప్రీం ధర్మాసనం.. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు వర్తించిన అన్ని చట్టాలు కొత్తగా ఏర్పాటైన రెండు రాష్ట్రాలకు యథాప్రకారం కొనసాగుతాయని తేల్చిచెప్పింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదుకు తాజాగా ఎలాంటి అనుమతి అవసరం లేదని తెలిపింది.

తెలంగాణకు శోభా కరంద్లాజే.. ఏపీకి పీసీ మోహన్

- తమిళనాడుకు కిషన్‌రెడ్డి, యూపీకి పీయూష్ గోయల్
- పార్టీ ఎన్నికల అధికారులను నియమించిన బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: సంస్థాగత మార్పుల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పార్టీ నూతన అధ్యక్షుల నియామకానికి శ్రీకారం చుట్టింది. సంక్రాంతిలోగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కౌన్సిల్ సభ్యులను నియమించేందుకు వీలుగా ప్రత్యేక ఎన్నికల అధికారుల పేర్లను ఖరారు చేసింది. శుక్రవారం 29 మందితో కూడిన జాబితాను బీజేపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రానికి ఎన్నికల అధికారిగా కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే, ఆంధ్రప్రదేశ్‌కు కర్ణాటకకు చెందిన లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్‌లను నియమించింది. వీరితోపాటు తమిళనాడుకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉత్తరప్రదేశ్‌కు పీయూష్‌గోయల్, అండమాన్ నికోబార్‌కు తమిళిసై సౌందర్‌రాజన్, బిహార్‌కు మనోహర్ లాల్ ఖట్టర్, కర్ణాటకకు శివరాజ్ సింగ్ చౌహాన్, గుజరాత్‌కు భూపేంద్ర యాదవ్, మధ్యప్రదేశ్‌కు ధర్మేంద్ర ప్రధాన్, పుదుచ్చేరికి తరుణ్ ఛుగ్‌లకు ఎన్నికల అధికారులుగా బాధ్యతలు అప్పగించింది.

రోడ్డు వేయాలంటూ డోలీలతో నిరసన



అనకాపల్లి జిల్లా చీమలపాడు–కొండశిఖర గిరిజన గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ ఆ రహదారిలో డోలీ మోతతో ఆయా గ్రామాల ప్రజలు శుక్రవారం నిరసన తెలిపారు. తమ గ్రామాలకు రోడ్డు వేయకపోవడం వల్ల డోలీలతో రోగులను తరలించవలసి వస్తోందని వాపోయారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలో కొండశికర, నేరుడుబంధ పీవీటీజీ కొందు గిరిజన గ్రామాలకు ఏడాది కిందట రూ. 2.66 కోట్లు మంజూరు చేసినా నేటికీ రోడ్డు నిర్మాణపనులు చేపట్టలేదన్నారు. రహదారి సమస్య పరిష్కారం కోరుతూ ఈ నెల 25న గుర్రాలు, డోలీలతో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని చెప్పారు. – చోడవరం (అనకాపల్లి జిల్లా)

రెవెన్యూ సదస్సుకు గేదెలు, ఆవులు



భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పేరడం గ్రామంలో రెవెన్యూ సదస్సుకు గేదెలు, ఆవులు, మేకలను తోలి టీడీపీ నేతలు నిరసన తెలియజేశారు. దీని వల్ల పశువుల మేతకు బీడు భూములు లేకుండా పోయాయని ఆరోపించారు. ఇంతలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు స్పందించి.. పశువులను తరిమేయడంతో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అయితే టీడీపీ నేతలు ఆరోపిస్తున్న బీడు భూముల్లో కొంత కాలంగా నిరుపేదలైన గిరిజనులు, దళితులు నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. వారంతా కూడా ఆ భూముల్లో ఇళ్ల పట్టాల కోసం అధికారులకు అర్జీలు అందజేశారు. – సత్యవేడు



మత్స్య సంపదకు కేరాఫ్ ఏపీ

దేశంలో 2022–23లో రికార్డు స్థాయిలో 175.45 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యాయి. ప్రపంచంలో చేపలు అత్యధికంగా ఎగుమతి చేసే 3వ దేశం మనది. మొదటి రెండు స్థానాల్లో చైనా, ఇండోనేషియా ఉన్నాయి. ప్రపంచ మత్స్య ఉత్పత్తుల్లో మనవాటా 8.92 శాతం. ఆ ఏడాది మనదేశ మత్స్య ఎగుమతుల మొత్తం విలువ రూ.63,969 కోట్లు. దేశంలో చేపల ఉత్పత్తిలో మొదటి స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. దేశ ఉత్పత్తిలో 29.10 శాతం మన రాష్ట్రం నుంచే వస్తున్నాయి. ఆ తరవాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్, కర్ణాటక ఉన్నాయి. ఏపీలో 2018–19లో 39.91 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయితే ఆ సంఖ్య 2022–23లో 51 లక్షల టన్నులు దాటింది.

రాష్ట్రం	ఉత్పత్తి చేసే చేపలు (లక్షల టన్నుల్లో)
ఆంధ్రప్రదేశ్	51.06
పశ్చిమబెంగాల్	20.45
కర్ణాటక	12.25
ఒడిశా	10.52
కేరళ	9.21
ఉత్తరప్రదేశ్	9.15

ఆధారం: కేంద్ర మత్స్యశాఖ

రైతన్నగా మాజీ ఎంపీ రెడ్డెప్ప



పుంగనూరు: వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీ రెడ్డెప్ప రైతుగా మారారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని చదళ్ల వద్ద ఉన్న పొలంలో శుక్రవారం తానే వ్యవసాయ పనులు చేస్తూ అందరిని విస్మయానికి గురిచేశారు. ప్రస్తుతం రెడ్డెప్ప తన పొలంలో డెయిరీ ఫాం ఏర్పాటు చేసి, ప్రతిరోజూ పాలు విక్రయించే కార్యక్రమం చేపడుతున్నారు. అలాగే పొలంలో వరి, టమాటా పంటలను పండిస్తున్నారు. ఇందుకోసం ఆయనే స్వయంగా కాడెద్దులతో పొలాన్ని దుక్కిచేసుకుంటూ ఔరా అనిపించారు.

‘అంగర’లో ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్ లైన్ లీక్

కపిలేశ్వరపురం: కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలోని అంబేడ్కర్ పార్క్ వద్ద ఉన్న ఓఎన్‌జీసీ సైట్‌లో పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకై, ఆ వాసన సమీప నివాస ప్రాంతాలకు వ్యాపించింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. సంస్థ సైట్ అధికారులు స్పందించి, ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. మండపేట అగ్నిమాపక వాహనం ఘటనాస్థలికి చేరుకుంది. తహసీల్దార్ చిన్నారావు, రెవెన్యూ, సచివాలయ అధికారులు నివాసితులకు ధైర్యం చెప్పారు. పైప్‌లైన్ యు బెండ్ వెల్డింగ్ వద్ద లీకేజీ ఏర్పడిందని, సాంకేతిక నిపుణులు స్పందించి, గ్యాస్ లీకేజీని అరికట్టారని ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని సైట్ ఇన్‌చార్జి సుబ్బారావు చెప్పారు. ఘటనా స్థలాన్ని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

రౌడీ సర్కార్!

బలవంతంగా మల్లవల్లి భూముల స్వాధీనం

ప్రభుత్వ ముఖ్య నేత కన్ను

మల్లవల్లి పారిశ్రామికవాడలో రూ.కోట్ల విలువైన భూమిపై ప్రభుత్వంలోని ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కన్ను పడినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో సాగుదారుల చేతిలో ఉన్న భూమితో పాటు గతంలో సామాజిక అవసరాలు, ఇళ్ల స్థలాల పంపిణీకి కేటాయించిన భూమిని సైతం తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధిని రంగంలోకి దింపి, ఈ వ్యవహారం చక్కబెట్టేలా దిశా నిర్దేశం చేసిందని తెలుస్తోంది. వందల ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసి, ఆపై పారిశ్రామిక వేత్తలకు అధిక ధరతో అప్పగించాలని వ్యూహం రచించింది.



మల్లవల్లి పారిశ్రామికవాడలో జంగిల్ క్లియరెన్స్



గృహ నిర్బంధంలో చిన్నాల వరప్రసాద్

సాక్షి ప్రతినిధి, విజయవాడ /హనుమాన్ జంక్షన్ రూరల్ : శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే ఇళ్ల చుట్టూ పోలీసులు.. అక్రమంగా గృహ నిర్బంధం.. అసలేం జరుగుతుందో తెలియని పరిస్థితి.. ఎందుకిలా చేస్తున్నారని అడిగితే సమాధానం చెప్పేవారే లేరు.. అక్కడందరూ తీవ్రవాదులు, దొంగలున్నట్లు ఈ పోలీసులేంటి.. వారి హడావుడి ఎందుకో తెలియక కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి వాసులు తల్లడిల్లిపోయారు. తాము దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వమే ఇలా దౌర్జన్యం చేస్తోందని తెలుసుకుని మండిపడ్డారు. పరిహారం కూడా ఇవ్వకుండా ఇలా బలవంతంగా లాక్కోవడమేమిటని నిలదీస్తున్నారు. మల్లవల్లిలోని రీ సర్వే నంబర్ 11లో 1,460 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల నిమిత్తం ఏపీఐఐసీకి కేటాయించింది. అప్పటికే ఆ భూమిని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న నిరుపేదలకు ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. ఇలా సేకరించిన భూమిలోంచి గ్రామ సామాజిక అవసరాలు, ఇళ్ల స్థలాల పంపిణీ నిమిత్తం 100 ఎకరాలు కేటాయిస్తామని జీవో 456 కూడా జారీ చేసింది. రైతు కూలి పనులు చేసుకుని బతికే భూమి లేని తెల్లరేషన్ కార్డుదారులకు రూ.50 వేలు సాయం అందిస్తామని కూడా హామీ ఇచ్చింది. అంతా బాగానే ఉందనుకున్న తరుణంలో రీ సర్వే నంబర్ 11లోని సాగుదారుల ఎంపిక ప్రహసనంగా మారింది. రాజకీయ కక్ష సాధింపులకు వేదికైంది. టీడీపీ నేతల ప్రోద్బలంతో రెవిన్యూ అధికారులు పలువురు సాగుదారులకు పరిహారం దక్కకుండా చేశారు. దీంతో దాదాపు 150 మంది రైతులు నాటి నుంచి పరిహారం కోసం దఫదఫాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. స్వయంగా మల్లవల్లి వచ్చి ఏపీఐఐసీ భూ నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలిపారు. త్వరలో ప్రభుత్వం తప్పక మారుతుందని, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సీన్ రివర్స్ అయింది. పరిహారం ఇవ్వకుండానే భూములు లాక్కోవాలని చూస్తోంది. సామాజిక అవసరాలకు కేటాయించిన 100 ఎకరాల భూమిని కూడా తిరిగి వెనక్కు తీసుకునేందుకు తెర వెనుక మంత్రాంగం మొదలుపెట్టింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొద్ది రోజులుగా ఆందోళన బాట పట్టారు.

పోలీసుల బలగాలతో భూముల స్వాధీనం

మల్లవల్లిలో ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో దాదాపు 300–400 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించక పోవటంతో ఇంకా ఆ భూమి సాగుదారుల చేతిలోనే ఉంది. ఈ భూమితో పాటు సామాజిక అవసరాలు, ఇళ్ల స్థలాల పంపిణీకి కేటాయించిన 100 ఎకరాల భూమిని కూడా తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు కార్యాచరణ చేపట్టింది. దీని కోసం 15 మంది తహసీల్దార్లు, రెవెన్యూ యంత్రాంగంతో గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు సుబ్రహ్మణ్యం, బీఎస్ హేలా షారోన్ రంగంలోకి దిగారు. హనుమాన్ జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం తెల్లవారుజామున సుమారు వెయ్యి మంది పోలీసులు గ్రామంలో, పారిశ్రామికవాడలో మోహరించారు. భూ నిర్వాసితుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్న చిన్నాల వర ప్రసాద్, పంతం కామరాజు, బొకినాల సాంబశివరావులతో పాటుగా మరో ఎనిమిది మందిని శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వారి సెల్ ఫోన్లు లాక్కున్నారు. వీరి ఇళ్ల వద్ద ఒక ఎస్ఐ, ఏఎస్ఐ, తహసీల్దార్ స్థాయి అధికారులు సహా పది మంది కానిస్టేబుళ్లను బందోబస్తులో ఉంచారు. ప్రతి సాగుదారుని ఇంటి వద్ద పోలీసులను ఉంచి, వారిని ఇంట్లో నుంచి బయటకు రానివ్వలేదు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, పారిశ్రామికవాడలోని వివాదాస్పద ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దార్లు, సర్వేయర్లను రప్పించి.. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి పర్యవేక్షణలో పారిశ్రామికవాడలో సర్వే పనులు చేపట్టారు. ప్రొక్లెయిన్లు, బుల్‌డోజర్లు, ఇతర యంత్రాలను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చి జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా మొదలు పెట్టారు. సాగుదారుల చేతుల్లో ఉన్న భూములను సైతం చదును చేశారు. ఆ వెంటనే ఏపీఐఐసీ ప్లాట్ల విభజన పనులు కూడా శరవేగంగా చేపట్టారు.

సముద్రంలో 150 కి.మీ ఈత

- అరుదైన ఘనత సాధించిన స్విమ్మర్ శ్యామల
- వైజాగ్‌లో ప్రారంభం.. కాకినాడలో ఒడ్డుకు



కాకినాడ తీరంలో జాతీయ పతకంతో శ్యామల గోలి

కాకినాడ రూరల్ : సముద్రంలో 150 కిలోమీటర్లు ఈది ఆసియాలోనే అరుదైన ఘనతను సాధించారు స్విమ్మర్ శ్యామల గోలి. గత నెల 28న విశాఖపట్నం ఆర్కే బీచ్ వద్ద సముద్రంలో ఈత ప్రారంభించిన ఆమె ఏడో రోజైన శుక్రవారం కాకినాడ తీరం చేరుకున్నారు. మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో కాకినాడ బీచ్‌కు చేరుకున్న శ్యామలకు కాకినాడ నగర కమిషనర్ భావన, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు స్వాగతం పలికారు. ఐదు పదుల వయసులో అలవోకగా సముద్రాలు ఈదుతూ సాహస యాత్రతో అబ్బుర పరుస్తున్న శ్యామలను చూసేందుకు, ఆమెకు స్వాగతం పలికేందుకు విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్యామల మీడియాతో మాట్లాడుతూ.. తాను చిన్నప్పట్నుంచీ స్విమ్మర్‌ను కాదని చెప్పారు. జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల మేర స్విమ్ చేసేలా తనను కోచ్ జాన్ సిద్ధిక్ తీర్చిదిద్దారన్నారు. 2021లో శ్రీలంక – ఇండియా మధ్య రామ్‌సేతును ఈదానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశానని గుర్తు చేశారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు సముద్రంలో దిగి.. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఒడ్డుకు వచ్చానని.. ఈ లెక్కన ఆరు రోజుల్లోనే లక్ష్యం చేరానన్నారు. స్విమ్మింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, మహిళల్లో గైనిక్ సమస్యలు తగ్గుతాయని చెప్పారు.

తిరుమల శ్రీవారిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి దర్శించుకున్నారు. అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్న వారిలో సినీనటి రాశీసింగ్, కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. - తిరుమల





కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలత కుటుంబ సమేతంగా శుక్రవారం చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు, స్వామిచిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. - కాణిపాకం

20 నుంచి మళ్లీ రీ సర్వే

ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని

సాక్షి, అమరావతి: ఈ నెల 20వ తేదీ నుంచి భూముల రీ సర్వేను తిరిగి ప్రారంభిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తొలుత ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని రీ సర్వే చేస్తామన్నారు. జోన్ 2, జోన్ 3లోని 11 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో మంత్రి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం ఆ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. రీ సర్వేలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొంటారని చెప్పారు. ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా ఒక బృందం రోజుకు 20 ఎకరాలే సర్వే చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని కోటీ ఎనభై లక్షల ఎకరాలు నిషేధిత జాబితా 22(ఎ)లో ఉన్నాయని, వాటన్నింటిపై విచారణ జరిపి, నిషేధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. ఏ జిల్లాలో ఎన్ని భూములు 22 ఏ కింద ఉన్నాయి, అవి ఏ కేటగిరీల కింద ఉన్నాయో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, వాటిలో వచ్చిన విజ్ఞాపనలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ పాస్ పుస్తకంపై రాజముద్రతోపాటు క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. కాగా, భూముల రీ సర్వే కోసం తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా మంజూరు చేసిన డిప్యూటీ తహశీల్దార్ పోస్టుల్ని మరో రెండేళ్లు కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గత ఏడాది సెప్టెంబర్ 23తో గడువు ముగిసింది. అయితే ఇప్పటివరకు రీ సర్వే కొనసాగింపుపై సందిగ్ధత ఉండడంతో ఆ పోస్టుల కొనసాగింపుపై ఏ నిర్ణయం తీసుకోలేదు.

తిరుమల తీర్థాల వద్ద మెరుగైన సౌకర్యాలు

తిరుమల: తిరుమలలో తీర్థాలు, ఉప ఆలయాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై టీటీడీ ఈవో శ్యామలరావు అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరితో కలిసి తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆకాశ గంగ, పాప వినాశనం, చక్ర తీర్థాల్లో పార్కింగ్, లైటింగ్, పచ్చదనం, క్యూలైన్లు, సూచిక బోర్డులు, ఉప ఆలయాల్లో ప్రసాద దిట్టం, పలు నిర్మాణ పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు.

వైఎస్సార్‌సీపీ బీసీ నేతలపై టీడీపీ శ్రేణుల దాడి



గాయపడ్డ యలమంద

దుర్గి : పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పులలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులపై టీడీపీ నేతలు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ నేత జంగా యలమంద రోడ్డుపై వెళుతుండగా.. టీడీపీ నేతలు పథకం ప్రకారం గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన యలమంద తండ్రి జంగా శ్రీనివాసరావు, బంధువు నాలి రామయ్యలపైనా దాడికి పాల్పడ్డారు. గాయపడిన యలమందను మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, నాలి రామయ్య, జంగా శ్రీనివాసరావులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు నిర్బంధించారు. దాడి చేసిన వారిని బయట ఉంచి తమను లోపల ఉంచడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి యలమందను ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధీర్‌బాబు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడిపై ‘టీడీపీ’ దాడి



గాయపడ్డ సుధాకర్

సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ సచివాలయ పరిధిలో ఎంపీటీసీ సభ్యుడిని టీడీపీ నాయకుడు తీవ్రంగా అవమానించి దాడి చేశాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, నిధులు వినియోగం, ఖర్చులపై గ్రామసభ నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఉమాపతి స్థానిక ఎంపీటీసీ బచ్చల సుధాకర్, ఉప సర్పంచ్ వాడరేవు రవికుమార్‌కు ఆహ్వానం పలికారు. పంచాయతీ కార్యదర్శి ఆహ్వానం మేరకు శుక్రవారం గ్రామసభకు వీరు హాజరయ్యారు. పలు సమస్యలపై అధికారులను ఎంపీటీసీ సుధాకర్ ప్రశ్నించారు. దీంతో పక్కన ఉన్న టీడీపీ నాయకుడు వాడరేవు కృష్ణారావు జోక్యం చేసుకుని ‘మిమ్మల్ని ఇక్కడ కూర్చోబెట్టడమే గొప్ప’ అంటూ చులకనగా మాట్లాడుతూ చిందులు తొక్కారు. ప్రజా ప్రతినిధిగా గ్రామసభకు పిలిస్తే వచ్చామని ఎంపీటీసీ సమాధానం చెప్పడంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఎంపీటీసీపై టీడీపీ నాయకులు దాడి చేశారు. గాయపడిన ఎంపీటీసీ సుధాకర్‌ను 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై దాడి



గాయపడ్డ శివ

పిడుగురాళ్ల: సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇర్లా వెంకటశివపై టీడీపీ నేతలు శుక్రవారం దాడి చేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో వెంకటశివ బార్బర్ షాపునకు వెళ్లి కటింగ్ చేయించుకుని వస్తున్నాడు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరులైన టీడీపీ కార్యకర్తలు షేక్ ఇంతియాజ్, జె.రవితో పాటు మరికొంత మంది యువకులు వెంకటశివపై మూకుమ్మడిగా దాడి చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న వెంకటశివ బంధువు నాగరాజు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ ఇంతియాజ్ ఆగ్రహంతో ఊగిపోతూ.. నీ సంగతి చూస్తానంటూ.. చంపేస్తానంటూ బెదిరించాడు. గాయపడిన వెంకటశివను పల్నాడు వైద్యశాలలో చేర్పించారు. కాగా, గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వెంకటశివను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినంపై మాస్టర్ డాక్యుమెంట్

తిరుమల: శ్రీవారి భక్తులకు జనవరి 10 నుంచి 19 వరకు సులభంగా వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. వైకుంఠ ఏకాదశి ముఖ్యాంశాలతో అదనపు ఈవో సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ రూపొందించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇది ప్రస్తుత, భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందని తెలిపారు. తిరుపతి, తిరుమలలో ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ, వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీవారి ఆలయంలో కైంకర్యాల నిర్వహణ, భక్తుల భద్రత, దర్శనం, వసతి, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నప్రసాదం, ఇతర ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తరువాత వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా వచ్చే భక్తుల రద్దీ కోసం వివిధ పార్కింగ్ ప్రాంతాలను కేటాయించడం ద్వారా ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేసే నిపుణులు ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో విద్యుత్ అలంకరణలు చేయనున్నారు. అలాగే ప్రత్యేకమైన పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలు ఏర్పాటు చేయనున్నారు.


7 నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ప్రకటన

సాక్షి, విశాఖపట్నం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై ఈ నెల 7, 8, 10వ తేదీల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 3 విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ, అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)పై 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ-కన్వెన్షన్ సెంటర్ నుంచి, 10న కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ఏపీఈఆర్సీ ఛైర్మన్ (ఇన్‌ఛార్జ్) ఠాకూర్ రామసింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోజు ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు నేరుగానూ, 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు, అభ్యంతరదారులు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థల కార్పొరేట్, సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాక్ పబ్లిక్ హియరింగ్‌ని ఏపీఈఆర్సీ శుక్రవారం నిర్వహించినట్లు పృథ్వీతేజ్ వివరించారు.

ఖర్చుల్లో తగ్గేది లేదంటున్న ఆంధ్రులు

జాతీయ సగటును మించి ఖర్చు చేస్తున్న ఏపీ జనం



ఖర్చుల విషయంలో ఆంధ్రులు తగ్గేదే లేదంటున్నారు. ఏపీలో గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో నెలవారీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం జాతీయ స్థాయిని మించి నమోదైంది. 2022-23 ఆర్థిక ఏడాదితో పోలిస్తే.. రాష్ట్రంలోగ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ 2023-24లో నెలవారీ తలసరి వినియోగం వ్యయం పెరిగింది. 2022-23తో పోలిస్తే రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం 9.38 శాతం, పట్టణాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం 5.89 శాతం పెరిగింది. 2022-23తో పోలిస్తే రాష్ట్రంలో 2023-24లో గ్రామీణ నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.457, పట్టణ ప్రాంతాల్లో రూ.400 పెరిగింది. గృహ వినియోగ వ్యయ సర్వే 022-23-24ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం 2023-24లో జాతీయ స్థాయిలో నెలవారీ పట్టణ తలసరి వినియోగ వ్యయం రూ.6,996 ఉండగా.. ఏపీలో నెలవారీ పట్టణ తలసరి వినియోగ వ్యయం రూ.7,182గా నమోదైంది. జాతీయ స్థాయి గ్రామీణ తలసరి వినియోగ వ్యయం రూ.4,122 ఉండగా.. ఏపీలో గ్రామీణ తలసరి వినియోగ వ్యయం రూ.5,327గా నమోదైంది.

\- సాక్షి, అమరావతి

రాష్ట్రంలో నెలవారీ పట్టణ తలసరి వినియోగ వ్యయం రూ.7,182

జాతీయ స్థాయిలో ఇది రూ.6,996గా నమోదు

ఏపీలో నెలవారీ గ్రామీణ తలసరి వినియోగ వ్యయం రూ.5,327

జాతీయ స్థాయిలో గ్రామీణ తలసరి వినియోగ వ్యయం రూ.4,122

వెల్లడించిన గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24



2023-24లో నెలవారీ తలసరి వినియోగ వ్యయంలో జాతీయ స్థాయిని మించిపోయిన రాష్ట్రాలు

రాష్ట్రం	గ్రామీణ వ్యయం	పట్టణ వ్యయం (రూపాయల్లో)
కేరళ	6,611	7,783
తమిళనాడు	5,701	8,165
పంజాబ్	5,817	7,359
తెలంగాణ	5,435	8,978
ఆంధ్రప్రదేశ్	5,327	7,182
హరియాణ	5,377	8,428
కర్ణాటక	4,903	8,076
మహారాష్ట్ర	4,145	7,363
జాతీయ సగటు వ్యయం	4,122	6,996

ఆహారేతర వస్తువులపైనే ఖర్చు

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా ఆహారేతర వస్తువుల వినియోగంపైనే ఎక్కువ వ్యయం చేస్తున్నట్టు సర్వేలో స్పష్టమైంది. 2023-24లో గ్రామీణ ప్రాంతాల్లో 53 శాతం, పట్టణ ప్రాంతాల్లో 60 శాతం ఆహారేతర వస్తువుల వినియోగంపైనే వ్యయం చేశారు. రవాణా, దుస్తులు, పరుపులు, పాదరక్షలు, ఇతర వస్తువులు, వినోదం, మన్నికైన వస్తువులు ఆహారేతర వ్యయంలో ప్రధాన వ్యయ వాటాను కలిగి ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఆహారేతర వ్యయంలో ఇంటి అద్దె దాదాపు 7 శాతం వాటా కలిగి ఉంది. ప్రధానంగా పానీయాలు, రిఫ్రెష్‌మెంట్‌లు, ప్రాసెస్ చేసిన ఆహారంలో వ్యయం కొనసాగుతోంది. ఆ తరువాత పాలు, పాల ఉత్పత్తులు, కూరగాయలు ఆహార వ్యయంలో ప్రధానంగా ఉన్నాయి. 2022-23తో పోలిస్తే జాతీయ స్థాయిలో 2023-24లో గ్రామీణ ప్రాంతాల్లో నెల వారీ తలసరి వినియోగ వ్యయం 9 శాతం, పట్టణ ప్రాంతాల్లో 8 శాతం పెరిగింది. జాతీయ స్థాయిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య నెలవారీ తలసరి వినియోగ వ్యయం వ్యత్యాసం మరింత తగ్గింది. 2022-23లో 71 శాతం ఉండగా 2023-24లో 70 శాతానికి తగ్గింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన వినియోగం పెరుగుదలను సూచిస్తోంది.

దేశీయ కంపెనీలు.. హెచ్‌-1బి వీసాలు



దేశీయ దిగ్గజ ఐటీ కంపెనీలు గతేడాది అమెరికా ప్రభుత్వం మంజూరు చేసిన హెచ్‌-1బీ వీసాల్లో సింహభాగాన్ని కైవసం చేసుకున్నాయి. 2024 సెప్టెంబరు 30 వరకు అమెరికా టాప్ – 10 కంపెనీలకు మంజూరు చేసిన వీసాల్లో ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌సీఎల్ టెక్, కాగ్నిజెంట్ 41 శాతం వీసాలను దక్కించుకున్నాయి. విప్రో 1,634, టెక్ మహీంద్రా 1,199 వీసాలను దక్కించుకున్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్.. మెటా, యాపిల్ వంటి వాటితో పోటీపడి ముందంజలో నిలవడం విశేషం.

కంపెనీ	మంజూరైన వీసాలు
అమెజాన్ డాట్ కామ్ సేవలు	9,265
ఇన్ఫోసిస్	8,140
కాగ్నిజెంట్ టెక్ సొల్యూషన్స్	6,321
గూగుల్ ఎల్‌ఎల్‌సీ	5,364
టీసీఎస్	5,274
మెటా ప్లాట్‌ఫామ్స్	4,844
మైక్రోసాఫ్ట్	4,725
యాపిల్	3,873
హెచ్‌సీఎల్ అమెరికా	2,953
ఐబీఎమ్	2,906

ఆధారం: యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్

కార్ల షోరూమ్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



స్కోడా షోరూమ్‌లోకి దూసుకెళ్లి ఆర్టీసీ బస్సు

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో శుక్రవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఈ బస్సుకు బ్రేకులు ఫెయిల్ కావడంతో జాతీయ రహదారికి పక్కగా ఉన్న స్కోడా కార్ల షోరూమ్‌లోకి దూసుకెళ్లడంతో షోరూమ్‌లో పార్కింగ్ చేసిన 2 కార్లు ధ్వంసమయ్యాయి. విజయవాడ గవర్నర్ పేట-1 డిపోకు చెందిన బస్సు 30 మందితో హనుమాన్‌జంక్షన్‌కు బయలుదేరింది. ప్రసాదంపాడుకు వచ్చేసరికి బస్సుకు బ్రేకులు ఫెయిల్ కావడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కార్ల షోరూమ్‌లోకి దూసుకెళ్లింది. పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. విద్యుత్ స్తంభం ఒరిగి తీగలు బస్సుపై పడటంతో కండక్టర్, డ్రైవర్ లు ప్రయాణికులను కిందకు దింపివేశారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పటమట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పం ఏరియా అభివృద్ధికి రూ.92.20 కోట్లు



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 92.20 కోట్లు మంజూరు చేసింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి చేపట్టే 9 పనులతో పాటు ఐదుగురు ప్రైవేట్ కన్సల్టెన్సీల కోసం పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. గత నెలలో రూ.456 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసినప్పటికీ, అదే రోజు ఆ ఉత్తర్వులను ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పుడు రూ.92.20 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.42.20 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

క్లుప్తంగా...

5న 'హైందవ శంఖారావం'

సాక్షి, అమరావతి/కేసరపల్లి(గన్నవరం): దేశంలోని హిందూ దేవాలయాల పరిరక్షణ, ఆలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని కోరుతూ ఈ నెల 5న కృష్ణా జిల్లాలోని కేసరపల్లిలో హైందవ శంఖారావం బహిరంగ సభను 3 లక్షల మందితో నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నేతలు తెలిపారు. శుక్రవారం కేసరపల్లిలో సభా ప్రాంగణం వద్ద వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు జి.సత్యం, రాష్ట్ర అధ్యక్షులు ఓబిలిశెట్టి వేంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు దేశంలోని 150కు పైగా పీఠాధిపతులు హాజరుకానున్నారని.. 3,500 ప్రత్యేక బస్సులు, 7 ప్రత్యేక రైళ్లు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

దేవాలయాలపై 'సంఘ్'ది రెండు నాల్కల ధోరణి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయాన్ని దెబ్బతీసేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావుతో కలిసి శ్రీనివాసరావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. దేవాలయాలపై ప్రభుత్వం నియంత్రణ వద్దనే పేరుతో చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం పూర్తిగా ప్రజావ్యతిరేకమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉన్న యూపీలో దేవాలయాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారని ఇక్కడ మాత్రం ప్రభుత్వ ఆధీనంలో ఉండకూడదంటే ఎలాగని ప్రశ్నించారు.

'ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా'

తాళ్లరేవు: మత్స్యకారులకు గతేడాది అందించాల్సిన వేట నిషేధ పరిహారాన్ని వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీన అందజేయనున్నట్లు మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఓఎన్‌జీసీ నష్టపరిహార పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 23,458 మంది మత్స్యకార లబ్ధిదారులకు రూ.148.35 కోట్ల చెక్కును అందజేశారు. వచ్చే ఏప్రిల్ 1న మత్స్యకార భరోసా రూ.20 వేలు, రైతు భరోసా వేస్తామని చెప్పారు.

మార్చిలో జనసేన ప్లీనరీ

సాక్షి, అమరావతి: ఈ ఏడాది పార్టీ ఆవిర్భావ కార్యక్రమాలను పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించాలని జనసేన నిర్ణయించింది. మార్చి 12, 13, 14 తేదీల్లో 3 రోజులపాటు ప్లీనరీ రూపంలో పార్టీ ఆవిర్భావ కార్యక్రమాలను నిర్వహించనుంది. శుక్రవారం విజయవాడలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశమై కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. మార్చి 12న ప్లీనరీ ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు చెప్పారు. 14న బహిరంగ సభ నిర్వహిస్తామని మనోహర్ తెలిపారు.

ఆమెతోనా మాకు నీతులు చెప్పించేది

- సినీనటి, బీజేపీ నేత మాధవీలతపై జేసీ ప్రభాకర్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు
- భజరంగదళ్, ఆరెస్సెస్, వీహెచ్‌పీ.. ఇలాంటి వాళ్లా నన్ను బెదిరించేది?
- వీళ్లకంటే థర్డ్‌జెండర్‌లు మేలు
- జేసీ వీడియో వైరల్



సాక్షి ప్రతినిధి, అనంతపురం/అనంతపురం టవర్ క్లాక్ : టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యల పరంపర కొనసాగుతోంది. తాజాగా.. ఆయన సినీ నటి, బీజేపీ నేత మాధవీలతపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆమె పెద్ద వ్యభి చారి అని వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తులతోనా తమకు నీతులు చెప్పించేది అంటూ ఫైర్ అయ్యారు. ఆయన మాట్లాడిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

న్యూ ఇయర్ వేడుకలకు వెళ్లొద్దన్నందుకు..

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డిసెంబర్ 31న తాడిపత్రిలోని జేసీ పార్కులో 'మహిళలకు మాత్రమే' అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై మాధవీలత స్పందిస్తూ.. ఇలాంటి వేడుకలకు వెళ్లకూడదని, తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి వేళ ఏదైనా జరిగితే ఎవరు కాపాడతారని, జేసీ పార్కులో వేడుకలకు వెళ్లొద్దని సూచించారు. దీంతో జేసీ ఒక్కసారిగా భగ్గుమన్నారు. ఆయనతో పాటు టీడీపీకే చెందిన మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున కూడా పరుష పదజాలంతో మాట్లాడారు. మాధవీలతకు సంబంధించిన చిత్రాలను చూపిస్తూ అశ్లీలంగా నటించిందంటూ వ్యాఖ్యానించారు.

మీరు థర్డ్ జెండర్ కంటే అధ్వానం..

జేసీ ప్రభాకర్‌రెడ్డి బీజేపీని, దాని అనుబంధ సంస్థలనూ వదల్లేదు. 'మాధవీలత బతుకుదెరువు కోసం ఏదో పాట్లు పడుతోంది, పడనివ్వండి. ఆమె మాకు నీతులు చెప్పకూడదు. భజరంగదళ్, ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్.. ఇలాంటి వాళ్లా నన్ను బెదిరించేది? వాళ్లకంటే థర్డ్‌జెండర్ (ట్రాన్స్‌జెండర్)లు మేలు' అని వ్యాఖ్యానించారు. బీజేపీ వాళ్లు నా వెంట్రుక కూడా పీక్కోలేరు.. సిగ్గులేని నా కొ...కల్లారా అంటూ ఫైర్ అయ్యారు. తన బస్సును కాల్చిన తర్వాత ఆ వేడికి కరెంటు వైర్లు పడ్డాయని.. కానీ, షార్ట్ సర్క్యూట్ అని రాసుకున్నారని, అలాగే రాసుకోండని జేసీ అన్నారు. తన వర్గం మహిళలతో మాధవీలత పైనే తాడిపత్రి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేయించారు.

జేసీకి మతిపోయిందేమో..

ఇక జేసీ ప్రభాకర్‌రెడ్డికి వయసు రీత్యా మతి ఏమైనా పోయిందేమోనని, ఒకసారి చూపించుకోవాలని బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జేసీ ప్రభాకర్‌రెడ్డి బీజేపీ మహిళా నేతలపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమిలో ఉండి కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఇది సరైంది కాదని హితవు పలికారు.

కేసులకు భయపడను : మాధవీలత



జేసీ పరుష వ్యాఖ్యల నేపథ్యంలో సినీనటి మాధవీలత కూడా సోషల్‌మీడియాలో ఘాటుగానే స్పందించారు. మహిళల మాన, ప్రాణ రక్షణ గురించి మాట్లాడటం తప్పయితే తనపై వెయ్యి కేసులు పెట్టినా భయపడబోనన్నారు. తెరమీద కనిపించే వాళ్లందరూ వ్యభిచారులేనని అనడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఇలాగైతే తాడిపత్రి నుంచి తెర మీదకు ఎవరూ రాకూడదన్నట్లు ఉందన్నారు. తండ్రి అలా మాట్లాడినా యువ ఎమ్మెల్యేగా ఉన్న అస్మిత్‌రెడ్డి ఖండించలేని స్థితిలో ఉన్నారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రేమించే సైకోలెవరికీ తాను భయపడబోనన్నారు. తనను కిడ్నాప్ చేయాలనుకున్నా, మర్డర్ చేయాలనుకున్నా తాను బెదిరేది లేదన్నారు. ఈ వయసులో ఇలా మాట్లాడ్డానికి ఆయన సిగ్గుపడాలని, ఈ భాషను భరిస్తున్న ఆయన భార్యాపిల్లలకు ధన్యవాదాలన్నారు.

నోటికొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు

- ఇది రౌడీరాజ్యం, ఆటవిక రాజ్యం అనుకుంటున్నారా?
- ఏదిపడితే అది మాట్లాడితే చెల్లదు
- ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి.. నోరు అదుపులో ఉంచుకోవాలి
- ఒకప్పుడు నడిచింది కదాని, ఇప్పుడూ నడుస్తుందనుకోవడం మూర్ఖత్వం
- టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరిక



సాక్షి, అమరావతి : జేసీ ప్రభాకర్‌రెడ్డి తన నోటికొచ్చినట్లు బీజేపీ, ఆరెస్సెస్ గురించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని బీజేపీ ఏపీ శాఖ తీవ్రస్థాయిలో హెచ్చరించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. 'ఎక్కడో ఓ మూల కూర్చుని రెండు కెమెరాలు పెట్టుకుని నోటికి వచ్చినట్లు వాగుతుంటే చూస్తూ ఊరుకోడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా లేరు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని నేరుగా హెచ్చరిస్తున్నాం.. ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి.. నోరు అదుపులో ఉంచుకోవాలి. ఒకప్పుడు నడిచింది కదాని, ఇప్పుడూ నడుస్తుందనుకోవడం ఆయన మూర్ఖత్వం. ఇదేమి రౌడీరాజ్యం కాదు'.. అంటూ పార్థసారథి మండిపడ్డారు. తమ కార్యకర్తలు బస్సులు కాల్చారని జేసీ ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఆయన పూర్తిగా అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని.. ఆయన మున్సిపల్ చైర్మన్ అయితే, అలాంటి మున్సిపల్ చైర్మన్లు బీజేపీలో దేశవ్యాప్తంగా కొన్ని వందల మంది ఉన్నారన్నారు. వందల మంది ఎమ్మెల్యేలు, ఎంపీలున్న పార్టీ బీజేపీపై మాట్లాడే నైతిక హక్కు జేసీకేమి ఉందంటూ ప్రశ్నించారు.

బస్సు దగ్ధంపై ఆధారాలు మీడియా ముందు పెట్టాలి..

ఇక.. 'బస్సులను బీజేపీ కార్యకర్తలు కాల్చారని ఈయన ఏమన్నా కలగన్నారా? పోలీసు కేసు ఇవ్వడట. పోలీసులంటే గౌరవంలేదు. పోలీసు కేసు పెట్టరట.. పోలీసులను, ఎస్పీలను నోటికొచ్చినట్లు మాట్లాడతారు, ఈయన సభ్యసమాజంలో, ప్రజాస్వామ్యంలో ఉన్నాడా లేకుంటే ఇంకా ఆటవిక రాజ్యంలో ఉన్నాడా'.. అంటూ పార్థసారథి వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఉన్న జేసీ ప్రభాకర్‌రెడ్డికి అంత అహంకారం పనికిరాదని హితవు పలికారు. నిజంగా ఆయనకు బీజేపీ కార్యకర్తలపై అనుమానముంటే పోలీసు కేసు పెడితే పోలీసులు విచారణ చేస్తారన్నారు. బీజేపీ కార్యకర్తలు కాల్చారని ఆధారముంటే మీడియా ముందు పెట్టాలని పార్థసారథి డిమాండ్ చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అంశాన్ని టీడీపీ అధ్యక్షుడి దృష్టికి తమ పార్టీ అధ్యక్షురాలు తప్పనిసరిగా తీసుకెళ్తారని విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.


అచ్చెన్న బ్రదరా.. మజాకా!

- రిటైర్డ్ పోలీసు అధికారి కింజరాపు ప్రభాకర్‌నాయుడుకు ఓఎస్డీగా పోస్టింగు
- విజిలెన్స్ విభాగంలో నియామకం
- రెడ్‌బుక్ కక్ష సాధింపు చర్యల కోసమే

సాక్షి, అమరావతి: తమ్ముడు కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర మంత్రి.. అన్నయ్య కొడుకు కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి.. ఆ రిటైర్డ్ పోలీసు అధికారికి ఉన్న ప్రధాన అర్హతలు ఇవే. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా పోస్టింగు కట్టబెట్టడానికి ఇవి చాలు కదా.. అందుకే రిటైర్డ్ పోలీస్ అధికారి కింజరాపు ప్రభాకర్‌నాయుడుకు రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఆయన విశాఖలో డీసీపీగా ఇటీవలే రిటైరయ్యారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీచేసిన జీఓ-48 ప్రకారం ఆయనకు జీతభత్యాలు, ఇతర అలవెన్స్‌లు అన్నీ వర్తిస్తాయని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది.బాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆయన విశాఖలో ఏసీపీగా డీఎస్పీ స్థాయి అధికారిగా ఉన్నారు. ప్రభాకర్‌నాయుడు ఉద్యోగ విరమణకు ఒక్కరోజు ముందు ఆయన్ను ప్రభుత్వం డీసీపీగా అంటే అదనపు ఎస్పీ స్థాయి అధికారిగా పదోన్నతి కల్పించింది. ఇక రిటైరైన తరువాత కూడా ఓఎస్డీగా నియమించింది. అది కూడా విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో. ఎందుకంటే.. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగ కక్ష సాధింపు చర్యలకు ఈ విభాగాన్నే ఆయుధంగా వాడుకుంటోంది. ఆ విభాగం ద్వారా రూపొందిస్తున్న తప్పుడు నివేదికల ఆధారంగానే తమ రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు నమోదుచేస్తోంది. మరి కక్ష సాధింపునకు ప్రధాన సాధనంగా చేసుకున్న విభాగంలో ప్రభాకర్ నాయుడుకు ఏ ఉద్దేశంతో పోస్టింగు ఇచ్చారన్నది స్పష్టమవుతోంది.

కొత్తగా ఏడు విమానాశ్రయాలు


- కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, తుని-అన్నవరం, ఒంగోలులో ఎయిర్‌పోర్టులు
- శ్రీ సిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ ఏర్పాటును పరిశీలించండి
- సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 7 విమానాశ్రయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, తుని-అన్నవరం, ఒంగోలులో కొత్త ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం సమీక్ష చేశారు. ఈ సమీక్షలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమలు, నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ వస్తున్నందున ఆ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు అవసరం ఉందని చెప్పారు. అనకాపల్లి, కాకినాడ, విశాఖలకు దగ్గరలో ఈ విమానాశ్రయం వచ్చేలా చూడాలని అన్నారు. తాడిపత్రి ప్రాంతంలో ఎయిర్‌పోర్టు, శ్రీ సిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. కుప్పం ఎయిర్‌పోర్టు ఫీజిబులిటీ రిపోర్ట్ సిద్ధమైందని అధికారులు తెలిపారు. రెండు దశల్లో 1,250 ఎకరాల్లో దీని నిర్మాణం జరుగుతుందన్నారు. అయితే దీనికి సమీపంలో ఐఏఎఫ్, హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్టులు, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నందున ఇక్కడ ఎయిర్‌స్పేస్‌ను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉందని, సంబంధిత వర్గాల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం విస్తరణ పనులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. టెర్మినల్ నూతన డిజైన్లను ప్రదర్శించారు. కూచిపూడి నృత్యం, అమరావతి స్థూపాలు థీమ్‌గా ఈ ఎయిర్‌పోర్టు డిజైన్లు రూపొందించారు. ఈ పనులను 6 నెలల్లో పూర్తి చేసి జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల పురోగతిని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలో ఏవియేషన్ యూనివర్సిటీ, ట్రైనింగ్ సెంటర్ కూడ ఏర్పాటు చేస్తామన్నారు. ఎయిర్ పోర్టుల్లో ప్రైవేటు ఫ్లైట్స్ పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని, వాటిని కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు.

చంద్రబాబు పచ్చి మోసగాడు

- సూపర్ సిక్స్ హామీలిచ్చి ప్రజలను వంచించారు
- హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారు
- నాడు వైఎస్ జగన్ క్యాలెండర్ ప్రకటించి సంక్షేమం అందించారు
- మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



సాక్షి, రాజమహేంద్రవరం: సీఎం చంద్రబాబు పచ్చి మోసగాడని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను నిలువునా వంచించారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ అమలుపై తాజా కేబినెట్‌లో అయినా చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని ఆశించినా, మళ్లీ ప్రజలకు మొండిచేయి చూపించారని అన్నారు. వేణుగోపాలకృష్ణ శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సంక్షేమాన్ని క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేసి, చంద్రబాబు అసత్య ప్రచారం చేశారని చెప్పారు. అప్పట్లో రూ.14 లక్షల కోట్ల అప్పు అంటూ అబద్ధాలు ప్రచారం చేసిన చంద్రబాబు.. ఈ ఆరు నెలల్లోనే రూ.లక్ష కోట్ల అప్పు చేశారని, దీనిపై ఏమి చెబుతారని నిలదీశారు. అప్పులపై చంద్రబాబు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో జగన్ ఒకటి నుంచి ఇంటర్ చదివే విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో రూ.26వేల కోట్లు జమ చేశారని గుర్తు చేశారు. కానీ, చంద్రబాబు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకుండా రాష్ట్రంలోని 87.42 లక్షల మంది విద్యార్థులకు ఒక్క ఏడాదికే రూ.13,112 కోట్ల మేర నష్టం కలగజేశారని తెలిపారు. ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వకుండా 54 లక్షల మంది రైతులకు రూ.10,000 కోట్ల మేర నష్టం చేశారన్నారు. 1.80 కోట్ల మంది ఆడబిడ్డలకు ఆడబిడ్డ నిధి ఇవ్వకుండా దగా చేశారని దుయ్యబట్టారు. మత్స్యకార భరోసా ఇవ్వనందువలన 1.30 లక్షల మంది మత్స్యకారులు ఇప్పటికే రూ.260 కోట్లు నష్టపోయారని చెప్పారు. ఉచిత గ్యాస్ కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఒక్క సిలిండర్‌తోనే మాయ చేస్తున్నారని విమర్శించారు. ఇలా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. ఇదంతా చూస్తుంటే సూపర్ సిక్స్ హామీలకు బాబు ఎగనామం పెడతారన్న సందేహం కలుగుతోందన్నారు.

దిమ్మ తిరిగేలా విద్యుత్ బిల్లు!

ప్రతి నెలా రూ.వెయ్యి దాటని ఇంటికి రూ.39,525



బుచ్చిరెడ్డిపాళెం : స్మార్ట్ మీటర్లతో బిల్లులు షాక్ కొడుతున్నాయి. నెల్లూరు జిల్లాలో కొద్ది రోజులుగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ఇళ్లకు బిగించిన స్మార్ట్ మీటర్ బిల్లులు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. వాటిని చూసిన వారి దిమ్మ తిరిగిపోతోంది. బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల తూర్పు దళితవాడకు చెందిన వెంకటేశ్వర్లు చిరుద్యోగి. చిన్న ఇల్లు. గతంలో ఆయన ఇంటికి ప్రతి నెలా సగటున రూ.1000 విద్యుత్ బిల్లు వచ్చేది. ఇటీవల పెరిగిన చార్జీలు, ట్రూఅప్ చార్జీలు కలుపుకుంటే అదనంగా మరో రూ.500 వస్తుందనుకున్నాడు. అయితే వెంకటేశ్వర్లు ఇంటికి గత నెలలో స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేశారు. ఆయనకు డిసెంబర్ వినియోగానికి జనవరిలో వచ్చిన బిల్లు చూసి షాకయ్యాడు. ఏకంగా రూ.39,525 వచ్చింది. ఈ విషయమై విద్యుత్ అధికారులను సంప్రదిస్తే ఎవరూ సమాధానం చెప్పలేదని వాపోయాడు.

2024.. అత్యంత వేడి సంవత్సరం

దేశంలో గత 125 సంవత్సరాల్లో అత్యంత వేడి సంవత్సరంగా '2024' రికార్డుల్లోకి ఎక్కింది. 1901 నుంచి చూస్తే.. 2024లో అక్టోబరు – డిసెంబరు కాలంలో దేశంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్టోబరు నెల గత 123 సంవత్సరాల్లో అత్యంత వేడి నెలగా నిలిచింది. 2024 వార్షిక సగటు ఉష్ణోగ్రత 25.75 డిగ్రీలు. ఇది 1991–2020 సాధారణ సగటు కంటే 0.65 డిగ్రీలు ఎక్కువ. గత 15 ఏళ్లలోనే 5 అత్యంత వేడి సంవత్సరాలు నమోదయ్యాయి. ప్రపంచంలో కూడా 2024ను అత్యంత వేడి సంవత్సరంగా ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించింది.

సంవత్సరం	అధికంగా నమోదైన ఉష్ణోగ్రత
2024	+0.65
2016	+0.54
2009	+0.40
2010	+0.39
2017	+0.38

ఆధారం: భారత వాతావరణ శాఖ

చలికాలం.. కాస్త ఎండపడనిద్దాం

లేదంటే మానసిక ఒత్తిడి తప్పదంటున్న వైద్యులు

- సీజనల్ అఫెక్టివ్ సిండ్రోమ్(ఎస్ఏడీ)గా నామకరణం
- కొన్ని పదాలు పలకలేకపోవడం.. తెలిసిన విషయాన్నీ మర్చిపోయే ప్రమాదం
- ఇతరులతో కలిసేందుకు ఇష్టపడకపోవడమూ దీని ప్రభావమే
- ఉదయం 10లోపే అరగంట ఎండలో ఉండాలని సూచన
- హార్వర్డ్ హెల్త్ పబ్లిషింగ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ హోవార్డ్ లీవైన్ వెల్లడి



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: చలికాలమని ముసుగుతన్ని ఇంట్లోనే పడుకుని కాలక్షేపం చేద్దామనుకుంటున్నారా? చలికి భయపడి మార్నింగ్ వాక్‌కు వెళ్లడం మానేశారా? ఇంట్లోంచి నేరుగా ఉదయం 10 తర్వాత కార్యాలయానికి బయలుదేరుతున్నారా? ఉదయం బాగా చలేస్తోందని.. సాయంత్రం వాకింగ్ చేస్తున్నారా? చలి పేరుతో ఇలా చేస్తుంటే వెంటనే మీ అలవాటును మార్చుకోండి. లేదంటే మానసిక ఒత్తిడి తప్పదని హార్వర్డ్ హెల్త్ పబ్లిషింగ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంవో) హోవార్డ్ లీవైన్ చెబుతున్నారు. చలికాలంలో వచ్చే వాతావరణ మార్పులతో మెదడులో కొన్ని రసాయన మార్పులు జరిగి.. శారీరకంగా నీరసంగా ఉన్నామనే భావన వస్తుందని.. ఈ భావనతో బయటకు వెళ్లి ఇతరులను కలవడం కూడా తగ్గిపోతుందని ఆయన పేర్కొంటున్నారు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా తెలిసిన విషయాన్ని మర్చిపోవడం.. కొన్ని పదాలను అసలు పలికేందుకు ఇబ్బంది పడి.. వేరే పదాలను పలకడం వంటివి కూడా చేస్తారని ఆయన అధ్యయనం స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోపు అరగంట పాటు సూర్యరశ్మిలో ఉండాలని సూచిస్తున్నారు. ఒకవేళ సూర్యరశ్మి అందుబాటులో లేని రోజుల్లో ప్రత్యేకంగా కాంతిని ప్రసరింపచేసేందుకు ఉపయోగించే లైట్ బాక్సుల ద్వారా కూడా ఉపశమనం పొందవచ్చని ఆయన చెబుతున్నారు.

ఎస్ఏడీ.. ఎలా వస్తుందంటే..

చలికాలంలో కాంతి లేకపోవడం వల్ల మన మానసిక, శారీరక ప్రవర్తనపై ప్రభావం పడుతుంది. దీనిని సీజనల్ అఫెక్టివ్ సిండ్రోమ్ (ఎస్ఏడీ) అని.. వైద్య పరిభాషలో 'సిర్కాడియల్ రిథమ్స్' అని అంటారు. ఎస్ఏడీ మన మెదడులోని నిద్రను ప్రేరేపించే హార్మోన్ మెలటోనిన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేసే మరో ఎంజైమ్ సెరోటోనిన్ తక్కువ విడుదల కావడానికి దోహదం చేస్తుంది. ఈ రసాయన అసమతుల్యత వల్ల నీరసంగా మారిపోతాం. తద్వారా ఎక్కువగా తినడం.. ప్రధానంగా కార్బొహైడ్రేట్ ఆహారాన్ని ఎక్కువగా తీసుకుని.. ప్రొటీన్ ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం కూడా జరుగుతుందని ఈ అధ్యయనంలో తేలింది. అంతే కాకుండా ఇతరులతో కలవడంపై దీని ప్రభావం ఉంటుందని అంటున్నారు. దీంతో ఇంటికే పరిమితమై మానసికంగా ఇబ్బంది పడతారని లీవైన్ స్పష్టం చేశారు. ఎస్ఏడీ అనేది కేవలం మానసిక స్థితి మాత్రమే కాదని అంతకుమించి ఏకాగ్రతను కూడా దెబ్బతీస్తుందని ఆయన పేర్కొంటున్నారు. జ్ఞాపకశక్తి వంటి సమస్యలతో పాటు మన పని తీరుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. ఈ సిండ్రోమ్ మన ఉచ్చారణలో సరైన పదాలు పలకలేకపోవడంతో పాటు.. సరైన సమాచారం కూడా సకాలానికి గుర్తుకురాకపోవడం జరుగుతుందని ఆయన చెబుతున్నారు.

సూర్యరశ్మి లేదా లైట్ థెరపీ

సీజనల్‌గా వచ్చే ఈ సిండ్రోమ్‌కు సాధారణంగా డోపమైన్ స్థాయిని పెంచే యాంటీ డిప్రెసెంట్స్ మందులను వాడతారు. అయితే, దీనికంటే మంచి మందు ఏమిటంటే.. ప్రతిరోజూ అరగంట పాటు సూర్యుడి ఎండ తగిలేలా ఉండటమేనని హోవార్డ్ లీవైన్ చెబుతున్నారు. అది కూడా ఉదయం 10 గంటలలోపు అరగంటపాటు సూర్యుడి ఎండ తగిలేలా ఉంటే ఈ సిండ్రోమ్ నుంచి బయటపడవచ్చని ఆయన జరిపిన అధ్యయనంలో తేలింది. ఒకవేళ చలికాలంలో వాతావరణ ప్రభావంతో సూర్యరశ్మి లేనిపక్షంలో లైట్ థెరపీని ఆయన సూచిస్తున్నారు. తెల్లని కాంతిని ఉత్పత్తి చేసే లైట్ బాక్సులను కొనుగోలు చేసి ఉపయోగించడమే ఈ లైట్ థెరపీ. ఆన్‌లైన్‌లో ఈ లైట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. మీ లైట్ బాక్స్‌లో 10,000 లక్స్ ('లక్స్' అంటే నిర్దేశిత ప్రదేశంలో ఎంతమేర లైట్ పడుతుందని తెలిపేది. దీనిని కాంతి తీవ్రత/కాంతి ప్రకాశం అని పేర్కొంటారు) ఎక్స్‌పోజర్ ఉండాలి. సాధారణంగా సూర్యుడు బాగా ప్రకాశించే సమయంలో 50 వేల కాంతి ప్రకాశాలు ఉంటాయి. అందులో పదో వంతు కాంతి తీవ్రత ఉండేలా చూసుకుంటే చాలని ఆయన స్పష్టం చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎస్ హామీ

సాక్షి, అమరావతి: దశల వారీగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హామీ ఇచ్చినట్లు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేశ్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన విజయానంద్‌ను గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ చైర్మన్ కె.వి.కృష్ణయ్యతో పాటు సచివాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

ప్రభావతి పిటిషన్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదుచేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు శుక్రవారం ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 10వ తేదీన తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అప్పటి వరకు ప్రభావతిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీచేశారు.

వాసుదేవరెడ్డి పిటిషన్‌పై విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, అమరావతి: మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హోలోగ్రామ్స్ తయారీ, సరఫరా కాంట్రాక్ట్ టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు కుంభత్ హోలోగ్రాఫిక్స్, హోలిస్టిక్ ఇండియా లిమిటెడ్, అల్ఫా లేజర్ టెక్‌లను అనుమతించడంపై సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి తప్పుకొన్నారు. ప్రధాన న్యాయమూర్తి అనుమతితో ఈ వ్యాజ్యాన్ని తగిన బెంచ్ ముందుంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

తెలుగులోనూ జీవోలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులను ఇక నుంచి సచివాలయంలోని అన్ని శాఖలు ఇంగ్లిష్‌తోపాటు తెలుగులో కూడా జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ శుక్రవారం ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఉత్తర్వులు జారీ చేశారు.

ఫుడ్ ప్రోసెసింగ్ సమాచారం కోసం హెల్ప్‌లైన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఆహార పరిశ్రమల సమాచారం కోసం వన్–స్టాప్ హెల్ప్ లైన్ నంబర్–04045901100 ను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ విధానాలలో పారదర్శకతను పెంచడం, ఆహార ప్రాసెసింగ్ రంగంలోని పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, వారి సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా ఫుడ్ ప్రోసెసింగ్ పాలసీ 4.0 వివరాలతో పాటు ప్రాజెక్ట్ రిపోర్ట్ సమర్పణ నుంచి అన్ని దశల్లో ప్రభుత్వ అనుమతులు పొందే వరకు నూతన పరిశ్రమలకు సహాయ సహకారం అందించనున్నట్లు చెప్పారు.

మా ముందు చెప్పులతో నడవొద్దు!

మా వీధుల్లో తిరగొద్దు.. ఊర్లోనే ఉండొద్దు

దళితులపై రెచ్చిపోయిన టీడీపీ రౌడీమూకలు

- ఎదురుతిరిగినందుకు దాడి.. బైక్‌లు దహనం
- బాధితులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలపైనా దాడి.. కేసులు
- వైఎస్సార్‌సీపీ వారే మాపై దాడి చేశారంటూ టీడీపీ రివర్స్ గేర్
- కలెక్టర్, ఎస్పీలు మాకు న్యాయం చెయ్యాలి: దళిత మహిళలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'మా వీధుల్లో మీరు తిరగకూడదు.. మా ముందు చెప్పులు వేసుకుని నడవకూడదు.. దళితులు ఊర్లోనే ఉండకూడదు.. ఖాళీచేసి వెళ్లిపోండి'.. అంటూ టీడీపీ నేతలు దళితులపై విరుచుకుపడ్డారు. సిమెంటు రోడ్డు నిర్మాణ విషయమై టీడీపీ వారికి, సర్పంచ్‌కు మధ్య వివాదం ఏర్పడడంతో 'పచ్చ'మూకలు అధికార బలంతో ఇలా పేట్రేగిపోయారు. ఇది చినికి చినికి గాలివానగా మారి దాడులకు దారితీసింది. టీడీపీ నేతలు మండల ప్రధాన కార్యదర్శి, మరికొందరు చేసిన ఈ వ్యాఖ్యలపై దళితులూ తిరగబడ్డారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా, నగరి మండలం, తడుకుపేట గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడుల్లో దళితవాడకు చెందిన విక్కీ (20), సంతోష్ (17), ప్రవీణ్‌కుమార్ (23), శ్రీధర్ (27), రమేష్ (43), శ్రీశాంత్ (18), సిద్దు (14)తో పాటు వీరికి మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి చెందిన గోపి (45)కి గాయాలయ్యాయి. టీడీపీకి చెందిన మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడు, రాజేష్ కూడా గాయపడ్డారు. అయితే, గాయపడ్డ దళితులను, వైఎస్సార్‌సీపీ వారిని ఇళ్లలోనే నిర్బంధించిన టీడీపీ నేతలు.. వైఎస్సార్‌సీపీ నేతలే తమపై దాడిచేశారంటూ రాస్తారోకో చేసి వాహనాలను రోడ్డుపై ఆపేసి హంగామా చేశారు. ఒకవైపు రాస్తారోకో చేస్తూనే మరోవైపు టీడీపీ రౌడీమూకలు దళితులకు చెందిన ఆరు బైక్‌లను కాల్చేశారు. కానీ, దళితులు, వైఎస్సార్‌సీపీ నేతలు 13 మందిపై కేసులు నమోదు చేశారు. మరికొందరిని కేసులో ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, నిర్బంధంలో ఉన్న దళితులు శుక్రవారం ఉదయం బయటకు రాగానే వారికి జరిగిన అన్యాయం కూడా వెలుగుచూసింది.



ఆస్పత్రికి వెళ్తున్న రమేశ్, గోపి, అన్బుకుమార్, శ్రీశాంత్



టీడీపీ శ్రేణులు దహనం చేసిన దళితుల బైకు

మాపై దాడిచేసి వారే నిరసనలు చేస్తున్నారు : దళిత మహిళల ఆందోళన

నిజానికి.. తమపై దాడిచేసిన టీడీపీ వారే నిరసనలకు దిగడం విడ్డూరంగా ఉందని దళిత మహిళలు మండిపడ్డారు. ఊర్లో దళితులు తిరగకూడదంటూ టీడీపీ నేతలు హుకుం జారీచేస్తున్నారని.. వాళ్ల ముందు చెప్పులు వేసుకుని నడవకూడదని, చెప్పులు తలపై పెట్టుకుని వెళ్లండని దౌర్జన్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. పిల్లలకు పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఊర్లోకి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉందని.. తమ పిల్లలు పాఠశాలకు వెళ్తే వారిని తిరిగి పంపేశారని, ఇదేం న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక దళితవాడకు చెందిన ఐదుగురు యువకులు కనిపించడంలేదని, వారెక్కడున్నారో తమకు తెలియాలన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి తిరిగామని టీడీపీ అధికారంలోకి రావడంతో సమస్యలు మొదలయ్యాయన్నారు. రోడ్లపై వెళ్తుంటే చెప్పులతో కొట్టడానికి వస్తున్నారని, బూతులు తిడుతూ వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తామేం చెయ్యలేమంటూ పోలీసులు చేతులెత్తేస్తున్నారని.. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్, ఎస్పీ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

నా కొడుకు ఏమయ్యాడో..



రాత్రి నుంచి నా కొడుకు కార్తీక్ కనిపించడంలేదు. ఏమయ్యాడో వాడిని ఏంచేశారో తెలీడంలేదు. తలుచుకుంటే నా గుండె తరుక్కుపోతోంది. దళితులు ఈ బాధలన్నీ అనుభవించాలా? అధికారులు దయచేసి నా కొడుకును నా వద్దకు పంపండి.

– నీలవేణి, తడుకుపేట దళితవాడ

ఊర్లో ఉండకూడదంటే మేం ఎక్కడికెళ్లాలి?



దళితులు ఊర్లోనే ఉండకూడదంటే మేం ఎక్కడికెళ్లాలి? నడిరోడ్డుపై కూర్చున్న టీడీపీ నేతలు దళితులు ఊర్లోనే ఉండకూడదంటూ అరుస్తూ నిరసనలు చేస్తుంటే వారిపై ఏం చర్యలు తీసుకున్నారు? ప్రభుత్వం వారిది.. మేమేమీ చెయ్యలేమని పోలీసులే చెబుతున్నారు. మా మామను కొట్టేశారు మాకు దిక్కెవరు?

– సుప్రియ, తడుకుపేట దళితవాడ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ పరిస్థితిలేదు..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ పరిస్థితి లేదు. అందరూ కలిసే ఉండేవారు. ప్రభుత్వం మారడంతో గ్రామస్తుల్లో ప్రవర్తన మారింది. మమ్మల్ని చులకనగా చూస్తున్నారు. ఎదిరిస్తే కొడుతున్నారు. పాలప్యాకెట్ తీసుకురావడానికి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉంది. పిల్లల్ని పాఠశాలలకు పంపడానికి కూడా భయపడుతున్నాం.

– స్వప్న, తడుకుపేట దళితవాడ

శాంతిభద్రతలు అదుపులోకి తెస్తున్నాం..

రెండువర్గాల మధ్య గొడవల్లో ఇప్పటికే ఒక వర్గం వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదుచేశాం. మరో వర్గం వారు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశాం. అదనపు బలగాలను తీసుకొచ్చి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

– మహేశ్వర్‌రెడ్డి, సీఐ, నగరి

ప్రజాస్వామ్యంలో దళితులకు రక్షణలేదా?

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికీ దళితులకు రక్షణలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు. చిత్తూరు జిల్లాలో దళితులపై దాడి ఘటన నేపథ్యంలో శుక్రవారం కార్వేటినగరంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దళిత సామాజికవర్గానికి ఇప్పటికీ రక్షణలేకుండా అగ్రవర్ణాలు దాడులు చేయడం దారుణమన్నారు. గ్రామాల్లో దళితులు చెప్పులు వేసుకెళ్లడాన్ని అగ్రవర్ణాలు జీర్ణించుకోలేక దాడులకు దిగి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వస్తే దళితులపై దాడులు పెరుగుతాయన్నారు. స్వయాన చంద్రబాబే ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ దళితులను అవమానించారని, అలాంటి వ్యక్తి అధికారంలో ఉన్నప్పుడు ఇక దళితులకు ఎక్కడ న్యాయం జరుగుతుందని నారాయణస్వామి ప్రశ్నించారు. దళిత ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా ఆ వర్గాన్ని ఊచకోత కోసే పక్షాన కాకుండా దళితులను ఆరాధించే పక్షాన పోరాటం చేయడానికి సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు. దళితుల ఎదుగుదలను జీర్ణించుకోలేని అగ్రవర్ణాలు ఆరు మోటార్‌సైకిళ్లను కాల్చి దళితులపై కక్ష సాధింపులకు దిగడం మంచిది కాదని హెచ్చరించారు. దళితులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడిచేయడమే కాక వైఎస్సార్‌సీపీ నేతలే దాడిచేశారనడం ఎంతవరకు సమంజసమన్నారు. మనం ప్రజాస్వామ్య రాష్ట్రంలో ఉన్నామా.. లేక టీడీపీ రాజ్యాంగంలో ఉంటున్నామా అని ప్రశ్నించారు.

తమిళనాడు రౌడీషీటర్లతో టీడీపీ దాడులు..

ఇక దళితులపై జరుగుతున్న దాడులను ఖండించేందుకు పోలీసు అధికారులు లేరా.. శాంతిభద్రతలను అదుపుచేసే శక్తి వారికి లేదా, తమిళనాడు నుంచి రౌడీషీటర్లను తెచ్చి దాడులు చేస్తున్న టీడీపీ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని నారాయణస్వామి ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నంత వరకు దళితులకు స్వాతంత్ర్యం ఉండదని, దళితులు ఇప్పటికైనా మేలుకోవాలని ఆయన సూచించారు.

ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులతో సీఎస్ సమీక్ష

సాక్షి, అమరావతి: ఈనెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన విజయవంతానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. శుక్రవారం సచివాలయం నుంచి ఆయన వీడియో సమావేశం ద్వారా అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకనుగుణంగా ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్, పోలీస్ కమిషనర్ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం ప్రధాని విశాఖపట్నం చేరుకుని సంపత్ వినాయక గుడి నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే సభా వేదిక వరకూ రోడ్డు షో నిర్వహించనున్నారని, ఇందులో పాల్గొనేందుకు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

ప్రధాని మోదీ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు

విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్‌టీపీసీ ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ హబ్, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

- మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశం



సిటీ కోర్టులు (హైదరాబాద్): పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు అల్లు అర్జున్‌కు శుక్రవారం నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. వ్యక్తిగత పూచీకత్తుతో పాటు, రూ.50 వేలతో రెండు పూచీకత్తులు కోర్టుకు సమర్పించాలని సూచించింది. ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్ (చిక్కడపల్లి)లో హాజరు కావాలని ఆదేశించింది. డిసెంబర్ 5న జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా, ఆమె కొడుకు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా ఘటనపై రేవతి భర్త భాస్కర్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అల్లు అర్జున్‌ను ఏ–11గా చేర్చిన పోలీసులు.. సెక్షన్ 105, 118(1), రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేశారు. డిసెంబర్ 13న అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా నాంపల్లిలోని 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జడ్జి నిర్మల 14 రోజుల రిమాండ్ విధించారు. కానీ హైకోర్టు ఆయనకు 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ గడువు ఈనెల 10న పూర్తికానుండగా.. అల్లు అర్జున్ నాంపల్లిలోని 2వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో డిసెంబర్ 26న రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం తీర్పును వాయిదా వేసిన జడ్జి వినోద్‌కుమార్.. శుక్రవారం తీర్పు వెలువరించారు. ఇదిలా ఉండగా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌పై ఈనెల 21 వాదనలు ఉన్నాయని ఆయన తరపు న్యాయవాదులు మీడియాకు తెలిపారు.

ఇసుక దందా కోసం టీడీపీ నేతల ఘర్షణ

- అన్నమయ్య జిల్లా తరిగొండలోని చెరువులో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- ఆధిపత్యం కోసం టీడీపీ నేతల మధ్య వాగ్వాదం



ఇసుక తవ్వకాలు అడ్డుకోవడంతో టీడీపీ వర్గాల మధ్య వాగ్వాదం

గుర్రంకొండ: అక్రమ ఇసుక దందా కోసం అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో టీడీపీ నేతలు ఘర్షణకు దిగారు. మూడు వర్గాలుగా విడిపోయి.. చెరువులో ఇసుకను 'మేం తవ్వేస్తామంటే.. కాదు మేమే తవ్వేస్తాం' అంటూ వాగ్వాదానికి దిగారు. వివరాలు.. అధికారంలోకి రాగానే తరిగొండ గ్రామంలోని టీడీపీ నేతలంతా కలిసి ఇష్టారీతిన రామానాయిని చెరువులోని ఇసుక తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మూడు నెలల కిందట వారి మధ్య విభేదాలు రావడంతో మూడు వర్గాలుగా విడిపోయారు. ఈ నేపథ్యంలో టీడీపీలోని ఒక వర్గం నేతలు శుక్రవారం వేరే మండలాల నుంచి కూడా ట్రాక్టర్లను తెప్పించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీంతో మరో వర్గం కూడా ఇదే విధంగా ఇసుక తవ్వకాలు చేస్తూ అక్రమ రవాణా మొదలు పెట్టింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేత, సాగునీటి సంఘం చైర్మన్ తన అనుచరులతో చెరువు వద్దకు చేరుకొని.. ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం చెలరేగింది. ఎవరూ అడ్డుకున్నా.. ఇసుకను తీసుకెళ్లి తీరుతామంటూ ఓ వర్గం తెగేసి చెప్పడంతో ఘర్షణ చెలరేగింది. చివరకు సాగునీటి సంఘం చైర్మన్ హెచ్చరికలతో ట్రాక్టర్లలోని ఇసుకను దేవాలయం వద్ద దింపేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకొని.. సర్దిచెప్పి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

ఎమ్మెల్యేల తీరు ఎలా ఉంది?

- కూటమి ప్రజా ప్రతినిధుల పోకడలపై టీడీపీ సర్వే
- ప్రజలకు ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్
- చినబాబు టీమ్ పనేనంటూ జనసేన, బీజేపీ నేతల రుసరుసలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఇప్పటికే మంత్రుల పనితీరుపై సర్వేకు ఉపక్రమించిన టీడీపీ కూటమి సర్కారు తాజాగా ఎమ్మెల్యేల పని తీరుపై కూడా ఆరా తీస్తోంది. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా ఆయా నియోజకవర్గాలకు చెందిన ఓటర్లకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఆర్నెళ్లలో మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉందంటూ వాకబు చేస్తున్నారు. బాగుంటే ఒకటి.. ఫరవా లేదు అయితే రెండు.. బాగోలేకుంటే మూడు నొక్కాలని సూచిస్తూ సమాచారం సేకరిస్తున్నారు. గతంలో ఇదంతా టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకే పరిమితం కాగా తాజాగా జనసేన, బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కూడా సాగుతుండటం గమనార్హం. ఈ ఫోన్ కాల్స్ అన్నీ మంగళగిరి కేంద్రంగా టీడీపీ కార్యాలయం నుంచి వస్తున్నట్లు భావిస్తున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేకు పరిమితం కాకుండా తమపై టీడీపీ పెత్తనం ఏమిటంటూ జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు మండిపడుతున్నట్లు తెలుస్తోంది.

కూటమి నేతలను కట్టడి చేసేందుకేనా...!

ఎమ్మెల్యేల పనితీరుపై మదింపు పేరుతో జరుగుతున్న ఈ సర్వే బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలను కట్టడి చేసేందుకేననే ప్రచారం జరుగుతోంది. 'మా పనితీరును మా అధినేతలు గమనిస్తుంటారు. ఒకవేళ ఏమైనా చెప్పాలనుకుంటే వారు చెప్పాలి. అంతేగానీ జాతీయ పార్టీ అయిన మాపై ప్రాంతీయ పార్టీ అధినేత ఎలా సర్వే చేస్తారు? మాపై టీడీపీ పెత్తనం ఏమిటి?' అని బీజేపీకి చెందిన కొందరు నేతలు రుసరుసలాడుతున్నారు. జనసేనకు చెందిన ఎమ్మెల్యేలు కూడా ఈ వ్యవహారంపై రగిలి పోతున్నట్లు తెలుస్తోంది.

జైన్ ఇన్‌ఫ్రా నంబర్లతో...

రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల పనితీరుపై వివిధ నంబర్లతో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఇవన్నీ మంగళగిరికి చెందిన జైన్ ఇన్‌ఫ్రా పేరుతో ఉండగా ఆ చిరునామాతో వివరాలు అందుబాటులో లేవు. 86453 సిరీస్ నుంచి కాల్స్ వస్తున్నాయి. ట్రూ కాలర్‌లో పరిశీలిస్తే... జైన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ (టీడీపీ ఆఫీస్) మంగళగిరి అని కనిపిస్తోంది. నారా లోకేష్ కార్యాలయం నుంచే ఈ ఫోన్ కాల్స్ వస్తున్నాయని పేర్కొంటున్నారు. లోకేష్ కార్యాలయం కేంద్రంగానే ప్రభుత్వ వ్యవహారాలన్నీ నడుస్తున్నాయని, ఈ సర్వే కూడా ఆయన టీమ్ నిర్వహిస్తోందని చెబుతున్నారు.

పేరెంటింగ్



వంట గది చప్పళ్లు...
టీవీ సౌండు...
తల్లిదండ్రుల కబుర్లు, వాదనలు,...
చిన్న తమ్ముడో, చెల్లెలో
మధ్యలో దూరి ఆటలు...
'మంచి మార్కులు తేవాలి'
అంటారు గాని చదివేందుకు
మంచి చోటును చూపిస్తున్నారా?
సంక్రాంతి దాటితే పిల్లలందరూ
పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలి.
ఇంట్లో మీ పిల్లలు
చదివే చోటును చూడండి.
వారు శ్రద్ధగా చదువుకునేలా
ఆ చోటును ఎలా ఏర్పాటు
చేయాలో నిపుణుల
మాట వినండి.

చదివే చోటు సరిగ్గా ఉందా?

ఇల్లు సర్దుకుంటే ఇల్లు ఎంత విశాలమో అర్థమవుతుంది. చిన్న ఇల్లయినా పెద్ద ఇల్లయినా సర్దుకోవడంలోనే స్థలం బయట పడుతుంది. ముంబై వాసులు అతి చిన్న ఇంటిలో కూడా అన్నీ అందంగా అమర్చుకుంటారు. కాని మనకు ఎంత విశాలమైన ఇల్లు ఉన్నా అవసరం లేని సామాను, వాడని సామాను, పారేయని సామాను ఉంచుకుని పిల్లల చదువుకు, పుస్తకాలు పెట్టుకోవడానికి కూడా స్థలం లేనట్టుగా తయారు చేస్తాం. మళ్లీ వాళ్లు బాగా చదవాలని డిమాండ్ చేస్తాం. శుభ్రమైన చోటు చదువు తలకెక్కే చోటు అలాంటి చోటును మీ ఇంట్లో మీ పిల్లలకు చదువు కోసం కేటాయిస్తున్నారా?

● అబ్రహం లింకన్ వీధి దీపాల కింద చదివాడు. ఎనభైల నాటి పిల్లలు డాబాల మీద లైట్లు లాగి చదివారు. కాని ఇప్పటి పిల్లలు అలా చదవడం లేదు. ఇంటిలోనే నిశ్శబ్దంగా చదువుకోవడానికి ఇష్టపడుతున్నారు. కాబట్టి ఇంట్లో వాళ్లకు యోగ్యమైన చోటును ఏర్పాటు చేయాలి. కామన్ ఏరియాకు సంబంధం లేకుండా ఎవరైనా ఇంటికి వచ్చి వెళుతున్నా కన్ను పడని చోటు ఇంటిలో చదువుకునే పిల్లలకు ఇవ్వాలి. ఆ చోటును పూర్తిగా శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కంప్యూటర్‌లో ప్రశ్నాపత్రాలు చూసి చదువుకుంటున్నారు. వారికి డెస్క్‌టాప్ లేదా లాప్‌టాప్ ఏర్పాటు చేయలేకపోతే కనీసం ఫోన్‌లో అన్నా తగినంత డేటా వేయించి ఇవ్వాలి.

● పిల్లలు చదివి అలసి పడుకోవాలంటే ఆ దాపునే బెడ్ ఉంటే మరీ మేలు. అది వాలగానే నిద్రపోయేలా తప్పక శుభ్రంగా సౌకర్యంగా ఉండాలి. కష్టపడి చదివి నిద్ర పట్టక ఇబ్బంది పడితే చదివింది నిద్ర లేమి వల్ల వృథా అవుతుంది.

● పిల్లలు చదువుతున్నప్పుడు వారి మానసిక ఆరోగ్యం బాగుండాలి. ఇంట్లో తగాదాలు పూర్తిగా బంద్ చేయాలి. తల్లిదండ్రులు మంచి మూడ్‌లో కనిపిస్తూ పిల్లలతో స్నేహంగా మాట్లాడాలి. వారికి ఇష్టమైన పదార్థాలు అందుబాటులో ఉంచాలి. బయట తిండి కాకుండా ఇంటి తిండి ఇవ్వాలి.

● పిల్లలు చదువుకునే సమయంలో దగ్గర కూచుని అప్పుడప్పుడు పలకరిస్తూ ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ ఉంటే వాళ్లు ఆ ప్రెజెన్స్ ఇష్టపడతారు. అయితే రోజూ నువ్వు 99 పర్సెంట్ తేవాలి... టాపర్‌గా నిలవాలి అనే మాటలు ఎత్తి స్ట్రెస్ క్రియేట్ చేయకూడదు. న్యాయంగా ఎంత కష్టపడాలో అంత కష్టపడమని మాత్రమే చెప్పాలి.

● గంటకోసారన్నా చదివే చోట నుంచి లేచి కాస్త అటూ ఇటూ నడిచేలాగా, నీరు తాగేలా, బాల్కనీలోనో కారిడార్‌లోనో కాస్త గాలి పీల్చేలా చూడాలి.

పిల్లలు కూచుని చదవడానికి కుర్చీ, డెస్క్ సరిగా ఉండాలి. వారికి కావలసిన రఫ్ బుక్స్, పెన్లు పెన్సిళ్లు అక్కడ అమర్చాలి. వాల్ క్లాక్, క్యాలెండర్ ఉండాలి. తప్పక ఒక వాటర్ బాటిల్ పెట్టాలి. తగినంత వెలుతురు ఆ చోట పడకపోతే ఒక లైట్ వేయించాలి. మోటివేషనల్ స్లోగన్స్, పోస్టర్స్ అవసరమైతే పెట్టొచ్చు. కొందరు పిల్లలు ఇష్టపడకపోతే వదిలేయాలి.

ఈ విటమిన్లు తీసుకోండి

విటమిన్లు అందరికీ అవసరమే అయినా మహిళల ఆరోగ్యంలో ఇవి మరింత కీలక పాత్ర పోషిస్తాయి. 25 ఏళ్ల తరువాత మహిళల శరీరంలో పలు మార్పులు ప్రారంభమవుతాయి. ఇలాంటి కీలక దశలో పోషకాహారం, ఎక్సర్‌సైజులను నిర్లక్ష్యం చేస్తే విపరిణామాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం 25 దాటిన మహిళల ఆహారంలో కొన్ని విటమిన్స్ తప్పనిసరిగా ఉండాలి. అవేంటంటే..

విటమిన్ డి...

ఎముకలు, రోగనిరోధక శక్తి బలోపేతానికి అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్లను శరీరం సులువుగా గ్రహించేందుకు విటమిన్ డీ అవసరం. మహిళల్లో మరణాలకు ప్రధాన కారణాల్లో ఆస్టియోపోరోసిస్, ఫ్రాక్చర్ల ప్రమాదం ఎక్కువ కాబట్టి విటమిన్ డీ ఆహారంలో ఉండేలా చేసుకోవాలి.



ఎందులో ఉంటుందంటే...

ఫోర్టిఫైడ్ పాలు, గుడ్లు, సాల్మన్ లాంటి ఫ్యాటీ ఫిష్‌లో ఇది పుష్కలంగా ఉంటుంది.

విటమిన్ బి12...

ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కీలకమైన విటమిన్ బీ12 మహిళ ఆరోగ్యానికి ఎంతో కీలకం. ఈ విటమిన్ లోపం తలెత్తితే మెగాలోబ్లాస్టిక్ అనేమియా అనే రక్తహీనత తలెత్తుతుంది. సంతానోత్పత్తికి, ప్రెగ్నెన్సీ సమయంలో ఇబ్బందులను అడ్డుకునేందుకు కూడా ఈ విటమిన్ కీలకం.

ఎందులో లభిస్తుందంటే...

అన్ని రకాల మాంసాహారాలలో... పాలు, పెరుగు, నెయ్యి, కివీ, అరటి వంటి పండ్లలో విటమిన్ బి 12 లభిస్తుంది.



విటమిన్ సి...

మహిళలకు కావలసిన అతి ముఖ్యమైన విటమిన్లలో ఇది కూడా ఒకటి. ఇది శరీరంలో ఉత్పత్తి కాదు కాబట్టి ఆహారం ద్వారానే తీసుకోవాల్సి ఉంటుంది. మహిళలకు రోజుకు 75 మిల్లీ గ్రాముల విటమిన్ సీ కావాలి. ఇది రక్తపోటు, కొలెస్టెరాల్ స్థాయులను నియంత్రించేందుకు అవసరం. వయసు పెరిగే కొద్దీ గుండె జబ్బులు అడ్డుకునేందుకు కూడా ఇది కీలకం. విటమిన్ సి సమృద్ధిగా తీసుకుంటే ఐరన్ లోపం తలెత్తే అవకాశాలు కూడా తగ్గిపోతాయి.

ఎందులో ఉంటుంది?

నిమ్మ జాతికి చెందిన పండ్లు, కీవీ పళ్లల్లో ఈ విటమిన్ సమృద్ధిగా ఉంటుంది.



విటమిన్ ఈ

యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉన్న విటమిన్ ఈ చర్మ ఆరోగ్యానికి కీలకం. అతినీలలోహిత కిరణాలు, కాలుష్యం కారణంగా చర్మానికి జరిగే నష్టాన్ని ఇది తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తి కూడా బలోపేతమయ్యేలా చేస్తుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులు, ఇతర అసౌకర్యాల నుంచి కూడా విటమిన్ ఈ ఉపశమనం కలిగిస్తుంది.

ఎందులో ఉంటుందంటే...

విత్తనాలు, గింజలు, పాలకూర, పొద్దుతిరుగుడు పువ్వు నూనెలో ఈ విటమిన్ పుష్కలంగా ఉంటుంది.



విటమిన్ కే...

బ్లడ్ క్లాటింగ్‌కు కీలకమైన విటమిన్ కే గాయాలు త్వరగా మానేలా చేస్తుంది. ఎముకల ఆరోగ్యానికీ ఇది కీలకం. మహిళల్లో ఉదయం పూట కలిగే అసౌకర్యాల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. మెదడు ఆరోగ్యానికీ ఇది అవసరమే. ఆకుకూరలు, అవకాడో లాంటి పండ్లు, చేపలు, లివర్, మాంసం గుడ్లల్లో ఇది పుష్కలంగా ఉంటుంది.

లైఫ్@360

ఉదరానికి అదనుగా...

జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి కావలసిన కొన్ని ఆహార పదార్థాలు...



పెరుగన్నం..

మీకు ఉదర సమస్య ఉంటే పెరుగన్నం తినవచ్చు. ఇది సులభంగా జీర్ణమవుతుంది. పెరుగులో ప్రోబయోటిక్స్ ఉంటాయి ఇవి గట్‌లో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయి.

అల్లం టీ..

కడుపు నొప్పి, అజీర్ణం ఉంటే అల్లం టీ తాగండి. అల్లం టీ కడుపులో చికాకు, ఇతర సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. కడుపు సమస్యలను వదిలించుకోవడానికి సహాయపడుతుంది.

ఓట్స్...

ఓట్స్ ఒక రుచికరమైన, తేలికపాటి ఆహారం. దీనిని ఖాళీ కడుపుతో తినవచ్చు. ఎలాంటి మసాలా దినుసులను కలుపవద్దు. స్వీట్ ఓట్స్ పాలతో వండుతారు. కానీ నీటిలో కూడా ఉడికించవచ్చు. ఓట్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది ఇది కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉండేలా చేస్తుంది.

యోగా

మీ నొప్పులకు ఓ దండం



కుర్చీల్లో ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల నడుము, తుంటి భాగం పట్టేసినట్టుగా అనిపిస్తుంటుంది. ఈ సమస్యకు గార్లాండ్ పోజ్ సరైన పరిష్కారం. పిల్లలు ఈ ఆసనాన్ని సులువుగా వేయగలరు. పెద్దలు ఒకే సారి ఈ ఆసనాన్ని వేయడం సాధ్యం కాకపోవచ్చు. కానీ, సాధన ద్వారా సాధించవచ్చు. ఈ ఆసనం వల్ల దీర్ఘకాలిక నొప్పుల నుంచి సరైన ఉపశమనం లభిస్తుంది. ఇండియన్ విధానంలో మోషన్‌కి వెళ్లినప్పుడు ఎలాగైతే కూర్చుంటారో ఈ ఆసన భంగిమ అలా ఉంటుంది.

ఈ ఆసనం వల్ల దీర్ఘకాలిక నొప్పుల నుంచి సరైన ఉపశమనం లభిస్తుంది. ఇండియన్ విధానంలో మోషన్‌కి వెళ్లినప్పుడు ఎలాగైతే కూర్చుంటారో ఈ ఆసన భంగిమ అలా ఉంటుంది.

ముందుగా...

● ముందు నిటారుగా, రెండు పాదాలను కొద్దిగా ఎడంగా ఉంచి నిల్చోవాలి. ● తర్వాత మోకాళ్లను వంచి, నడుం కింది భాగాన్ని నేల వైపుకు ఉంచాలి. ● అరచేతులను నమస్కారం చేసినట్టుగా హృదయం దగ్గర ఉంచాలి. మోచేతులను మోకాళ్ల వైపుగా ఉంచడానికి ప్రయత్నించండి. ● వెన్నెముకను నిటారుగా ఉంచండి. ● ఐదు దీర్ఘ శ్వాసల తీసుకొని వదలాలి. ● ఈ ఆసనాన్ని మూడు సార్లు పునరావృతం చేయాలి. ● బ్యాలెన్స్ కోల్పోకుండా ఉండటానికి మీ మడమల కింద మడత పెట్టిన దుప్పటి లేదా క్లాత్ ఉంచండి. అవసరమైతే ఆసరా కోసం మీ బట్ కింద ఒక బ్లాక్ లేదా రెండు స్లైడ్ చేయండి. కాలక్రమేణా, మీరు మీ సపోర్టును క్రమంగా తగ్గించగలరో లేదో చూడండి, తద్వారా మీ తుంటి, చీలమండలను విస్తరించడానికి గురుత్వాకర్షణ పని చేస్తుంది. ● మీరు ఈ భంగిమను బ్యాలెన్స్ చేయడంలో ఇబ్బంది అనిపిస్తే గోడ దగ్గర లేదా కుర్చీ సాయంతో ప్రయత్నించవచ్చు. మీ వీపును గోడకు ఉంచి, ఈ భంగిమను సాధన చేయవచ్చు.

జాగ్రత్తలు...

● మోకాలు, వెన్నుకు గాయాలు ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు. మీ శరీరం అన్ని విధాల ఈ భంగిమకు అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్నాక సాధన చేయడం మేలు. ఆసనం సాధనలో నొప్పి అనిపిస్తే తిరిగి యథా స్థితికి చేరుకోవచ్చు.

సినిమా



అంతా కలలా ఉంది

- మీనాక్షీ చౌదరి

"'సంక్రాంతికి వస్తున్నాం'లో కామెడీ టచ్ ఉన్న పోలీసాఫీసర్‌గా చేశాను. నిజ జీవితంలో ఐపీఎస్ ఆఫీసర్ కావాలనుకునేదాన్ని. ఈ మూవీలో ఆ పాత్ర చేయడంతో నా కల ఆ విధంగా నెరవేరిందని ఆనందంగా ఉంది (నవ్వుతూ)" అని హీరోయిన్ మీనాక్షీ చౌదరి తెలిపారు. వెంకటేశ్ హీరోగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీనాక్షీ చౌదరి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● మా నాన్నగారు ఆర్మీ ఆఫీసర్ కావడంతో ఓ అధికారి బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందనే ఐడియా ఉంది. అలాగే 'సంక్రాంతికి వస్తున్నాం'లో ఐపీఎస్ ఆఫీసర్ పాత్ర కోసం నేను కూడా కొంత హోమ్‌వర్క్ చేశాను. నాకు ఇష్టమైన పోలీసాఫీసర్ పాత్ర చేసే అవకాశం రావడం నా అదృష్టం. తొలిసారి ఈ మూవీలో యాక్షన్ సీన్స్ చేశాను. ● నేను నటించిన 'గుంటూరు కారం' 2024 సంక్రాంతికి రిలీజ్ అయ్యింది. 2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ రిలీజ్ కావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ జర్నీ అంతా ఒక కలలా ఉంది. నన్ను నేను నిరూపించుకునే మంచి కథలు, పాత్రలు రావడం చాలా హ్యాపీగా ఉంది. ● వెంకటేశ్‌గారిలో ఎప్పుడూ ఒక ఆనందం కనిపిస్తుంటుంది. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. ఆయన ఇప్పటికీ చాలా ఫిట్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉంటారు. 'దిల్' రాజు, శిరీష్‌గార్లు చాలా సపోర్ట్ చేశారు. వారు నిర్మించిన 'గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. కామెడీ మూవీ తీయడం అంత సులభం కాదు. అనిల్ రావిపూడిగారి కామెడీ టైమింగ్ అద్భుతం. ఐశ్వర్యా రాజేశ్ మంచి నటి. తన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ● నటీనటులకు హిట్స్, ఫ్లాప్స్ కామన్. అయితే ఏ మూవీ హిట్ అవుతుందో? ఏది కాదో చెప్పలేం. కానీ, నా వరకు ఆ కథకి, నా పాత్రకి వంద శాతం నేను న్యాయం చేశానా? లేదా అని మాత్రమే ఆలోచిస్తాను. నా కెరీర్‌లో 'లక్కీ భాస్కర్' బ్లాక్‌బస్టర్ హిట్. ఆ సినిమాకి పెట్టిన ఎఫర్ట్ ఇతర సినిమాలకు కూడా పెట్టాను. కానీ, ఫలితం ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో ఒక సినిమా చేస్తున్నాను. మరో రెండు సినిమాలు కూడా ఒప్పుకున్నాను.

డబుల్ ధమాకా

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు (జనవరి 3) సందర్భంగా డబుల్ ధమాకా ఇచ్చారు. ఆయన నటిస్తున్న 'భైరవం' సినిమాతో పాటు 'బీఎస్ఎస్ 12' (వర్కింగ్ టైటిల్) మూవీ అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అదితీ శంకర్, దివ్యా పిళ్లై హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా. జయంతీ లాల్ గడ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే మెలోడీ పాటని హీరో నాని చేతుల మీదుగా విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు తిరుపతి జవాను సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, యామిని ఘంటసాల పాడారు.

400 ఏళ్ల ఆలయం నేపథ్యంలో...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'బీఎస్ఎస్ 12' (వర్కింగ్ టైటిల్). లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివన్ రామకృష్ణ సమర్పణలో మహేష్ చందు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి సాయి శ్రీనివాస్ క్యారెక్టర్ పోస్టర్ రిలీజ్ చేశారు. "కల్ట్ థ్రిల్లర్‌గా, 400 ఏళ్ల నాటి దశావతార ఆలయం నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది. ప్రస్తుతానికి 35 శాతం షూటింగ్ పూర్తయింది" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్.



● అదితీ శంకర్, సాయిశ్రీనివాస్



బాలీవుడ్‌లో బడా బేనర్లో...

సౌత్‌లో దూసుకెళుతున్న శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి కొన్నాళ్లుగా రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకూ అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా ప్రచారంలో ఉన్న వార్త విషయానికొస్తే... బాలీవుడ్‌లో ఓ బడా బేనర్ అయిన ధర్మ ప్రొడక్షన్స్ ద్వారా శ్రీలీల హిందీ చిత్రపరిశ్రమ అరంగేట్రం జరగనుందట. ఈ సంస్థ అధినేత కరణ్ జోహార్ 'తూ మేరీ మై తేరా... మై తేరా తూ మేరీ' అనే చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటించనున్నారు. ఈ హీరో సరసన శ్రీలీలను హీరోయిన్‌గా ఫిక్స్ చేశారని సమాచారం. ఇక అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం అని బాలీవుడ్ టాక్. ఈ ఏడాది మధ్యలో ఈ చిత్రం షూట్ ఆరంభం అవుతుందట. ఈ చిత్రానికి సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహించనున్నారు. మరి... బడా బేనర్ ద్వారా శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ జరుగుతుందా? అంటే... వేచి చూడాల్సిందే.

● శ్రీలీల



● రవి, ఆశిష్ మెహ్రా, కిరణ్, విశ్వకరుణ్

నమ్మిన సిద్ధాంతం కోసం...

"పక్కా ఎంటర్‌టైన్‌మెంట్, ఇంటెన్స్ లవ్ స్టోరీతో 'దిల్ రూబా' రూపొందింది. ఈ చిత్రంలో తను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రేమతో సహా ఏ విషయంలోనైనా వెనకడుగు వేయని సిద్ధార్థ్ పాత్ర చేశాను. ఇలాంటి సిద్ధార్థ్‌లు అందరిలోనూ ఉంటారు. వారందరికీ మా 'దిల్ రూబా' బాగా నచ్చుతుంది. 'క' సినిమా తర్వాత నా సినిమాపై ప్రేక్షకులు పెట్టుకున్న అంచనాలను 'దిల్ రూబా' తప్పకుండా అందుకుంటుంది'' అని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, రుక్సార్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''ప్రస్తుతం నాలుగు సినిమాలు చేస్తున్నాను. ఏడాదికి కనీసం 3 చిత్రాలు రిలీజ్‌కు తీసుకురావాలని అనుకుంటున్నాను'' అని తెలిపారు. రవి మాట్లాడుతూ– ''దిల్ రూబా' టీజర్‌లో మీరు చూసింది కొంతే. ట్రైలర్‌లో మరింత చూస్తారు'' అని చెప్పారు. విశ్వకరుణ్ మాట్లాడుతూ– ''మనందరి జీవితాల్లోని ప్రేమను స్ఫూర్తిగా తీసుకుని ఈ మూవీ చేశాను. ఈ ప్రేమకథని థియేటర్స్‌లో ఎంజాయ్ చేస్తారు'' అని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న కో ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి, సినిమాటోగ్రాఫర్ డానియేల్ విశ్వాస్ తదితరులు మాట్లాడారు.



● విజయపాల్, సత్యరాజ్, మారుతి

బార్బరిక్ కొత్తగా ఉంటుంది

- మారుతి

''మైథలాజికల్ పాయింట్‌లో ఉన్న పాత్ర ప్రస్తుత తరానికి వస్తే ఎలా ఉంటుందో 'బార్బరిక్'లో చూపించారు. ఇది చాలా రిస్కీ జానర్ అని చెప్పాను. కానీ, మోహన్, రాజేశ్ ఎంతో నమ్మకంతో ఈ సినిమాని చాలా ఖర్చు పెట్టి తీశారు. ఈ మూవీ సరికొత్తగా ఉంటుంది.. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది'' అని దర్శకుడు మారుతి అన్నారు. సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహా, సాంచీ రాయ్, 'సత్యం' రాజేశ్, ఉదయ భాను ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతి సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించారు. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి మారుతి అతిథిగా హాజరై, విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ– ''ఏజ్డ్ యాక్షన్ హీరో అనే ట్యాగ్ కోసం ప్రయత్నిస్తున్నాను. ఈ మూవీతో నాకు ఆ ట్యాగ్ వస్తుంది'' అని చెప్పారు. ''ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది'' అని విజయపాల్ రెడ్డి తెలిపారు. ''బార్బరికుడికి త్రిబాణాస్త్రం ఉన్నట్టు ఈ మూవీకి సంబంధించి నాకు మూడు అస్త్రాలు ఉన్నాయి. ఒకరు డీఓపీ రమేశ్, రెండు ఫ్యూజన్ బ్యాండ్, మూడు ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేశ్. ఈ మూడు అస్త్రాలతో నేను ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు మోహన్ శ్రీవత్స. ''బార్బరిక్' మినీ 'బాహుబలి' మూవీలా ఉంటుంది'' అన్నారు 'సత్యం' రాజేశ్. ''ఇది నాకు తొలి తెలుగు సినిమా'' అని సాంచీ రాయ్ చెప్పారు. ఈ చిత్రానికి కెమేరా: కుశేందర్ రమేశ్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బ్యాండ్.

రైజ్ ఆఫ్ డ్రాగన్!

'లవ్ టుడే' మూవీలో హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. 'ఓరి దేవుడా' మూవీ ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. కేఎస్ రవికుమార్, మిస్కిన్, వీజే సిద్ధు, హర్షత్ ఖాన్, అనుపమా పరమేశ్వరన్ తదితరులు నటిస్తున్నారు. కల్పాతి ఎస్. అఘోరం, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'రైజ్ ఆఫ్ డ్రాగన్' అనే పాటను విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను లియోన్ జేమ్స్, నదీషా థామస్ పాడారు. ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ పాటలో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి డాన్స్ చేశారు.



● ప్రదీప్ రంగనాథన్

దర్శకురాలు అపర్ణ మల్లాది మృతి



నటి, రచయిత, దర్శకురాలు, నిర్మాత అపర్ణ మల్లాది (54) క్యాన్సర్‌తో మృతి చెందారు. కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె చికిత్స కోసం అమెరికా వెళ్లారు. అయితే చికిత్స నుంచి పూర్తి స్థాయిలో కోలుకోలేక లాస్ ఏంజెల్స్‌లోనే ఆమె గురువారం తుదిశ్వాస విడిచారు. 'ది అనుశ్రీ ఎక్స్‌పెరిమెంట్స్' సినిమా ద్వారా దర్శకురాలిగా తన కెరీర్ ప్రారంభించారు అపర్ణ మల్లాది. ఆ తర్వాత 'పోష్ పోరీస్' అనే వెబ్ సిరీస్ చేశారు. ఈ సిరీస్‌కి వీక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. రచయితగా రాణించిన ఆమె కొన్ని సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు. రెండేళ్ల క్రితం 'పెళ్లికూతురు పార్టీ' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత క్యాన్సర్ బారిన పడడంతో చికిత్స కోసం అమెరికా వెళ్లిన ఆమె అప్పటి నుంచి అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. అయితే ట్రీట్‌మెంట్‌కి ఆమె శరీరం సహకరించక పోవడంతో తుది శ్వాస విడిచారట. అపర్ణ చేసింది తక్కువ సినిమాలే అయినా 'కేరాఫ్ కంచరపాలెం' వంటి సినిమాలు తెర మీదకు రావడానికి ఆమె కృషి చాలా ఉందని సన్నిహితులు చెబుతున్నారు. ఎంతోమంది నటీనటులకు, దర్శకులకు ఆమె అవకాశాలు ఇప్పించారని తెలుస్తోంది. అంతేకాదు దర్శకత్వం విభాగాల్లో విద్యార్థులకు మెళకువలు కూడా నేర్పించేవారట. అపర్ణ మల్లాది మృతి పట్ల పలువురు తెలుగు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	721	184
	79,223	24,005

విదేశీ సూచీలు (శుక్రవారం మధ్యాహ్నం ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,531	▲ 252
డోజోన్స్	42,653	▲ 261
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,224	▽ 36
డాక్స్	19,906	▽ 119
షాంఘై	3,211	▽ 51
నికాయ్ (పోయినవారం ముగింపు)	39,895	▽ 387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	77,504	▲ 425
బంగారం (99.5 స్వచ్ఛత)	77,194	▲ 424
వెండి (కేజీ)	88,121	▲ 954

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.38	86.40
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.36	109.63
€	యూరో	ఒకటి	86.93	89.55
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.91	55.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.27	54.45
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.93	65.00
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.92	23.46
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.41	24.17
¥	చైనా యువాన్	ఒకటి	10.84	12.66

ఎస్‌బీఐ రెండు కొత్త డిపాజిట్ పథకాలు

80 ఏళ్లు నిండిన వారికి అదనపు రేటు



న్యూఢిల్లీ: డిపాజిట్‌దారుల కోసం ఎస్‌బీఐ రెండు వినూత్నమైన పథకాలను ప్రకటించింది. ఇందులో ఒకటి 'హర్ ఘర్ లఖ్‌పతి' కాగా, మరొకటి 'ఎస్‌బీఐ పాట్రాన్స్'. ఇందులో హర్ ఘర్ లఖ్‌పతి పథకం కింద రూ.లక్ష లేదా అంతకుమించి రూ.లక్ష చొప్పున ఎంత వరకు అయిన సమకూర్చుకునేందుకు ఉద్దేశించిన రికరింగ్ డిపాజిట్ పథకం. ఆర్థిక లక్ష్యాల సాధనను ఈ పథకం సులభతరం చేస్తుందని, కస్టమర్లు ప్రణాళిక మేరకు పొదుపు చేసుకోవచ్చని ఎస్‌బీఐ తెలిపింది. 'ఎస్‌బీఐ పాట్రాన్స్' అన్నది 80 ఏళ్లు, అంతకుమించి వయసున్న వృద్ధుల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన టర్మ్ డిపాజిట్ పథకం. సాధారణంగా సీనియర్ సిటిజన్లకు ఆఫర్ చేసే రేటుపై అదనంగా 0.10% వడ్డీ రేటును ఈ పథకం కింద ప్రస్తుత డిపాజిటర్లతోపాటు, కొత్త టర్మ్ డిపాజిటర్లకు ఇవ్వనున్నట్టు ఎస్‌బీఐ తెలిపింది. ఇవి కస్టమర్ల ఆకాంక్షలను తీర్చడంతోపాటు అదనపు రాబడులను అందిస్తాయని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ప్రకటించారు.


రూపాయికీ యూపీఐ!

- జనవరి 1న రూ.81,015 కోట్ల లావాదేవీలు
- రికార్డులు సృష్టిస్తున్న డిజిటల్ చెల్లింపులు
- చిరు వ్యాపారుల వద్ద కూడా క్యూఆర్ కోడ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో



రూపాయికీ యూపీఐ.. అవును మీరు విన్నది నిజమే. ఒక్క రూపాయి చెల్లించాలన్నా స్మార్ట్‌గా యూపీఐ పేమెంట్ యాప్‌తో 'స్కాని'చేస్తున్నారు. ఈ ట్రెండ్ దేశవ్యాప్తంగా పల్లెలకూ పాకింది. ఇదంతా అత్యంత వేగంగా చెల్లింపులను సుసాధ్యం చేస్తున్న టెక్నాలజీ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మాయాజాలం. క్షణాల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎవరికైనా రోజుకు గరిష్ఠంగా రూ.1 లక్ష వరకు.. బ్యాంకు ఖాతాకు, ఖాతా అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు, యూపీఐ ఐడీ, క్యూఆర్ కోడ్‌కు సురక్షితంగా, సులభంగా డిజిటల్ చెల్లింపులను యూపీఐ సుసాధ్యం చేసింది. చిరు వ్యాపారులకూ డిజిటల్ రూపంలో నగదును స్వీకరించే ప్రధాన సాధనంగా మారిపోయింది. చిల్లర సమస్యలకు యూపీఐ చెక్ పెడుతోంది. 2025 జనవరి 1న రూ.81,015.79 కోట్ల విలువైన 56.84 కోట్ల లావాదేవీలతో కొత్త సంవత్సరంలో యూపీఐ శుభారంభం చేసింది. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31న ప్రజలు రూ.93,148 కోట్ల విలువైన లావాదేవీలు జరిపారు.



ఫోన్‌పే టాప్

లావాదేవీల పరంగా ఫోన్‌పే 48 శాతం వాటాతో తొలి స్థానంలో నిలిచింది. గూగుల్ పే 37 శాతం, పేటీఎంకు 7% వాటా ఉంది. మిగిలిన 8% వాటాను క్రెడ్, ఐసీఐసీఐ బ్యాంక్ యాప్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాప్స్ వంటివి పంచుకున్నాయి.

కొత్త రికార్డుల ప్రయాణం..

దేశవ్యాప్తంగా 2024 డిసెంబర్ 2న రూ.95,915.6 కోట్ల విలువ చేసే లావాదేవీలు నమోదయ్యాయి. యూపీఐ చరిత్రలో 2016 ఏప్రిల్ నుంచి 2025 జనవరి 1 నాటికి ఇదే అత్యధికం. ఇక 2024 డిసెంబర్ నెలలో సగటున రోజుకు రూ.74,990 కోట్ల విలువైన 54 కోట్ల లావాదేవీలు జరిగాయంటే నోరెళ్లబెట్టాల్సిందే. కస్టమర్లు నవంబర్‌లో రోజుకు సగటున రూ.71,840 కోట్ల విలువైన 51.6 కోట్ల లావాదేవీలు జరిపారు. యూపీఐ లావాదేవీల సంఖ్య గత నెలలో 8 శాతం దూసుకెళ్లి మొత్తం 1,673 కోట్లుగా ఉంది. నవంబర్‌లో ఈ సంఖ్య 1,548 కోట్లు నమోదైంది. లావాదేవీల విలువ గత నెలలో రూ.23.25 లక్షల కోట్లకు చేరింది. నవంబర్‌లో ఇది రూ.21.55 లక్షల కోట్లుగా ఉంది.

భారత్ స్కాన్ చేస్తోంది..

దేశం ఇప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తోందంటే అతిశయోక్తి కాదు. రోడ్డు పక్కన ఉండే చిరు వర్తకుల వద్దా ఇవి దర్శనమిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం 2024 నవంబర్ నాటికి భారత్ క్యూఆర్‌తో కలిపి మొత్తం యూపీఐ క్యూఆర్ కోడ్స్ 63.2 కోట్లు జారీ అయ్యాయి. 2023 నవంబర్‌లో ఈ సంఖ్య 31.4 కోట్లు మాత్రమే. అంటే ఏడాదిలో క్యూఆర్ కోడ్స్ రెట్టింపు అయ్యాయన్నమాట. వర్తకుల వద్ద దేశవ్యాప్తంగా 2024 మార్చి 31 నాటికి 34.9 కోట్ల క్యూఆర్ కోడ్స్ ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల వేగానికి ఈ అంకెలే నిదర్శనం.

ఎన్‌పీసీఐ వేదికగా 55 శాతం..

ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐఎల్), ఆర్‌టీజీఎస్, ఐఎంపీఎస్, ఎన్ఏసీహెచ్, నెఫ్ట్, యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులు, ఏటీఎంలు, పీవోఎస్ మెషీన్లు, చెక్కులు, బ్యాంక్ డ్రాఫ్టులు, నగదు.. ఇలా ప్రభుత్వ, రిటైల్ పరంగా దేశవ్యాప్తంగా 2024 నవంబర్ నెలలో రూ.2,20,52,158 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఇందులో యూపీఐ వాటా 9.77 శాతం. అలాగే నవంబర్‌లో ఎన్‌పీసీఐ వేదికగా జరిగిన రూ.38,94,079 కోట్ల రిటైల్ లావాదేవీల్లో యూపీఐ 55.34 శాతం వాటా కైవసం చేసుకుంది.

ఏ బ్యాంక్‌లో అయినా ఈపీఎఫ్ పెన్షన్

అమల్లోకి సెంట్రలైజ్డ్ పెన్షన్ చెల్లింపుల వ్యవస్థ



న్యూఢిల్లీ: 'ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్), 1995' సభ్యులకు శుభవార్త. 68 లక్షల పెన్షనర్లు ఇక మీదట ఏ బ్యాంక్‌లో అయినా పెన్షన్ పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. అన్ని ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో కేంద్రీకృత పింఛను చెల్లింపుల వ్యవస్థ (సీపీపీఎస్)ను అమల్లోకి తీసుకువచ్చినట్టు కేంద్ర కార్మిక శాఖ ప్రకటించింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న పింఛను పంపిణీ వ్యవస్థ కేంద్రీకృతమై లేదు. ప్రతి జోనల్/ప్రాంతీయ కార్యాలయ పరిధిలో సభ్యులకు పింఛను పంపిణీకి వీలుగా 3–4 బ్యాంకులతో ఒప్పందం చేసుకోవాల్సి వచ్చేది. సీపీపీఎస్ కింద లబ్ధిదారు ఏ బ్యాంకు నుంచి అయినా పెన్షన్ తీసుకోవచ్చని, పెన్షన్ ప్రారంభంలో ధ్రువీకరణ కోసం బ్యాంక్‌ను సందర్శించాల్సిన అవసరం ఉండదని కార్మిక శాఖ తెలిపింది. పెన్షన్‌ను మంజూరు చేసిన వెంటనే బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని పేర్కొంది. పెన్షనర్ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివెళ్లినప్పటికీ, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీవో)ను ఒక ఆఫీస్ నుంచి మరో ఆఫీస్‌కు బదిలీ చేసుకోవాల్సిన అవసరం తప్పుతుందని వివరించింది. రిటైర్మెంట్ అనంతరం తమ స్వస్థలాలకు వెళ్లి స్థిరపడే పింఛనుదారులకు నూతన వ్యవస్థతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సీపీపీఎస్‌ను అన్ని ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పూర్తి స్థాయిలో అమలు చేయడాన్ని చారిత్రక మైలురాయిగా కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వ్యాఖ్యానించారు.

బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు



- కొత్త ఏడాదిలో సూచీలకు తొలి నష్టం
- సెన్సెక్స్ నష్టం 721 పాయింట్లు

ముంబై: రెండురోజుల వరుస లాభాల తర్వాత కొత్త ఏడాదిలో స్టాక్ సూచీలు తొలిసారి నష్టాలు చవిచూశాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 2% –1% నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. వచ్చేవారం కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. బ్యాంకులు, ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో శుక్రవారం సెన్సెక్స్ 721 పాయింట్లు నష్టపోయి 79,223 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 184 పాయింట్లు పతనమై 24,005 వద్ద నిలిచింది. ఇంధన, టెలీకమ్యూనికేషన్, కన్జూమర్ డ్యూరబుల్స్, యుటిలిటీస్, మెటల్, ఆయిల్అండ్‌గ్యాస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

- ✔ డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు బలహీనపడి రికార్డు కనిష్ఠం 85.79 స్థాయి వద్ద స్థిరపడింది.
- ✔ డిసెంబర్ క్వార్టర్ ఆదాయం 17% వృద్ధి నమోదుతో అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేరు 11% ర్యాలీ చేసి రూ.4,023 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.4165 వద్ద గరిష్టాన్ని తాకింది. ఇదే రిటైల్ రంగానికి విశాల్‌మెగా మార్ట్ షేరు ఇంట్రాడేలో 10% పెరిగి రూ.117.50 వద్ద గరిష్టాన్ని అందుకుంది. చివరికి 5% లాభంతో రూ.112 వద్ద స్థిరపడింది.

బ్యాంక్‌నెట్ పోర్టల్ ప్రారంభం

- బ్యాంక్‌లు స్వాధీనం చేసుకున్న ఆస్తుల వేలం ఇక్కడే వేలం
- ప్రారంభించిన కేంద్ర ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: బ్యాంక్‌లు స్వాధీనం చేసుకున్న అన్ని రకాల ఆస్తులను ఇక మీదట బ్యాంక్‌నెట్ పోర్టల్ పైనే వేలానికి పెట్టనున్నారు. ఇందుకు వీలుగా నవీకరించిన బ్యాంక్‌నెట్ (బీఏఏఎన్‌కేఎన్‌ఈటీ) పోర్టల్‌ను కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎం.నాగరాజు ప్రారంభించారు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లు (పీఎస్‌బీలు) చేపట్టే ఆస్తుల వేలం సమాచారం ఈ పోర్టల్‌పై ఉంటుందని.. కొనుగోలుదారులు, ఇన్వెస్టర్లకు భిన్న రకాల ఆస్తులను గుర్తించొచ్చని ఆర్థిక శాఖ ప్రకటించింది. ఫ్లాట్‌లు, ఇళ్లు, ఓపెన్ ప్లాట్‌లు, వాణిజ్య ప్రాపర్టీలు, ఇండస్ట్రియల్ ల్యాండ్, బిల్డింగ్‌లు, షాప్‌లు, వాహనాలు, ప్లాంట్, మెషినరీ, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వేలం సమాచారం పోర్టల్‌పై అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ వివరాలన్నీ ఒకే చోట లభించడంతో, విలువైన ఆస్తులను గుర్తించి, వేలంలో పాల్గొనడానికి వీలుంటుందని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంక్‌లు రుణాలను వసూలు చేసుకోవడంలో ఈ ప్లాట్‌ఫామ్ గణనీయంగా సాయపడుతుందని నాగరాజు తెలిపారు. కొత్త పోర్టల్‌లోకి ఇప్పటికే 1,22,500 ప్రాపర్టీలను లిస్ట్ చేసినట్టు చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్‌లో తగ్గిన పేదరికం: ఎస్‌బీఐ రీసెర్చ్
హెచ్‌యూఎల్ చేతికి మినిమలిస్ట్!



ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన కోనేరు హంపి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసింది. న్యూయార్క్‌లో జరిగిన మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచిన ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా ప్రధానితో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఆమెపై ప్రశంసలు కురిపించిన మోదీ... హంపి క్రీడా దిగ్గజమని కొనియాడారు. 'హంపిలాంటి స్పోర్టింగ్ ఐకాన్‌ను కలవడం ఆనందంగా ఉంది. చెస్ ప్లేయర్లకు ఆమె ఒక స్ఫూర్తి. చురుకైన ఆలోచన, అచంచల సంకల్పం, నిబద్ధత వల్లే ఆమె ఈ స్థాయికి చేరుకుంది. దేశానికే ఆమె గర్వకారణం' అని ప్రధాని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. మోదీతో భేటీ కావడం, ఆయన కురిపించిన ప్రశంసలు, ప్రోత్సహించిన తీరు తనలో నూతనోత్సాహాన్ని నింపిందని హంపి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

బ్యాటింగ్ విఫలం... బౌలింగ్‌పైనే భారం!



పిచ్‌పై పచ్చిక... ఆకాశంలో మబ్బులు పట్టి ఉన్నాయి... ఇలాంటి స్థితిలో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ చేసే సాహసానికి సిద్ధమైంది... ఆరంభంలో కొన్ని ఓవర్లు నిలబడగలిగితే బ్యాటింగ్ సులువైపోతుందని జట్టు భావించింది... అయితే ఈ వ్యూహం కలిసి రాలేదు... సిరీస్‌లో తమ బ్యాటింగ్ వైఫల్యాన్ని కొనసాగిస్తూ జట్టు మళ్లీ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆసీస్ పేసర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో కనీసం 200 పరుగులు కూడా చేయలేకపోయింది... అయితే అద్భుత బంతితో ఆసీస్ తొలి వికెట్ తీసి బుమ్రా కాస్త ఊరటనివ్వడంతో పాటు రెండో రోజుపై ఆశలు పెంచాడు. తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరే చేసినా... బౌలింగ్‌తో చెలరేగి పెర్త్ టెస్టులా ప్రత్యర్థిని పడగొడతారా లేక ఆసీస్ మెరుగైన బ్యాటింగ్‌తో పైచేయి సాధిస్తుందా అనేది ఆసక్తికరం.

సిడ్నీలోనూ మారని భారత్ ఆటతీరు

- తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 185 ఆలౌట్
- దెబ్బ తీసిన ఆసీస్ పేస్ త్రయం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 9/1

సిడ్నీ: ఆస్ట్రేలియాతో సిరీస్‌ను సమంగా ముగించాలనే లక్ష్యంతో చివరి టెస్టులో బరిలోకి దిగిన భారత్ తొలి రోజు ఆ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయింది. ఏ ఒక్క బ్యాటర్ కూడా ప్రభావం చూపలేకపోవడంతో శుక్రవారం తమ తొలి ఇన్నింగ్స్‌లో 72.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది. వికెట్ కీపర్ రిషభ్ పంత్ (98 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ బౌలర్లలో బోలండ్ 4, స్టార్క్ 3, కమిన్స్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 3 ఓవర్లలో ఉస్మాన్ ఖ్వాజా (2) వికెట్ కోల్పోయి 9 పరుగులు చేసింది. తొలి రోజు ఆటకు రికార్డు స్థాయిలో 47,998 మంది హాజరయ్యారు. ఈ మైదానంలో ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు జరిగిన టెస్టుల్లో తొలి రోజు ఇదే అత్యధిక హాజరు కావడం విశేషం.

జాగ్రత్తగా బ్యాటింగ్...

ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (10), కేఎల్ రాహుల్ (4) భారత్‌కు శుభారంభం అందించడంలో విఫలమయ్యారు. ఆరు పరుగుల వ్యవధిలో వీరిద్దరు పెవిలియన్ చేరారు. ఆ తర్వాత శుబ్‌మన్ గిల్ (20), కోహ్లి (17) కూడా చాలా జాగ్రత్తగా ఆడటంతో పరుగులు రావడం గగనంగా మారిపోయింది. లంచ్‌కు ముందు చివరి బంతికి అనూహ్యంగా ముందుకొచ్చి ఆడబోయిన గిల్ అవుట్ కావడంతో భారత్ 57/3 వద్ద సెషన్ ముగించింది. విరామం తర్వాత కొద్ది సేపటికే కోహ్లి కూడా నిష్క్రమించాడు. ఈ దశలో జత కలిసిన పంత్, జడేజా (95 బంతుల్లో 26; 3 ఫోర్లు) కూడా వికెట్ కాపాడుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. దాంతో 25 ఓవర్ల రెండో సెషన్‌లో కూడా 50 పరుగులే వచ్చాయి. చివరి సెషన్ ఆరంభంలోనే బోలండ్ వరుస బంతుల్లో పంత్, నితీశ్ కుమార్ రెడ్డి (0)లను అవుట్ చేసి భారత్‌ను దెబ్బ తీశాడు. మెల్‌బోర్న్ టెస్టు సెంచరీ హీరో, ఆంధ్ర క్రికెటర్ నితీశ్ ఈసారి తొలి బంతికే వెనుదిరిగాడు. జడేజా వికెట్ స్టార్క్ ఖాతాలో చేరింది. ఆ తర్వాత వివాదాస్పద రీతిలో సుందర్ (14) అవుట్ కాగా... చివర్లో బుమ్రా (17 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లతో అలరించాడు. భారత్ ఇన్నింగ్స్ రన్‌రేట్ ఓవర్‌కు 2.55 పరుగులు మాత్రమే కాగా... తొలి 60 ఓవర్లలో జట్టు స్కోరులో 8 బౌండరీలే (7 ఫోర్, 1 సిక్స్) ఉన్నాయి. బ్యాటింగ్ ఆర్డర్‌లో నలుగురు కీలక ఆటగాళ్లు (3–6 స్థానాలు) గిల్, కోహ్లి, పంత్, జడేజా కలిపి మొత్తం 326 బంతులు ఎదుర్కొని 103 పరుగులే చేశారంటే ఇన్నింగ్స్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెబ్‌స్టర్ (బి) బోలండ్ 10; రాహుల్ (సి) కొన్‌స్టాస్ (బి) స్టార్క్ 4; గిల్ (సి) స్మిత్ (బి) లయన్ 20; కోహ్లి (సి) వెబ్‌స్టర్ (బి) బోలండ్ 17; పంత్ (సి) కమిన్స్ (బి) బోలండ్ 40; జడేజా (ఎల్బీ) (బి) స్టార్క్ 26; నితీశ్ రెడ్డి (సి) స్మిత్ (బి) బోలండ్ 0; సుందర్ (సి) కేరీ (బి) కమిన్స్ 14; ప్రసిధ్ కృష్ణ (సి) కొన్‌స్టాస్ (బి) స్టార్క్ 3; బుమ్రా (సి) స్టార్క్ (బి) కమిన్స్ 22; సిరాజ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (72.2 ఓవర్లలో ఆలౌట్) 185. వికెట్ల పతనం:** 1–11, 2–17, 3–57, 4–72, 5–120, 6–120, 7–134, 8–148, 9–168, 10–185. **బౌలింగ్:** స్టార్క్ 18–5–49–3, కమిన్స్ 15.2–4–37–2, బోలండ్ 20–8–31–4, వెబ్‌స్టర్ 13–4–29–0, లయన్ 6–2–19–1.

కోహ్లి ఏడోసారి...



వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న కోహ్లి తన లోపాన్ని సరిదిద్దుకోలేని స్థితికి వచ్చేసినట్లున్నాడు! ఈసారి కూడా అతను ఆఫ్‌స్టంప్ బయట పడిన బంతిని ఆడబోయి స్లిప్‌లో క్యాచ్ ఇచ్చాడు. సిరీస్‌లో ఏడోసారి అవుటైన అతను ఏడుసార్లూ ఇదే తరహాలో కీపర్ లేదా స్లిప్‌లోకి ఆడి వెనుదిరిగాడు. నిజానికి తొలి బంతికే అతనికి అదృష్టం కలిసొచ్చింది. బోలండ్ బౌలింగ్‌లో స్లిప్‌లో చివరి క్షణాల్లో క్యాచ్ పట్టిన స్మిత్ బంతిని పైకి లేపగా, పక్కనే ఉన్న లబుషేన్ అందుకున్నాడు. అయితే పదేపదే రీప్లేలు చూసిన తర్వాత బంతి నేలను తాకిందని చెబుతూ థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. ఆ తర్వాత తన స్టాన్స్ మార్చుకొని మరో 67 బంతుల పాటు బౌండరీ కోసం కూడా ప్రయత్నించకుండా జాగ్రత్తగా ఆడిన కోహ్లి చివరకు తనను తాను నియంత్రించుకోలేక షాట్ ఆడబోయి వెనుదిరిగాడు.

పంత్ పట్టుదలగా...



తన శైలికి భిన్నంగా డిఫెన్స్‌కే ప్రాధాన్యత, సుదీర్ఘ సమయం పాటు షాట్లకు ప్రయత్నించకుండా ఓపిగ్గా బ్యాటింగ్, ఈ క్రమంలో శరీరానికి వరుసగా తగిలిన బంతులు, హెల్మెట్‌ను తాకిన బౌన్సర్, పలుమార్లు ఫిజియో చికిత్స... ఇదీ శుక్రవారం పంత్ బ్యాటింగ్ సాగిన తీరు! మెల్‌బోర్న్ టెస్టులో చెత్త షాట్‌లు ఆడి అవుటై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పంత్ ఈసారి చాలా జాగ్రత్త పడ్డాడు. 'పిచ్ అనుకూలంగా లేకపోగా మా పరిస్థితి కూడా బాగా లేదు. అందుకే షాట్లు ఆడకుండా నియంత్రించుకున్నాను. ఆరంభంలో కొంత కష్టంగా అనిపించినా డిఫెన్స్ ఆడటం అసాధ్యమేమీ కాదు. కొన్నిసార్లు సమయోచితంగా కూడా ఆడాల్సి ఉంటుంది' అంటూ ఇన్నింగ్స్ తర్వాత పంత్ వ్యాఖ్యానించాడు. అయితే 97 బంతుల తర్వాత ఇక నా వల్ల కాదన్నట్లు షార్ట్ బాల్‌ను పుల్ చేయబోయి మిడాన్‌లో సునాయాస క్యాచ్ ఇచ్చి అతను అవుటయ్యాడు.

కొన్‌స్టాస్ X భారత జట్టు



అద్భుత బంతులతో బ్యాటర్లను పడగొట్టినా... సాధారణంగా బుమ్రా ఆగ్రహావేశాలు వ్యక్తపరిచే వ్యక్తి కాదు. అలాంటి ఆటగాడిని 19 ఏళ్ల ఆసీస్ ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్ గత టెస్టు నుంచే రెచ్చగొడుతున్నాడు. బుమ్రా చివరి ఓవర్లో ఐదో బంతి వేసేందుకు సిద్ధమైన తరుణంలో ఏదో చూపిస్తూ ఖ్వాజా వెనక్కి జరిగాడు. బుమ్రా కాస్త అసంతృప్తి ప్రదర్శించగా... సంబంధం లేకపోయినా మరో ఎండ్ నుంచి కొన్‌స్టాస్ కల్పించుకుంటూ ఏవో మాటలు అన్నాడు. బుమ్రా కూడా బదులిచ్చేందుకు సిద్ధం కాగా, అంపైర్ వీరిద్దరిని విడదీయాల్సి వచ్చింది. అయితే రెండు బంతుల తర్వాత అసలు సినిమా కనిపించింది. ఖ్వాజాను అవుట్ చేయగానే బ్యాటర్ వైపు చూడకుండా బుమ్రా వెనక్కి తిరిగి కొన్‌స్టాస్ వైపు తన ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ నిలబడ్డాడు. మిగతా భారత ఆటగాళ్లంతా అంతే స్థాయిలో ఆవేశాన్ని చూపిస్తూ అంతా కలిసికట్టుగా కొన్‌స్టాస్ వైపు దూసుకు వచ్చారు. ఆసీస్ బ్యాటర్ మాటలు టీమ్‌ను ఎలా రెచ్చగొట్టాయో ఇది చూపించింది.

రోహిత్ శర్మ 'విశ్రాంతి'




'మా కెప్టెన్ విశ్రాంతి తీసుకొని తన నాయకత్వ లక్షణాలు చూపించాడు. ఇది జట్టులోని ఐక్యతను చూపిస్తోంది. జట్టు అవసరాల కోసం నిస్వార్థంగా ఈ నిర్ణయం తీసుకున్నాడు'... టాస్ సమయంలో రోహిత్ శర్మ గురించి బుమ్రా చెప్పిన మాట ఇది. పేలవ బ్యాటింగ్ కారణంగా వేటు వేసినా ఆ మాటను చెప్పేందుకు మేనేజ్‌మెంట్ ఇష్టపడటం లేదు. మైదానంలో వార్మప్ సమయంలో సహచరులతో కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడిన రోహిత్ టాస్‌కు ముందు అక్కడి నుంచి నిష్క్రమించాడు. బుమ్రా భారత కెప్టెన్ జంపర్‌తో గ్రౌండ్‌లోకి రావడంతో స్పష్టత వచ్చేసింది. జాతీయ గీతం సమయంలోనూ రోహిత్ ఇతర సభ్యులతో కలవకుండా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యాడు. ఇది తమను భావోద్వేగానికి గురి చేసిందని పంత్ వ్యాఖ్యానించాడు. తాజా పరిస్థితి చూస్తే రోహిత్ టెస్టు కెరీర్ ముగిసినట్లే. వచ్చే జూన్‌లో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు అతని పేరును పరిశీలించే అవకాశం కనిపించడం లేదు. భారత్ ఒకవేళ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరినా రోహిత్‌కు చోటు దక్కుతుందనే గ్యారంటీ లేదు!


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో




17.2 కోట్ల ఉద్యోగాలు

దేశంలో 2014 నుంచి 2024 వరకు.. అంటే నరేంద్ర మోదీ ప్రధాని పదవి చేపట్టిన నుంచీ ఇప్పటివరకు.. వచ్చిన మొత్తం ఉద్యోగాలు 17.2 కోట్లు. కేవలం 2023–24లో వచ్చిన ఉద్యోగాలు 4.6 కోట్లు. ఈ విషయాలను కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా యువతకు (గ్రాడ్యుయేట్లు) ఉద్యోగావకాశాలు 2013లో 33.95 శాతం నుంచి 2024లో రికార్డు స్థాయిలో 54.81 శాతానికి పెరిగాయని ఈ నివేదిక పేర్కొంది. ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్ఓ) లెక్కల ప్రకారం 2017 సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్యలో 4.7 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయి.







తొక్కలో ఇంధనం

బంగాళాదుంప తొక్కలు, వ్యర్థాల నుంచి ఇథనాల్

తొక్కే కదా అని అలుసుగా చూడొద్దు! ఏమో రేపు అవే మన బైకులు.. కార్లు.. లారీలను నడిపే ఇం'ధనం'గా మారొచ్చు! దేనిగురించి అనుకుంటున్నారా? అదేనండీ మనం కరకరలాడించే చిప్స్.. ఫ్రై.. కూరల్లో లొట్టలేసుకుంటూ లాగించే బంగాళాదుంపల సంగతిది. ఈ ఆలుగడ్డ తొక్కలు, వ్యర్థాల నుంచి బయో ఇంధనాన్ని ఉత్పత్తిచేసే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టారు మన శాస్త్రవేత్తలు. దీన్ని పరీక్షించేందుకు త్వరలో ప్రయోగాత్మక (పైలట్) ప్లాంటును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇది విజయవంతమైతే.. బంగాళాదుంపలతో బైక్ నడిపేయొచ్చన్నమాట!!

- ల్యాబ్ పరీక్షలు విజయవంతం.. టెక్నాలజీ టెస్టింగే తరువాయి
- ప్రయోగాత్మక ప్లాంటును ఏర్పాటు చేయనున్న సీపీఆర్ఐ
- ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆలు ఉత్పత్తిదారు భారత్
- ఉత్పత్తిలో 10–15% నిరుపయోగంగా పారేస్తున్న వైనం

సాక్షి, బిజినెస్ డెస్క్: బంగాళాదుంపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే చైనా తర్వాత రెండో స్థానంలో ఉంది భారత్. అయితే, సరైన నిల్వ సదుపాయాల్లేక పంట చేతికొచ్చాక పాడైపోయే ఆలుగడ్డలు మొత్తం ఉత్పత్తిలో 10–15 శాతం ఉంటాయని అంచనా. మరోపక్క పొటాటో చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ప్రాసెస్డ్ ఆహారోత్పత్తులను పెద్ద ఎత్తున తయారుచేసే స్నాక్స్ కంపెనీల నుంచి తొక్కలు ఇతరత్రా రూపంలో వేల టన్నుల వ్యర్థాలు వెలువడుతుంటాయి. వీటి నుంచి జీవ ఇంధనాన్ని (బయో ఫ్యూయల్–ఇథనాల్) ఉత్పత్తి చేసే టెక్నాలజీని సిమ్లాలోని సెంట్రల్ పొటాటో రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్ఐ) రూపొందించింది. ల్యాబ్ పరీక్షలు కూడా పూర్తి కావడంతో, ఈ టెక్నాలజీని టెస్ట్ చేయడం కోసం పైలట్ ప్లాంటును నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తోంది.



చెరకు, మొక్కజొన్నతో పాటు..

దేశంలో ప్రస్తుతం చెరకు, మొక్కజొన్న నుంచి పెద్ద ఎత్తున ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. వీటితోపాటు బంగాళాదుంపల వ్యర్థాలను కూడా ఇథనాల్ ఉత్పత్తికి ఫీడ్ స్టాక్‌గా ఉపయోగించేందుకు జాతీయ జీవ ఇంధన పాలసీలో ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ లభించింది. 'ఆలుగడ్డల నుంచి గణనీయమైన వ్యర్థాలు ఉంటున్న నేపథ్యంలో ఇథనాల్ ఉత్పత్తికి వీటిని విలువైన ప్రత్యామ్నాయాలుగా పరిగణించవచ్చు' అని సీపీఆర్ఐ శాస్త్రవేత్త ధర్మేంద్ర కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఏటా సగటున సుమారు 5.6 కోట్ల టన్నుల ఆలుగడ్డలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 8–10 శాతం, అంటే 50 లక్షల టన్నులను పొటాటో చిప్స్, ఫ్రైస్, ఇంకా డీహైడ్రేటెడ్ ప్రాడక్టులుగా ప్రాసెస్ చేస్తున్నారు. ఆయా ప్లాంట్ల నుంచి భారీ మొత్తంలో తొక్కలు, ఇతరత్రా వ్యర్థాలు బయటికొస్తాయి. ఇక పంట చేతికొచ్చాక ఉత్పత్తి నష్టాలు 20–25 శాతం, అంటే సుమారు 1.1–1.4 కోట్ల టన్నుల మేరకు ఉంటాయని అంచనా. ప్రధానంగా సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం, సరిగ్గా రవాణా చేయకపోవడం వంటివి దీనికి కారణం. 'అత్యధికంగా బంగాళాదుంపలను ఉత్పత్తి చేస్తున్న ఉత్తరప్రదేశ్ లేదా పశ్చిమ బెంగాల్, అలాగే భారీగా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్న గుజరాత్ వంటి చోట్ల పొటాటో ద్వారా ఇథనాల్ తయారు చేసే పైలట్ ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం' అని కుమార్ తెలిపారు.

20% ఇథనాల్ బ్లెండింగ్ టార్గెట్..

క్రూడ్ ఆయిల్ దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడం, కాలుష్యాన్ని నియంత్రించడం కోసం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే బయో ఫ్యూయల్ పాలసీని పక్కాగా అమలు చేస్తోంది. 2013–14 ఇథనాల్ సరఫరా సంవత్సరం (ఈఎస్‌వై)లో 38 కోట్ల లీటర్ల ఇథనాల్ (ఫ్యూయల్ గ్రేడ్) దేశంలో ఉత్పత్తి కాగా, 2020–21 నాటికి ఇది 302.3 కోట్ల లీటర్లకు చేరింది. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం 1.53 శాతం నుంచి 8.17 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో దేశంలో పెట్రోల్ వినియోగం 64 శాతం ఎగబాకడం గమనార్హం. 2030 నాటికి పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని 20 శాతానికి చేర్చాలని కేంద్ర ప్రభుత్వం తొలుత లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, 2022 జూన్ నాటికే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) 10 శాతం బ్లెండింగ్ లక్ష్యాన్ని చేరుకోవడంతో 2025–26 నాటికి 20 శాతం లక్ష్యాన్ని కుదించారు. 2023–24లో ఈ బ్లెండింగ్ 13 శాతంగా నమోదైంది. డీజిల్‌లో సైతం 5% ఇథనాల్‌ను కలిపే పాలసీని తీసుకొచ్చే ప్రణాళికల్లో ప్రభుత్వం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇథనాల్ ఉత్పత్తికి మరిన్ని రకాల ఫీడ్ స్టాక్‌లనువినియోగించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



2025 కల్లా ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజన్లు తప్పనిసరి..

పెట్రోలు, డీజిల్‌తో నడిచే సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసీఈ) వాహనాల స్థానంలో రాబోయే రోజుల్లో ఫ్లెక్సీ ఫ్యూయల్ వెహికల్స్ (ఎఫ్‌వీ)లు పరుగులు తీయనున్నాయి. బయో ఫ్యూయల్ పాలసీకి అనుగుణంగా 2025 చివరినాటికి దేశంలో ఉత్పత్తి అయ్యే ఐసీఈ వాహన ఇంజిన్లను పెట్రోల్‌తో పాటు ఫ్లెక్స్ ఫ్యూయల్ (85 శాతం వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్–ఈ 85)కు అనుగుణంగా మార్చడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో ఆటోమొబైల్ కంపెనీలు ఆ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

500 కోట్ల లీటర్లు	2023 మార్చి నాటికి దేశంలో ఇథనాల్ వార్షిక ఉత్పత్తి
13%	2023-24 నాటికి పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమ పరిమాణం.
5.6 కోట్ల టన్నులు	దేశవ్యాప్తంగా బంగాళాదుంపల వార్షిక ఉత్పత్తి

ఒక్క నెల ముచ్చటేనా?

- మూడో తేదీకి కూడా టీచర్లకు జీతాలు ఇవ్వని ప్రభుత్వం
- రూ.5,000 కోట్లు అప్పు చేసినా వేతనాలు చెల్లించని చంద్రబాబు సర్కారు



సాక్షి, అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం... దాన్ని ఒక్క నెల ముచ్చటగా మార్చేసింది. తొలి నెల మినహా తర్వాత నెల నుంచి ఒకటో తేదీన ఉద్యోగులందరికీ జీతాలు, పెన్షనర్లు అందరికీ పెన్షన్లు జమ చేయడం లేదు. నూతన సంవత్సరంలోను మూడో తేదీ వచ్చినప్పటికీ వేతనాల కోసం సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఉపాధ్యాయులతోపాటు పలు శాఖల్లోని ఉద్యోగులకు ఈ నెల ఒకటో తేదీన వేతనాలు అందలేదు. రెండో తేదీ కొంత మంది ఉద్యోగులకు వేతనాలను ప్రభుత్వం జమ చేసింది. అయితే 3వ తేదీ కూడా ఉపాధ్యాయులు ఎవరికీ జీతాలు అందలేదు. జీతాల కోసం ప్రతి నెలా ఎదురుచూపులు తప్పడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత నెల కూడా ఉపాధ్యాయులకు ఒకటో తేదీన వేతనాలు జమచేయలేదు. ప్రతి నెలా 6, 7 తేదీల వరకు జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. యూనివర్సిటీల ప్రొఫెసర్లకు కూడా ఈ నెల వేతనాలు ఇంకా అందలేదు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు మరి కొన్ని శాఖల్లో పెన్షనర్లకు పెన్షన్లు కూడా అందలేదు. ప్రభుత్వం గత నెల 31వ తేదీ మంగళవారం రూ.5,000 కోట్లు అప్పు చేసినప్పటికీ తమకు వేతనాలు ఇవ్వకపోవడం శోచనీయమని ఉపాధ్యాయులు అంటున్నారు. వేతనాలు అందకపోవడంతో పిల్లల ఫీజులు, ఈఎంఐ చెల్లింపులకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఒక నెల మాత్రమే కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, ఆ తర్వాత నుంచి ఏ నెలలో కూడా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లు అందరికీ ఒకటో తేదీన వేతనాలు ఇవ్వలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు.

క్రీడలతో ఉల్లాసం...ఉత్సాహం

ఆక్టోపస్ అదనపు డీజీ ఆర్కే మీనా

సాక్షి, అమరావతి: క్రీడలు ఐకమత్యానికి సూచికని ఆక్టోపస్ అదనపు డీజీ ఆర్కే మీనా అన్నారు. మంగళగిరిలోని ఆరో బెటాలియన్ మైదానంలో నిర్వహించిన ఆక్టోపస్ వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం ముగిశాయి. 10 ట్రాక్ ఈవెంట్లతో సహా మొత్తం 20 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ముగింపు సమావేశంలో అదనపు డీజీ ఆర్కే మీనా మాట్లాడుతూ.. పోలీసులు దేహదారుఢ్యానికి, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు అత్యంత ఆవశ్యకమన్నారు. విజేతలు, క్రీడాకారులు, నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆక్టోపస్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ సుమిత్‌సునీల్ గరుడ, ఆరో బెటాలియన్ కమాండెంట్ కె.నగేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి 'పాలి టెక్‌ఫెస్ట్'

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థులు సాంకేతిక ప్రాజెక్టుల నైపుణ్య ప్రదర్శనకు ఈనెల 6 నుంచి 8 వరకు రాష్ట్రస్థాయి 'పాలి టెక్‌ఫెస్ట్–2024–25'ను నిర్వహిస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మూడురోజుల పాటు ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అగ్రిసెట్ ద్వారా స్పోర్ట్స్ కోటా, మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో అగ్రిసెట్ 2024 ర్యాంకు ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాలకు మిగిలిన సీట్ల భర్తీకి, స్పోర్ట్స్ కోటాలో సీట్ల భర్తీకి ఫైనల్ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి లాం ఫాంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆల్ ఇండియా కోటాలో సీట్లు పొందిన వారికి ఫ్రీ ఎగ్జిట్

సాక్షి, అమరావతి: రాష్ట్ర కౌన్సెలింగ్‌లో ఇప్పటికే వైద్య విద్య పీజీ ప్రవేశాలు పొందిన వారు ఆల్ ఇండియా కోటా మూడో దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందినట్లైతే ఫ్రీ ఎగ్జిట్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫ్రీ ఎగ్జిట్ ఎంచుకున్న అభ్యర్థుల సీట్లను రాష్ట్రస్థాయి మూడో దశ కౌన్సెలింగ్‌లో సీట్ మ్యాట్రిక్స్‌లో ప్రదర్శించి, భర్తీ చేపడతామన్నారు.

గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

మంత్రి డీబీవీ స్వామి



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి

మహారాణిపేట: గురుకులాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విశాఖలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని వసతి గృహాల్లో పేరెంట్స్ వెయిటింగ్ హాలు, లైబ్రరీలు, వాషింగ్ మెషీన్లు, సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆరోగ్యశ్రీ ప్రైవేటుపరంలో దోచుకునే కుట్ర

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజం
- ఆరోగ్యశ్రీని ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించడం సరికాదు
- లోకేశ్ సన్నిహితుల బీమా కంపెనీకి కాంట్రాక్ట్ కట్టబెట్టే యత్నం
- తీరు మార్చుకోకపోతే వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం



సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీని తమ స్వార్థం కోసం ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆక్షేపించారు. లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన, ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం ప్రారంభించిన 10,300 విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను ఇప్పటికే నిర్వీర్యం చేశారు. 17 మెడికల్ కాలేజీలను జగన్ హయాంలో తీసుకువస్తే, వాటిలోని సీట్లనూ ప్రైవేటుపరం చేసేలా అడుగులేస్తున్నారు. మంత్రి లోకేశ్ తన సొంత మనుషులతో బీమా కంపెనీ పెట్టించి, వారికే ఈ కాంట్రాక్ట్ ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నారని, ఇది దోచుకునే కుట్ర' అని ఆయన ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. గోపిరెడ్డి పలు ప్రశ్నలను సంధించారు.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి

- ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగిస్తే ఈ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు లభిస్తాయా?
- బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించినా, చికిత్స వ్యయంలో కేవలం రూ.2.5 లక్షల వరకే ఆ సంస్థ నుంచి చెల్లింపులు జరుగుతాయనడం వాస్తవం కాదా?
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనుమతించిన 3,257 ప్రొసీజర్లకు వైద్యం అందిస్తారా?
- కూటమి ప్రభుత్వం బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించి చేతులు దులుపుకుంటే, మొత్తం ప్రొసీజర్లను ఆ బీమా కంపెనీ కవర్ చేస్తుందా?
- ఖరీదైన వైద్యం మాటేంటి? కాంక్లియార్ ఇంప్లాంటేషన్‌కు రూ.6.5 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు ఖర్చవుతుంది. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుంది. ఆ మొత్తాలను బీమా కంపెనీలు చెల్లిస్తాయా?
- అందుకు బీమా కంపెనీ ఒప్పుకోకపోతే రోగుల పరిస్థితి ఏమిటి?
- 60 ఏళ్లు దాటిన వారికి, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి.. బీమా కంపెనీలు, బీమా చెల్లింపుల్లో పలు ఆంక్షలు విధిస్తుండటం వాస్తవం కాదా? ప్రీమియం చెల్లించాక వెయిటింగ్ పీరియడ్‌లో రోగాలొస్తే పరిస్థితేంటి? హిప్ రీప్లేస్‌మెంట్ ఆరోగ్యశ్రీలో ఉంది. ఏ ఇబ్బంది లేకుండా ఆ సర్జరీ చేసేవాళ్లు. మరి ఇదే చికిత్సకు ప్రైవేటు బీమా కంపెనీలు కనీసం ఏడాది పాటు వెయిటింగ్ పీరియడ్ తర్వాతే అంగీకరిస్తాయనడం నిజం కాదా?
- బీమా కంపెనీలు ఏదో ఒక విధంగా క్లెయిమ్స్ తగ్గించుకోవాలనే చూస్తాయి. అందుకే చిన్న చిన్న అంశాలనూ సీరియస్‌గా తీసుకుని క్లెయిమ్స్ నిరాకరిస్తుంటాయి. వీటన్నింటి నేపథ్యంలో ఇప్పుడు ఆరోగ్యశ్రీలో అందుతున్నట్లు ఇకపై కూడా సేవలందుతాయా? అందుకు బీమా కంపెనీలు ఒప్పుకుంటాయా?
- ఆరోగ్యశ్రీని ప్రైవేటు బీమా సంస్థకు అప్పగిస్తే, ఆస్పత్రులన్నీ ఆ కంపెనీ చుట్టూ తిరిగి, క్లెయిమ్స్ పొందాల్సి వస్తుంది. నిబంధనలకు కట్టుబడి ఎన్ని ఆస్పత్రులు, ఎన్ని క్లెయిమ్స్ తెచ్చుకోగలవు? కోవిడ్ లాంటిదొస్తే పరిస్థితి ఏమిటి?

రూ.2.50 లక్షల వరకు 'ఆరోగ్య బీమా'

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి..
- ఎన్నికల హామీ మేరకు అన్ని కుటుంబాలకు వర్తింపజేయలేం
- వైద్య శాఖ మంత్రి సత్యకుమార్



సాక్షి, అమరావతి: ఆరోగ్య బీమా పథకాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రూ.2.50 లక్షల వరకు వైద్య సేవలను బీమా పరిధిలోకి తెస్తామని చెప్పారు. ఇందు కోసం ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.2,500 చొప్పున ప్రీమియం చెల్లిస్తామన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలోని 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే ఆరోగ్య బీమా వర్తిస్తుందని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు బీమా వర్తింపజేస్తే ప్రైవేటు ఆస్పత్రులు మనుగడ సాగించడం కష్టమన్నారు. మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో విఫలమైన బీమా విధానాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయాలనుకుంటున్నారని మీడియా ప్రశ్నించగా.. ఆయా రాష్ట్రాల్లో నిర్వహణ లోపాల వల్లే బీమా విధానం విఫలమైందని మంత్రి చెప్పారు. ఆ సమస్యలు ఇక్కడ తలెత్తకుండా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు. రూ.2.50 లక్షల పైబడిన చికిత్సలను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా అందిస్తామన్నారు. ఆరోగ్య ఆసరా పథకాన్ని కొనసాగించాలో, లేదో పరిశీలిస్తున్నామని చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ముందుకు తీసుకెళ్లడానికి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌ను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం కోసం నేషనల్ మెడికల్ కమిషన్‌కు దరఖాస్తులు చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. చైనాలో కొత్త వైరస్ గురించి వార్తలు వస్తున్నాయని.. అయితే అధికారికంగా ధ్రువీకరణ కాలేదన్నారు.

జేసీ.. నోరు అదుపులో పెట్టుకో!

టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి బీజేపీ నాయకులపై చేసిన వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఆయనకు వైఎస్ జగన్‌పై అంత ప్రేమ ఉంటే.. ఆయన పంచనే చేరాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తన బస్సులు తగలబెట్టిందని జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు.

వచ్చే వారంలో పింఛన్ లబ్ధిదారులకు స్క్రీనింగ్..

అనర్హులైన పింఛన్ లబ్ధిదారులను ఏరివేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పింఛన్ లబ్ధిదారులకు స్క్రీనింగ్ చేపట్టడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. వచ్చే వారంలో వైద్యులు బృందాలుగా ఏర్పడి.. కదల్లేని స్థితిలో ఉన్న పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్క్రీనింగ్ చేస్తారని తెలిపారు. ప్రతి బృందంలో ఆర్థో, జనరల్ మెడిసిన్, పీహెచ్‌సీ వైద్యుడు ఉంటారని వివరించారు.

మెడికల్ కౌన్సెలింగ్ వల్ల ఆత్మహత్య చేసుకునే పరిస్థితి..

మంత్రి ఎదుట వైద్య విద్యార్థి తండ్రి, టీడీపీ కార్యకర్త ఆవేదన



రఘుబాబు

గుంటూరు మెడికల్ : పీజీ వైద్య విద్య కౌన్సెలింగ్ ప్రక్రియను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని, దీని ద్వారా వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని పీజీ వైద్య విద్యార్థిని తండ్రి, గుంటూరు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రఘుబాబు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాలకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎదుట ఆయన ఈ విధంగా మొరపెట్టుకున్నారు. మొదటి కౌన్సెలింగ్ సమయంలో ఒక ఆర్డర్, రెండో కౌన్సెలింగ్ సమయంలో మరో ఆర్డర్ ఇచ్చారని, ఇప్పుడు మూడో కౌన్సెలింగ్‌కు యూనివర్సిటీ అధికారులు రంగం సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆలిండియా కౌన్సెలింగ్ ఇంకా ప్రారంభం కాలేదని, అది ప్రారంభమయ్యాకే మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఫ్రీ ఎగ్జిట్‌కు శుక్రవారం నుంచి సోమవారం ఉదయం వరకు అవకాశం ఇచ్చారని, సోమవారం క్లోజ్ చేయడం వల్ల ఆలిండియా కోటాలో ఏపీ వైద్య విద్యార్థులు పీజీ సీట్లు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ పీజీ కోటా వారికి మేలు జరిగేలా హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహిస్తోందని ఆరోపించారు. మొదటి కౌన్సెలింగ్ అయ్యాక, కోర్టు తీర్పు వల్ల జీవో 56ను కొట్టేశారని, దీని ద్వారా వైద్య విద్యార్థుల ఫీజులు పెరిగాయన్నారు. కోర్టు తీర్పు కారణంగా పీజీ వైద్య విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు.

కోర్టు తీర్పు వల్ల గందరగోళం

అనంతరం పీజీ కౌన్సెలింగ్ ప్రక్రియపై మీడియా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించగా.. కోర్టు తీర్పు వల్ల ప్రస్తుతం కొంత గందరగోళం నెలకొందని తెలిపారు. అన్ని ఆలోచించి విద్యార్థులకు ఏది లాభమో అదే చేస్తామని తెలిపారు. స్పెషలిస్టులు 75 శాతం, ఇతర వైద్యులు, వైద్య సిబ్బందిలో 80 శాతం కొరత ఉందని, ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామని తెలిపారు.

ఆ అందం.. వర్ణించతరమా!



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, కేశనపల్లిలో శుక్రవారం రాష్ట్రస్థాయిలో అధికంగా పాల ఉత్పత్తి ఇచ్చే ఆవులు, గిత్తల అందాల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను గో సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేశారు. దాతల సాయంతో గ్రామానికి చెందిన అడబాల లక్ష్మీనారాయణ (నాని) ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కోస్తాజిల్లాల నుంచి గిర్, పుంగనూరు, ఒంగోలు ఆవులు, గిత్తలు ప్రదర్శనకు తరలి వచ్చాయి. వీటిలో ఉత్తమంగా ఎంపిక చేసిన ఆవులు, గిత్తల రైతులకు ప్రోత్సాహక నగదు, మెమెంటో అందజేయనున్నారు.

- మలికిపురం

10 అడుగుల బెండ చెట్టు

సాధారణంగా బెండ చెట్టు మూడు, లేదా నాలుగు అడుగులు ఉంటుంది. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం వేపగుంట దళితవాడకు చెందిన మోహన్ గాంధీ అనే వ్యక్తి తన ఇంటి పెరటిలో నాటిన చెట్టు ఏకంగా 10 అడుగుల వరకు పెరిగింది. ఆన్‌లైన్‌లో చూసి ఈ చెట్టును తెప్పించుకున్నట్టు ఆయన తెలిపారు. దీనిపై విజయపురం మండల వ్యవసాయాధికారి రజనీకుమారిని వివరాలు కోరగా ఆ చెట్టు ఈ ప్రాంతంలో 12 అడుగుల వరకు పెరుగుతుందని, విత్తనం నాటిన ఏడాదికి కాయలు కాస్తుందని తెలిపారు. ఇలా మూడేళ్ల వరకు కాయలు కాస్తుందని చెప్పారు.



- వడమాలపేట(విజయపురం)

సాంకేతికతపై అవగాహనకే ఒప్పందం

ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ వాహనాన్ని పరిశీలించిన మంత్రి లోకేశ్



మంగళగిరి (తాడేపల్లిరూరల్): అధునాతన సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇన్ఫోసిస్‌తో ఒప్పందం చేసుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో శుక్రవారం ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ వాహనాన్ని ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో విద్యార్థులకు భవిష్యత్ సాంకేతికతలను వివరించే లక్ష్యంతో ఈ నమూనా వాహనాన్ని రూపొందించామని, మంగళగిరిలోని పాఠశాలలకు వెళ్లి పిల్లల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని స్కూళ్లకు ఇటువంటి వాహనాలను పంపిస్తామని లోకేశ్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం ၊ 4 ၊ జనవరి ၊ 2025



సీఎస్‌ను కలిసిన కలెక్టర్, జేసీ

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను శుక్రవారం కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు.



అర్ధరాత్రి కలకలం

పార్కింగ్ చేసిన బైక్‌లపై పెట్రోల్ పోసి దహనం చేసిన ఘటన విజయవాడ విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలో గురువారం అర్ధరాత్రి కలకలం సృష్టించింది. -IIలో▸



నాటికలు.. జనరంజకం..

అప్పాజోస్యుల, విష్ణుభొట్ల, కందాళం, జామవా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 32వ వార్షిక కథా నాటిక పోటీలు జనరంజకంగా సాగుతున్నాయి. సాహితీ సమాలోచన జరిగింది. -IIలో▸

పేదల స్థలాలపై 'పచ్చ' గద్దలు

- 100 ఎకరాల భూమి కొట్టేసేందుకు టీడీపీ ప్రజాప్రతినిధి యత్నం!
- ఆ భూమి చేతికొచ్చాక మళ్లీ చేతులు మారేలా ప్రైవేట్ వ్యక్తులతో డీల్
- మల్లవల్లిలో భూముల ధర ఎకరం రూ.కోటికి పైనే..
- ప్రభుత్వ ధర రూ.18 లక్షలు చెల్లించి దండుకునేందుకు సన్నాహాలు
- పేదలకు మరోచోట భూమి కేటాయిస్తామని మభ్యపెట్టే యత్నం



మల్లవల్లి భూమిలో ఏర్పాటుచేసిన జగనన్న లేఅవుట్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఇళ్ల స్థలాలు, సామాజిక అవసరాలకు కేటాయించిన భూమిని 'పచ్చ' గద్దలు తన్నుకుపోనున్నాయి. సుమారు రూ.100 కోట్ల విలువచేసే ఈ భూమిని కారుచౌకగా కొట్టేసేందుకు భారీ స్కెచ్చే వేశారు. పారిశ్రామిక అవసరాల పేరిట ఈ భూమిని లాక్కుని అస్మదీయులకు అప్పగించడానికి తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారు. ఈ మొత్తం బాగోతంలో టీడీపీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఒకరు ప్రైవేట్ వ్యక్తులతో ఇప్పటికే డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఈ భూమికి బదులుగా గ్రామస్తులకు మరోచోట ప్రత్యామ్నాయ భూమి కేటాయిస్తామని అధికారుల ద్వారా మభ్యపెడుతున్నారు. ఈ భూబాగోతం కథాకమామిషు ఏమిటంటే..

అసలు సంగతి ఇదీ..

మల్లవల్లి పారిశ్రామికవాడ భూసేకరణ సమయంలో జారీ చేసిన జీఓ–456 ప్రకారం.. మల్లవల్లి రీసర్వే నంబర్ 11లోని 1,460 ఎకరాల్లో 1,360 ఎకరాలను ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు, మిగిలిన 100 ఎకరాల భూమిని నిరుపేదల ఇళ్లస్థలాలు, సామాజిక అవసరాల నిమిత్తం కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జగనన్న కాలనీ కింద కొంతమేర లేఅవుట్ వేసి స్థలాలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లుచేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇప్పుడు టీడీపీ కూటమి సర్కారు రావడంతో ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు ప్లేటు ఫిరాయించారు. గ్రామానికి ఇస్తామన్న భూమి ఇది కాదు, అది మరోచోట ఉందంటూ కొత్త పాట పాడుతున్నారు. గ్రామానికి దూరంగా.. నిరుపయోగంగా.. లోయలు తలపించేలా ఉన్న భూమిని గ్రామస్తులకు అంటగట్టి మల్లవల్లిలో ఖరీదైన 100 ఎకరాల భూమి హస్తగతం చేసుకోవడానికి చకచకా పావులు కదుపుతున్నారు. ఈ విషయంలో గ్రామస్తులు ఇప్పటికే పలుమార్లు అధికారులకు అభ్యంతరం చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం పోలీసు బలగాల సాయంతో భూనిర్వాసితులను గృహ నిర్బంధం చేసి రెవెన్యూ అధికారులు 1,360 ఎకరాలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు.

కారుచౌకగా కట్టబెట్టడానికి యత్నం..

నిజానికి.. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడ చుట్టుపక్కల ఎకరం విలువ రూ.కోటి పైమాటే. ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.89 లక్షలుగా ఉంది. మల్లవల్లి పారిశ్రామికవాడలో మరిన్ని పరిశ్రమలను ఆకర్షించే పేరుతో ఈ ధరను తగ్గిస్తామని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇక్కడ ఎకరా రూ.18 లక్షలకే విక్రయించేందుకు త్వరలోనే జీఓ విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సామాజిక అవసరాలకు కేటాయించిన 100 ఎకరాల భూమిని అస్మదీయులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధంచేస్తున్నారు. అంటే.. రూ.100 కోట్లకు పైగా విలువచేసే భూమిని ఎకరం కేవలం రూ.18 లక్షలకే కొట్టేసేందుకు స్కెచ్ వేశారు.



మల్లివల్లిలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమి

పేదల భూమి లాక్కోవడం తగదు



మల్లవల్లి పారిశ్రామికవాడ ఏర్పాటు తరుణంలోనే పేదల ఇళ్ల స్థలాలు, సామాజిక అవసరాల నిమిత్తం 100 ఎకరాల భూమి కేటాయించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న ఆ భూమిలో ఇప్పటికే ఇళ్ల స్థలాల లే అవుట్ కూడా సిద్ధం చేశారు. దాదాపు రెండు వేల మంది నిరుపేదలకు ఇవ్వడానికి స్థలాలు సిద్ధం చేశారు. ఈ స్థలాన్ని వదులుకునేందుకు ఒప్పుకోం. గ్రామానికి ఆనుకుని ఉన్న ఈ భూమిలోనే పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

– వేముల రంగారావు, మల్లవల్లి

నివాసయోగ్యంగా లేని భూమి ఇస్తామంటే ఎలా?



ఎన్నో ఏళ్లుగా గూడులేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తారని ఎదురు చూస్తున్నాం. ఈ తరుణంలో ప్రభుత్వం ఈ భూమి తీసుకుని మరెక్కడో నివాసయోగ్యంగా లేనిచోట ఇళ్ల స్థలాలు ఇస్తామంటే ఎట్లా? కొండల్లో, గుట్టల్లో కనీసం నడకదారి కూడా లేని ప్రాంతంలో ఇళ్ల స్థలాలకు ప్రత్యామ్నాయ భూమి అప్పగించడం కుదరదు. గతంలో కేటాయించిన భూమిని వదులుకోం.

– తోట సాంబశివరావు మల్లవల్లి

పెద్ద మొత్తంలోనే ముడుపులు..

టీడీపీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి డైరెక్షన్‌లోనే రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు సర్వే పనులు చేస్తున్నారు. గ్రామస్తులకు మరోచోట ప్రత్యామ్నాయం చూపిస్తామని నమ్మించి, సామాజిక అవసరాలకు కేటాయించిన భూమిని ప్రభుత్వ పెద్దలకు అప్పగించి, ప్రసన్నం చేసుకోవడానికి రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులూ తహతహలాడుతున్నారు. ఈ వ్యవహారంలో గ్రామస్తులను మభ్యపెట్టి, కారుచౌకగా పారిశ్రామికవాడలో భూమిని తిరిగి ఏపీఐఐసీకి అప్పగించి అక్కడ నుంచి సదరు ప్రజాప్రతినిధి దక్కించుకుని ఆ తర్వాత ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా డీల్ కుదిరింది. ఇందులో భాగంగా.. ఆ ప్రైవేట్ వ్యక్తులు సదరు ప్రజాప్రతినిధికి పెద్ద మొత్తంలోనే ముట్టజెప్పినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.


న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మచిలీపట్నంకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. మచిలీపట్నంకు చెందిన డొక్కు కృష్ణ డిటెక్టివ్, భారతీదేవి దంపతులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్‌ను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, అధికారులు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

నేటి నుంచి నవదిన ప్రార్థనలు



ఉంగుటూరు: ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 4నుంచి నవదిన ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహోత్సవాలకు భక్తులను ఆధ్యాత్మికంగా సిద్ధం చేయడానికి సాయంత్రం 5.30 గంటల నుంచి జపమాల, దివ్యబలిపూజలు జరుగుతాయని చెప్పారు. విజయవాడ మేత్రాసనం, వికార్ ఫోరిన్ గన్నవరం విచారణ ఫాదర్ పసల థామస్ మహోత్సవాల పతాకవిష్కరణ చేసిన తర్వాత నవదిన ప్రార్థనలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

కొండలమ్మకు రూ.22.16 లక్షల ఆదాయం



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు వేసిన కానుకలను తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాసరావు సమక్షంలో శుక్రవారం లెక్కించారు. 57రోజులకు రూ.22,16,117 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు చేయూత



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి యువ పారిశ్రామిక వేత్తలకు చేయూత నివ్వాలని సంకల్పించినట్లు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యాన లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రోటా ఫెయిర్‌ను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్స్‌లో పలు సంస్థలు ప్రదర్శించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపార లావాదేవీలకు సంబంధించిన కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్‌బాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఫెయిర్‌లో పది వేల మంది సందర్శకులు సందర్శించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఫెయిర్ ద్వారా వచ్చే నగదును పోలియో నిర్మూలనకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రోటా ఫెయిర్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్లు చిన్నం మధుబాబు, అమూల్య శ్రీనివాస్, క్యూనిక్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఆనందరెడ్డి, క్లబ్ కార్యదర్శి బత్తుల ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా శాఖ 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సంఘ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి.నాగార్జున, ఎం.రాజుబాబు, జి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస్, ఎం.గోపాలకృష్ణ, బీవీ రమణ, కె.శివలీల, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌కు 'జీఎం ఎఫిషియెన్సీ షీల్డ్'



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని కలారంగ్‌లో జరిగిన '69వ జోనల్ రైల్వే వీర్ అవార్డ్ – విశిష్ట రైలు సేవా పురస్కార్ 2024'లో అన్ని విభాగాల్లోను అత్యుత్తమ ప్రతిభ కనపర్చినందుకు విజయవాడ, సికింద్రాబాద్ డివిజన్లు సంయుక్తంగా ఎంపికయ్యాయి. ఈ మేరకు శుక్రవారం విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా జీఎం ఎఫిషియెన్సీ షీల్డ్‌ను అందుకున్నారు. వివిధ విభాగాల్లో డివిజన్ మొత్తం 36 అవార్డులు అందుకోగా అందులో 12 ఎఫిషియెన్సీ షీల్డ్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా డివిజన్‌లో అత్యుత్తంగా పనిచేసిన అన్ని విభాగాల అధికారులను డీఆర్ఎం అభినందించారు.

కవిత్వం.. విశ్వభాష



పుస్తక మహోత్సవంలో స్టాల్స్‌ను సందర్శిస్తున్న ప్రజలు

దక్షిణ–పశ్చిమ కవి సమ్మేళనంలో కవులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కవిత్వం ఒక విశ్వభాష అని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన దక్షిణ–పశ్చిమ కవి సమ్మేళనాన్ని శుక్రవారం ప్రధాన వేదికపై నిర్వహించారు. ప్రముఖ కవి పాపినేని శివశంకర్ సభకు అధ్యక్షత వహించారు. చదువుతూ చదువుతూ ఒక్కసారి నేను ఉలిక్కిపడతాను.. అంటూ తన కవితను వినిపించారు. కవిత్వం ఒక మెరుపులా, పిడుగులా హృదయాలలోకి ప్రవేశించి మనల్ని మార్చివేస్తుందన్నారు. సామాజిక చైతన్యానికి కవిత్వం గొప్ప సాధనమన్నారు. దేశాల ఎల్లలకు అతీతంగా ప్రజలను ఏకం చేసే శక్తి కవిత్వానికి ఉందని చెప్పారు. అంతర్ముఖమవుతూనే బహిర్గతం కావడం, విశాల విశ్వ అవధులను మనసులో కనుగొనడం కేవలం కవిత్వంతో సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి, కవి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ కవిత్వం అనేది అద్భుతమైన భావవ్యక్తీకరణ విధానమన్నారు. కృత్రిమ మేధ అభివృద్ధి చెందినా నిజమైన కవిత్వాన్ని సృష్టించలేదన్నారు. సమాజంలో కవిత్వాన్ని ఆస్వాదించే అభిరుచి కనుమరుగు అవుతుండటం దురదృష్టకరమన్నారు. గుజరాతీ కవయిత్రి ఈషా దాదావాలా, మళయాళీ కవి, పీఎస్ గోపీకృష్ణన్, మరాఠీ కవయిత్రి స్వాతి షిండే పవార్, కన్నడ కవి సుమిత్ మైత్రి, కొంకణీ కవి ప్రకాష్ డి నాయక్, సింధీ కవి హరీష్ కరం చందానీ, తమిళ కవి షణ్ముగం విమల్‌కుమార్ తమ కవిత్వాలతో స్థానిక సమాజాల్లోని మధ్యతరగతి, దిగువ తరగతి వ్యక్తుల అంతరంగాలను ప్రతిబింబించే పలు కవితలను వినిపించి అలరించారు. పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సాహిత్య అకాడమీ సభ్యులు ఎమెస్కో విజయకుమార్ సభకు స్వాగతం పలుకుతూ, భాషలు ఏవైనా కవుల చేతుల్లో అవి మానవ హృదయాలను స్పందింపజేసి, సౌకుమార్యం చేయగలవన్నారు. పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.



దక్షిణ–పశ్చిమ కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా

మిచాంగ్ పరిహారానికి నిరీక్షణ

- 2023లో తుపానుతో అన్నదాతలకు అపార నష్టం
- 92.318 మందికి రూ 99.90 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- వివిధ కారణాలతో 12,955 మందికి అందని పరిహారం
- ఎన్నికల కోడ్ అమలుతో నిలిపివేత
- అధికారంలోకి వచ్చిన తర్వాత 'కూటమి' నిర్లక్ష్యం
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ



కంకిపాడులో పనల మీద తడిసిన వరి పంట (ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మిచాంగ్ తుపాను పరిహారానికి రైతులు నిరీక్షిస్తున్నారు. తుపాను చేసిన గాయం నుంచి నేటికీ రైతులు కోలుకోలేకపోతున్నారు. వివిధ సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన పంట నష్టపరిహారం విడుదలైతే సాగుకు ఊతమవుతుందని అన్నదాతలు భావిస్తున్నారు. నిత్యం పరిహారం కోసం అధికారుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఎంత కష్టం...ఎంత నష్టం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరులో ఖరీఫ్ సమయంలో మిచాంగ్ తుపాను విరుచుకుపడింది. పనల మీద, కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలతో పాటుగా, మిల్లులకు తరలించే ధాన్యం సైతం తడిసిపోయింది. రైతుల కష్టాలపై స్పందించిన నాటి ప్రభుత్వం నిబంధనలు పూర్తిగా సడలించి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంది. అధికారిక లెక్కల ప్రకారం.. కృష్ణా జిల్లాలో 92,318 మంది రైతులు 58,835.56 హెక్టార్లలో పంటను నష్టపోయారు. అత్యధికంగా వరి పంట 57,777.03 హెక్టార్లలో 90,741 మంది నష్టపోయారు. మొక్కజొన్న 264 మంది రైతులు 167.70 హెక్టార్లలోనూ, మినుము 89 మంది రైతులు 58.04 హెక్టార్లల్లోనూ, వేరుశనగ పంటను 1066 మంది రైతులు 681.29 హెక్టార్లలోనూ, పత్తి 158 మంది రైతులు 151.50 హెక్టార్లలో నష్టపోయారు. 92,318 మంది 58,835.56 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లటంతో నాటి ప్రభుత్వం రూ.99.90 కోట్లు కేటాయించింది. ఏ సీజన్‌కు అదే సీజన్‌లో పరిహారం అందితే సాగుకు ఆటంకాలు ఎదురుకాకుండా రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతారనేది ప్రభుత్వ ఉద్దేశం. పంట నష్టపరిహారం విడుదల చేసి రైతులకు అండగా నిలిచింది.

శిక్ష రైతులకా..

రైతుల బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాల నమోదు అంతా అధికారులే చూస్తారు. అలాంటిది వారి వద్ద తప్పు జరిగింది. రైతులు శిక్ష అనుభవిస్తున్నారు. ఏడాది గడిచినా నేటికీ పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించాలి. మిచాంగ్ పరిహారాన్ని బాధిత రైతులకు అందించడానికి చర్యలు తీసుకోవాలి. రైతులను నిర్లక్ష్యం చేయటం సరికాదు.

–మాగంటి హరిబాబు, కౌలురైతుసంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సాంకేతిక సమస్యలతో..

రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇబ్బందులు, ఆధార్ లింకేజ్, బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర సాంకేతిక పరమైన అంశాల్లో లోటుపాట్లు నెలకొనడంతో జిల్లాలో 12,955 మంది రైతులకు పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రూ 14.68 కోట్లు పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీగా) అందాల్సి ఉంది. సమస్యను గుర్తించిన అధికార యంత్రాంగం రైతుల సమాచారాన్ని సేకరించి జాబితాను ఉన్నతాధికారులకు నివేదించింది. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులకు చర్యలు తీసుకునే క్రమంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో పరిహారం విడుదల నిలిచింది.

స్పందన లేని 'కూటమి'

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం అందజేతలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాగును సంబరంగా చేస్తామని చెప్పిన మాటలను కార్యరూపంలో లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. పరిహారం ఎప్పుడు అందుతుందో అని ఎదురుచూడటం అన్నదాతల వంతవుతోంది. నిత్యం అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఏ సీజన్‌లో రైతుకు కష్టం వస్తే అదే సీజన్‌లో పరిహారం అందించిన వైఎస్సార్ సీపీ సర్కారుకు, సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి పరిహారం అందజేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి సర్కారుకు వ్యత్యాసం ఇదేనని చెబుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయ అధికారులను సంప్రదిస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, బడ్జెట్ కేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నామని, త్వరలోనే విడుదలవుతాయని వివరించారు.

తల్లికి వందనం పేరుతో మోసం చేసిన కూటమి

ఏఐఎస్ఎఫ్



లెనిన్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆందోళన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో 84 లక్షల మంది తల్లులను మోసం చేసిందని ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్ జి అన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద శుక్రవారం తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లికి వందనం అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇంట్లో ఎంత మంది చదువుకొనే పిల్లలు ఉంటే అంతమందికి పథకం కింద లబ్ధి చేకూరుస్తామని నమ్మబలికిందన్నారు. కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం ప్రకటించడాన్ని వారు తప్పుబట్టారు. ఈ ఏడాది నుంచి పథకం అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.శివకుమార్, సాధిక్ బాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సీఎం చంద్రబాబు సచివాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. చరిత్రకారులు సయ్యద్ నసీర్ అహ్మద్ సహకారంతో క్యాలెండర్‌ను రూపొందించామని సమితి అధ్యక్షుడు ఫరూక్ షిబ్లీ చెప్పారు. నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



'టెర్మినల్' పనులు వేగవంతం చేయండి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

విమానాశ్రయం (గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన నూతన టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించారు. టెర్మినల్ నిర్మాణ పనుల పురోగతిని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, సివిల్ విభాగం అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. సుమారు రూ. 550 కోట్ల వ్యయంతో నూతన టెర్మినల్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్‌లోపు నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రయాణికులకు టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. దీనికోసం ఎయిర్‌పోర్ట్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. పలువురు ఎయిర్‌పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న రామ్మోహన్‌నాయుడు

క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతులతో 'కొత్త' వేడుకలు



విజయవాడస్పోర్ట్స్: విభిన్న ప్రతిభావంతుల చిన్నారులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. నగరంలోని అన్నమ్మ స్కూల్ ఫర్ హియరింగ్ అండ్ ఫిజికల్లీ హ్యాండిక్యాప్డ్, బేబీ కేర్ సెంటర్ లోని చిన్నారులు కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కమిషనర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరిపారు. అనంతరం స్కూల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక డిమాండ్



కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రయత్నాలను విరమించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్టును రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ ఎం.వి.ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మార్చి 31లోపు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇవి ప్రీ పెయిడ్ మీటర్లని, వీటి వల్ల విద్యుత్ నష్టాలు తగ్గుతాయని చెప్పటం వినియోగదారులను మభ్యపెట్టడం కోసమే తప్ప నిజం కాదన్నారు. విద్యుత్ సరఫరా కోసం అండర్ గ్రౌండ్ కేబుల్స్ వేస్తేనే పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అని, అది పెద్ద కుట్ర అన్నారు. ఈ కుట్రలో కేంద్రం, రాష్ట్రం, డిస్కంలు భాగస్వామ్యం అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే 2025–26కు డిస్కంలు సమర్పించిన ప్రతిపాదనలలో టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని ప్రతిపాదించాయని, దీని ప్రకారం ఉదయం 6 నుంచి 10గంటల వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అధిక చార్జీలు వసూలు చేస్తారన్నారు. ఈ టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్నే విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక వ్యతిరేకిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాలను ఆపాలని ఇప్పటికే విద్యుత్ శాఖ మంత్రికి లేఖ రాశామన్నారు. ఇళ్లల్లో మీటర్లు పెట్టేందుకు ఎవరైనా వస్తే ప్రజానీకం ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుందర రామరాజు, యూవీ కృష్ణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ..

అధికారుల ధిక్కారంపై ప్రభుత్వం చర్యలు

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లా పీడీలపై సస్పెన్షన్ వేటు
- భవనంపై పట్టు కోసం ఇరువురూ పోరాటం
- మంత్రులు, ఉన్నతాధికారులు చెప్పినా వినకపోవడంతో చర్యలు

పెనమలూరు: కానూరులో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారి కార్యాలయం భవనంపై వివాదం చిలికి చిలికి చివరకు ఇద్దరు పీడీల సస్పెన్షన్‌కు దారి తీయడం తీవ్ర చర్చనీయాంశమైంది. కానూరు ఐసీడీఎస్ భవనంలో కృష్ణా జిల్లా పీడీ, ఎన్టీఆర్ జిల్లా పీడీలు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే కొద్ది కాలంగా భవనం కోసం ఇరు జిల్లాల పీడీలు ఆధిపత్య పోరు సాగిస్తున్నారు. ఈ వివాదం ముదరటంతో అధికారులు ఇంటికి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.



కానూరులో పీడీ కార్యాలయం

ఇదీ విషయం..

ఉమ్మడి కృష్ణా జిల్లా ఉన్న కాలం అంటే 2016లో కానూరు వద్ద కామన్‌సైట్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారి కార్యాలయం భవనం ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నాబార్డు నిధులు రూ. 1.03 కోట్లు కేటాయించింది. అప్పట్లో కానూరు పంచాయతీగా ఉండటంతో తీర్మానం చేసి అత్యంత విలువైప కామన్‌సైట్ ఈ శాఖకు అప్పగించారు. రెండేళ్ల గడిచిన తరువాత భవన నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఉమ్మడి కృష్ణా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారి కార్యాలయంతో పాటు బాలల సంరక్షణ, గృహహింస నుంచి మహిళల రక్షణ, వాత్సల్య పథకం వంటి వాటికి కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే 2022లో జిల్లా విడిపోయిన తరువాత ఆ భవనం కృష్ణా జిల్లా పరిధిలోకి వెళ్లడంతో వివాదం మొదలయింది.

హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలి..

ఎన్టీఆర్ జిల్లా సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయాలు విజయవాడ అర్బన్, మైలవరం, నందిగామ, తిరువూరు, చిల్లకల్లులో ఉన్నాయి. కృష్ణా జిల్లాలో కంకిపాడు, గన్నవరం, గుడివాడ, అవనిగడ్డ, మొవ్వ, బంటుమిల్లిలో ఉన్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో మొత్తం 7 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కానూరులో పీడీ కార్యాలయంలో అధికారులకు సౌకర్యంగా ఉన్నా రెండు జిల్లాల సీడీపీవో కార్యాలయాలకు అందుబాటులో లేదు. పైగా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోనే పీడీ కార్యాలయాలు ఉండాలన్న నిబంధన ఉంది. ఇక్కడ ఏ జిల్లా సమావేశాలు జరిగినా సిబ్బంది దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు తరలివచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఆ శాఖ మంత్రి పీడీ కార్యాలయాలు మార్చి వేరువేరుగా పెట్టాలని ఇచ్చిన ఆదేశాలు పీడీలు అమలు చేయక పోవటంతో సస్పెన్షన్ వేటు పడింది.

ఇప్పుడేమి చేస్తారు?

ఇంతకాలం ఇద్దరు పీడీలకు మధ్య జరిగిన వివాదానికి తెరదించుతారా లేదో ఆసక్తిగా ఉంది. పీడీ కార్యాలయాలు ఇక్కడి నుంచి తరలిస్తే కానూరులో భవనం ఏమి చేస్తారనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి భవనానికి ఇచ్చిన స్థలం ప్రస్తుతం తాడిగడప మునిసిపాలిటీకి చెందింది. దీని విలువ రూ. కోట్లలో ఉంది. తాడిగడప మునిసిపాలిటీకి సొంత కార్యాలయ భవనం లేనందున ప్రభుత్వం ఈ భవనం మునిసిపాలిటీకి కేటాయిస్తే బావుంటుందని పలువురు చెబుతున్నారు.

వివాదానికి కారణం ఇదే..

అన్ని వసతులతో నిర్మించిన భవనం వదులుకోవటానికి ఇష్టంలేక కృష్ణా జిల్లా పీడీ ఎస్.సువర్ణ, ఎన్టీఆర్ జిల్లా పీడీ జి.ఉమాదేవి గట్టిగా పట్టుబట్టారు. ఇద్దరు అధికారులు ఎవరి చాంబర్లు వారు ఏర్పాటు చేసుకొని వివాదాలకు తెరలేపారు. వాస్తవానికి ఈ కార్యాలయాలు కృష్ణా జిల్లాకు సంబంధించి మచిలీపట్నంలో, ఎన్టీఆర్ జిల్లాకు సబంధించి విజయవాడలో ఏర్పాటు చేయాలి. రెండు కార్యాలయాలు కానూరులో ఏర్పాటు చేయటంతో అధికారుల మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. దీనిపై అనేక పంచాయతీలు నాయకులు, అధికారుల వద్ద జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. కృష్ణా జిల్లాకు సంబంధించి క్యాంపు కార్యాలయం మచిలీపట్నంలో ఏర్పాటు చేసినా సమస్యలు తీరలేదు. దీంతో మచిలీపట్నంలోనే పీడీ కార్యాలయం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి కార్యాలయం కృష్ణా జిల్లాలో ఏర్పాటుపై ఫిర్యాదులు అందాయని సమాచారం.

మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరువూరు: ప్రజాపాలనలో పూర్తిగా విఫలమైన కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ మత రాజకీయాలతో కాలక్షేపం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం తిరువూరులో ఎన్టీఆర్ జిల్లా సీపీఎం మహాసభల ప్రారంభ సందర్భంగా ప్రదర్శన జరిపిన అనంతరం ఫ్యాక్టరీ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాపై బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోవడం విచారకరమన్నారు. సామాజిక అసమానతలను సృష్టిస్తూ దేశంలోని రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతూ గత పదిన్నరేళ్లుగా అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని శ్రీనివాసరావు ఆరోపించారు. హిందూ, ముస్లిం మతాల నడుమ చిచ్చు పెట్టే రీతిలో పాలన సాగిస్తున్న బీజేపీకి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. భారతదేశం పెట్టుబడిదారులు, బూర్జువా పార్టీల పాలనతో పూర్తిగా వెనుకబడిపోయిందని, మనకంటే చిన్నదేశాలు ఆర్థికంగా, పారిశ్రామికంగా దూసుకుపోతున్నాయన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, రాష్ట్ర, జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్, మేకల నాగేంద్రప్రసాద్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరెడ్డి, చిగురుపాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బోస్ సెంటర్, చీరాల సెంటర్, సినిమా హాల్స్ సెంటర్ల మీదుగా జరిగిన ప్రదర్శనలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనరంజకంగా సాగుతున్న నాటికలు



విజయవాడ కల్చరల్: అప్పాజోస్యుల, విష్ణుభోట్ల, కందాళం, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 32వ వార్షిక కథా నాటిక పోటీలు జనరంజకంగా సాగుతున్నాయి. బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య కళావేదికపై శుక్రవారం తొలి నాటికగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి '(అ) సత్యం' నాటికను ప్రదర్శించారు. అనంతరం సరిలేరు నీకెవ్వరు పేరుతో సాహితీవేత్త కోయి కోటేశ్వరరావుకు విశిష్ట దళిత పురస్కారం, రూ.25 వేల నగదును అందజేశారు. అప్పాజోస్యుల సత్యనారాయణ, నాటక రచయిత పాటిబండ్లమాధవరావు, సాహితీవేత్త బీరం సుందరావు, విద్యావేత్త గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం కోయికోటేశ్వరరావు సాహితీ సమాలోచన కార్యక్రమం నిర్వహించారు.

'హైందవ శంఖారావం'కు భారీ బందోబస్తు

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఈ నెల 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సభ ప్రాంగణం వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఐజీ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం భద్రత ఏర్పాట్లపై ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హైందవ శంఖారావం సందర్భంగా 3,088 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు ఆరు స్పెషల్ టీమ్‌లు, ఏపీఎస్పీ బృందాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు నాలుగు వైపులా నుంచి జనం సభకు చేరుకుంటారని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాపిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. బహిరంగ సభ జరిగే ఆదివారం రోజున ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు గన్నవరం నుంచి రామవరప్పాడు వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపులు ఇలా..

- గన్నవరం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బీబీ.గూడెం, ముస్తాబాద, ఇన్నర్ రింగ్ రోడ్డు, రామవరప్పాడు, గుణదల మీదుగా వెళ్లాలి.
- విజయవాడ నుంచి విమానాశ్రయానికి వెళ్లే వాహనాలు రామవరప్పాడు ఫ్లై ఓవర్, ముస్తాబాద, సూరంపల్లి అండర్ పాస్ నుంచి ఎన్‌హెచ్ బైపాస్ బీబీ గూడెం, గన్నవరం మీదుగా వెళ్లాలి.
- హనుమాన్‌జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు చిన్న ఆవుటపల్లి వద్ద ఎన్‌హెచ్ బైపాస్ మీదుగా బీబీ గూడెం, ముస్తాబాద, సున్న, పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలను కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి యానం, అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, రేపల్లె, బాపట్ల మీదుగా మళ్లిస్తారు.
- చెన్నై నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, బాపట్ల, రేపల్లె, లోస్రా బ్రిడ్జి, నరసాపురం, అమలాపురం, కాకినాడు, కత్తిపూడి మీదుగా వెళ్లాలి. మరో మార్గంగా తెనాలి నుంచి పులిగడ్డ, మచిలీపట్నం, నరసాపురం, అమలాపురం, కాకినాడు, కత్తిపూడి వైపు ఉంటుంది.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు తూర్పు గోదావరి జిల్లా దివాను చెరువు బైపాస్ నుంచి గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం మీదుగా వెళ్లాలని తెలిపారు.
- తణుకు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు హనుమాన్‌జంక్షన్, నూజివీడు, మైలవరం, ఇబ్రహీంపట్నం, నందిగామ మీదుగా వెళ్లాలి.

విజయవాడలో అర్ధరాత్రి కలకలం



దుండగుడు పెట్రోలు పోసి దహనం చేసిన నాలుగు వాహనాలు



బొప్పావారి వీధిలో బాధితులతో మాట్లాడుతున్న వెలంపల్లి

- బైకులపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగుడు
- కాలి బూడిదైన ఐదు బైకులు
- ఒకే వ్యక్తి ఘటనకు పాల్పడినట్లు పోలీసుల గుర్తింపు

భవానీపురం(విజయవాడ పశ్చిమ)/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): పార్క్ చేసిన బైక్‌లపై పెట్రోల్ పోసి దహనం చేసిన ఘటన విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలో గురువారం అర్ధరాత్రి (తెల్లవారితే శుక్రవారం) చోటు చేసుకుంది. ఈ ఘటనలో 5 బైక్‌లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై కుమ్మరిపాలేనికి చెందిన షేక్ మెహమ్మద్ ఖాసీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొట్టేటి కోటయ్య వీధిలో షేక్ మొహమ్మద్ ఖాసీం, మెల్లేటి కాశీబాబు, వెలగపూడి రాజేశ్వరి, షేక్ బాజీ, మరిపూడి శ్రీనివాసరావులకు చెందిన బైక్‌లు వారి వారి ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్నాయి. అకస్మాత్తుగా అర్ధరాత్రి సమయంలో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు లేచి చూశారు. బైక్‌లు తగలబడుతుండటంతో మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. ఒక వ్యక్తి పెట్రోల్‌తో బైక్‌లకు నిప్పంటించినట్లు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ వ్యక్తి ఎవరనేది తెలుసుకునేందుకు పోలీసులు అన్వేషణ ప్రారంభించారు. ఒకే వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. బైక్‌లు తగులబెట్టిన ఘటనలో సీసీ కెమెరాలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి..

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వచ్చి బాధితులను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకుని పోలీస్ అధికారులు, తహసీల్దార్‌తో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి, భద్రతలు కరువయ్యాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన హోం మంత్రి కేవలం ప్రెస్‌మీట్లకే పరిమితం అవుతున్నారని విమర్శించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం మంజూరు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీపీ

విజయవాడస్పోర్ట్స్: గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మరణించిన, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పరిహారం అందజేస్తోందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. జిల్లాకు చెందిన 15 మంది బాధితులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10.50 లక్షల చెక్కులను పోలీస్ కమిషనర్ కమిషనరేట్‌లో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.లక్ష, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.50 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈనెల మూడో తేదీ వరకు జిల్లాలో 221 రోడ్డు ప్రమాద (హిట్ – రన్) కేసులు నమోదయ్యాయని తెలిపారు. దీని కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఇప్పటి వరకు 120 కేసులకు సంబంధించిన ఫారాలను కలెక్టరేట్‌కు పంపిందని, వాటిల్లో జనరల్ ఇన్సూరెన్స్ అధికారులకు 30 వెళ్లాయని, వీటిల్లో 15 మంది బాధితులకు రూ. 10.50 లక్షలను మృతుల కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. నష్ట పరిహారం రావడంలో కీలకంగా వ్యవహరించిన డీసీపీ కృష్ణమూర్తినాయుడు, డెప్యూటీ కలెక్టర్ జి. మహేశ్వర రావు, జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రామ్ సుధాకర్, ఏసీపీ పి. రామచంద్రరావు, ఎస్ఐ మల్లీశ్వరి, డెప్యూటీ తహసీల్దార్ ఎస్.నాగజ్యోతిని అభినందించారు.

దత్తక్షేత్ర నాద యాత్ర ప్రారంభం



యాత్రను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, గణపతి సచ్చిదానంద స్వామి

పటమట (విజయవాడ తూర్పు): దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ రాష్ట్రంలో 42 ఊర్లలో చేపట్టిన దత్తక్షేత్ర నాద యాత్ర–2025ను సీఎం చంద్రబాబు శుక్రవారం విజయవాడ పటమటలోని దత్త పీఠం వద్ద ప్రారంభించారు. చంద్రబాబు ముందుగా పీఠంలోని మరకత రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో స్వామిజీ చేపట్టిన ఈ యాత్రలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. గణపతి సచ్చిదానంద స్వామిజీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మికత, సాంస్కృతిక వారసత్వాలను కాపాడటంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తల్లీ కుమారుల ఆత్మహత్యాయత్నం

తల్లి మృతి, కోలుకుంటున్న కుమారుడు

కోకిలంపాడు(తిరువూరురూరల్): మండలంలోని కోకిలంపాడులో గత నెల 27న తల్లీకుమారులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటనలో తల్లి మృతిచెందగా, కుమారుడు ప్రాణాపాయం నుంచి గట్టెక్కాడు. గ్రామానికి చెందిన మానికల వెంకటేశ్వరరావు భార్య శ్రీలక్ష్మి(40) పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, ఈ సంఘటనతో ఆందోళనకు గురైన కుమారుడు శ్రీనివాసరావు కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇరువురినీ విజయవాడ ఆంధ్రా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా శుక్రవారం శ్రీలక్ష్మి మృతి చెందింది. శ్రీనివాసరావు డిగ్రీ చదివి ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై తరచూ మూర్ఛ వ్యాధికి గురవుతుండగా, అతని భవిష్యత్తును తలచుకుని బెంగతో శ్రీలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తిరువూరు పోలీసులు కేసు నమోదు చేసి శ్రీలక్ష్మి మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో దూకిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే టి. రాంబాబు(35) నగరంలోని ఒక ఆస్పత్రిలో అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. భార్య సునీత, ఆరు సంవత్సరాల కుమార్తె రిషికాతో కలిసి గులాబీతోట ప్రాంతంలో జీవిస్తున్నాడు. ఈ నెల 31వ తేదీన భార్య, కుమార్తెను ఏలూరు జిల్లాలో ఉంటున్న తన తల్లి ఇంటికి పంపించి తాను సంక్రాంతికి సెలవు పెట్టి వస్తానని చెప్పాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ప్రకాశం బ్యారేజీ 38వ ఖానా వద్ద రాంబాబు మృతదేహం నదిలో తేలుతూ కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. అతని వద్ద లభించిన ఆధారాల సాయంతో రాంబాబు సహోద్యోగి అయిన పుల్లారెడ్డికి సమాచారం ఇచ్చారు. అతను మృతదేహాన్ని గుర్తించి రాంబాబు భార్య సునీతకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఆమె భర్తను గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

అధ్యాపకుడి వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణ



ఫ్లెక్సీతో ర్యాలీగా వస్తున్న మృతుని స్నేహితులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. భవానీపురానికి చెందిన బి. కల్యాణ్ (21) పొట్టిశ్రీరాములు కళాశాలలో బీటెక్ (ఈఈఈ) ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. గ్రూప్ ప్రాజెక్టుకు సంబంధించి నలుగురు విద్యార్థులతో కూడిన వాట్సాప్ గ్రూప్‌లో కల్యాణ్ పెట్టిన మెసేజ్‌పై అందులోని ఒక విద్యార్థిని కళాశాల విభాగాధిపతి దృష్టికి తీసుకెళ్లటంతో వివాదం చోటు చేసుకుంది. విభాగాధిపతి కల్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు టీసీ ఇప్పిచ్చేస్తానని బెదిరించడం, గతంలో కూడా ఇలాగే ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే ఈ నెల 27వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు కల్యాణ్ భవానీపురం పోలీసులుకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. 27వ తేదీన తన అన్న సాయంతో ప్రభుత్వాస్పత్రిలో చేరినట్లుగా ఆ ఫిర్యాదులో వివరించాడు. అయితే చికిత్స పొందుతున్న కల్యాణ్ శుక్రవారం మరణించాడు. దాంతో అతని మిత్రులు కళాశాల వద్ద కల్యాణ్‌కు సంబంధించిన బ్యానర్లను ఉంచి హడావుడి చేశారు. అలాగే కల్యాణ్ మిత్ర బృందం కొద్దిమంది భవానీపురం నుంచి ఊరేగింపుగా కళాశాల వైపు వచ్చే ప్రయత్నం చేయటంతో పోలీసులు వారిని సముదాయించారు. కేసు నమోదైందని, విచారణ చేస్తున్నామని, అందులో దోషులెవరైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించటంతో విద్యార్థులు శాంతించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

కోతి దాడిలో బాలుడికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి కొల్లి ఆదినారాయణ వీధిలో కోతి దాడిచేసిన ఘటనలో ఓ బాలుడు శుక్రవారం గాయపడ్డాడు. సేకరించిన వివరాల మేరకు బాలుడు తండ్రి బంక కాంతారావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల కుమార్తెతో పాటు నాలుగేళ్ల కౌశిక్‌ను ఇంట్లో ఉంచి భార్యాభర్తలు పనిమీద బయటకు వెళ్లారు. కుమార్తె బయట ఆడుకుంటుండగా కుమారుడు కౌశిక్ ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన కోతి కౌశిక్‌పై దాడి చేసింది. నుదుటిపైన గాయమైంది. ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం బాలుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన గుణదలలో 220 కేవీ సబ్‌స్టేషన్‌కు శనివారం మరమ్మతులు నిర్వహించనున్నట్లు ఓఅండ్ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యం.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గుణదల 220 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా ఆపివేస్తామని చెప్పారు. దీని వలన సాధారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కానీ అత్యవసర పరిస్థితి ఏర్పడితే సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బీఎల్ఎస్, ఏసీఎల్ఎస్‌పై శిక్షణ



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్, ఇండియన్ రేడియాలజికల్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఏ) సంయుక్త ఆధ్వర్యంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వారి బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్), అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) విధానాలపై మూడు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. మహాత్మా గాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సదస్సును ఐఆర్ఐఏ జాతీయ అధ్యక్షుడు వీఎన్ వరప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బీఎల్ఎస్, ఏసీఎల్ఎస్ ప్రాధాన్యం ఎంతో పెరిగిందన్నారు. వైద్యులు సిబ్బంది సైతం ఆ విధానాల్లో నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. డాక్టర్ కె.గోపాలకృష్ణ, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ సూర్యదేవర శేశరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలిరోజు ప్రాక్టికల్ సెషన్లు, హ్యాండ్‌-ఆన్ మాడ్యూల్స్, ఇంటరాక్టివ్ డిస్కషన్లతో శిక్షణ కొనసాగింది.

రాష్ట్ర ఖ్యాతిని చాటండి

విజయవాడస్పోర్ట్స్: జాతీయ పోటీల్లో విశేష క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్లకు సూచించారు. ఈనెల ఏడు నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లకు శాప్ కార్యాలయంలో జెర్సీలను శాప్ ఎండీ గిరిషాతో కలిసి శుక్రవారం ఆయన అందజేశారు. నాలుగేళ్ల తర్వాత రాష్ట్ర వాలీబాల్ జట్టు జాతీయ పోటీలకు వెళుతోందని రవి నాయుడు వెల్లడించారు. జాతీయ పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్లను ఇటీవలే శాప్ ఆధ్వర్యంలో ఎంపిక చేశామన్నారు. జాతీయ పోటీల్లో సత్తా చాటి పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో డాక్టర్ అన్వర్‌కు స్థానం



భవానీపురం (విజయవాడపశ్చిమ):హైకోర్ట్ న్యాయవాది, రీసెర్చ్ స్కాలర్ విద్యాధరపురానికి చెందిన డాక్టర్ అన్వర్ షేక్‌కు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (లండన్)లో స్థానం లభించింది. విద్య, రీసెర్చ్, సామాజిక సేవ అంశాల్లో కృషి చేసినందుకుగాను సంస్థ ఆయనకు ఈ సర్టిఫికెట్ ప్రదానం చేసింది. ఈ మేరకు డాక్టర్ అన్వర్ షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ రీసెర్చ్ స్కాలర్‌గా 2019లో అవార్డ్, అలాగే 2020లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందానని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పలు ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయని తెలిపారు. కోవిడ్, ప్రకృతి విపత్తుల సమయాల్లో బాధిత కుటుంబాలకు మందులు, ఆహారం, వైద్య సాయం వంటి అనేక సేవలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వర్ షేక్‌ను పలువురు న్యాయవాదులు, సామాజికవేత్తలు అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

కృష్ణలంక(విజయవాడతూర్పు):చదువుకోవడం ఇష్టంలేక పాఠశాలకు వెళ్లకుండా ఆర్టీసీ బస్సు ఎక్కి విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కృష్ణాజిల్లా, ఆగిరిపల్లి మండలం, ఈదులగూడెం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమార్తె(11) ఆ గ్రామం పక్కనే ఉన్న ఈదర గ్రామంలోని పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో రోజులాగే బాలిక శుక్రవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరింది. పాఠశాలకు వెళ్లకుండా విజయవాడ బస్సు ఎక్కి బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పోలీసులు ప్రశ్నించగా తనను గుర్తు తెలియని ఒక వృద్ధురాలు కిడ్నాప్ చేసి తీసుకొచ్చిందని, తనకు తల్లిదండ్రులు ఎవ్వరూలేరని చెప్పింది. బాలికను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందించారు. స్టేషన్‌కు చేరుకున్న తల్లిదండ్రులు టీచర్ కొడుతుందన్న భయంతో పాఠశాలకు వెళ్లకుండా విజయవాడకు వచ్చినట్లు చెప్పారు. పోలీసులు బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

- 16వ డివిజన్ భూపేష్‌గుప్తానగర్‌లో దయనీయ స్థితి
- కాల్వల్లో మురుగు పారని వైనం
- దోమలతో ప్రజలకు నరకయాతన
- చర్మ రోగాలతో సతమతం



భూపేష్‌గుప్తానగర్ 7వ లైన్‌లో ఇంటి ముందు నిల్వ ఉన్న మురుగు



రిటైనింగ్ వాల్ పక్కన మురుగుకాలువ పూడిపోయిన దృశ్యం

ఆటోనగర్‌(విజయవాడతూర్పు): అధ్వాన పారిశుద్ధ్యంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాల్వల్లో రోజుల తరబడి మురుగు నిల్వ ఉంటుంది. పూడికలు సక్రమంగా తీయకపోవడంతో సమీప నివాస ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు కాల్వల్లో పారకపోవడంతో వచ్చే దుర్వాసనతో నివాసాల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సమస్యతో దోమలు, ఇతర క్రిమికీటకాలు పెరిగి పిల్లలు, మహిళలు, చిన్నారులు పదుల సంఖ్యలో ఎలర్జీ బారిన పడి నరకయాతన అనుభవిస్తున్నారు. కృష్ణానది పరివాహ ప్రాంతం రిటైనింగ్ వాల్ పక్కనే 16వ డివిజన్ బూపేష్‌గుప్తానగర్ ఉంది. సుమారు 400 వరకు ఇళ్లు ఉన్నాయి. అన్ని రేకుల షెడ్డులే. ఈ ప్రాంతంలో నివశించే వారంతా రోజువారీ పనులు చేసుకునే పేదలే ఉన్నారు. మౌలిక వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇటీవల నాలుగు నెలల క్రితం వచ్చిన వరదలు కారణంగా ఈ కాలనీ మొత్తం ముంపునకు గురైయింది. కనీసం వారం రోజుల పాటు కాలనీవాసులంతా రోడ్డు మీదనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ కాలనీ లోని సమస్యలపై ప్రస్తుతం ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి ఇంటి ముందే మురుగు...

బూషేష్‌గుప్తానగర్‌లోని పకీర్‌గూడెం శ్మశానం వీధి 7వ రోడ్డులో ఇంటి ముందుకు మురుగునీరు చేరి స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ విధంగా గత కొన్ని నెలల నుంచి పడరాని పాట్లు పడుతున్నారు. పగలు.. రాత్రి అని తేడా లేకుండా దోమలు విలయతాండవం చేస్తున్నాయి. దోమల కారణంగా చర్మ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో బాధితుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ఎన్ని మందులు వాడినా ఉపయోగంలేదని పలువురు చెబుతున్నారు. రూ.వేలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ దద్దుర్లు తగ్గడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల వలయం..

ఈ కాలనీలో ఉన్న తాగునీటి కుళాయిలు పనిచేయడంలేదు. తాగునీరు సక్రమంగా అందడం లేదని చెబుతున్నారు. కాలనీ మెయిన్ సెంటరులో ఉన్న నీటి పంపునకు పనిచేయడంలేదు. ఇక్కడి ప్రధాన రహదారిని గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో రోడ్డు వేశారు. ఇప్పుడు ఈ రోడ్డు రెండుగా పగిలి దర్శనమిస్తుంది. దీని పై రాకపోకలు చేసేవారు నానా యాతన పడుతున్నారు. నాసిరకంగా వేశారని కొందరు ఆరోపిస్తున్నారు. గతంలో వచ్చిన వరదల కారణంగా కాలని మొత్తం ముంపునకు గురయింది. ఇళ్లన్నీ మరమ్మతులకు గురయ్యాయి. నష్ట పరిహారం ఇచ్చే విషయంలో అన్యాయం జరిగిందని చెబుతున్నారు.

రిటైనింగ్ వాల్ పక్కన పూడిన డ్రెయినేజీ...

రిటైనింగ్ వాల్ పక్కన ఉన్న డ్రెయినేజీ పూడిపోవడం వల్ల మురుగునీరు పోవడంలేదు. దీని వల్ల ఇంటి ముందు మురుగునీరు నిల్వ చేరుతోందని ఈ ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు మార్లు సంబంధిత శానిటేషన్ సిబ్బంది, అధికారులకు విన్నవించినా కాలయాపన చేయడం మినహా మురుగు పోయే విధంగా చర్యలు తీసుకోవడంలేదని చెబుతున్నారు. దీని వల్ల చర్మ సమస్యలతో సతమతమవుతున్నారు.

చికిత్సకు రూ.5వేలు ఖర్చు



ఇంటి ముందు మురుగు ఉండటం వల్ల గత కొన్ని నెలల నుంచి మా మనువరాలికి ఎలర్జీ వచ్చింది. ఎన్ని ఆసుపత్రులకు తిరిగా ప్రయోజనం లేదు. చికిత్స కోసం రూ.5వేలు ఖర్చు చేశాను. అయినా పూర్తిస్థాయిలో తగ్గలేదు. ఇంకా మందులు వాడుతున్నాం.

–షంషాద్‌బేగం

బీజేపీ తూర్పు మండలాధ్యక్షుడిగా సందీప్



యార్లగడ్డ సందీప్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

పటమట(విజయవాడతూర్పు): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో బాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని అయ్యప్ప నగర్ మండలం (12, 13, 14 డివిజన్లు) మండల అధ్యక్షునిగా యార్లగడ్డ సందీప్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పటమట 14వ డివిజన్‌లోని పటమట దర్శిపేట రాజరాజేశ్వరి అమ్మవార్ల కళ్యాణమండపంలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఎన్నికల పక్రియలో భాగంగా మూడు డివిజన్ల సంబంధించి 42 బూత్ కమిటీలకు 22 బూత్ కమిటీలు యార్లగడ్డను అధ్యక్షులుగా మద్దతు తెలుపుతూ ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో తొలుత సందీప్ అభ్యర్థిత్వాన్ని చింతా రమా దేవి ప్రతిపదించగా పామర్తి నరేంద్ర బలపరచడంతో సందీప్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ కార్యక్రమానికి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అర్ముగం, ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి మాదాల రమేష్ పరివేక్షణలో ఎన్నిక జరిగింది. ఎన్నికల ప్రక్రియను మాజీ మండల అధ్యక్షురాలు సి.హెచ్.రమాదేవి, కాకాని తరుణ్, నందిగామ ఎన్నికల ఇంచార్జి కిలారు దిలీప్, ఎన్టీఆర్ జిల్లా వారధి సమన్వయ కర్త సగ్గుర్తి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు అసెంబ్లీ కన్వీనర్ శ్రీ పొతంశెట్టి నాగేశ్వరరావు నిర్వహించారు.

ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరణ



ముగ్గుల పోటీలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం బాధ్యులు ఎ.సంధ్యారాణి తెలిపారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, ఎం.బి. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్‌మైండ్ సౌజన్యంతో ఎం.జి.రోడ్డులోని సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ పోటీలు మూడు కేటగిరిలలో జరుగుతాయన్నారు. మొదటి కేటగిరిలో 5, 6, 7 తరగతుల విద్యార్థినులు, రెండో కేటగిరిలో 8, 9, 10 తరగతులు, మూడో కేటగిరలో ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు, నాల్గో కేటగిరిలో మహిళలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రవేశం ఉచితమని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు సంక్రాంతి సాంప్రదాయ పద్ధతుల్లో బోగి మంటలతో పాటు గంగిరెద్దులు, హరిదాసుల కళారూపాలతో ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫణిప్రసాద్, అనురాధ, శివరామకృష్ణయ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు):కమ్మవారి సేవా సమితి గ్రేటర్ విజయవాడ ఆధ్వర్యంలో ఈ నెల 5న గంగూరులోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి సభ్యుడు, నిర్వాహకుడు కిలారు ఫణిప్రసాద్ తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా, తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొంటారని చెప్పారు. లబ్బీపేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు, పాటలు, రంగవల్లుల పోటీలు, నృత్యాలతో మన సంస్కృతి ప్రతిబింబించేలా సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2016లో సమితి ప్రారంభించామని, అప్పుడు కేవలం 500 మంది సభ్యులు మాత్రమే ఉన్నారని, నేడు 1300 మంది సభ్యులకు చేరినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పేద కమ్మవారి ఆడపిల్లల 30 మందికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వేములపల్లి అనురాధ, ముత్తవరపు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫైలింగ్ ఎందుకు చేయడం లేదు?

- ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్
- అదనపు విధులకు హాజరు కావాల్సిందే
- అంతరాలయ దర్శనానికి టికెటు తప్పని సరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దేవస్థానానికి సంబంధించిన పరిపాలనా అంశాలు, బిల్లులను తప్పని సరిగా ఈ ఫైల్‌లో అప్‌లోడ్ చేయాల్సిందేనని, మ్యానువల్‌గా ఎటువంటి బిల్లులు తన వద్దకు తీసుకురావద్దని దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్ శుక్రవారం ఆలయంలోని పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. శుక్రవారం ఆలయ ఏఈవోలు, సూపరింటెంటెంట్లతో సమావేశమయ్యారు. పాలనా పరమైన అంశాల గురించి చర్చించి ఆలయంలో జరిగే వ్యవహారాలన్నీ ఈ ఫైల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ ఉన్న సమయంలో పరిపాలనా విభాగంలోని సిబ్బందికి క్యూలైన్ల వద్ద అదనపు విధులు కేటాయిస్తారు. అయితే ఏ ఒక్క సిబ్బంది కూడా అదనపు విధులకు హాజరు కావడం లేదని తెలుసుకున్న ఇన్‌చార్జీ ఈవో తప్పని సరిగా విధులు నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. రద్దీ సమయంలో తాను తప్పని సరిగా క్యూలైన్లను పర్యవేక్షించడానికి వస్తానని, సంబంధిత ప్రాంతంలో విధులు కేటాయించిన వారు అక్కడ లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో శుక్రవారం ఉదయం 8 గంటలకే దేవస్థాన పరిపాలనా విభాగం, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది స్కానింగ్ పాయింట్, గాలిగోపురం, లక్ష్మీ గణపతి విగ్రహాల వద్ద విధులు నిర్వహిస్తూ కనిపించారు. మరో వైపున అంతరాలయ దర్శనం వచ్చే భక్తులందరికీ తప్పనిసరిగా రూ. 500 టికెటు ఉండాలని ఆదేశించారు. స్కానింగ్ పాయింట్ వద్ద తనిఖీ చేసిన టికెట్లు, ఆలయంలోకి ప్రవేశించే గేటు వద్ద చింపిన టికెట్ల సంఖ్యలో సమంగా ఉండాలన్నారు. ఒక వేళ ఆలయానికి చెందిన సిబ్బంది ఎవరైనా టికెట్లు లేకుండా అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లితే వారి జీతం నుంచి రికవరీ చేస్తామని తెలిపారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు నృత్య కళాకారులు నృత్య నీరాజనాలు అర్పించారు. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీనాట్య వేద ఆర్ట్స్ అకాడమీకి చెందిన లలితాదేవి పర్యవేక్షణలో 25 మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులకు విశేషంగా అలరించింది. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు దేవస్థానం తరుపున ప్రశంసాపత్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నార్ల బాల సాహిత్యం అపూర్వం

సాహితీవేత్త సీతారామ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాహితీవేత్త నార్ల చిరంజీవి సృష్టించిన బాల సాహిత్యం అపూర్వమని ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు సీతారామ్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవం రెండో రోజు ప్రధాన సాహిత్య వేదికపై నార్ల చిరంజీవి శతజయంతి సభను నిర్వహించారు. ముఖ్యవక్త సీతారామ్ మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితమే నార్ల చిరంజీవి రచించిన తెలుగు పూలు నేటికీ బాలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదవవలసిన పుస్తకమన్నారు. తెలుగు సాహిత్యానికీ, తెలుగుజాతికీ నార్ల చిరంజీవి చేసిన సేవ బాలసాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదని చెప్పారు. ఆయన తన రచనల ద్వారా అభ్యుదయ భావాలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడ్డారని చెప్పారు. ఆకాశవాణి పూర్వసంచాలకు ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సామ్యవాద భావాలను పిల్లలకు కథల ద్వారా నేర్పిన ఘనత నార్ల చిరంజీవిదని కొనియాడారు. వివిధ కథలను ఉదహరిస్తూ హింస లేకుండా సామ్యవాద భావాలను ఎలా సాధించవచ్చో ఆయన సూచించారన్నారు. శ్రీశ్రీ పబ్లిషర్స్ అధినేత, సాహితీ మిత్రులు సంస్థ నిర్వాహకులు విశ్వేశ్వరరావు సభలో పాల్గొన్నారు.

రతన్‌టాటా దేశానికి గర్వకారణం

పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా దేశానికి గర్వకారణమని పారిశ్రామికవేత్త దాసరి రామకృష్ణ అన్నారు. రతన్‌టాటా సంతాప కార్యక్రమం బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పరిశ్రమలకున్న పాత్రను గుర్తించి, దాన్ని సమాజం, ప్రభుత్వం కూడా గుర్తించే స్థితికి చేర్చిన వ్యక్తి రతన్ టాటా అన్నారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం పూర్వసంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు నాగప్రసూన ప్రతిభా వేదిక మీద నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

శ్రీమద్భాగవత కథా శ్రవణం ముక్తిదాయకం



విజయవాడ కల్చరల్: శ్రీమద్భాగవత కథా శ్రవణం ముక్తి దాయకమని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని కళాశాల ఆడిటోరియంలో శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ భాగవతం విన్నా చదివినా ముక్తి కలుగుతుందని భక్తులు భావిస్తారని తెలిపారు. సకలవేద సారమే భాగవతమని వివరించారు. వ్యాస భగవానుడు భక్తులను తరింప జేయడానికి అష్టాదశ పురాణాలను రచించినట్లు తెలిపారు. సృష్టిలోని సమస్త జీవ రాసులు భగవంతుని సంకల్పమే నన్నారు. నవ విధ భక్తులు ఉన్నాయన్నారు. శ్రవణం, కీర్తనం కూడా ప్రధానమైనవేనన్నారు. తొలిరోజు ప్రసంగంలో శ్రీమద్భాగత అవిర్భావ సందర్భం, నైమిశారణ్యంలో శౌనకాది మహామునుల సంవాదం, తదితర అంశాలు చోటు చేసుకున్నాయి. కార్యక్రమంలో కళాపీఠం ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణరావు ఎస్.లలిత్ ప్రసాద్, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ మేడసానిని సత్కరించారు.

విద్యార్థి దశ నుంచే సేవా గుణం ఉండాలి



వృద్ధాశ్రమంలో నిత్యావసరాలను అందజేస్తున్న విద్యార్థులు, స్కూల్ ప్రతినిధులు

మొగల్రాజపురం:విద్యార్థి దశ నుంచే చిన్నారులు సేవా గుణాన్ని అలవరచుకోవాలని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి చెప్పారు. సిద్ధార్థ నగర్‌లోని స్కూల్ ఆవరణలో గివింగ్ గాలా-లవ్ టు లెర్న్ హ్యాపీ టు షేర్ పేరుతో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సేకరించిన నగదుతో కొనుగోలు చేసిన నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, డైపర్లు, కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, చలికోట్లను విద్యార్థులు నగరంలోని పలు ప్రాంతాల్లో వృద్ధాశ్రమాలు, అనాధ శరణాలయాలకు శుక్రవారం వెళ్లి వాటిని స్వయంగా పంపిణీ చేశారు. కృష్ణలంకలోని నిర్మల శిశుభవన్, బందరు రోడ్డులోని నిర్మల హృదయ భవన్, గుణదలలోని ప్రేమదాస్ మదర్‌థెరిస్సా శరణాలయం, రాజీవ్‌నగర్‌లోని వృద్ధాశ్రమం, బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ టు గెదర్ కేంద్రాలకు వెళ్లి వీటిని అందచేశారు. విద్యార్థులు సేకరించిన నగదుతో పాటుగా స్కూల్ యాజమాన్యం కొంత నగదును కలిపి మొత్తం రూ.3 లక్షల 50 వేల నగదుతో ఈ సామగ్రిని కొనుగోలు చేశామని వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ, స్కూల్ అకడమిక్ డీన్ డి.గిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న యూసీడీ పీవో వెంకట నారాయణ

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో నివాసం ఉంటున్న వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటుందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి (పీవోయూసీడీ) వెంకట నారాయణ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో శుక్రవారం వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్‌లైన ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్ (స్త్రీలైనా, పురుషులైనా) తదితర చేతివృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల ఆర్థిక స్థితి గతులు మెరుగుపరచేందుకు, వారిలోని నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దే క్రమంలో ఈ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 556 అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. దరఖాస్తుదారులందరికీ ఈ నెల 15 నుంచి 31 వరకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇవ్వటమే కాకుండా ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8790233881, 7780683789 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 23 వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి, విజయవాడ నగరపాలక అధికారులు ఫణి కుమార్, సుజాత, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ఎస్ఎం) నేతలు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై. వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ఎస్.వి.ఎస్. బాలసుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె. బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి ఉపకులపతులను నియమించాలని కోరారు. అలాగే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఐదు వేల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యావిధానంపై విద్యాసంస్థలకు, అధ్యాపకులకు సరైన అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే విద్యాశాఖ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏబీఆర్ఎస్ఎంకు ప్రొఫెసర్ మధుమూర్తి హామీ ఇచ్చారు.

● గన్నవరం రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.హరిశరణ్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.అశ్వినికుమారి, ప్రధాన కార్యదర్శిగా కె.రాజ్యలక్ష్మి, గౌరవ అధ్యక్షులుగా ఎం.వీరబాబును ఎన్నుకున్నారు.

న్యూస్‌మేకర్స్



గ్రీన్ ఆర్మీ

ఉత్తరప్రదేశ్‌లో గతంలో 'గులాబ్ గ్యాంగ్' ఘనత విన్నాం. ఇప్పుడు 'గ్రీన్ ఆర్మీ'. స్త్రీల మీద జరిగే దురాగతాలను స్త్రీలే ఉమ్మడిగా ఎదిరిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. వారణాసిలో క్రియాత్మకంగా ఉన్న 'గ్రీన్ ఆర్మీ' మహిళా బృందాన్ని ప్రధాని మోదీ ఇటీవలి మన్‌కీ బాత్‌లో ప్రశంసించారు.

వాళ్లంతా ఒక 50 మంది ఉంటారు. ఆకుపచ్చ చీరలో, చేతి కర్రతో వరుసగా నడుస్తూ ఊళ్లోకి వస్తారు. ఇక ఊళ్లోని మగాళ్లకు గుండె దడే. భార్యలను కొట్టే వాళ్లు, తాగుబోతులు, పేకాట రాయుళ్లు, మత్తు పీల్చేవాళ్లు, కట్నం కోసం వేధించే వాళ్లు... ఎక్కడికక్కడ సెట్‌రైట్ కావాల్సిందే. ఎందుకంటే వారు 'గ్రీన్ ఆర్మీ'. అందరి స్క్రూలు టైట్ చేసే ఆర్మీ. అందుకే మొన్నటి 'మన్ కీ బాత్'లో వీరి గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'వీరి ఆత్మనిర్భరతకు, కృషికి అభినందనలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని తెలిపారు. దాంతో గ్రీన్ ఆర్మీలో కొత్త జోష్ వచ్చింది.

వారణాసి చుట్టుపక్కల

గ్రీన్ ఆర్మీ 2014లో పుట్టింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్న రవి మిశ్రా వారణాసి చుట్టుపక్కల పల్లెల్లో ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ ఉత్తర జిల్లాలలో గృహ హింస ఎక్కువగా ఉందని గమనించాడు. స్త్రీలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తే వారు ఆత్మరక్షణ చేసుకోగలరని అనుకున్నాడు. కొందరు విద్యార్థులతో కలిసి నిర్మలాదేవి అనే గృహిణిని గృహ హింసను ప్రతిఘటించమని కోరాడు. రైతు కూలీగా ఆమె సంపాదించేదంతా ఆమె భర్త లాక్కుని తాగేవాడు. కొట్టేవాడు. నిర్మలా దేవి విద్యార్థుల స్ఫూర్తితో ఆత్మరక్షణ నేర్చుకుంది. అంతేకాదు గ్రామంలోని మరికొంతమందిని జమ చేసింది. అందరూ కలిసి ఇక గృహ హింసను ఏ మాత్రం సహించమని ఎలుగెత్తారు. అంతేకాదు.. కర్ర చేతబట్టి మాట వినని భర్తలకు బడితె పూజ చేశారు. నిర్మలాదేవి భర్త దారికొచ్చాడు. దాంతో గ్రీన్ ఆర్మీ పేరు వినపడసాగింది.

ఇది ఓ జనతా గ్యారేజ్



270 పల్లెల్లో...

వారణాసిలో, చుట్టుపక్కల జిల్లాల్లో ఇప్పుడు 270 గ్రామాల్లో గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు ఉన్నారు. 2000 మంది స్త్రీలు ఇందులో భాగస్వాములు. ప్రతి ఊరిలో ఇరవై నుంచి యాభై మంది స్త్రీలు ఆకుపచ్చ చీరల్లో దళంగా మారి క్రమం తప్పక ఇంటింటికీ వెళ్లి సమస్యల ఆచూకీ తీస్తారు. వాటికి పరిష్కారాలు వెదుకుతారు. స్త్రీల మీద చెయ్యెత్తడం అనేది వీరు పూర్తిగా ఊళ్లల్లో నిర్మూలించారు. ఇక తాగుడు పరిష్కారం కోసం తాగుబోతులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించారు. పేకాట, డ్రగ్స్‌కైతే స్థానమే లేదు. గ్రీన్ ఆర్మీతో స్థానిక పోలీస్ కాంటాక్ట్‌లో ఉంటుంది. ఎవరైనా గ్రీన్ ఆర్మీకి ఎదురు తిరిగితే పోలీసులు వచ్చి చేయవలసింది చేస్తారు. వరకట్న సమస్య ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. 'మీకు కట్నం ఎందుకు ఇవ్వాలి... సరంజామా ఎందుకివ్వాలి' అని గ్రీన్ ఆర్మీ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దాంతో గొంతెమ్మ కోరికలు పూర్తిగా తగ్గాయి. ఇచ్చింది పుచ్చుకుంటున్నారు.

ఆడపిల్లే అదృష్టం

కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ ఆడపిల్ల పుడితే శోకం వ్యక్తం చేస్తారు. ఏడుస్తూ గుండెలు బాదుకుంటారు. కాని గ్రీన్ ఆర్మీ బయలుదేరి ఈ శోకానికి ముగింపు చెప్పింది. 'ఆడపిల్ల అంటే లక్ష్మి అని ఇంటికి భాగ్యమనీ బాగా చదివిస్తే సరస్వతి అని, శక్తిలో దుర్గ అని... ఆడపిల్లను మగపిల్లాడితో సమానంగా చూడాల'ని ఇంటింటికి తిరిగి చైతన్యం కలిగించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లులకు రక్షణగా నిలబడ్డారు. ఇవన్నీ సాంఘికంగా చాలా మార్పు తెచ్చాయి. అందుకే ఒక్కరు కాకుండా సమష్టిగా ప్రయత్నిస్తే విజయాలు వస్తాయి. గ్రామీణ జీవితంలో స్త్రీలకు ఇంకా ఎన్నో ఆటంకాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయి. కర్రచేత బట్టి ఆర్మీగా మారకపోయినా స్త్రీలు సంఘాలు ఏర్పరుచుకుంటే సమస్యలు దూరం కాకపోవడం ఉండదు. గ్రీన్ ఆర్మీ ఇస్తున్న సందేశం అదే.

ఈత - ఘనత

55 ఏళ్లు.. 150 కిలోమీటర్లు



కొందరు ఓటమి నుంచి విజయాలు అందుకుంటారు. మరికొందరు తమ జీవితంలో ఎదురైన ప్రతిబంధకాల నుంచి బయటపడేందుకు ఏదో సాధించాలనే తపనతో ముందుకు సాగుతారు. ఆ కోవకు చెందిన వారే స్విమ్మర్ గోలి శ్యామల. సామర్లకోటకు చెందిన శ్యామల భర్త మోహన్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో యానిమేషన్ స్టూడియో పెట్టుకుని పలు సీరియళ్లు, సినిమాలకు పనిచేశారు. దురదృష్టవశాత్తూ స్టూడియో ద్వారా తీవ్రంగా నష్టపోవడంతో మానసికంగా మనోవేదనకు గురయ్యారు. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. 45 ఏళ్ళ వయసులో శరీరం సహకరించని స్థితిలో మనసును మళ్ళించేందుకు హైదరాబాద్‌లో స్విమ్మింగ్ నేర్చుకున్నారు. స్వతహాగా ఆమె స్విమ్మర్ కాదు... అయితేనేం, నాటి మనోవేదనకు ఉపశమనంగా ప్రారంభించిన స్విమ్మింగ్ నేడు ఐదు పదుల వయసులో ఆమెను సముద్రాలు దాటే సాహస యాత్రికురాలిగా తీర్చి దిద్దింది.

150 కిలోమీటర్లు ఏడు రోజుల్లో అలవోకగా..

డిసెంబరు 28న విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఈత ప్రారంభించిన శ్యామల శుక్రవారం కాకినాడ తీరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడుతూ యానిమేషన్ స్టూడియోలో నష్టం రావడంతో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిన తాను మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు స్విమ్మింగ్ ప్రారంభించాననీ, కోచ్ జాన్‌సిద్ధిక్ సహకారంతో జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల స్విమ్ చేసేలా తయారయ్యానని సగర్వంగా చెప్పారు. 2021లో శ్రీలంక నుంచి ఇండియా వరకు రామ్‌సేతు దాటానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశానన్నారు. బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడం ద్వారా ఆసియా స్థాయిలో ఘనత సాధించానన్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈదాలని రెండేళ్ళ కిందటే నిర్ణయించుకున్నానని, అయితే రెండుసార్లు వాతావరణం అనుకూలించలేదనీ, ఎట్టకేలకు డిసెంబర్ 28న చిన్న ఫిషింగ్ బోట్, ఇద్దరు స్కూబా డైవర్స్‌తో ప్రారంభించానన్నారు. ఆర్కే బీచ్‌లో సముద్రంలో ప్రవేశించాక మళ్ళీ కాకినాడలో నేలపైకి వచ్చామన్నారు. మొదటి రోజు 7 గంటల్లోనే 30 కిలోమీటర్ల దూరం ఈదానన్నారు. తరువాత నుంచి ఈరోజు వరకు అనేక ఒడుదొడుకులను అధిగమిస్తూ ఈదుకుంటూ వచ్చానన్నారు. తల వెంట్రుకల నుంచి కాలి గోళ్ల వరకు స్విమ్మింగ్ వల్లే ఆరోగ్యం కలుగుతుందని, స్విమ్మింగ్‌ను స్పోర్ట్‌గా కాకుండా సర్వైవల్ స్పోర్ట్‌గానే చెబుతానన్నారు. మహిళలు ఈత చేయడం వలన గైనిక్ సమస్యలు తగ్గుతాయన్నారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి ప్రతినిధి.. కాకినాడ.
ఫోటోలు: విశ్వనాధుల రాజబాబు.
కాకినాడ రూరల్



హేళన చేసిన వారే పొగుడుతున్నారు

సముద్రంలో ఈత కోసం తొలి ప్రయత్నం చేసినప్పుడు చాలామంది హేళన చేశారు. కొందరు యూట్యూబ్‌లో కామెంట్లు పెట్టారు. వాటిని పట్టించుకోలేదు. అరేబియా సముద్రం ఈదాను. శ్రీలంక నుంచి ఇండియా ఈత మరపురానిది. మేటీ స్ఫూర్తితో లక్షద్వీప్‌లో 18గంటల పాటు 48 కిలోమీటర్లు ఈదాను. వైజాగ్ నుంచి కాకినాడ 150 కిలోమీటర్లు ఈదగలిగినందుకు చాలా హ్యాపీగా ఉంది.

– గోలి శ్యామల – స్విమ్మర్.

● ముగ్గు ముచ్చట



దామరాజు లక్ష్మి
ఆర్.ఆర్.పేట,
ఏలూరు.

22 చుక్కలు, 10 వరసలు,
10 వచ్చే వరకు, చుక్క వదిలి చుక్క.





17 చుక్కలు,
5 వరసలు,
5 వచ్చే వరకు,
సరి చుక్క.



బెన్నూరి ఉమాదేవి
సికింద్రాబాద్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



బ్యూటిప్

సిట్రస్ ఫ్రెషనర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మతొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరునటిరోజు ఉదయం నిమ్మతొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మరసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

● నగధగలు

బంగారం ఎక్కడైనా బంగారమే



ప్రపంచంలో ఏ దేశంలోనైనా బంగారం అత్యంత విలువైన లోహంగా గౌరవం అందుకుంటోంది. బంగారం స్వచ్ఛత గురించి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క నిష్పత్తిని అనుసరిస్తుంటారు. స్వచ్ఛమైన బంగారం అంటే 24 క్యారట్‌ల బంగారం. ఆభరణం తయారు చేయాలంటే కొన్ని ఇతర లోహాల మిశ్రమాన్ని బంగారంలో కలుపుతారు. బంగారం మెత్తటి లోహం. కాబట్టి ఆభరణం ఆకారం గట్టిదనం కోసం ఇతర లోహాలను కలపాలి. అలా లోహపు మిశ్రమాల కలయిక తర్వాత ఆభరణం తయారు చేయడానికి ఉపయోగించే బంగారం స్వచ్ఛత 22 క్యారట్‌లు ఉంటుంది.

● క్యారట్ అనే పదం అయోమయానికి గురి చేస్తుంది. బంగారం స్వచ్ఛత విషయంలో ఉపయోగించే క్యారట్ అనే పదం ఇంగ్లిష్ అక్షరం 'కె'తో సూచిస్తారు. మరో క్యారట్ రాళ్ల (వజ్రంతో సహా అన్ని రకాల రాళ్లు) బరువును సూచించే పదం. ఈ క్యారట్‌ను 'సి'తో అనే అక్షరంతో సూచిస్తారు. ఒక క్యారట్ అంటే 200 మిల్లీగ్రాములు.

● బంగారం ధర పెరగడం వల్ల ఆభరణాల తయారీలో 22 క్యారట్‌లకు బదులు 18, 14, 9 క్యారట్ స్వచ్ఛతతో ఆభరణాలు చేస్తున్నారు. క్యారట్ స్వచ్ఛత తగ్గేకొద్దీ గట్టిదనం పెరుగుతుంది. వజ్రాలు పొదిగే ఆభరణాలకు సాధారణంగా 18 క్యారట్ బంగారం ఉపయోగిస్తారు. ఇప్పుడు 9 క్యారట్ బంగారంతో కూడా వజ్రాల ఆభరణాలు చేస్తున్నారు.

● తక్కువ క్యారట్ బంగారు ఆభరణాలను కొంటే తిరిగి అమ్మేటప్పుడు ఆ బంగారానికి విలువ రాదనే అపోహ చాలామందిలో ఉంటుంది. నిజానికి మనం కొన్న ఆభరణంలో ఎంత నిష్పత్తి బంగారం ఉందో కరిగించినప్పుడు ఆ మేరకు బంగారమే తిరిగి వస్తుంది. బీఐఎస్ హాల్‌మార్క్ వేసిన 18 క్యారట్ బంగారాన్ని కరిగిస్తే 75 శాతం బంగారం వస్తుంది. అంతకంటే క్యారట్ తగ్గితే ఆ మేరకే బంగారం వస్తుంది. అంతే తప్ప తిరిగి ఏమీ రాదనేది అపోహ మాత్రమే. సర్టిఫికేట్‌లో ఆభరణంలో ఉన్న బంగారం స్వచ్ఛతతో పాటు క్యారట్ వివరం తాలూకు పర్సెంటేజ్ కూడా ఉంటుంది.



– విశేషిణి రెడ్డి,
జీఐఏ జెమ్మాలజిస్ట్

● కల్లోల కాలం

ఆ అమ్మ సునామీకి జన్మనిచ్చింది!





సునామీ రాయ్, నమిత రాయ్

ఎప్పుడూ చూసే సముద్రమే ఆ రోజు కొత్తగా ఉంది.
భయంగా ఉంది.
ఎప్పుడూ నవ్వుతూ పలకరించే సముద్రం
విలయవిధ్వంసానికి సిద్ధంగా ఉంది.
ఆరోజు... ఏ రోజూ మరచిపోలేని రోజు.
సునామీ విశ్వరూపాన్ని చూపిన రోజు.
ఇరవై సంవత్సరాల తరువాత కూడా...
నిన్ననే జరిగినట్లు వెన్నులో చలిపుట్టించే రోజు...

అండమాన్ నికోబార్‌లోని హట్ బే దీవిలో భీకర అలల ధాటికి నమిత రాయ్ ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. అప్పుడు నమిత వయసు పాతిక సంవత్సరాలు. దిక్కుతోచని పరిస్థితుల్లో పాములకు ప్రసిద్ధి చెందిన అడవిలో ఆశ్రయం పొందారు. ఎటు నుంచి ఏ విషసర్పం వచ్చి ప్రాణం తీస్తుందో తెలియని భయానక పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లోనే ఆ పాముల అడవిలోనే పండంటి పిల్లాడికి జన్మనిచ్చింది నమిత.

ఆ పిల్లాడికి 'సునామీ' అని పేరు పెట్టారు.

రెండు దశాబ్దాల తరువాత మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్లింది నమిత రాయ్...

'ఆ చీకటి రోజును గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒంట్లో వణుకు పుడుతుంది. అప్పుడు నేను గర్భవతిని. రోజువారీ పనులతో బిజీగా ఉన్నాను. ఉన్నట్టుండి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. మా తీరం నుండి మైళ్ళ దూరంలో సముద్రం తగ్గుముఖం పట్టడం చూసి షాక్ అయ్యాను. కొన్ని సెకనుల తరువాత మా దీవి వైపు భారీ సముద్రపు అలలు దూసుకొస్తున్నాయి, ఆ తర్వాత బలమైన ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు కేకలు వేస్తూ గుట్ట వైపు పరుగెత్తడం చూశాను. పానిక్ ఎటాక్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాను.

కొన్ని గంటల తరువాత స్పృహలోకి వచ్చాను. కొండ అడవిలో వేలాది మంది స్థానికుల మధ్య నేను ఉన్నాను. నా భర్త, పెద్ద కొడుకును చూడగానే ప్రాణం లేచి వచ్చింది. మా ద్వీపంలోని చాలా ప్రాంతాలు రాక్షస అలల తాకిడికి నాశనం అయ్యాయి. ఆస్తి అనేది లేకుండా పోయింది.

ఒకరోజు రాత్రి పదకొండు గంటల తరువాత నాకు పురిటినొప్పులు వచ్చాయి. కానీ చుట్టుపక్కల డాక్టర్లు ఎవరూ లేరు. నేను ఒక బండరాయిపై పడుకొని సహాయం కోసం ఏడ్చాను. నా భర్త ఎంత ప్రయత్నించినా వైద్యసహాయం అందలేదు. అడవిలో ఆశ్రయం పొందిన కొందరు మహిళలను నా భర్త వేడుకున్నాడు. వారి సాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సునామీకి జన్మనిచ్చాను.

తిండి లేదు. సముద్రానికి భయపడి అడవి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో నా బిడ్డ బతుకుతాడా అనే బాధ మొదలైంది. కొబ్బరి నీళ్లే ఆహారమయ్యాయి. లాల్ టిక్రీ హిల్స్‌లో నాలుగు రాత్రులు గడిపిన మమ్మల్ని రక్షణ సిబ్బంది కాపాడారు. చికిత్స కోసం నన్ను పోర్ట్ బ్లెయిర్‌లోని జీబీ పంత్ ఆసుపత్రికి ఓడలో తీసుకువెళ్లారు. హట్ బే నుంచి పోర్ట్ బ్లెయిర్‌కు 117 కిలోమీటర్‌ల దూరం. సుమారు ఎనిమిది గంటల సమయం పట్టింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నమిత.

కోవిడ్ మహమ్మారి సమయంలో భర్త లక్ష్మీ నారాయణ మరణించడంతో ఇద్దరు కుమారులు సౌరభ్, సునామీలతో కలిసి పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో నివసిస్తుంది నమితా రాయ్.

నమిత పెద్ద కుమారుడు సౌరభ్ ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సునామీ 'ఓషనోగ్రాఫర్' కావాలనుకుంటున్నాడు.

'మా అమ్మే నాకు సర్వస్వం. ఆమె ధైర్యశాలి. నాన్న చనిపోయాక మమ్మల్ని పోషించడానికి చాలా కష్టపడింది. ఫుడ్ డెలివరీ సర్వీసును నిర్వహించింది. దానికి సునామీ కిచెన్ అని సగర్వంగా పేరు పెట్టింది' అంటున్నాడు సునామీ రాయ్.

'2004లో సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థ లేకపోవడంతో పెద్ద ఎత్తున విధ్వంసం, ప్రాణ నష్టం జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1.400కు పైగా హెచ్చరిక కేంద్రాలు(వార్నింగ్ స్టేషన్స్) ఉన్నాయి. సునామీ నాటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము సర్వసన్నద్ధంగా ఉన్నాం' అంటున్నారు అండమాన్ నికోబార్ దీవుల అడ్మినిస్ట్రేషన్ సీనియర్ అధికారులు.

వంటిల్లు

అరిశెలు



కావలసినవి:
బియ్యం – ఒక కిలో; బెల్లం పొడి – 800 గ్రా.; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి – కేజీ

తయారి:
- బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని జల్లించాలి. పిండి గాలికి పొడిబారకుండా ఒక పాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి.
- ఇప్పుడు పాకం సిద్ధం చేసుకోవాలి. మందపాటి పాత్రలో ఒక గ్లాసు నీరు పోసి బెల్లం పొడి వేసి పాకం వచ్చేదాకా తెడ్డుతో కలుపుతూ మరిగించాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ మీద నుంచి దించేసి బియ్యప్పిండి వేసి ఉండలు కట్టకుండా తెడ్డుతో కలపాలి.
- బాణలిలో నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది కాగిన నెయ్యిలో వేసి దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి.

గమనిక: అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే ముదురు పాకం పట్టాలి.
- ఈ అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: మైదా లేదా గోధుమ పిండి – కేజీ; నువ్వులు – కేజీ; బెల్లం పొడి – 800 గ్రా.; ఏలకులు– 10 గ్రా. జీడిపప్పు– వందగ్రాములు; నూనె– కేజీ;

తయారి:
- పిండిని చపాతీలకు కలుపుకున్నట్లుగా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.
- నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కాస్త పలుకుగా గ్రైండ్ చేయాలి. బెల్లం పొడి, యాలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి.
- గోధుమ పిండిని చిన్న గోళీలుగా చేసుకోవాలి. ఒక్కొక్క గోళీని ప్రెస్సర్‌తో పూరీలా వత్తుకుని దానిని సాంచా (కజ్జికాయ చేసే చెక్క మౌల్డ్) లో పరిచి ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచా మూత వేయాలి.
- సాంచాలో నుంచి తీసి కజ్జికాయను మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి.

ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.

క్లుప్తంగా...

'ఉపాధ్యాయుల వేతనాలు తక్షణమే చెల్లించాలి'

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నేటి వరకూ డిసెంబర్ నెల జీతాలు రాలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్. చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

'పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా పెండింగ్ డీఏలు, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా 12 పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు.

'ఆరోగ్య సహాయకులను విధుల్లోకి తీసుకోవాలి'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వైద్య, ఆరోగ్య శాఖలో గ్రామీణస్థాయిలో సేవలందించే ఆరోగ్య సహాయకులను తొలగించిన ప్రభుత్వం వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామగ్రామానా అమలు చేయడమే కాకుండా పల్లె ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలూ శ్రమిస్తున్నది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లే (ఆరోగ్య సహాయకులు) అని అన్నారు. అటువంటి వారిని హైకోర్టు తీర్పు పేరుతో రాత్రికి రాత్రే ఉద్యోగాల నుంచి తొలగించారని, దీంతో వందలాదిగా ఆరోగ్య సహాయకుల కుటుంబాలు రోడ్డున పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'మేనిఫెస్టోలో హామీలు అమలు చేయరా'?

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయట్లేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ రెడ్డి శుక్రవారం మండిపడ్డారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి..దాన్ని నిలబెట్టుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల జీతభత్యాల చెల్లింపు ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీజీఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్ లో దాచుకున్న పొదుపు చేసుకున్న సొమ్మును అత్యవసరాలకు పెట్టుకున్న లోన్లను వెంటనే విడుదల చేయాలన్నారు.

ఉచిత బస్సు పథకంపై అధ్యయనం



బనశంకరి: మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం బెంగళూరులో పర్యటించింది. ముందుగా వారు కర్ణాటక రాష్ట్ర రవాణా మంత్రి రామలింగారెడ్డితో సమావేశమయ్యారు. అనంతరం ఏపీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హోం మంత్రి అనిత, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి తదితరులు శాంతినగర బీఎంటీసీ బస్టాండుకు వెళ్లి అక్కడి ప్రయాణికులతో ఉచిత బస్సు పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. .

పెండింగ్ టీడీఆర్ బాండ్లను విడుదల చేయండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను తక్షణమే విడుదల చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 437 టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉండగా వాటిని వెంటనే ఆన్‌లైన్ చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.

త్యాగధనుల పోరాట స్ఫూర్తిని మరువద్దు

మంత్రి ఫరూక్ పిలుపు

సాక్షి, అమరావతి: దేశంకోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని, ఆ త్యాగధనుల పోరాట స్ఫూర్తిని మరువరాదని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రాలతో రూపొందించిన 2025 ఆంగ్ల సంవత్సర నూతన క్యాలెండర్‌ను వెలగపూడి రాష్ట్ర సచివాలయంలోని తన పేషీలో ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, లీగల్ టీం అధ్యక్షుడు సలీం పాషా, జాఫర్, షకీల్, అఫ్జల్, ముఫ్తీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు స్మగ్లింగ్ ముప్పు

ప్రమాదంలో ఏనుగులు, తాబేళ్లు, పంగోలిన్, జింకలు

పులులు, బల్లులు, నక్షత్ర తాబేళ్లు, బుల్‌బుల్ పిట్టల్నీ వదలని వేటగాళ్లు

- వాటి శరీర భాగాల కోసం క్రూరంగా వేటాడుతున్న వైనం
- ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి
- ఏడాదిలోనే దేశవ్యాప్తంగా 40కిపైగా కేసులు
- ఎంత కఠిన చట్టాలున్నా ఆగని స్మగ్లింగ్





వన్యప్రాణుల అక్రమ రవాణా మన దేశంలో అంతకంతకూ పెరిగిపోతోంది. ఈశాన్య రాష్ట్రాల్లోని సరిహద్దులు, ఎయిర్‌పోర్టుల ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించారు. దీనికి చెన్నై, ముంబై ఎయిర్‌పోర్టులు కీలక హబ్‌లుగా మారాయని వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో చెబుతోంది. ఈ ఏడాదిలో అక్రమ రవాణాకు సంబంధించి 40కిపైగా కేసులు నమోదయ్యాయి. వన్యప్రాణుల దంతాలు, విడిభాగాలు, చర్మానికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండటంతో అక్రమ రవాణా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా జరుగుతోంది. ప్రధానంగా రైనో (ఖడ్గమృగం) కొమ్ము, పులి శరీర భాగాలు సంప్రదాయ ఔషధాల తయారీకి వినియోగిస్తారు. వాటి మాంసాన్ని కొన్నిచోట్ల తింటారు కూడా.

రవాణా జరిగే రూట్లు

మనదేశంలోనూ, మన దేశం నుంచి ఇతర దేశాల్లోకి వన్యప్రాణుల అక్రమ రవాణా ప్రధానంగా రెండు మార్గాల ద్వారా జరుగుతున్నట్టు గుర్తించారు. ఈశాన్య ప్రాంతంలోని పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ద్వారా ఎక్కువ రవాణా జరుగుతుండగా, విమానాశ్రయాల ద్వారా రెండో మార్గంలో జరుగుతోంది. దిమాపూర్, గౌహతి, ఇంఫాల్ వంటి ఈశాన్య నగరాల నుంచి నేపాల్, మయన్మార్, చైనా సరిహద్దుల్లో ఖడ్గమృగాల కొమ్ములు, పులి భాగాలు, పాంగోలిన్ పొలుసుల అక్రమ రవాణా విపరీతంగా జరుగుతున్నట్టు గుర్తించారు. ఇండియా–బంగ్లాదేశ్ సరిహద్దులో పక్షులు, సరీసృపాల అక్రమ రవాణా కూడా చాలా ఎక్కువగా ఉంది. నక్షత్ర తాబేళ్లు ప్రపంచంలోనే అత్యధికంగా రవాణా అవుతున్న వన్యప్రాణులు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వీటిని థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియాకు విమానాల ద్వారా సరఫరా చేస్తున్నారు. విమానాల్లో తీసుకెళ్లే లగేజీల రూపంలో 50 శాతానికిపైగా రవాణా ఎక్కువగా జరుగుతోంది. మరో 15 శాతం రవాణా ఎయిర్ కార్గో ద్వారా జరుగుతోంది. చెన్నై, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల్లో తరచూ ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి.

ఇవీ కారణాలు

ప్రపంచంలో 8 శాతం వన్యప్రాణులు మన దేశంలో ఉండగా.. అధిక జనాభా వల్ల వన్యప్రాణుల ఉత్పత్తులు మన మార్కెట్లలోకి సులభంగా ప్రవేశిస్తున్నాయి. ఒకసారి మార్కెట్లలోకి వచ్చిన తర్వాత వాటిని గుర్తించడం అసాధ్యంగా మారుతోంది. చైనా, మయన్మార్, పలు ఆగ్నేయాసియా దేశాలతో సరిహద్దులు ఉండడం, పెరుగుతున్న విమానయాన మార్కెట్, వేగంగా విస్తరిస్తున్న విమానాశ్రయాలు, సోషల్ మీడియాను కూడా ఆన్‌లైన్ మార్కెట్లుగా ఉపయోగిస్తుండడంతో అక్రమ రవాణా పెరిగిపోతోంది.

– సాక్షి, అమరావతి

అతిపెద్ద వ్యవస్థీకృత నేరాల్లో నాలుగోది

అడవి జంతువుల అక్రమ రవాణా వల్ల ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం దెబ్బ తినడంతోపాటు జీవ వైవిధ్యం సమతుల్యత లోపిస్తోంది. ఆర్థిక వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతోంది. అక్రమ రవాణా అనేక దేశాలలో విస్తరించింది. రక్షిత వన్యప్రాణులను వేటాడటం, స్మగ్లింగ్ చేయడం, చట్టవిరుద్ధంగా సేకరించడం, పట్టుకోవడం వంటివి నిరాటంకంగా జరుగుతోంది. డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, నకిలీల తర్వాత నాలుగో అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరంగా వన్యప్రాణుల అక్రమ రవాణా కొనసాగుతున్నట్టు గుర్తించారు. ఈ అక్రమ రవాణా విలువ సంవత్సరానికి రూ.1,500 కోట్లు ఉంటుందని వైల్డ్ లైఫ్ నిపుణులు చెబుతున్నారు. వన్యప్రాణుల అక్రమ రవాణా జరుగుతున్న టాప్–20 దేశాల్లో మన దేశం ఒకటి. విమానాల ద్వారా అక్రమ రవాణా జరుగుతున్న టాప్–10 దేశాల్లో మన దేశం కూడా ఉండటం గమనార్హం.

ఏనుగు దంతాలదే మొదటి స్థానం

స్మగ్లింగ్ ఇన్ ఇండియా నివేదిక ప్రకారం భారతదేశం నుంచి అత్యధికంగా అక్రమ రవాణా అవుతున్నవి ఏనుగు దంతాలు. ఆ తర్వాత తాబేళ్లు. వీటిలో నక్షత్ర తాబేళ్ల స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోంది. ఖడ్గమృగం కొమ్ముల వ్యాపారం కూడా పెరిగింది. ఇటీవల కాలంలో పాంగోలిన్ వేట, అక్రమ రవాణాకు మన దేశం ప్రధాన కేంద్రంగా మారింది. పులుల శరీర భాగాల వ్యాపారం కూడా యథేచ్ఛగా కొనసాగుతోంది. స్నేక్‌హెడ్ ఫిష్, జీబ్రా లోచ్ వంటి అలంకార చేపలను లైవ్ అక్వేరియంలో ఉంచడం కోసం అక్రమ రవాణా చేస్తుండడంతో వాటి సహజ ఆవాసాలు అంతరించిపోతున్నాయి. వీటితో పాటు నక్కలు, ఎలుగుబంట్లు, చిరుతలు, ముంగిసలు, కప్పలను అక్రమంగా రవాణా చేసి వాటి శరీర భాగాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారు.



ఒక్క పిలుపు... వంద మంది పలుకు



ఆలయంలోని సుంకులమ్మ, ముత్యాలయ్య మూలవిరాట్‌లు

గ్రామంలో ప్రతి ఇంటా ఇద్దరు, ముగ్గురికి గ్రామదేవతల పేర్లు • ఏటా సుంకులమ్మ, ముత్యాలయ్య జాతర

పామిడి: ఏ పల్లెలోనైనా ఒకే పేరు ఉన్న వారు ఐదారు మంది ఉంటే గొప్ప. అలాంటిది ఆ ఊళ్లో దాదాపు వెయ్యి మందికి పైగా ఒకే పేరు పెట్టుకున్నారు. సుంకులమ్మ అనో... ముత్యాలయ్య అనో కేక వేస్తే చాలు పదుల సంఖ్యలో పోగవుతారు. తమ ఇలవేల్పును నిత్యం స్మరించేలా ఇలా గ్రామ దేవతల పేర్లు పెట్టామని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంతకు ఆ గ్రామం ఏదంటే... అనంతపురం జిల్లా పామిడి మండలం రామరాజుపల్లి. గ్రామంలో 340 కుటుంబాలకు గాను 1,400 మంది జనాభా ఉన్నారు. వీరిలో ఓ వెయ్యి మందికి ముత్యాలయ్య, ముత్యాలరెడ్డి, ముత్యాలమ్మ పేర్లు ఉన్నాయి. అలాగే మరో 400 మందికి సుంకులమ్మ, సుంకిరెడ్డి, సుంకన్న తదితర పేర్లు ఉన్నాయి. ఇంత మంది ఒకే పేరు పెట్టుకోవడానికి కారణం ఏమని ఆరా తీస్తే.. ఆ గ్రామస్తులు ఓ పురాతన కథ వినిపిస్తున్నారు. ఆ కథ ఏమిటో తెలుసుకుందాం రండి...

అక్కాతమ్ముళ్లుగా జన్మించి....

రామరాజుపల్లి గ్రామం ఏర్పడినప్పుడు రెడ్ల సామాజిక వర్గానికి చెందిన గణేశం వంశంలో సుంకులమ్మ, ముత్యాలయ్య అక్క, తమ్ముడిగా జన్మించారు. దైవాంశసంభూతులైన వారి మహిమతో గ్రామం సస్యశ్యామలంగా ఉంటూ వచ్చింది. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చిన వారు తీరుస్తూ వచ్చారు. దీంతో స్థానికులు వారిని గ్రామ దేవతలుగా ఆరాధించేవారు. కాలక్రమేణ వారు అంతర్థానమైన తర్వాత గ్రామంలో ఆలయాన్ని నిర్మించి, నిత్య పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ ఇలవేల్పు పేరును సదా స్మరించేలా తమ సంతానానికి గ్రామ దేవతల పేర్లు పెడుతూ వచ్చారు.

ఏటా తిరునాల

దాదాపు 250 సంవత్సరాలుగా రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య తిరునాలను ఏటా నిర్వహిస్తూ వస్తున్నారు. రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల మధ్య ఐదురోజుల పాటు సాగే ఈ తిరునాలకు జిల్లా వాసులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తిరునాల సందర్భంగా నిర్వహించే రథోత్సవం చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రధానంగా ఓ ఎద్దుల బండికి తాటిచెట్టు కాండాన్ని తాళ్లతో కట్టి అలంకరించి రథంగా భావిస్తారు. అనంతరం ఏడు జతల ఎద్దులను కట్టి రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం వరకూ లాగిస్తారు. ఎద్దులు బండిని లాగే క్రమంలో తాటి చెట్టు కాండం పైపైకి లేస్తూ ఉంటుంది. ఎద్దులు ఎంత బలంగా బండిని లాగితే కాండం అంత పైకి లేస్తుంది. ఆ సమయంలో రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య ఉత్సవ మూర్తులను చిలకమ్మ పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. తొలిరోజు గుత్తి అనంతపురానికి చేరిన రథం మరుసటి రోజు రాత్రికి రామరాజుపల్లికి చేరుతుంది. తిరిగి మూడోరోజు రాత్రికి బయలుదేరి నాల్గో రోజుకు గుత్తి అనంతపురానికి చేరుతుంది. ఆ రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. ఐదో రోజు తెల్లవారుజామున తిరిగి బండిని రామరాజుపల్లికి చేర్చడంతో తిరునాల ముగుస్తుంది. ముగింపు రోజున గ్రామంలో దేవర నిర్వహించి, మొక్కులు తీర్చుకుంటారు.

భక్తి భావానికి నిదర్శనం



ఎంతో మహిమాన్వితంగా భావిస్తూ మేము ఆరాధించేసుంకులమ్మ, ముత్యాలయ్య గ్రామ దేవతల వల్లనే మా ఊరు సుభిక్షంగా ఉంటోంది. గ్రామ దేవతల పేర్లు లేని ఇల్లు లేదు. ఈ పేర్లు పెట్టుకుంటే ఆ కుటుంబంలో ఎలాంటి లోటు పాట్లు ఉండవన్నది మా పెద్దల కాలం నుంచి విశ్వసిస్తూ వస్తున్నాం. ఇది మా గ్రామస్తులకు గ్రామదేవతలపై ఉన్న భక్తిభావానికి నిదర్శనం.

– డీసీ ముత్యాలరెడ్డి, సర్పంచ్, రామరాజుపల్లి గ్రామం, పామిడి మండలం

ఊరు సుభిక్షంగా ఉంటుందని



ప్రతి ఇంట్లోనూ సుంకులమ్మ, సుంకిరెడ్డి, ముత్యాలయ్య, ముత్యాలమ్మ, ముత్యాలరెడ్డి తదితర పేర్లను పెడుతుంటారు. ఇలా చేయడం వల్ల మహిమాన్వితులైన గ్రామదేవతల పేర్లు సదా ఉచ్ఛరించేలా ఉంటుందని అందరూ భావిస్తున్నారు. గ్రామ దేవతల వల్లనే మా ఊరు సుభిక్షంగా ఉందని అందరూ విశ్వసిస్తున్నాం. అందుకే ఏటా గ్రామంలో గ్రామ దేవతలకు జాతర ఉత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటాం.

– భోగాతి మురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీ, రామరాజుపల్లి గ్రామం, పామిడి మండలం



శుడిబండి రథోత్సవం (ఫైల్), చిలకమ్మ పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ఇదేం'కొత్త' సంప్రదాయం!

- 'పీఎం సూర్యఘర్' ప్రోత్సాహక నగదుతో ఐఏఎస్‌లకు కానుకలు
- 11 జిల్లాల ఐఏఎస్‌లకు నూతన వస్త్రాలు బహూకరణ



ఈపీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ ఇస్తున్న కానుకను చూస్తున్న విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

సాక్షి, అమరావతి: ఏదైనా సంస్థకు వచ్చిన ప్రోత్సాహక నగదు బహుమతిని అందుకు కృషి చేసిన సిబ్బంది సంక్షేమానికో లేదా సంస్థ అభివృద్ధికో ఖర్చు చేస్తారు. కానీ, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఓ వింత పని చేసింది. పీఎం సూర్యఘర్ పథకం అమలును సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈపీడీసీఎల్‌కు రూ.10 కోట్ల ప్రోత్సాహక నగదు అందింది. దీనిని సంస్థ లేదా ఉద్యోగుల కోసం ఖర్చు చేయకుండా నగదు బహుమతిలో కొంత ఏమాత్రం సంబంధం లేని ఐఏఎస్ అధికారులకు కానుకల రూపంలో పంచేసింది. నూతన సంవత్సర కానుక పేరుతో 2025 డైరీ, క్యాలెండర్‌తో పాటు ఖరీదైన వస్త్రాలను డిస్కం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న ఐఏఎస్ అధికారులకు బహూకరిస్తోంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏలూరు జిల్లాల్లోని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, నగర పాలక కమిషనర్లకు ఈ నజరానాలను అందించింది. ఆయా జిల్లాల పర్యవేక్షక ఇంజనీర్లు(ఎస్ఈ) స్వయంగా ఈ అధికారులను కలిసి, కానుకలిచ్చి, ఆ ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించారు. ఈ వింత పనిపై ఈపీడీసీఎల్ ఉద్యోగులు ముక్కున వేలేసుకున్నారు. ఇలాంటి సంప్రదాయం విద్యుత్ సంస్థల్లో ఎప్పుడూ లేదు. ఇప్పుడు కూడా మధ్య, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలూ ఇలాంటి పని చేయలేదు. తూర్పు డిస్కంలోనే సంస్థ డబ్బుతో ఐఏఎస్‌లకు అంత ఖర్చుపెట్టి దుస్తులు కొనివ్వాల్సిన అవసరం ఏమిటనే సందేహాలు వస్తున్నాయి. దీనిపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్‌ను «సాక్షి» వివరణ కోరగా.. పీఎం సూర్యఘర్ పథకం అమలును సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక నగదు ఇచ్చిందని, అందులో కొంత మొత్తాన్ని ఈ విధంగా ఖర్చు చేశామని తెలిపారు. అంత నగదు వస్తే ఐఏఎస్‌లకు ఇచ్చే బదులు, డిస్కం అవసరాలకు, ఉద్యోగుల సంక్షేమానికి వెచ్చిస్తే బాగుండేదని, తమ కష్టాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోడమేమిటని సంస్థ సిబ్బంది విమర్శిస్తున్నారు.

పర్యాటక ప్రాంతాల్లో గిరిజనుల లబ్ధికి అధ్యయనం

- త్వరలో ప్రభుత్వానికి నివేదిక
- ఏపీ ఎస్టీ కమిషన్ సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న డీవీజీ శంకరరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అత్యధిక పర్యాటక ప్రదేశాలు షెడ్యూల్డ్ ఏరియాలోనే ఉన్నా, స్థానిక గిరిజనులకు తగిన లబ్ధిచేకూరడంలేదని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో సభ్యులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటక ప్రదేశాల నుంచి ఆదాయం పొందుతున్న పర్యాటక శాఖ స్థానిక గిరిజనులకు తగిన లబ్ధి చేకూర్చడంలేదనే ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటిని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో కమిషన్ పర్యటిస్తుందని, వాస్తవ స్థితిగతులపై ప్రభుత్వానికి త్వరలో నివేదిక అందిస్తామని శంకరరావు వెల్లడించారు. అత్యంత వెనుకబడిన గిరిజన తెగల (పీవీటీజీ) అభివృద్ధి, సదుపాయాల కోసం కేంద్రం కేటాయిస్తున్న నిధులను రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పీవీటీజీలకే పరిమితం చేయకుండా అన్ని ప్రాంతాల్లోని వారికి అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) ప్రజలు ఏ సమస్య వచ్చినా కమిషన్‌ను సంప్రదించాలని సూచించారు. కమిషన్‌కు వచ్చిన అన్ని ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎస్టీ చట్టాలు, పీసా చట్టంపైనా గిరిజనులు అవగాహన పెంచుకోవాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు సూచించారు.

అక్రమ కేసుపై కోర్టును ఆశ్రయించిన బాధితులు

- వెంకటగిరి పోలీసులపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు
- సీసీ టీవీ ఫుటేజీలు అందజేయాలని హైకోర్టు ఆదేశాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేజీరాజుపై పోలీసులు అక్రమ కేసు బనాయించారంటూ.. ఆయన భార్య తంగా భాను హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ కేసు వివరాలను హైకోర్టు ముందుంచాలని వెంకటగిరి పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటగిరి పట్టణానికి చెందిన తంగా పేచీరాజు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వడంతో కూటమి నేతలు ఆయనపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గంజాయి కేసులో ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. అయితే తన భర్త ఎలాంటి తప్పు చేయకపోయినప్పటికీ అన్యాయంగా అరెస్ట్ చేసి నాటకీయ పరిణామాలతో స్టేషన్‌కు తీసుకుని పోయి గంజాయి కేసును బనాయించారంటూ పేజీరాజ్ భార్య తంగాభాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తూ పేచీరాజును అరెస్ట్ చేసిన సమయం నుంచి వెంకటగిరి పోలీసుస్టేషన్, యూనియన్ బ్యాంకు, వెంకటగిరి రైల్వే స్టేషన్ వద్ద గల సీసీ టీవీ ఫుటేజీలను కోర్టుకు అందజేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తేలేదు : నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూటమి నేతలను హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ పోరు రోజు శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే కేవలం రాజకీయ కక్ష సాధించేందుకు తనతో పాటు 11 మందిపై అన్యాయంగా కేసును నమోదు చేశారని తెలిపారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 06 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,085 మంది స్వామివారిని దర్శించుకోగా 15,680 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

అట్టహాసంగా శ్రీవారి తిరువీధి సేవ



ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో చిన వెంకన్న తిరువీధి సేవ క్షేత్ర పురవీధుల్లో శుక్రవారం ఉదయం అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సాక్షి ప్లస్
శనివారం । 4-1-2025



పోస్టర్ ప్రెజెంటేషన్‌ను చూస్తున్న విద్యార్థులు

అన్నిరంగాల్లో ఏఐదే కీలకపాత్ర

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై జాతీయ సదస్సు

వివిధ పరిశోధన అంశాలపై పోస్టర్ ప్రెజెంటేషన్

250 పరిశోధన పత్రాలతో సావనీర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. ఇంటర్నెట్‌లో మనం వినియోగించేది ప్రతీది ఏఐపై ఆధారపడి పనిచేస్తుంది. ఏఐ గురించి ప్రాముఖ్యతను, దానిపై జరుగుతున్న పరిశోధనలను తెలిపేందుకు సిద్దిపేట వేదికైంది. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూక్ష్మ జీవశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఏఐపై జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజు రీసెర్చ్‌లు చేసిన వాటిపై పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సదస్సు సందర్భంగా దేశంలోని పలు యూనివర్సిటీల ఏఐ అనుబంధ అంశాలపై జరిగిన రీసెర్చ్‌లను ఆహ్వానించారు. ఆయా యూనివర్సిటీలు ఆన్‌లైన్ ద్వారా పరిశోధన పత్రాలను పంపించాయి.

- సాక్షి, సిద్దిపేట

250 పరిశోధన పత్రాలతో సావనీర్

ఈ సదస్సు సందర్భంగా తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి దాదాపు 250 పరిశోధన పత్రాలు వచ్చాయి. వాటిని ఒక్క చోట చేర్చి సావనీర్‌ను రూపొందించారు. దీనికి ఐఎస్‌బీఎన్ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబరు) లభించింది. దానిని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సదస్సు శనివారం కూడా కొనసాగనుంది.

ఏఐ ద్వారా డ్రగ్స్ కాంబినేషన్‌లు గుర్తించవచ్చు



ప్రపంచంలో రెండవ అతి పెద్ద వ్యాధి బ్రెస్ట్ కేన్సర్. చెట్టు నుంచి వచ్చే కాంబినేషన్ బయో మెటాబోలైట్స్ ద్వారా బ్రెస్ట్ కేన్సర్‌ను నయం చేయవచ్చు. ఏఐ టూల్స్ ద్వారా కాంబినేషన్‌ను గుర్తించి ఆ డ్రగ్ సామర్థ్యాన్ని గుర్తించవచ్చు. ప్లాస్టిక్, స్మోకింగ్, ఫుడ్ ద్వారా కేన్సర్ బారిన పడుతున్నారు. ఉదాహరణకు తినుబండారాల కోసం గంటలకొద్దీ నూనెను మరగపెడుతారు. దీంతో అది విషంగా మారుతోంది.

- డాక్టర్ పూర్ణచందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ, తమిళనాడు

భవిష్యత్తులో ఏఐ కీలక పాత్ర



భవిష్యత్తులో విద్యార్థులకు అనుకూలమైన అభ్యసన, అనుభవాలను అందించడంలో ఏఐ కీలక పాత్ర పోషించనుంది. బలాలు, బలహీనతల ఆధారంగా పాఠ్యాంశం డిజైన్‌కు ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది. ఆటోమేటెడ్ గ్రేడింగ్ పద్ధతి ఇతర దేశాలలో వినియోగిస్తుండగా త్వరలో మన దేశంలో సైతం వినియోగంలోకి రానుంది. పిల్‌బాల్‌ని మనిషి వేసుకుంటే దాని ద్వారా దాదాపు 65 వేల ఫోటోలను తీసి అందిస్తోంది. ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పిల్‌బాల్‌ను టెస్ట్ చేశారు. పిల్‌బాల్‌తో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. ఏఐని ఎంత అభివృద్ధి చేసినా మానవునిపైనే ఆధారపడి పని చేస్తుంది. సైబర్ నేరస్తులను పట్టుకోవడంలో ఏఐ ప్రభావవంతమైన ఫలితాలను ఇస్తోంది.

- రాఘవేందర్‌రావు, అసోసియేట్ ప్రొఫెసర్, నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాల

డేటా పంపేప్పుడు జాగ్రత్తలు పాటించాలి....



తెలిసిన వారికి, తెలియని వారికి మొబైల్ ద్వారా డేటా పంపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మనం పంపే డేటా ఏ యాప్ నుంచి పంపిస్తున్నామో వారికి సైతం చేరే అవకాశం ఉంటుంది. హ్యూమనైడ్స్ పద్ధతి–2030 వరకు వచ్చే అవకాశం ఉంటుంది. హ్యూమనైడ్స్ అంటే మనిషి ఇంట్లో చేసే పనులు అన్ని రోబో చేస్తుంది. మోకాలు సర్జరీ రోబో ద్వారా చేయడం వలన కుట్ల సంఖ్య తగ్గుతుంది.

- డాక్టర్ ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల

షుగర్‌తో కంటి చూపుపై ఎఫెక్ట్



షుగర్ ద్వారా తయారయ్యే ఉత్పత్తులను తినడం వలన కంటి చూపుపై ఏ విధంగా ఎఫెక్ట్ చూపుతుందో నా రీసెర్చ్ ద్వారా వివరించాను. పుణె యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాను. ఇంటర్న్‌షిప్‌లో ఈ రీసెర్చ్ చేశాను. నా పరిశోధనను సావనీర్‌లో పబ్లిష్ చేయడం ఆనందంగా ఉంది. ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది.

- శాలిని చౌహాన్, పుణె యూనివర్సిటీ

సావిత్రిబాయి పూలేకు దత్తాత్రేయ నివాళి



సాక్షి, న్యూఢిల్లీ: కుల వివక్షకు వ్యతిరేకంగా.. బలహీన వర్గాల స్త్రీ, పురుషుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శుక్రవారం చండీగఢ్‌లోని హరియాణా రాజ్‌భవన్‌లో నివాళులర్పించారు. విద్య, సామాజిక సంస్కరణల విషయంలో ఆమె నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకమని దత్తాత్రేయ పేర్కొన్నారు.



సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గారి జయంతి సందర్భంగా జూబ్లిహిల్స్ నివాసంలో ఆ మహనీయురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

సీఎంకు టీపీసీసీ చీఫ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విదేశీ పర్యటన నుంచి వచ్చిన ఆయన శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్కలతోపాటు పార్టీ నేతలు రోహిణ్ రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) హాల్‌లో నివాళులర్పిస్తున్న సెక్రటరీ శాంతభూషణ్‌రావు ఉప్పల, సంయుక్త కార్యదర్శి నవీన్ వాసిరెడ్డి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్.సమీన, ఎగ్జిక్యూటివ్ మెంబర్ హబీబుద్దీన్, శ్రీకాంత్




ఎ'వరి'కి దక్కేనో ఎరువు

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు యూరియా కోసం సొసైటీ గోదాం ఎదుట శుక్రవారం ఉదయం చలిలో బారులు తీరారు. ఉదయం 6 గంటలకే గోదాం వద్దకు చేరుకున్నారు. క్యూ తప్పితే యూరియా లభించదని సుమారు రెండు గంటలపాటు నిల్చున్నారు. మొదటి వరుసలో ఉన్నవారు ఒక్కొక్కరికి రెండు బస్తాలు లభించడం.. చివర ఉన్నవారికి స్టాక్ అయిపోయిందని చెప్పడంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంటిబాట పట్టారు. ప్రస్తుతం రైతులకు మొక్కజొన్న పంటలతో పాటు రబీ వరికి యూరియా అవసరమవుతుంది.

– ఖానాపురం

అమెరికాలోని అల్లుడిపై ఇక్కడ కేసా?

పోలీసులకు ఆదేశాలివ్వలేమన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని అల్లుడిపై ఇక్కడ కేసు ఎలా పెడతారని ఓ అత్తను ప్రశ్నించిన హైకోర్టు.. పోలీసులకు ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. హైదరాబాద్ ఎస్‌ఆర్ నగర్ నివాసి 84 ఏళ్ల పదవీ విరమణ పొందిన ప్రభుత్వోద్యోగి.. న్యూజెర్సీలో ఉంటున్న తన అల్లుడిపై కేసు నమోదుకు ఎస్‌ఆర్ నగర్ పోలీసులకు ఆదేశాలివ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్న పిటిషనర్ కుమార్తెను అల్లుడు వేధిస్తున్నాడు. గతంలోనే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆమె నివాసంలోకి చొరబడి తీవ్ర బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు అతనిపై కేసు నమోదు చేయకపోవడం చట్టవిరుద్ధం. రాజ్యాంగంలోని నిబంధనలకు విరుద్ధం'అని పేర్కొన్నారు. దీంతో అమెరికాలోని భారత రాయబార కార్యాలయం, ఇతర అధికారులకు ఫిర్యాదు చేయాలని పిటిషనర్‌కు న్యాయమూర్తి సూచించారు. 'ఆమె అమెరికాలో అధికారులతో పాటు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ సంప్రదించారు. భారత పౌరురాలిగా జాతీయ మహిళా కమిషన్‌తో పాటు ఇతర మార్గాల్లో రక్షణ పొందే హక్కును ఆమె వినియోగించుకుంటున్నారు'అని బదులిచ్చారు. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని ప్రభుత్వ న్యాయవాది వెల్లడించారు. పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసులకు ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు.

బీజాపూర్‌లో జర్నలిస్టు హత్య



ముఖేశ్ చంద్రాకర్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జర్నలిస్టు హత్యకు గురయ్యాడు. ఈ నెల 1న కనిపించకుండా పోయిన ఆయన శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఓ కాంట్రాక్టర్‌కు చెందిన సెప్టిక్ ట్యాంకులో శవమై తేలారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బీజాపూర్‌కు చెందిన ముఖేశ్ చంద్రాకర్ గతంలో పలు పత్రికలు, చానెళ్లలో పనిచేయగా ప్రస్తుతం ఓ టీవీలో పనిచేస్తూనే సొంతంగా బస్తర్ జంక్షన్ పేరిట యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్నారు. ఈనెల 1న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో ముఖేశ్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఆయన ఫోన్ చివరి లొకేషన్ ఆధారంగా విచారిస్తుండగా బీజాపూర్‌లోని చట్టాన్‌పారా ప్రాంతంలో ఓ కాంట్రాక్టర్ ఇంటి సెప్టిక్ ట్యాంకులో మృతదేహాన్ని గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లో పలు సందర్భాల్లో కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, పోలీసు సిబ్బందిని మావోయిస్టులు కిడ్నాప్ చేస్తే ముఖేశ్ అడవుల్లోకి వెళ్లి చర్చల ద్వారా వారిని విడిపించిన ఘటనలు ఉన్నాయి. 2021 ఏప్రిల్‌లో బీజాపూర్ – సుక్మా జిల్లాల సరిహద్దు తెర్రెం సమీపాన ఎదురు కాల్పుల్లో 22 మంది జవాన్లను మావోయిస్టులు హతమార్చి సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రాకేశ్‌సింగ్‌ను కిడ్నాప్ చేశారు. దీంతో ఆయన ఉన్నతాధికారులు, జవాన్ కుటుంబీలకు వినతితో మావోయిస్టులతో చర్చలు జరిపి జవాన్‌ను బయటకు తీసుకొచ్చారు. అంతకు ముందు బీజాపూర్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏఈని మావోయిస్టులు కిడ్నాప్ చేస్తే సహచర జర్నలిస్టులతో కలిసి ఆయన మావోయిస్టులతో చర్చలు జరిపి విడిపించారు. ఇదిలా ఉండగా ముఖేశ్ హత్యకు కారణాలు, ఎవరు చేశారన్నది ఇంకా తెలియరాలేదు.

ఫూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: దేశంలో మహిళల అభ్యున్నతికి చదువే ప్రధాన ఆయుధం అని శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. ప్రతికూలతలను ఎదిరించి బడుగు బలహీన వర్గాలు, మహిళలకు విద్యను అందించిన మహాత్మా జ్యోతిబా పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ 'పూలే దంపతులకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇచ్చి గౌరవించుకోవాలి. వారి స్ఫూర్తితోనే కేసీఆర్ రాష్ట్రంలో వందలాది గురుకులాలు స్థాపించారు. నిర్బంధాల నడుమ మహిళల విద్య కోసం సొంత వనరులతో సావిత్రి బాయి విద్యాలయాలు స్థాపించారు. ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా అవతరించారు'అని పేర్కొన్నారు. దేశంలో అట్టడుగు వర్గాలకు విద్యావకాశాల కోసం నాంది పలికిన ఘనత పూలే దంపతులకు దక్కుతుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బీఆర్‌ఎస్ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు తుల ఉమ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాజీవ్ విగ్రహాలకు బదులుగా పూలే దంపతుల విగ్రహాలు పెట్టాలని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌రెడ్డి, జూలూరి గౌరీశంకర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పల్లె రవికుమార్ గౌడ్, కిశోర్‌గౌడ్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కేసీఆర్‌తో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి భేటీ



సాక్షి, హైదరాబాద్: లగచర్ల కేసులో అరెస్టై జైలుకు వెళ్లి అనంతరం బెయిల్ మీద విడుదలైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. నరేందర్‌రెడ్డి వెంట పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులున్నారు.

హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో శుక్రవారం 'నో యువర్ ఆర్మీ' మేళా ప్రారంభమైంది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సైనికులు ప్రదర్శించిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



మూడు వారాల్లో ఆస్తుల జాబితా సమర్పించండి

ఏపీ టూరిజం కార్పొరేషన్‌కు తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ (టీడీసీ) ఆస్తుల వివరాలను మూడు వారాల్లో సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అలాగే కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఇక్కడ విచారణ చేపట్టవచ్చా? లేదా? అనే విషయంలో పరిధిని తేల్చాలని కమర్షియల్ కోర్టుకు స్పష్టం చేసింది. ఏపీటీడీసీ 2013లో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌తో పలు నిర్మాణాలకు సంబంధించి ఒప్పందం చేసుకుంది. అనంతరం ఇరు పక్షాల మధ్య వివాదం తలెత్తింది. ఏపీడీడీసీ ఒప్పందాన్ని ఉపసంహరించుకోవడంతో కేపీసీ ప్రాజెక్ట్స్ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. విచారణ జరిపిన ట్రిబ్యునల్.. కేపీసీ ప్రాజెక్ట్స్‌కు రూ.3,17,32,913 వడ్డీతో సహా చెల్లించాలని ఏపీటీడీసీని ఆదేశించింది. దీనిని ఏపీటీడీసీ పాటించకపోవడంతో ఎగ్జిక్యూటివ్ కోర్టు (కమర్షియల్ కోర్టు)లో కేపీసీ ప్రాజెక్ట్స్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ కోర్టుకు విచారణ పరిధి లేదని ఏపీటీడీసీ పేర్కొంది. ఈ క్రమంలో ఆస్తుల వివరాలను సమర్పించాలని న్యాయస్థానం ఏపీటీడీసీకి ఆదేశాలు జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ టూరిజం కార్పొరేషన్, రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఎగ్జిక్యూటివ్ కోర్టు అడిగిన ఆస్తుల వివరాలు మూడు వారాల్లో సమర్పించాలని, అలాగే విచారణ పరిధిని కూడా తేల్చాలని కిందికోర్టును ఆదేశించింది.



పోలీసు అధికారుల గెట్ టు గెదర్

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం ప్రారంభంలో ఆనవాయితీగా జరిగే పోలీసు ఉన్నతాధికారుల గెట్‌టుగెదర్ శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని పోలీసు అధికారుల మెస్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిలుగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి? రైన డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు.

మన్నె క్రిశాంక్‌కు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో పరిశోధక విద్యార్థిగా ఉన్న క్రిశాంక్.. 'మీడియాలో దళితుల పాత్ర, ప్రాతినిధ్యం'(రిప్రజెంటేషన్ అండ్ ప్రెజెంటేషన్ ఆఫ్ దళిత్స్ ఇన్ మీడియా) అనే అంశంపై పరిశోధన చేశారు. యూనివర్సిటీ జర్నలిజం విభాగం సీనియర్ ప్రొఫెసర్ కర్నం నరేందర్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు.

● గిన్నిస్ రికార్డ్







రెండు రంగులు నాలుగు

అంక్రా వయసు రెండేళ్లు. కాని బొమ్మలు చూస్తే ఎవరికైనా బేజారు. వీడు... ఇంత బుజ్జాడు...ఇంత బాగా బొమ్మలేస్తాడా? నోరు వెళ్లబెట్టాలి. ఆఫ్రికా దేశానికి చెందిన అంక్రా పుట్టి సంవత్సరం దాటగానే బొమ్మలు గీయడం మొదలుపెట్టాడు. దానికి కారణం అతని తల్లి కుకువా ఎషున్. ఆమె కళాకారిణి. తన పనుల్లో తీరిక లేకుండా ఉన్న సమయంలో పిల్లాడు అల్లరి చేయకుండా నేలపై ఓ కాన్వాస్ పెట్టి అంక్రాను వదిలింది. అలా మెల్లగా అంక్రా బొమ్మలు గీయడం అలవాటు చేసుకున్నాడు.

చిన్నపిల్లలు సరదాగా బొమ్మలు గీయడంలో పెద్దగా విశేషం లేకపోవచ్చు. కానీ రెండేళ్ల వయసున్న అంక్రా గీసిన బొమ్మలు ఆర్ట్ గ్యాలరీలకు చేరి అందర్నీ ఆకర్షిస్తున్నాయి. భారీ ధరలకు అమ్ముడుపోతున్నాయి. దీంతో ఒక్కసారిగా అందరి దృష్టీ అతనిపై పడింది. అంక్రా గీసిన బొమ్మలతో ఘనాలో జరిగిన మొదటి సోలో షో 'ది సౌండ్అవుట్ ప్రీమియం ఎగ్జిబిషన్' నిర్వహిస్తే పది చిత్రాల్లో తొమ్మిది అమ్ముడయ్యాయి. అయితే అతను మొట్టమొదటిసారి గీసిన 'ది క్రాల్'ను మాత్రం ఎక్కడా అమ్మకుండా తల్లిదండ్రులు తమ ఇంట్లో దాచుకున్నారు.

అంక్రా బొమ్మలు గురించి విని గిన్నిస్ బుక్ వారు వచ్చి, అతని పనితనం చూసి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఇప్పుడు ఎన్నో అంతర్జాతీయ వేదికలపై అతని బొమ్మలు ప్రదర్శిస్తున్నారు. రెండేళ్ల వయసుకే ఇంత ప్రతిభ చూపుతున్న అతణ్ని అందరూ పొగుడుతున్నారు. బొమ్మల జీనియస్ అంక్రా.

● సినిమా చూద్దామా?



వండర్ ల్యాండ్‌కు వెళదామా!

వండర్‌ల్యాండ్‌కు వెళ్లడం ఎవరికైనా ఇష్టమే. వండర్‌ల్యాండ్‌కు వెళ్లే సినిమాలు పెద్ద హిట్ అయ్యాయి. అదే వరుసలోని సినిమా 'ఏ బాయ్ కాల్డ్ క్రిస్మస్'. ఇందులో నికోలస్ అనే 13 ఏళ్ల కుర్రాడు ఏకంగా ఫార్ నార్త్ వరకు ట్రావెల్ చేసి 'ఎఫెల్మ్' అనే వండర్ ల్యాండ్‌కి వెళ్ళి తన క్రిస్మస్ విష్ పూర్తి చేసుకుంటాడు. అదెలాగో ఇప్పుడు చెప్పుకుందాం. నికోలస్ అనే కుర్రవాడు వడ్రంగి కొడుకు. వాళ్లు పెద్ద అడవిలో ఉంటారు. రెండేళ్లకు ముందు నికోలస్ తల్లిని ఓ ఎలుగుబంటి చంపేస్తుంది. దాంతో తండ్రి కొడుకు మాత్రమే ఉంటారు. ఓ రోజు రాజు ఆ రాజ్యంలోని ప్రజలందరికీ ఓ మాట చెప్తాడు. ఎవరైతే ఏదైనా అద్భుతం చేసి రాజ్యంలోని అందరికీ నవ్వు తెప్పిస్తారో వాళ్ళకి మంచి ప్రైజ్ ఉంటుందని అనౌన్స్ చేస్తాడు. ఆ విషయం విని నికోలస్ తండ్రి తన ఫ్రెండ్స్‌తో కలిసి ఫార్ నార్త్‌లో ఉన్న ఫాంటసీ ఐలాండ్ కి వెళ్ళి అక్కడి నుండి ఏదైనా తీసుకువద్దామని అనుకుంటాడు. నికోలస్‌కు అతని పిన్ని కార్లట్టాను తోడుగా ఉంచి వెళతాడు.. కాని ఆ పిన్ని చాలా సెల్ఫిష్. నికోలస్‌ని ఇంటి నుంచి బయటకు వెళ్ళగొడుతుంది. అప్పుడు నికోలస్ తన తల్లి ప్రెజెంట్ చేసిన మఫ్లర్‌ను చూసుకుంటూ ఏడుస్తూ ఉంటాడు. అనుకోకుండా ఆ మఫ్లర్‌లో వండర్ ల్యాండ్ 'ఎఫెల్మ్'కు వెళ్ళే మాప్ కుట్టి ఉంటుంది. ఎలాగైనా తన ఫాదర్‌ని కలవాలని విష్ చేసుకుని ఎఫెల్మ్‌కు తన జర్నీ స్టార్ట్ చేస్తాడు. ఈ జర్నీలో ఓ చిన్న ఎలుక కూడా ఉంటుంది. అంతే కాదు ఎలుక చక్కగా మాట్లాడుతూ భలే ఉంటుంది. వండర్ ల్యాండ్ ఎఫెల్మ్‌లో ఎన్నో మ్యాజిక్స్‌తో సూపర్ గా ఉంటుంది. మరి నికోలస్ విష్ పూర్తవుతుందా అంటే మీరందరూ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న ఫాంటసీ కిడ్స్ మూవీ 'ఏ బాయ్ కాల్డ్ క్రిస్మస్'ని చూడాల్సిందే.

- ఇంటూరు హరికృష్ణ

● మహనీయులు

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్



పిల్లలూ.. మీ కుటుంబమంతా కలిసి ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్లారనుకోండి. అక్కడ అందర్నీ సమానంగా చూసి, మీ కుటుంబాన్ని మాత్రం వేరేగా చూస్తే మీకెలా ఉంటుంది? అందర్నీ ఒక చోట కూర్చోనిచ్చి మిమ్మల్ని మరో చోట కూర్చోబెడితే ఏమనిపిస్తుంది? బాధగా ఉంటుంది కదా? సరిగ్గా అలాంటి బాధనే అనుభవించాడు ఆ బాలుడు. అతను పుట్టింది అమెరికా దేశంలో. చిన్నతనంలో తన తల్లిదండ్రులతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్తే అక్కడ అందర్నీ ఒకలా చూసి, వీళ్ల కుటుంబాన్ని మాత్రం మరోలా చూశారు. దూరంగా వేరేచోట కూర్చోబెట్టి భోజనం వడ్డించారు. ఆఫ్రికా నుంచి వచ్చిన తమ పూర్వీకుల కారణంగా తమను 'బ్లాక్ అమెరికన్స్' అంటారని, తమపై అమెరికాలో తీవ్రమైన వివక్ష ఉందని ఆ పిల్లాడు చిన్న వయసులోనే గుర్తించాడు.

ఆ తర్వాత కాలంలో అతను అనేక వివక్షలు చూశాడు. సినిమా థియేటర్‌కు వెళితే వెనక సీట్లలో కూర్చోవాలి. పబ్లిక్ టాయిలెట్స్ కూడా వేరుగా ఉంటాయి. షాపింగ్‌కు వెళితే అమెరికన్లు కొన్న తర్వాతే కొనాలి. నల్లరంగుతో ఉండే తమను అవమానకరంగా చూస్తున్నారని ఆ బాలుడు గమనించాడు. అమెరికన్లను, ఎలాగైనా ఈ వివక్షను దూరం చేయాలని ఆ పిల్లాడు నిశ్చయించుకున్నాడు.

పౌర హక్కుల ఉద్యమంలో పాల్గొని అమెరికాలో నల్లజాతీయుల హక్కుల కోసం పోరాటం మొదలుపెట్టాడు. అందరితో కలిసి అతను చేసిన పోరాటాన్ని 1955లో కోర్టు గుర్తించింది. 381 రోజుల నిరసన తర్వాత తెల్లవారికి, నల్లవారికీ వేరవేరుగా ఉండే చట్టాలను ఇకపై గుర్తించకూడదని తీర్పునిచ్చింది. ఆ తర్వాత1963లో 'మార్చ్ ఆన్ వాషింగ్టన్' పేరుతో జరిగిన ఒక ర్యాలీలో 'ఐ హేవ్ ఎ డ్రీం' అని ప్రసంగించాడు. సుమారు రెండున్నర లక్షల మంది ఆ ప్రసంగం విన్నారు. ఆ తర్వాత కాలంలో అది ప్రపంచ ప్రఖ్యాత ప్రసంగంగా మారి, ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఆయన చేసిన పోరాటంతో 1964లో అమెరికాలో జాతి విభజన, వివక్షను రద్దు చేస్తూ చట్టం తెచ్చారు. ఇంతటి కృషి చేసిన ఆయనకు 1964లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. ఆయనే మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. తన జీవితకాలమంతా వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు. అందరూ సమానమని, సోదర భావంతో మెలగాలని చాటిచెప్పారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని, మీరు కూడా అందర్నీ సమానంగా చూడాలి. ఎదుటివారిని గౌరవించి, వారితో స్నేహంగా మెలగాలి.

● కథ

మాటలు వచ్చిన చిలుక





ఒక ఊరిలో ఒక ధనవంతుడు ఉండేవాడు. అతను సంతలో మాటలు వచ్చిన చిలుకను కొన్నాడు. ఇంటిలో పంజరం తయారు చేయించి అందులో ఉంచాడు.

ఒకసారి ఆ చిలుక 'అయ్యా... నేను పక్షిని. హాయిగా రెక్కలు చాచి ఆకాశమంతా తిరుగుతూ వుంటే ఆనందంగా ఉంటుంది. నన్ను వదులు. ఎక్కడికీ పారిపోను. ఇక్కడే ఎగురుతూ మీతోనే ఉంటా' అంది.

ధనవంతుడు దాని మాటలు నమ్మలేదు. 'నిన్ను చాలా ఖరీదు పెట్టి కొనుక్కున్నాను. నువ్వు ఎగిరిపోవని ఎలా నమ్మడం. నేను విడవను' అన్నాడు.

పాపం ఆ చిలుక చాలా దిగులు పడింది. సరిగా తినేది కాదు. ఎవరితోనూ మాటలాడేది కాదు. ఎప్పుడు మౌనంగా ఆకాశం వైపు గాలిలో ఎగిరే పక్షులను చూస్తూ ఉండేది.

దాంతో ధనవంతునికి బాగా కోపం వచ్చి చిన్న కట్టె తీసుకొని చిలుకను బాగా కొట్టాడు. 'నువ్వు ఇలాగే మౌనంగా వున్నావంటే కాలువలో పారవేస్తా చూడు. ఏమనుకుంటా వున్నావో' అని బెదిరించాడు. పాపం అది బాధతో కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఆ ధనవంతునికి ఒకే ఒక కొడుకు ఉన్నాడు. ఒకరోజు అందరూ పడుకున్నాక ఒక విషపు పాము ఇంటిలోకి వచ్చింది. అది పిల్లవాడు నిద్రపోతున్న ఉయ్యాల పైకి ఎక్కడం మొదలుపెట్టింది. చిలుక దానిని చూసి వెంటనే 'పాము... పాము...' అంటూ గట్టిగా రెక్కలు కొట్టుకుంటూ, పంజరాన్ని అటూ ఇటూ ఊపుతూ అరవసాగింది. ఆ చప్పుడుకి అందరూ అదిరిపడి లేచారు. గబగబా దీపాలు వెలిగించారు. ఇంకేముంది పాము ఉయ్యాల మీదికి ఎక్కుతూ కనబడింది. వెంటనే ఆ ధనవంతుడు ఆ పాము తోక పట్టుకొని గిరగిరగిర తిప్పుతూ విసిరి ఇంటి బయట పడేశాడు. ఉయ్యాల నుంచి బాబును బయటికి తీసి గుండెలకు అదుముకున్నాడు.

కళ్ళనీళ్ళతో చిలుక దగ్గరికి వచ్చి 'నిన్ను ఎంత బాధ పెట్టినా... కొట్టినా... తిట్టినా... నువ్వు అవేమీ మనసులో పెట్టుకోకుండా నా బిడ్డను కాపాడావు. నీవు చేసిన మేలు ఎప్పటికీ మరిచిపోలేను. హాయిగా ఎక్కడికైనా నీ ఇష్టం వచ్చిన చోటుకి ఎగిరిపో' అంటూ పంజరం మూత తెరిచాడు.

చిలుక కిలకిలకిల నవ్వి 'రోజూ మూడు పూటలూ సమయం తప్పకుండా కమ్మగా కడుపునిండా భోజనం పెట్టే మీ అందరినీ వదిలిపెట్టి నేనెక్కడికి పోతాను. ఈ ఇంటిలోనే హాయిగా ఎగురుతూ మీతోనే ఉంటాను' అంది బయటికి వచ్చి బాబు భుజం మీద వాలుతూ.

- డా.ఎం.హరికిషన్



● పాడుదాం గేయం

పచ్చని మొలకలు

పచ్చని మొలకలు
చిన్నారి మొక్కలు
నీరు పోసి.. పాదు చేసి..
అంటు కట్టి
పెంచుదాం రారండి

కంటికి ఇంపుగ
గుండెకు నిండుగ
ఆయువు పెంచగ
కళకళలాడుతు
అందాలొలుకును

ఎదిగే మొక్క పుడమికి మేలు
మానై ఒదిగి నిలిచిన చాలు
కొమ్మలు ఎదిగి.. నీడను పంచి
మేలును చేయు పరిపరి విధాలు

పచ్చని మొలకలు
చిన్నారి మొక్కలు
పాదు చేసి.. అంటు కట్టి
పెంచుదాం రారండి



● ఈ జాతీయాలు తెలుసా?

కారాలు మిరియాలు నూరడం
అర్థం: కోపం ప్రదర్శించడం
వాక్యం: తీసుకున్న అప్పు ఇవ్వని వాడిపై అతడు కారాలు మిరియాలు నూరాడు.

పిండి కొద్దీ రొట్టె
అర్థం: పనికి తగ్గ ఫలితం
వాక్యం: అతని సంపాదన పిండి కొద్దీ రొట్టెలా ఉంది.

కత్తి మీద సాము
అర్థం: అత్యంత కష్టమైన పని
వాక్యం: ఇప్పటి పోటీ పరీక్షలు విద్యార్థులకు కత్తి మీద సాముగా మారాయి.

కాలికి బలపం కట్టుకొని తిరగడం
అర్థం: పని మీద సాగే వెతుకులాట
వాక్యం: అతను ఉద్యోగం కోసం కాలికి బలపం కట్టుకుని తిరుగుతోంది.



మసి పూసి మారేడు కాయ చేయడం
అర్థం:మోసం చేయడం
వాక్యం: ఆ వ్యాపారి మసి పూసి మారేడు కాయ చేసి సరుకులు అమ్ముతాడు.

మంత్రాలకు చింతకాయలు రాలవు
అర్థం: ఉత్త మాటల వల్ల పనులు కావు
వాక్యం: ఆ పార్టీ అభ్యర్థి ఎన్ని ప్రసంగాలు చేసినా మంత్రాలకు చింతకాయలు రాలవు.

ఒంటికాలిపై లేవడం
అర్థం: కోపం చూపించడం
వాక్యం: ఎయిర్‌పోర్టుకు లేటుగా వచ్చినందుకు స్నేహితునిపై అతడు ఒంటి కాలిపై లేచాడు

టెన్నిస్ కథ





రాకెట్ పట్టు... బంతిని కొట్టు

టెన్నిస్ కోర్టులో ఆటగాడు చిరుతలా కదిలి బంతిని కొట్టడం చూస్తే ఎవరైనా సరే థ్రిల్ అయిపోతారు. టెన్నిస్ ఆట అంత వీజీ కాదు. చాలా ఎనర్జీ కావాలి. చాలా మంది టెన్నిస్‌ను శారీరక వ్యాయామంగా చూస్తారు. టెన్నిస్ ప్లేయర్‌లకు చాలా దేశాల్లో ఫాన్స్ ఉంటారు. వీరి టోర్నమెంట్‌లకు భారీ నగదు బహుమతి కూడా ఉంటుంది.

ఆకుపచ్చ కోర్టులో ఆడే ఈ ఆట చరిత్రేమిటో తెలుసా? టెన్నిస్ ఆటకు పుట్టిల్లు ఇంగ్లండ్ దేశమని అక్కడున్న ఎడ్జ్‌బాస్టన్ ప్రాంతంలో తొలిసారి ఈ ఆట ఆడారని కొందరి అంచనా. మరికొందరు చరిత్రకారులు మాత్రం 12వ శతాబ్దంలోనే ఉత్తర ఫ్రాన్స్‌లో ఈ ఆట ఆడారని దబాయిస్తున్నారు. మొత్తం మీద ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాల్లో ఈ ఆట చాలా ప్రసిద్ధి చెందింది. ఫ్రాన్స్ రాజు, ఇంగ్లండ్ రాజు హెన్రీ-8 కూడా టెన్నిస్ ఆడారట. మొదట్లో దీన్ని 'రాకెట్ స్పోర్ట్' అని పిలిచేవారు. 14వ శతాబ్దం నుంచి 'టెన్నిస్' అనడం మొదలుపెట్టి, దాన్నే స్థిరపరిచారు.

మొదట్లో టెన్నిస్‌ని ఒక బ్యాట్‌తో ఆడే ఆటగా భావించేవారు. అంటే ఎదుటి వ్యక్తి బంతి వేస్తే దాన్ని రాకెట్‌తో కొట్టడమే ఈ ఆట. కాలక్రమేణా ఇద్దరు వ్యక్తులు ఎదురెదురుగా ఉండి ఆడటంగా మారింది. 16వ శతాబ్దం నాటికి ఈ ఆటకు సంబంధించి నిబంధనలు ఏర్పరిచి, అందుకు తగ్గట్టు ఆడటం మొదలుపెట్టారు.

మొదట్లో టెన్నిస్‌ని రాచరికపు క్రీడ. మైదానాల్లో రాజకుటుంబానికి చెందినవారు ఈ ఆట ఆడుతూ కాలక్షేపం చేసేవారు. ఆ కాలంలో చేతిలో టెన్నిస్ రాకెట్ పట్టుకొని ఉన్న రాజుల చిత్రాలను చిత్రకారులు గీసేవారు. 1860 తర్వాత టెన్నిస్ ఆధునికంగా మారింది. ఇంగ్లండ్‌కు చెందిన హ్యారీ జెమ్, ఆయన స్నేహితుడు అగౌరియో పెరెరా కలిసి ఈ ఆటలోని పాత నిబంధనలు మార్చి అందరికీ అనుకూలంగా ఉండే కొత్త నిబంధనలు ఏర్పాటు చేశారు. దీంతో సామాన్యులకు సైతం టెన్నిస్ అందుబాటులోకి వచ్చింది. 1881లో పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌షిప్, 1887లో మహిళల సింగిల్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. 1925లో ఫ్రెంచ్ ఛాంపియన్‌షిప్స్ మొదలుపెట్టి, క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రారంభించారు.

అలా అనేక దశాబ్దాల నుంచి మొదలైన ఈ క్రీడ నేటికీ కొనసాగుతోంది. మనదేశంలో రామనాథన్ కృష్ణన్, విజయ్ అమృతరాజ్, రమేష్ కృష్ణన్, లియాండ్ పేస్, మహేష్ భూపతి, రోహన్ బొపన్న, సానియా మీర్జా తదితరులు టెన్నిస్ క్రీడాకారులుగా పేరు తెచ్చుకున్నారు. మీక్కూడా టెన్నిస్ ఆడటమంటే ఇష్టమా? అయితే ఎంచక్కా ఆడేయండి.

సాక్షి ప్లస్
శనివారం, 4-1-2025

బిజినెస్ రీల్

హెచ్‌యూఎల్ చేతికి మినిమలిస్ట్!

- డీల్ విలువ రూ. 3,000 కోట్లు
- చివరి దశకు చర్చలు



ముంబై: చర్మ సంరక్షణ ఉత్పత్తుల కంపెనీ మినిమలిస్ట్‌పై ఎఫ్ఎంసీజీ దిగ్గజం హెచ్‌యూఎల్ దృష్టి పెట్టింది. 2020లో ప్రారంభమైన కంపెనీ తాజాగా సిరీస్ ఏలో భాగంగా యూనిలీవర్ వెంచర్స్, సీక్వోయా క్యాపిటల్ ఇండియా నుంచి పెట్టుబడులు సమీకరించింది. కాగా.. డైరెక్ట్ టు కన్జూమర్ స్కిన్‌కేర్ బ్రాండ్ మినిమలిస్ట్ కొనుగోలుకి హెచ్‌యూఎల్ చేపట్టిన చర్చలు చివరి దశకు చేరినట్లు తెలుస్తోంది. రూ. 3,000 కోట్ల విలువలో ఒప్పందం కుదిరే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మినిమలిస్ట్‌లో మెజారిటీ వాటాను హెచ్‌యూఎల్ సొంతం చేసుకోనున్నట్లు అభిప్రాయపడ్డాయి. బిజినెస్ వృద్ధి, విస్తరణకు వీలుగా వివిధ వ్యూహాల అమలుతోపాటు, అవకాశాలను అన్వేషిస్తుంటామని హెచ్‌యూఎల్ ఈ సందర్భంగా తెలియజేసింది. మెటీరియల్ డెవలప్‌మెంట్ ఉంటే చట్ట ప్రకారం తగినవిధంగా సమాచారాన్ని వెల్లడిస్తామని తెలియజేసింది. గతేడాది(2023-24) మినిమలిస్ట్ రూ. 347 కోట్ల ఆదాయం అందుకుంది. నికర లాభం రెట్టింపై రూ. 11 కోట్లకు చేరింది.

క్వాడ్రాంట్ ఫ్యూచర్ @ రూ. 275-290

- ఈ నెల 7-9 మధ్య ఐపీవో
- రూ. 290 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: రైళ్లు, సిగ్నలింగ్ వ్యవస్థల నియంత్రణ(కవచ్) సంబంధ సర్వీసులందించే క్వాంట్రాంట్ ఫ్యూచర్ టెక్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 7న ప్రారంభంకానుంది. 9న ముగియనున్న ఇష్యూకి రూ. 275-290 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 290 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 50 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 6న షేర్లను విక్రయించనుంది. ఇష్యూ నిధుల్లో రూ. 150 కోట్లవరకూ దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు(స్పెషాలిటీ కేబుల్ విభాగంపై) వెచ్చించనుంది. రూ. 24 కోట్లు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అభివృద్ధికి, మరో రూ. 24 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా రైల్వే రక్షణ సంబంధ వ్యవస్థల అభివృద్ధిపై పనిచేస్తోంది. అంతేకాకుండా రైల్వే రోలింగ్ స్టాక్, నౌకా(డిఫెన్స్) పరిశ్రమల్లో వినియోగించే కేబుళ్లను సైతం తయారు చేస్తోంది. స్పెషాలిటీ కేబుల్స్ విభాగంలో 2024 సెప్టెంబర్ 30కల్లా 1,887 మెట్రిక్ టన్నుల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	258.65	5.11
TATAMOTORS	789	3.13
SBILIFE	1,450.00	1.95
TITAN	3,450.00	1.8
NESTLEIND	2,231.00	1.4

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	295.2	-2.83
HDFCBANK	1,748.40	-2.53
ADANIPORTS	1,197.80	-2.3
TECHM	1,690.50	-2.11
CIPLA	1,507.50	-1.98

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-1-2025

విశాఖ	545-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,399
ఎన్ఎస్ఈ	1,06,094
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,64,587
ఎఫ్ఐఐ	- 4,227
డీఐఐ	+ 821

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.17	$ 73.13
బ్రెంట్	76.60	$ 75.93

భారత్‌లో తగ్గిన పేదరికం

- 4 నుంచి 4.5% వరకూ అంచనా
- 2023-24లో 4.86 శాతంగా గ్రామీణ పేదరికం
- 2011-12 ఈ రేటు ఏకంగా 25.7%
- ఇదే కాలంలో పట్టణ పేదరికం13.7 శాతం నుచి 4.09 శాతానికి డౌన్
- ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో గ్రామీణ, పట్టణ పేదరికం గణనీయంగా పడిపోయినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పరిశోధనా నివేదిక ఒకటి పేర్కొంది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో 25.7 శాతంగా ఉన్న గ్రామీణ పేదరికం 2023-24లో 4.86 శాతానికి దిగివచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఇక ఇదే సమయంలో పట్టణ పేదరికం కూడా 13.7 శాతం నుంచి 4.09 శాతానికి తగ్గినట్లు వెల్లడించింది. వార్షికంగా చూస్తే, 2022-23లో 7.2 శాతంగా గ్రామీణ పేదరికం ఉంటే, పట్టణ పేదరికం 4.6 శాతంగా ఉంది. అంటే వార్షికంగా గ్రామీణ పేదరికం తగ్గితే (7.2 శాతం నుంచి 4.86 శాతానికి), పట్టణ పేదరికం స్వల్పంగా (4.06 శాతం నుంచి 4.09 శాతం) పెరిగింది. ఇక భారత్‌లో పేదరికం రేట్లు ఇప్పుడు 4-4.5 శాతం పరిధిలో ఉండవచ్చని సర్వే భావించింది.

ప్రభుత్వ కార్యక్రమాల దన్ను

పేదరికం తగ్గడానికి ప్రభుత్వ కార్యక్రమాలే కారణమని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. నేరుగా లబ్ధిదారులకు నిధుల బదిలీ (డీబీటీ), గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలను ఆ సందర్భంగా ప్రధానంగా ప్రస్తావించింది. వినియోగం, వ్యయాలపై ఎస్‌బీఐ సర్వేలోని మరిన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- ✔ ప్రభుత్వ పథకాల మద్దతుతో దిగువ ఆదాయ వర్గాల వ్యయాల్లో 5% వరకూ పెరుగుదల కనిపించింది.
- ✔ ఆహార ధరల స్థిరత్వం వల్ల ఖర్చులు తగ్గాయి.
- ✔ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో గ్రామీణ-పట్టణ ఆదాయ వ్యత్యాసాలు తగ్గాయి. 2023 ఆగస్టు-2024 జూలై మధ్య గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.
- ✔ ఎక్కువ ఆదాయం కలిగిన రాష్ట్రాలు జాతీయ సగటు (31%) కంటే అధిక పొదుపు రేటును నమోదుచేసుకున్నాయి.
- ✔ ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలలో తక్కువ సేవింగ్స్ రేటు కనిపించింది. అధిక సంఖ్యలో ఆ రాష్ట్రాల నుంచి వలసలు దీనికి కారణం కావచ్చు.
- ✔ పట్టణ పేదరికం మరింత తగ్గుతుందని విశ్వసిస్తున్నాము.

రూపాయి రక్షణలో కరుగుతున్న 'ఫారెక్స్'!

- డిసెంబర్ 27తో ముగిసిన వారంలో 4.112 బిలియన్ డాలర్లు డౌన్
- 640.279 బిలియన్ డాలర్లుగా నమోదు



ముంబై: రూపాయి మారకం విలువ ఒడిదుడుకులు లేకుండా స్థిరంగా కొనసాగడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఫారెక్స్ నిల్వలను వినియోగిస్తున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. సెప్టెంబర్ చివరిలో 704.885 బిలియన్ ఆల్ టైమ్ గరిష్టానికి చేరిన ఫారెక్స్ నిల్వలు, డిసెంబర్ 27వ తేదీతో ముగిసిన వారానికి 640.279 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అంతక్రితం వారం (డిసెంబర్ 21) వారంతో పోల్చితే ఏకంగా 4.11 బిలియన్ డాలర్లు తగ్గాయి. డాలర్లకు డిమాండ్ తగ్గించడానికి తద్వారా రూపాయి విలువ స్థిరత్వానికి బ్యాంకులు, ఫారెక్స్ ట్రేడర్లకు ఆర్‌బీఐ తగిన స్థాయిలో అమెరికన్ కరెన్సీని అందుబాటులో ఉంచుతున్నట్లు నిపుణుల విశ్లేషణ. ఫారెక్స్‌లో ప్రధాన విభాగాలను పరిశీలిస్తే..

- డాలర్లలో పేర్కొనే ఫారెన్స్ కరెన్సీ అసెట్స్ విలువ 4.641 బిలియన్ డాలర్లు తగ్గి 551.921 బిలియన్ డాలర్లకు చేరింది.
- పసిడి నిల్వలు 541 మిలియన్ డాలర్లు తగ్గి, 66.268 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి.
- ఐఎంఎఫ్ వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్)కు సంబంధించి పరిమాణం 12 మిలియన్ డాలర్లు తగ్గి 17.873 బిలియన్ డాలర్లకు తగ్గింది.
- ఐఎంఎఫ్ వద్ద నిల్వల పరిస్థితి యథాతథంగా 4.217 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

విస్తరిస్తున్న ఓఎన్‌డీసీ

7 లక్షలకుపైగా నమోదు



న్యూఢిల్లీ: చిన్న వ్యాపారాల కోసం డిజిటల్ కామర్స్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రారంభించిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటివరకు 7 లక్షలకుపైగా విక్రేతలు, సర్వీస్ ప్రొవైడర్లు నమోదయినట్లు కేంద్రం వెల్లడించింది. 2021లో ప్రభుత్వం చొరవతో ఓఎన్‌డీసీ ప్రారంభమైంది. చిన్న రిటైలర్లు తమ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లో విస్తరించుకోవడానికి ఓఎన్‌డీసీ దోహదపడుతుంది. ఈ-కామర్స్ రంగంలో పెద్ద సంస్థల ఆధిపత్యాన్ని ఈ ప్లాట్‌ఫామ్ తగ్గిస్తుంది. అన్ని రకాల ఈ-కామర్స్ కోసం ఓపెన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు దీని లక్ష్యం. లాభాపేక్షలేకుండా ఇది సేవలను అందిస్తోంది. విక్రేతలు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లు, లేదా పేమెంట్ గేట్‌వే ఆపరేటర్లు స్వచ్ఛందంగా అనుసరించాల్సిన ప్రమాణాలను ఇందులో పొందుపరచడం జరిగింది. ఓఎన్‌డీసీ చిన్న వ్యాపారాలను బలోపేతం చేయడంలో అలాగే ఈ-కామర్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఓఎన్‌డీసీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఓఎన్‌డీసీ చిన్న వ్యాపారాలకు విస్తృత స్థాయి వేదికను కల్పించినట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. ఓఎన్‌డీసీ ఇప్పటి వరకూ 200 నెట్‌వర్క్ భాగస్వామ్యులతో 150 మిలియన్ల లావాదేవీలు పూర్తి చేసింది.

ఈజ్‌మైట్రిప్ షేర్ల విక్రయం

1.4 శాతం వాటా అమ్మకం



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ట్రావెల్‌టెక్ అగ్రిగేటర్ ఈజీమైట్రిప్ సహప్రమోటర్ నిశాంత్ పిట్టీ తాజాగా కంపెనీలో మైనారిటీ వాటాను విక్రయించారు. వ్యక్తిగత కారణాల రీత్యా 1.4 శాతం వాటానుఓపెన్ మార్కెట్ ద్వారా అమ్మివేశారు. నిశాంత్ ఇటీవలే కంపెనీ సీఈవో పదవికి రాజీనామా చేశారు. దీంతో వాటా విక్రయం ప్రాధాన్యతను సంతరించుకుంది. నిశాంత్ సోదరుడు, కంపెనీ సహవ్యవస్థాపకుడు రికాంత్ పిట్టీ జనవరి 1నుంచి ఈ బాధ్యతలు స్వీకరించినట్లు సోషల్ మీడియా ద్వారా ఈజ్‌మైట్రిప్ వెల్లడించింది. కంపెనీ పటిష్ట వృద్ధి బాటలో సాగుతున్నట్లు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. మరోపక్క నిశాంత్ సైతం ఇకపై తన వాటాను అమ్మబోనని పేర్కొన్నారు. ఇది కంపెనీపట్ల విశ్వాసం లేకపోవడంకాదని, వ్యక్తిగత అవసరాల రీత్యా మాత్రమే స్వల్ప వాటాను విక్రయించానని తెలియజేశారు. కంపెనీకి మంచి భవిష్యత్ ఉన్నదని అభిప్రాయపడ్డారు. కాగా.. 1.4 శాతం వాటాకు సమానమైన 4.99 కోట్ల షేర్ల విక్రయం ద్వారా నిశాంత్ రూ. 78 కోట్లు అందుకున్నారు.

ఎన్ఎస్ఈలో కంపెనీ మాతృ సంస్థ ఈజీ ట్రిప్ ప్లానర్స్ షేరు 1 శాతం బలపడి రూ. 15.47 వద్ద ముగిసింది.

ద్రవ్యోల్బణం 'లెక్క' మారుతోంది

కసరత్తు షురూ.. ● 18 మందితో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం బేస్ ఇయర్ మార్పు కసరత్తు ప్రారంభమైంది. 18 మంది సభ్యులతో కూడిన ఈ వర్కింగ్ గ్రూప్‌నకు నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం ఉన్న బేస్ ఇయర్ 2011-12ను 2022-23కు మార్పు సిఫారసులు చేయడం ఈ గ్రూప్ ఏర్పాటు ప్రధాన లక్ష్యం. దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థితిగతుల్లో మరింత పారదర్శకతల తీసుకురావడం లక్ష్యంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గ్రూప్ టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) ప్రకారం.. ఎకానమీలో వచ్చిన మార్పులకు అనుగుణంగా డబ్ల్యూపీఐతోపాటు ఉత్పత్తిదారుల ధర సూచీ (పీపీఐ) ఏర్పాటుకు వర్కింగ్ గ్రూప్ సూచనలు చేస్తుంది.

ఉత్పత్తిదారుల ధర సూచీ వైపు మార్పు!

పీపీఐలో ఉత్పత్తులపై సిఫారసులతోపాటు, ధరల సేకరణ వ్యవస్థ సమీక్ష, మెరుగునకు సూచనలు, డబ్ల్యూపీఐ నుంచి పూర్తిగా పీపీఐకి మారడానికి రోడ్ మ్యాప్ రూపకల్పన కూడా వర్కింగ్ గ్రూప్ బాధ్యతల్లో కొన్ని. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ఆర్థిక వ్యవహారాల విభాగం, గణాంకాల మంత్రిత్వ శాఖ, వ్యవసాయ విభాగం, విని యోగదారుల వ్యవహారాల విభాగం, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ నుండి ఈ గ్రూప్‌లో ప్రతినిధులు ఉన్నారు. ఆర్థికవేత్త సుర్జిత్ భల్లా, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యు రా లు షామికా రవి, క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి, కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ అసెట్ నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిలేష్ షా, బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిలించ్ చీఫ్ ఎకనామి స్ట్ కో హెడ్ ఇంద్రనిల్ సేన్‌గుప్తా ప్రత్యేక ఆహ్వానిత సభ్యులుగా గ్రూప్‌లో బాధ్యతలు నిర్వహిస్తారు.

ప్రస్తుత డబ్ల్యూపీఐలో 697 ఉత్పత్తులు

ప్రస్తుతం డబ్ల్యూపీఐలో 697 ఉత్పత్తులు ఉన్నాయి. ఇందులో ప్రైమరీ ఆర్టికల్స్ సంఖ్య 117. ఫ్యూయల్ అండ్ పవర్ విభాగంలో 16, తయారీ రంగంలో 564 ఉత్పత్తులు ఉన్నాయి. ధరల పెరుగుదల ధోరణులను గుర్తించడానికి ప్రస్తుతం ప్రధానంగా రెండు సూచీలు ఉన్నాయి. ఇందులో ఒకటి డబ్ల్యూపీఐకాగా, మరొకటి వినియోగ ధరల సూచీ (పీపీఐ). రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన సమీక్షకు వినియోగ ధరల సూచీ ప్రధాన ప్రాతిపదికగా ఉంది. 2 శాతం అటుఇటుగా 4 శాతం వద్ద సీపీఐ ఉండేలా చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. 1942లో డబ్ల్యూపీఐ విధానాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో 1939 బేస్ ఇయర్‌గా ఉంది. అటు తర్వాత ఏడు సార్లు (1952-53, 1961-62, 1970-71, 1981-82, 1993-94, 2004-05, 2011-12) బేస్ ఇయర్‌లు మారాయి. ప్రస్తుత 2011-12 బేస్ ఇయర్ 2017 మేలో ప్రారంభమైంది. తాజా గణాంకాల ప్రకారం, నవంబర్‌లో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 1.89 శాతంగా నమోదైంది. ఇక వృద్ధి లక్ష్యంగా రేటు తగ్గింపును (సరళతర వడ్డీరేట్ల విధానం) కోరుతున్న ప్రభుత్వం- రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాల్లో ఆహార ధరలను మినహాయించాలని కేంద్రం సూచిస్తోంది. అవసరమైతే పేదలకు ఫుడ్ కూపన్ల జారీ ప్రతిపాదనను సైతం ఆర్థిక సర్వే ప్రస్తావిస్తోంది. ఈ విధానాన్ని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంతదాస్ వ్యతిరేకించడం గమనార్హం.

చమురు, గ్యాస్‌కు పటిష్ఠ డిమాండ్

- 2025-26పై ఇండియా రేటింగ్స్ అంచనా
- డౌన్‌స్ట్రీమ్ కంపెనీలకు అదనపు రుణ భారం
- అప్‌స్ట్రీమ్ కంపెనీల క్రెడిట్ ప్రొఫైల్‌పై ధరల ఎఫెక్ట్



న్యూఢిల్లీ: త్వరలో ప్రారంభంకానున్న కొత్త ఆర్థిక సంవత్సరం(2025-26)లో దేశీయంగా చమురు, గ్యాస్‌లకు పటిష్ఠ డిమాండ్ కనిపించనున్నట్లు ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ తాజాగా అంచనా వేసింది. అయితే ప్రపంచస్థాయిలో డిమాండ్ నీరసించే వీలున్నదని, దీంతో చమురు శుద్ధి(రిఫైనింగ్) మార్జిన్లు బలహీనపడవచ్చని పేర్కొంది. పెట్రోలియం ప్రొడక్టులకు నెలకొనే భారీ డిమాండ్ కారణంగా డౌన్‌స్ట్రీమ్(రిఫైనింగ్) కంపెనీల క్రెడిట్ ప్రొఫైల్ స్థిరంగా కొనసాగే అవకాశమున్నట్లు అభిప్రాయపడింది. స్థూల రిఫైనింగ్ మార్జిన్లు(జీఆర్ఎం) మందగించినప్పటికీ బలమైన మార్కెటింగ్ మార్జిన్లు కంపెనీలకు అండగా నిలవనున్నట్లు తెలియజేసింది. వెరసి పటిష్ట నిర్వహణ లాభాలు(ఇబిటా) ఆర్జించే వీలున్నట్లు అంచనా వేసింది. నిర్మాణంలో ఉన్న రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టుల నేపథ్యంలో ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలన్నిటికీ అదనపు రుణ భారానికి అవకాశమున్నట్లు వివరించింది. అయితే చమురు ఉత్పాదక(అప్‌స్ట్రీమ్) కంపెనీల క్రెడిట్ ప్రొఫైల్ ముడిచమురు ధరలపై ఆధారపడనున్నట్లు 2025-26 ఆయిల్ అండ్ గ్యాస్ ఔట్‌లుక్‌పై విడుదల చేసిన నివేదికలో రేటింగ్ సంస్థ ఇండియారేటింగ్స్ వివరించింది.

ఇబిటాకు ఆధారం

రేటింగ్ సంస్థ నివేదిక ప్రకారం చమురు ధరల ఒత్తిడి, పురాతన క్షేత్రాల నుంచి ఉత్పత్తి తగ్గడం వంటి అంశాల నేపథ్యంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఇబిటా క్షీణించవచ్చు. అయితే కొత్త డిస్కవరీల నుంచి చమురు ఉత్పత్తి పెరగడం, ఉత్పాదకతపై ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ తొలగింపు వంటి అంశాలు చమురు ధరల క్షీణత ప్రభావానికి చెక్ పెట్టే వీలుంది. దేశీయంగా చమురు, గ్యాస్‌కు భారీ డిమాండ్ నెలకొనవచ్చని, ఇది రిఫైనింగ్, పెట్రోకెమికల్ సామర్థ్యాల విస్తరణకు దారి తీసే వీలున్నదని ఇండియారేటింగ్స్ కార్పొరేట్స్ విభాగం అసోయేట్ డైరెక్టర్ భాను పట్నీ పేర్కొన్నారు. రానున్న రెండు, మూడేళ్లలో రిఫైనరీ సామర్థ్యం 22 శాతం బలపడవచ్చని అంచనా వేశారు. చమురు, గ్యాస్ విభాగాలలో పెట్టుబడి నిర్ణయాలను డిమాండ్ ప్రభావితం చేయనున్నట్లు అభిప్రాయపడ్డారు.

జీఆర్ఎంలు వీక్

ఈ ఏడాది తొలి అర్ధభాగాన్ని ప్రతిఫలిస్తూ వచ్చే ఏడాది జీఆర్ఎంలు మందగించవచ్చు. ఇందుకు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు, పరిశ్రమల నుంచి డిమాండ్ నీరసించడం ప్రభావం చూపే వీలుంది. చైనాను ప్రధానంగా పేర్కొనవచ్చు. వీటికితోడు గ్లోబల్‌స్థాయిలో రిఫైనరీ సామర్థ్యాలు పెరగడం కారణంకానున్నాయి. దేశీయంగా పెట్రోలియం ప్రొడక్టులకు డిమాండ్ కొనసాగనుంది. డీజిల్, పెట్రోల్, ఎల్‌పీజీకి బల్క్ డిమాండ్ కనిపించనుంది. చమురు ధరల క్షీణత, నిలకడైన రిటైల్ ధరల కారణంగా సమీకృత కార్యకలాపాలుగల ఓఎంసీలకు ఈ తొలి అర్ధభాగంలో లభించిన మార్కెటింగ్ మార్జిన్లు మద్దతివ్వనున్నాయి. సమీకృత రిఫైనర్స్, స్టాండెలోన్ పెట్‌కెమ్ సంస్థల ఇబిటా వచ్చే ఏడాది మెరుగుపడనుంది. 2024 ఒత్తిడి తదుపరి ఈ ఏడాదిలోనే పెట్‌కెమ్ ఇబిటా బలపడటం మొదలైంది. బ్యారల్ ధర 65 డాలర్లకు ఎగువన కొనసాగితే అప్‌స్ట్రీమ్‌కంపెనీలు పటిష్ట మార్జిన్లు ఆర్జించే వీలుంది. ఒక్కో బ్యారల్‌పై 40-45 డాలర్లస్థాయిలో ఉత్పత్తి వ్యయాల బ్రేక్‌ఈవెన్‌కు చాన్స్ ఉంది. దీంతో బ్యారల్‌పై 20-30 డాలర్ల ఇబిటా ఆర్జించవచ్చు. ముడిచమురు ధరలు ప్రపంచ రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై ఆధారపడి కదులుతాయి. మరోవైపు డిమాండ్, ఒపెక్ దేశాల ఉత్పాదక లక్ష్యాలు సైతం ప్రభావం చూపుతాయి. దేశీయంగా విండ్‌ఫాల్ పన్ను తొలగింపుతో చమురు ధరల క్షీణత దేశీ అప్‌స్ట్రీమ్ కంపెనీలకు లబ్ధిని చేకూర్చగలదు.

సిటీ గ్యాస్ ఓకే

వచ్చే ఏడాది దేశీ చౌక గ్యాస్ కేటాయింపులు తగ్గిన తదుపరి రానున్న ఏడాదిలో సిటీ గ్యాస్ పంపిణీ(సీజీడీ) సంస్థల క్రెడిట్ ప్రొఫైల్ స్థిరంగా కొనసాగవచ్చని ఇండియారేటింగ్స్ నివేదిక పేర్కొంది. మూలధన పెట్టుబడులపై రాబడి మందగించవచ్చు. అయితే పటిష్టస్థాయిలోనే నమోదయ్యే వీలుంది. కొత్త ప్రాంతాలలో పెట్టుబడుల వెచ్చింపుపై కొంత మేర ఒత్తిళ్లు నెలకొనవచ్చు. పెట్టుబడి వినియోగ అంతర్గత వనరులు తగ్గే వీలుంది. క్రాక్ స్ప్రెడ్స్(మార్జిన్ల అంతరం) మెరుగుపడటం, అధిక సరఫరా పరిస్థితులు ఉపశమించడం వంటి కారణాలతో విడిగా(స్టాండెలోన్) పెట్రోకెమికల్ కంపెనీలు పటిష్ట పనితీరును ప్రదర్శించే వీలుంది. 2019-24 మధ్య కాలంలో ప్రధానంగా చైనా నుంచి భారీ సామర్థ్యాలు జత కలవడం అధిక సరఫరాలకు దారి తీసిన సంగతి తెలిసిందే.

టెలికం ఆపరేటర్ల ఆదాయంలో 10 శాతం వృద్ధి

- సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.91,426 కోట్లు
- కలిసొచ్చిన టారిఫ్‌ల పెంపు
- ట్రాయ్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: టెలికం ఆపరేటర్ల స్థూల ఆదాయం 2024 సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో 10.5 శాతం వృద్ధి చెంది రూ.91,426 కోట్లుగా నమోదైంది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్/దీనిపైనే ప్రభుత్వం పన్నులు వసూలు చేసేది) 13 శాతం పెరిగి రూ.75,310 కోట్లకు చేరింది. ఈ వివరాలను టెలికం రంగ నియంత్రణ సంస్థ (ట్రాయ్) విడుదల చేసింది. గతేడాది జూలైలో ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా తమ మొబైల్ టెలిఫోనీ చార్జీలను 11-25 శాతం మధ్య పెంచడం తెలిసిందే. ఈ పెంపు అనంతరం సగటు యూజర్ నుంచి వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) పెరిగింది. కానీ, అదే సమయంలో సబ్‌స్క్రయిబర్లను కొంత మేర కోల్పోవాల్సి వచ్చింది. టెలికం కంపెనీల నెలవారీ ఏఆర్‌పీయూ సెప్టెంబర్ త్రైమాసికంలో 10 శాతం పెరిగి రూ.172.57కు చేరింది. జూన్ త్రైమాసికంలో ఇది 157.45గా ఉంది. ప్రీపెయిడ్ కనెక్షన్ల ఏఆర్‌పీయూ రూ.171గా ఉంటే, పోస్ట్ పెయిడ్ కనెక్షన్లకు రూ.190.67గా నమోదైంది. మొబైల్ చందాదారులు 1.68 కోట్ల మంది తగ్గి 115.37 కోట్లకు పరిమితమయ్యారు. జూన్ క్వార్టర్ చివరికి చందాదారుల సంఖ్య 117 కోట్లుగా ఉంది.

కంపెనీల వారీగా ఏజీఆర్

భారతీ ఎయిర్‌టెల్ ఏజీఆర్ 24 శాతం పెరిగి రూ.24,633 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో ఏజీఆర్ 14 శాతం వృద్ధితో రూ.26,652 కోట్లకు.. వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ 4 శాతం పెరిగి రూ.7,837 కోట్లుగా నమోదయ్యాయి. సెప్టెంబర్ త్రైమాసికానికి టెలికం కంపెనీల నుంచి ప్రభుత్వం వసూలు చేసిన లైసెన్స్ ఫీజు 13 శాతం పెరిగి రూ.6,023 కోట్లకు చేరింది.

వస్త్రాల ఎగుమతులు రూ.1.82 లక్షల కోట్లు

- ఏడు నెలల్లో ఏడు శాతం వృద్ధి
- 41 శాతం రెడీమేడ్ విభాగంలోనే
- కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్, అప్పారెల్ (వస్త్రాలు, దుస్తులు) ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఏడు నెలల కాలంలో (ఏప్రిల్-అక్టోబర్) 21.35 బిలియన్ డాలర్లకు (రూ.1.82 లక్షల కోట్లు) వృద్ధి చెందాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఎగుమతులు 20 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే ఏడు శాతం వృద్ధి నమోదైంది. 8,733 మిలియన్ డాలర్ల ఎగుమతులు (మొత్తం ఎగుమతుల్లో 41 శాతం) రెడీమేడ్ వస్త్ర విభాగంలోనే నమోదయ్యాయి. కాటన్ టెక్స్‌టైల్స్ విభాగం నుంచి 7,082 మిలియన్ డాలర్లు (33 శాతం), మనుషుల తయారీ టెక్స్‌టైల్స్ ఎగుమతులు 3,105 మిలియన్ డాలర్లు (15 శాతం) చొప్పున ఉన్నట్టు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ గణాంకాలు విడుదల చేసింది. వూల్ విభాగంలో 19 శాతం, హ్యాండ్లూమ్ విభాగంలో 6 శాతం చొప్పున ఎగుమతులు క్షీణించగా, మిగిలిన అన్ని విభాగాల్లో ఎగుమతుల వృద్ధి నమోదైనట్టు వెల్లడించింది. మరోవైపు ఇదే కాలంలో టెక్స్‌టైల్స్, అప్పారెల్ దిగుమతులు ఒక శాతం క్షీణించి 5,425 మిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ప్రకటించింది. అత్యధికంగా మ్యాన్ మేడ్ టెక్స్‌టైల్స్ దిగుమతులు 1,859 మిలియన్ డాలర్లు (34 శాతం)గా ఉన్నాయి. కాటన్ టెక్స్‌టైల్స్ విభాగంలో, ప్రధానంగా కాటన్ ఫైబర్ దిగుమతులు పెరిగినట్టు టెక్స్‌టైల్స్ శాఖ నివేదిక వెల్లడించింది. ఇది దేశీ తయారీ సామర్థ్యం పెరగడాన్ని సూచిస్తున్నట్టు పేర్కొంది.

అంతర్జాతీయంగా 3.9 శాతం వాటా..

2023-24లో టెక్స్‌టైల్స్, అప్పారెల్ దిగుమతులు 8.94 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 15 శాతం తగ్గాయి. 2023 సంవత్సరం టెక్స్‌టైల్స్ ఎగుమతుల్లో భారత్ అంతర్జాతీయంగా ఆరో అతిపెద్ద దేశంగా నిలిచింది. ''టెక్స్‌టైల్స్, అప్పారెల్ అంతర్జాతీయ మార్కెట్లో మన దేశ వాటా 3.9 శాతంగా ఉంది. యూఎస్ఏ, ఈయూ 47 శాతం వాటాతో భారత్‌కు అతి పెద్ద ఎగుమతి కేంద్రాలుగా ఉన్నాయి. టెక్స్‌టైల్స్, అప్పారెల్ పరంగా వాణిజ్య మిగులుతో మన దేశం ఉంది.''అని టెక్స్‌టైల్స్ శాఖ వెల్లడించింది.

గొప్ప గుర్తింపే... కానీ ఇక్కడితోనే ఆగిపోను!



‘ఖేల్‌రత్న’పై హాకీ స్టార్ హర్మన్‌ప్రీత్ సింగ్

అమృత్‌సర్ శివారు గ్రామంలోని రైతు బిడ్డ హర్మన్‌ప్రీత్ సింగ్. హాకీలో మేటి ఆటగాడిగా ఎదిగాడు. దశాబ్దాల తర్వాత ఒలింపిక్స్ చరిత్రలో వరుస పతకాలు సాధించిన జట్టును నడిపించిన అతన్ని ప్రతిష్టాత్మక ‘మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న’ అవార్డుకు ఎంపిక చేశారు. ఈసారి హర్మన్‌తో పాటు ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్, ఒలింపిక్స్ ‘డబుల్ ధమాకా’ మనూ భాకర్ (షూటింగ్), పారాలింపిక్ చాంప్ ప్రవీణ్‌లను ఆ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తన హాకీ ప్రయాణం, ప్రతిష్టాత్మక అవార్డు సాఫల్యంపై హర్మన్ హర్షం వ్యక్తం చేశాడు.

ప్రపంచకప్ పతకమే తదుపరి లక్ష్యం ● సహచరులు తోడ్పాటు అద్భుతం

న్యూఢిల్లీ: అత్యున్నత క్రీడా పురస్కారం ‘మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న’కు ఎంపికైన భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో ఇదో గొప్ప సాఫల్యమన్నాడు. అయితే ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డుతోనే మురిసిపోనని, కెరీర్‌లో మరెన్నో మైలురాళ్లు సాధించాలని ఉవ్విళ్లూరుతున్నట్లు చెప్పాడు. టోక్యో-2020, పారిస్-2024 ఒలింపిక్స్‌లలో భారత హాకీ జట్టు వరుసగా కాంస్య పతకాలు సాధించింది. ఇందులో స్టార్ డ్రాగ్ ఫ్లికర్ హర్మన్ కీలక భూమిక పోషించాడు. భారత అత్యున్నత క్రీడా పురస్కారానికి ఎంపికైన హర్మన్ మీడియాతో తన ఆనందాన్ని పంచుకున్నాడు. ఆ విశేషాలు అతని మాటల్లోనే...

ఈ పయనం ఎంతో నేర్పింది

హాకీలో నా ప్రయాణం నాకెంతో నేర్పింది. ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కొన్నింటా గెలిచాం. మరి కొన్ని మ్యాచ్‌ల్లో ఓడాం. కానీ ఫలితాలేవైనా నాకన్నీ అవి అనుభవ పాఠాలే. కెరీర్ మొదలైన రోజే నేనెలా ఎలా మెరుగవ్వాలి. ఏం చేయాలని నా మనసుకు స్వీయ లక్ష్యాన్ని పెట్టుకున్నాను. ఇప్పుడు జట్టుగా... సహచరులతో కలిసికట్టుగా విజయవంతమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఒలింపిక్స్ పతకాల్లో, నా ‘ఖేల్‌రత్న’లో సహచరుల అండదండలున్నాయి.

ప్రపంచకప్ పతకమే లక్ష్యం

హాకీలో అడుగు పెట్టిన 2014 నుంచి ఇప్పటి వరకు ప్రతీ మ్యాచ్‌ను ఆస్వాదించాను. విజయానుభూతిని అనుభవించాను. ఓటమిని జీర్ణించుకున్నాను. ఇలా నేనెంచుకున్న క్రీడలో ప్రతీక్షణం సంతృప్తికరంగానే గడిచింది. అయితే ఇప్పుడు నా ప్రధాన లక్ష్యం ప్రపంచకప్ పతకమే! బెల్జియంలో వచ్చే ఏడాది జరిగే ఈవెంట్‌లో భారత్‌ను సన్నద్ధం చేయడానికి తగిన సమయం లభించింది. ఒలింపిక్స్‌లో స్వర్ణం, మేజర్ టోర్నీల్లో విజయాలే మా జట్టు లక్ష్యాలు. దీనికోసం ఒక్కోఅడుగు ముందుకు వేయాల్సి ఉంటుంది.

ఇప్పుడప్పుడే రిటైర్మెంటా?

ఇప్పుడైతే దృష్టంతా ఆటపైనే ఉంది. రిటైర్మెంట్‌కు చాలా సమయం ఉంది. ప్రపంచకప్, ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు మిగిలే ఉన్నాయి. జట్టును పరిస్థితులకు తగ్గట్లుగా తయారు చేసి మేజర్ ఈవెంట్లలో గట్టి ప్రత్యర్థిగా బరిలోకి దించే కసరత్తు నిరంతరం చేస్తూనే ఉంటాం. ముఖ్యంగా మ్యాచ్‌ల్లో టీమ్ కాంబినేషనే అత్యంత కీలకమవుతుంది. గెలిచినపుడు పొంగిపోయినట్లే ఓడినపుడు కుంగిపోకుండా ఎక్కడ లోపం జరిగిందో దృష్టిపెట్టి అధిగమించాల్సి ఉంటుంది.

కరుణ్ నాయర్ కొత్త రికార్డు

లిస్ట్ ‘ఎ’ క్రికెట్‌లో అవుట్ కాకుండా అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా గుర్తింపు

విజయ్ హజారే టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు ఆడి 542 పరుగులు చేసిన విదర్భ బ్యాటర్



సాక్షి, విజయనగరం: సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. లిస్ట్ ‘ఎ’ క్రికెట్‌లో వరుస మ్యాచ్‌ల్లో వికెట్ కోల్పోకుండా అత్యధిక పరుగులు (542) చేసిన ప్లేయర్‌గా విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ రికార్డుల్లోకెక్కాడు. న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ (527 పరుగులు; 2010లో) ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ టోర్నీలో భీకర ఫామ్‌లో ఉన్న నాయర్... వరుసగా మూడో సెంచరీతో చెలరేగాడు. విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ ‘డి’లో భాగంగా ఉత్తరప్రదేశ్‌తో మ్యాచ్‌లో కరుణ్ ఈ ఫీట్ సాధించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 307 పరుగులు చేసింది. సమీర్ రిజ్వీ (82 బంతుల్లో 105; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీ చేశాడు. అనంతరం కరుణ్ నాయర్ (101 బంతుల్లో 112; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశ్ రాథోడ్ (140 బంతుల్లో 138 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో విజృంభించడంతో విదర్భ జట్టు 47.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 313 పరుగులు చేసి గెలిచింది.

ఖోఖో ప్రపంచకప్ ట్రోఫీల ఆవిష్కరణ

మస్కట్లుగా తార, తేజస్ ● 13 నుంచి తొలి ఖోఖో మెగా ఈవెంట్ ● 19న టైటిల్ పోరు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచే పురుషులు, మహిళా జట్లకు అందజేసే ట్రోఫీలను శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించారు. పురుషుల విభాగంలో నీలి రంగు ట్రోఫీని బహూకరించనుండగా, మహిళలకు ఆకుపచ్చ రంగు ట్రోఫీని ప్రదానం చేస్తారు. ఈ మెగా ఈవెంట్‌లో కనువిందు చేసే మస్కట్లకు తార, తేజస్ అని పేర్లు పెట్టారు. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ ట్రోఫీలను ఆవిష్కరించి, మస్కట్‌లను మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళల విభాగాల్లో భారత్ నుంచి రెండేసి జట్లు చొప్పున బరిలోకి దిగుతాయన్నారు. భారత్ ‘ఎ’, భారత్ ‘బి’ నాలుగు జట్లను ఈ నెల 8న ఎంపిక చేస్తామని, ప్రస్తుతం ఇరు విభాగాల్లో 60 మంది ప్లేయర్ల చొప్పున జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ తొలి ఖోఖో ప్రపంచకప్‌లో 24 దేశాలకు చెందిన జట్లు పాల్గొంటాయని, ఇండోనేసియా కేవలం మహిళల జట్టునే పంపిస్తుండగా మిగతా 23 దేశాలు ఇరు జట్లను పంపేందుకు సిద్ధంగా ఉన్నాయని సుధాన్షు వివరించారు. మొత్తం 615 మంది క్రీడాకారులు, 125 మంది సహాయ సిబ్బంది కోసం ప్రముఖ కార్పొరేట్ సంస్థ జీఎంఆర్ బస, తదితర ఏర్పాట్లకు స్పాన్సర్‌షిప్ చేస్తోందని చెప్పారు. అయితే పాకిస్తాన్ జట్లకు ఇంకా వీసాలు మంజూరు కాలేదని, త్వరలోనే ఇది కొలిక్కి వస్తుందని... పాక్ జట్లు కూడా షెడ్యూల్ ప్రకారం టోర్నీలో పాల్గొంటాయని మిట్టల్ వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం, గ్రేటర్ నోయిడాలోని ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు లీగ్ దశ పోటీలు జరుగుతాయి. తొలి మ్యాచ్‌లో భారత్, పాక్ జట్లు పోటీపడతాయి. 17 నుంచి నాకౌట్ దశ మొదలవుతుంది. ఆ రోజు క్వార్టర్ ఫైనల్స్, 18న సెమీస్, 19న జరిగే ఇరు విభాగాల ఫైనల్స్‌తో ప్రపంచకప్ టోర్నీ ముగుస్తుంది.

సెమీస్‌లో సహజ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి మరో సంచలన విజయం సాధించింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 284వ ర్యాంకర్ సహజ 6-3, 5-7, 6-3తో ప్రపంచ 190వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ మరియా మాటీస్ (అమెరికా)పై గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సహజ మూడో సీడ్, 214వ ర్యాంకర్ హీన్ షి (చైనా)ను బోల్తా కొట్టించింది. నేడు జరిగే సెమీఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ 153వ ర్యాంకర్ కథింక వోన్ డెష్మన్ (లిష్టన్‌స్టయిన్)తో సహజ తలపడుతుంది.

జొకోవిచ్‌కు చుక్కెదురు

అమెరికా ప్లేయర్ రీలీ ఒపెల్కా చేతిలో పరాజయం





బ్రిస్బేన్: కెరీర్‌లో 100వ సింగిల్స్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో కొత్త ఏడాదిలో బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఆశించిన ఫలితం రాలేదు. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో టాప్ సీడ్ జొకోవిచ్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ జొకోవిచ్ 6-7 (6/8), 3-6తో అమెరికాకు చెందిన 293వ ర్యాంకర్ రీలీ ఒపెల్కా చేతిలో ఓడిపోయాడు. 2009లో ఒక్కసారి మాత్రమే ఈ టోర్నీలో ఆడి తొలి రౌండ్‌లో ఓడిపోయిన జొకోవిచ్‌కు ఈసారి కూడా టోర్నీ కలిసి రాలేదు. 1 గంట 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒపెల్కా ఏకంగా 16 ఏస్‌లు సంధించాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకున్నారు. నిర్ణాయక టైబ్రేక్‌లో ఒపెల్కా పైచేయి సాధించి తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో ఒకసారి జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకున్న ఒపెల్కా తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించాడు. 6 అడుగుల 11 అంగుళాల ఎత్తు, 102 కేజీల బరువున్న ఒపెల్కా 2022లో కెరీర్ బెస్ట్ 17వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత గాయం కారణంగా 2023లో కేవలం ఒక టోర్నీలోనే ఆడాడు. గాయం నుంచి కోలుకుని 2024లో పలు టోర్నీల్లో ఆడినా ఒక్క టైటిల్ కూడా సాధించకపోవడంతో అతని ర్యాంక్ పడిపోయింది.

పంజాబ్ పరుగుల జాతర

వరుసగా రెండో మ్యాచ్‌లో 400 పైచిలుకు స్కోరు

- ప్రభ్‌సిమ్రన్ సింగ్ సెంచరీ
- అభిషేక్, రమణ్‌దీప్ మెరుపులు
- హైదరాబాద్‌కు తప్పని ఓటమి
- నితీశ్ రెడ్డి శతకం వృథా



అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే టోర్నమెంట్‌లో పంజాబ్ పరుగుల జాతర కొనసాగుతోంది. గత మ్యాచ్‌లో సౌరాష్ట్ర బౌలింగ్‌ను చీల్చి చెండాడి 424 పరుగులు చేసిన పంజాబ్ జట్టు... ఈ సారి హైదరాబాద్ బౌలర్లను లక్ష్యంగా చేసుకొని మరోసారి భారీ స్కోరు చేసింది. గ్రూప్ ‘సి’లో భాగంగా శుక్రవారం పంజాబ్‌తో జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 80 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 426 పరుగులు చేసింది. తద్వారా దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో 400 పైచిలుకు పరుగులు చేసిన ఏకైక జట్టుగా రికార్డుల్లోకెక్కింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (105 బంతుల్లో 137; 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) ‘శత’క్కొట్టగా... కెప్టెన్ అభిషేక్ శర్మ (72 బంతుల్లో 93; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు), రమణ్‌దీప్ సింగ్ (53 బంతుల్లో 80; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) దుమ్మురేపారు. తొలి వికెట్‌కు ప్రభ్‌సిమ్రన్, అభిషేక్ కలిసి 24 ఓవర్లలో 196 పరుగులు జోడించి భారీ స్కోరుకు పునాది వేశారు. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (46; 4 ఫోర్లు, 1 సిక్స్), నేహల్ వధేరా (19 బంతుల్లో 35 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా విలువైన పరుగులు చేశారు. పంజాబ్ బ్యాటర్లు తొలి బంతి నుంచి బాదుడే పరమావధిగా చెలరేగడంతో గత మ్యాచ్ కంటే ఆ జట్టు మరో రెండు పరుగులు ఎక్కువ చేయగలిగింది. హైదరాబాద్ బౌలర్లలో ముదస్సిర్, నిశాంత్, అనికేత్ రెడ్డి, తనయ్ తలా ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యం కళ్ల ముందు కనిపిస్తున్నా ఏమాత్రం వెనక్కి తగ్గని హైదరాబాద్ జట్టు 47.5 ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నితీశ్ రెడ్డి (87 బంతుల్లో 111; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకోగా... తనయ్ త్యాగరాజన్ (42 బంతుల్లో 74; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ తిలక్ వర్మ (28), అరవెల్లి అవనీశ్ రావు (19), వరుణ్ గౌడ్ (16), హిమతేజ (18), తన్మయ్ అగర్వాల్ (22) ఎక్కువసేపు నిలవలేకపోవడంతో హైదరాబాద్‌కు పరాజయం తప్పలేదు. పంజాబ్ బౌలర్లలో టీమిండియా పేసర్ అర్‌‌‌ష్‌దీప్ సింగ్ 4 వికెట్లు పడగొట్టాడు. ప్రభ్‌సిమ్రన్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ మూడింట గెలిచి మరో 3 మ్యాచ్‌ల్లో ఓడి 12 పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో ఉంది. ఆదివారం జరగనున్న తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌తో హైదరాబాద్ ఆడనుంది.

స్కోరు వివరాలు

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) హిమతేజ (బి) అనికేత్ రెడ్డి 137; అభిషేక్ శర్మ (సి) మిలింద్ (బి) తనయ్ 93; అన్‌మోల్‌ప్రీత్ (సి) తిలక్ (బి) నిశాంత్ 46; రమణ్‌దీప్ (సి) తనయ్ (బి) ముదస్సిర్ 80; నేహల్ (నాటౌట్) 35; నమన్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 426. వికెట్ల పతనం: 1-196, 2-259, 3-313, 4-409. బౌలింగ్: ముదస్సిర్ 6-0-77-1; మిలింద్ 9-0-96-0; నిశాంత్ 10-0-65-1; అనికేత్ 10-0-67-1; వరుణ్ గౌడ్ 7-0-57-0; తనయ్ 8-0-62-1. **హైదరాబాద్ ఇన్నింగ్స్:** అవనీశ్ (ఎల్బీ) (బి) అభిషేక్ 19; నితీశ్ రెడ్డి (స్టంప్డ్) అన్మోల్ మల్హోత్రా (బి) రఘు 111; తిలక్ (సి) రఘు (బి) నమన్ 28; హిమతేజ (ఎల్బీ) (బి) రఘు 18; వరుణ్ గౌడ్ (బి) రఘు 16; తన్మయ్ అగర్వాల్ (సి) (సబ్) ధలివాల్ (బి) అర్‌‌ష్‌దీప్ 22; తన్మయ్ (సి) నేహల్ (బి) సాన్‌వీర్ సింగ్ 74; మిలింద్ (ఎల్బీ) (బి) అర్‌‌ష్‌దీప్ 0; అనికేత్ (బి) అర్‌‌ష్‌దీప్ 35; ముదస్సిర్ (సి) అన్‌మోల్ (బి) అర్‌‌ష్‌దీప్ 0; నిశాంత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 22; మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 346. వికెట్ల పతనం: 1-67, 2-155, 3-183, 4-192, 5-223, 6-229, 7-229, 8-344, 9-345, 10-346. బౌలింగ్: అర్‌‌ష్‌దీప్ 9.5-0-50-4, బల్‌తేజ్ సింగ్ 6-0-66-0, అభిషేక్ 10-0-74-1; సాన్‌వీర్ 5-0-35-1; రఘు శర్మ 10-0-68-3; నమన్ ధీర్ 7-0-47-1

శశికాంత్ మెరిపించినా...

- మహారాష్ట్ర చేతిలో ఆంధ్ర ఓటమి
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్



ముంబై: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆంధ్ర జట్టుకు అనూహ్య పరాజయం ఎదురైంది. గ్రూప్ ‘బి’లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 5 వికెట్ల తేడాతో మహారాష్ట్ర చేతిలో ఓడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శశికాంత్ (25 బంతుల్లో 52 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ షాట్లతో అజేయ అర్ధశతకం సాధించాడు. అశ్విన్ హెబర్ (85 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్), షేక్ రషీద్ (75 బంతుల్లో 42; 2 ఫోర్లు, 1 సిక్స్), రికీ భుయ్ (47 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్), వినయ్ కుమార్ (40 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. ఈ టోర్నీలో ఫుల్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రీకర్ భరత్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరగడంతో ఆంధ్ర జట్టుకు మంచి ఆరంభం లభించలేదు. ఆఖర్లో శశికాంత్ భారీ షాట్లతో విరుచుకుపడటంతో పోరాడే స్కోరు చేయగలిగింది. మహారాష్ట్ర బౌలర్లలో రజనీశ్ గుర్బానీ 3, ముకేశ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మహారాష్ట్ర 47.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 274 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సిద్దేశ్ వీర్ (124 బంతుల్లో 115 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగగా... రాహుల్ త్రిపాఠి (78 బంతుల్లో 69; 9 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. ఆంధ్ర బౌలర్లలో సందీప్ 2 వికెట్లు తీశాడు. గ్రూప్‌లో 6 మ్యాచ్‌లాడిన ఆంధ్ర 4 విజయాలు, 2 పరాజయాలతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానంలో ఉంది.



రికెల్టన్, బవుమా శతకాల మోత

కేప్‌టౌన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఘనమైన ఆరంభమిచ్చారు. ఓపెనర్ రికెల్టన్ (176 బ్యాటింగ్; 21 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ బవుమా (106; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. దాంతో శుక్రవారం 80 ఓవర్ల ఆటే జరిగినప్పటికీ దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. నిర్ణీత ఓవర్ల కోటా కంటే 10 ఓవర్లు తక్కువే పడినా... వాళ్లిద్దరి శతకాల మోతతో జట్టు అవలీలగా 300 పైచిలుకు స్కోరును దాటేసింది. తొలి సెషన్‌లో తడబడిన ఆతిథ్య జట్టు మార్క్‌రమ్ (17), ముల్డర్ (5), స్టబ్స్ (0) వికెట్లను కోల్పోయింది. 72 పరుగులకే కీలకమైన 3 వికెట్లు కోల్పోయిన దశలో ఓపెనర్ రికెల్టన్‌కు జతయిన కెప్టెన్ బవుమా నాలుగో వికెట్‌కు 235 జోడించడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ దశ మారింది. రికెల్టన్ డబుల్ సెంచరీపై కన్నేయగా... చివరి సెషన్ ముగిసే దశలో అఘా సల్మాన్... బవుమా వికెట్ తీసి భారీ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. మొదటి రోజు ఆట నిలిచే సమయానికి రికెల్టన్‌తో పాటు బెడింగ్‌హామ్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

జింబాబ్వే 243 ఆలౌట్

బులవాయో: స్పిన్ ఆల్‌రౌండర్ సికందర్ రజా (61; 6 ఫోర్లు), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (75; 4 ఫోర్లు, 2 సిక్స్) అర్ధశతకాలతో రాణించడంతో అఫ్గానిస్తాన్‌తో రెండో టెస్టులో జింబాబ్వే మెరుగైన స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ స్కోరు 6/0తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 73.3 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా జింబాబ్వే జట్టుకు 86 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. సీన్ విలియమ్స్ (49; 8 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 4, యామిన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్గానిస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 46 పరుగులు చేసింది. అబ్దుల్ (1), హసన్ (11), హష్మతుల్లా (13) అవుట్ కాగా... రహమత్ షా (18 బ్యాటింగ్), రహమాన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అఫ్గానిస్తాన్ ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 40 పరుగులు వెనుకబడి ఉంది.



కుంభమేళా జరిగే సంగం ప్రాంతంలో గస్తీ విధుల్లో ఎన్ఎస్‌జీ కమాండోలు

మహా కుంభ్‌కు ఘనంగా ఏర్పాట్లు


శుక్రవారం సంగం వద్ద శ్రీ మహానిర్వాణీ అఖాడా సాధువులు

దేశ, విదేశాల నుంచి 40 కోట్ల మంది తరలివస్తారని అంచనా

- 2013 మహాకుంభ్ కంటే మూడు రెట్లు పెద్దదిగా ఏర్పాట్లు
- కుంభ్ నగర్‌కు అత్యంత పటిష్ట భద్రత
- 200 ఛార్టర్డ్ విమానాలు ల్యాండయ్యేందుకు ప్రణాళిక
- మూడు వేల ప్రత్యేక రైళ్లను నడపనున్న రైల్వేశాఖ
- రూ.5 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- తొలిసారిగా ఏఐతో పర్యవేక్షణ

సాక్షి, న్యూఢిల్లీ: పన్నెండేళ్లకోసారి జరిగే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం మహా కుంభ మేళాను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి వరకు 42 రోజుల పాటు గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమ క్షేత్రం ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా జరగనుంది. ఈ సందర్భంగా యాత్రికులు త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ఇందులో జనవరి 13న పుష్య పౌర్ణమిన, 14న మకర సంక్రాంతి, 29న మౌని అమావాస్య, ఫిబ్రవరి 3న వసంత పంచమి, ఫిబ్రవరి 12న మాఘ పౌర్ణమి, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి రోజు చేసే స్నానాలకు ఓ ప్రాముఖ్యత ఉంది. ఈ రాజ స్నానం రోజుల్లో భక్తుల సంఖ్య కోట్లలో ఉండనుం దన్నది అధికారుల అంచనా. కేవలం జనవరి 29న మౌని అమావాస్య రోజున షాహి స్నాన్‌లో గరిష్టంగా 4 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. గతంలో 2013లో జరిగిన మహా కుంభమేళాతో పోలిస్తే ఇప్పుడు జరగనున్న మహాకుంభమేళా మూడు రెట్లు పెద్దదని భావిస్తున్నారు. ఈ పవిత్ర స్నానాల కోసం గతంలో 12 కోట్ల మంది భక్తులు రాగా ఈసారి సుమారు 40 కోట్లకు పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇందుకు తగ్గట్లుగా 40 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మేళా ఏర్పాట్లు విస్తృతంగా సాగుతున్నాయి.

నాలుగు రెట్ల బడ్జెట్

మహాకుంభమేళా నిర్వహణకు ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. గతం కంటే బడ్జెట్ నాలుగు రెట్లు పెంచారు. ఈసారి మహాకుంభ బడ్జెట్ రూ.5,060 కోట్లు కాగా ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,100 కోట్లు ఇచ్చింది. 2013 కుంభ్ సమయంలో రాష్ట్రంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధికారంలో ఉండగా.. అఖిలేష్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 2013లో మహాకుంభ్‌మేళా కోసం రూ.1,214 కోట్ల బడ్జెట్ కేటాయించగా రూ.1,017 కోట్లు ఖర్చు చేశారు. 2025లో మహాకుంభ బడ్జెట్ 2013 కంటే రూ.4,043 కోట్లు ఎక్కువ కావడం విశేషం.

నీటి అడుగునా నిఘాం

మహాకుంభ్ అత్యంత ఆకర్షణీయంగా కనిపించేందుకు ఈసారి విద్యుత్‌కు రూ.391.04 కోట్ల బడ్జెట్ కేటాయించారు. మొత్తం 67 వేల వీధి దీపాలను ఏర్పాటు చేశారు. 85 కొత్త తాత్కాలిక పవర్ ప్లాంట్లు, 170 సబ్ స్టేషన్లు నిర్మించారు. మహాకుంభ్‌లో ఆకాశంతో పాటు డ్రోన్‌ల ద్వారా నీటి అడుగున కూడా నిఘా ఉండనుంది. నీటి అడుగున భద్రత కోసం తొలిసారిగా నదిలోపల 8 కిలోమీటర్ల మేర డీప్ బారికేడింగ్‌ను ఏర్పాటు చేశారు. మహాకుంభ్‌లో అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 25 మెగా ఈవెంట్‌లు జరగనున్నాయి. దీనిని విదేశీ కంపెనీలు రూపొందించాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఒక కార్యక్రమానికి, ప్రధాని నరేంద్ర మోదీ రెండు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. పదికి పైగా దేశాల అధినేతలు రానున్నారు.

38 వేల మంది జవాన్లతో భద్రత

మహాకుంభమేళా జరుగుతున్న కుంభ్ నగర్ భద్రతను దుర్భేద్యమైన కోటలా పటిష్టం చేశారు. కుంభ్ నగర్ మాస్టర్ ప్లాన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భద్రత కోసం 38 వేల మంది సైనికులను మోహరిస్తున్నారు. మొత్తం 56 పోలీస్ స్టేషన్లు, 144 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రెండు సైబర్ స్టేషన్లను విడివిడిగా ఏర్పాటు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ డెస్క్ ఉంటుంది. కాగా, 2013 మహా కుంభ్‌లో దాదాపు 12 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. వీరిలో 12 మంది ఏఎస్పీ, 30 మంది సీఓలు, 409 మంది ఇన్‌స్పెక్టర్లు, 4,913 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

వీఐపీల కోసం మహారాజా టెంట్లు

వీఐపీల కోసం 150 మహారాజా టెంట్లతో కూడిన ప్రత్యేక నగరాన్ని సిద్ధం చేస్తున్నారు. దీనిలో ఒక్కరోజు ఛార్జీ రూ.30 వేలకు పైగా ఉంటుంది. వీటితో పాటు 1,500 సింగిల్ రూమ్‌లు, 400 ఫ్యామిలీ టెంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు డోమ్ సిటీని సిద్ధం చేశారు. వీటి అద్దె లక్షకు పైగా ఉంటుంది. మహాకుంభ్‌లో లక్షన్నర మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. వీటిలో 300 మొబైల్ టాయిలెట్లు ఉన్నాయి. 2013లో మొత్తం 33,903 మరుగుదొడ్లు నిర్మించారు. ఘాట్ వద్ద దాదాపు 10 వేల దుస్తులు మార్చుకునే గదులను నిర్మించనున్నారు. 2013 కుంభ్‌లో దుస్తులు మార్చుకునే గదుల సంఖ్య దాదాపు రెండున్నర వేలుగా ఉన్నాయి.

23 నగరాల నుంచి విమానాలు

మహాకుంభమేళా కోసం రైల్వే శాఖ 3 వేల ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఇది 13 వేలకు పైగా ట్రిప్పులను నడపనుంది. ప్రతిరోజూ 5 లక్షల మంది ప్రయాణికులు జనరల్ కోచ్‌లలో ప్రయాణిస్తారని రైల్వేశాఖ అంచనా వేసింది. ప్రయాగ్‌రాజ్ జంక్షన్‌తో పాటు నగరంలోని 8 రైల్వే స్టేషన్లను సిద్ధం చేశారు. అంతేగాక ఉత్తరప్రదేశ్ రోడ్‌వేస్ వేలకు పైగా బస్సులను ప్రత్యేకంగా నడపనుంది. ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి దేశంలోని దాదాపు 23 నగరాలకు నేరుగా విమానాలు అందుబాటులో ఉంచనున్నారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, భువనేశ్వర్, లక్నో, రాయ్‌పూర్, బెంగళూరు, అహ్మదాబాద్, గౌహతి, కోల్‌కతాలకు నేరుగా విమానాలు నడుస్తాయి. వీటితో పాటు మహాకుంభ్‌కు వీవీఐపీలు, విదేశీ అతిథులకు చెందిన 200కు పైగా చార్టర్డ్ విమానాలు ప్రయాగ్‌రాజ్ రానున్నాయి. ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయంలో కేవలం 15 విమానాలకు మాత్రమే పార్కింగ్ స్థలం ఉంది. అందువల్ల, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నాలుగు రాష్ట్రాల్లోని 11 విమానాశ్రయాల నుంచి పార్కింగ్‌కు సంబంధించిన నివేదికలను అందించాలని కోరింది.

ముయిజ్జు అభిశంసన కుట్రతో మాకు సంబంధం లేదు

మాల్దీవుల్లో పరిణామాలపై 'వాషింగ్టన్ పోస్ట్' కథనాన్ని ఖండించిన భారత్

న్యూఢిల్లీ: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జును అభిశంసించేందుకు అక్కడి ప్రతిపక్షం చేసిన విఫలప్రయత్నంతో భారత్‌కు సంబంధముందంటూ 'వాషింగ్టన్ పోస్ట్'లో వచ్చిన కథనాన్ని కేంద్రం ఖండించింది. భారత్‌పై వ్యతిరేకతను ప్రేరేపించేందుకు ఆ పత్రిక ప్రయత్నిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'ఆ వార్తా పత్రికతోపాటు రిపోర్టర్ కూడా మాల్దీవుల నాయకత్వం భారత్ పట్ల వ్యతిరేకత ధోరణి పెరగాలనే ఉద్దేశంతోనే ఈ కథనాన్ని ప్రచురించినట్లు అనుమానించాల్సి వస్తోంది. అయితే, ఇలాంటి చర్యలు రెండు దేశాల మధ్య సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపించబోవు'అని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఉన్న మాల్దీవుల విదేశాంగ మంత్రి, మన విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ సముద్ర భద్రత, వాణిజ్యం, పెట్టుబడుల్లో సహకారం పెంచుకునేందుకు గల అవకాశాలపై చర్చలు జరిపిన నేపథ్యంలో రణధీర్ జైశ్వాల్ ఈ మేరకు వ్యాఖ్యానించడం గమనార్హం.

వందే భారత్ స్లీపర్ గరిష్ట వేగం గంటకు 180 కిలోమీటర్లు

ట్రయల్‌లో సాధించామన్న రైల్వే శాఖ

న్యూఢిల్లీ: వందే భారత్ స్లీపర్ రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగం అందుకుందని రైల్వే శాఖ శుక్రవారం వెల్లడించింది. రాజస్తాన్‌లోని 40 కిలోమీటర్ల ట్రాక్‌పై గత మూడు రోజులుగా చేపట్టిన ట్రయల్స్ విజయవంతమయ్యాయని వివరించింది. విభిన్న ట్రాక్ పరిస్థితుల్లో ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మక పరిశీలన కొనసాగనుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ వీడియో షేర్ చేశారు. వందే భారత్ స్లీపర్ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. అంత వేగంలోనూ రైల్లో సీటు వద్ద ఉన్న ట్రేలో నిండుగా నింపిన గ్లాసులో నీరు చుక్క కూడా కిందపడకపోవడం విశేషం. ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. రాజస్తాన్‌లోని కోటాలో తొలుత జనవరి ఒకటిన గంటకు 130 కి.మీ.వేగంతో ఈ రైలును నడిపారు. తర్వాత వేగాన్ని క్రమంగా 140, 150, 160 కిలోమీటర్లకు పెంచారు. తాజాగా, గురువారం గరిష్ఠంగా 180 కిలోమీటర్లకు పెంచారు. రాజస్తాన్‌లోని కోటా–లబాన్ స్టేషన్ల మధ్య ఈ రైలు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఆ సమయంలో సాధారణ ప్రయాణికులకు సమానమైన బరువును రైలులో ఉంచారు. ట్రయల్స్ పూర్తయ్యాక గరిష్ఠ వేగంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ పరిశీలన జరుగుతుందని, చివరి దశ కూడా పూర్తయ్యాకనే అధికారికంగా ధ్రువీకరణ, సాధారణ సేవల కోసం రైలే శాఖకు అందజేస్తామని తెలిపింది. ఆటోమేటిక్ డోర్లు, అల్ట్రా–కంఫర్ట్ బెర్తులు, ఆన్‌బోర్డ్ వై–ఫై తదితర అత్యాధునిక వసతులతో విమానం మాదిరి డిజైన్‌తో ఉంటుందని తెలిపింది. కశ్మీర్–కన్యాకుమారి, ఢిల్లీ–ముంబై, హౌరా–చెన్నై తదితర సుదూర ప్రయాణాలు చేసే వారు ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభూతిని పొందొచ్చని రైల్వే శాఖ వివరించింది.

పర్దా పాటించకపోవడం విడాకులకు కారణం కారాదు

అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

లక్నో: భార్య పర్దా (ముసుగు) ధరించకపోవడాన్ని భర్త పట్ల క్రూరత్వం చూపినట్లుగా భావించలేమని, విడాకులు కోరేందుకు దానిని ఒక కారణంగా చెప్పరాదని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. విడాకుల పిటిషన్‌ను దిగువ కోర్టు కొట్టివేస్తూ వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై జస్టిస్ సుమిత్రా దయాళ్ సింగ్, జస్టిస్ దొనాడి రమేశ్‌ల ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. అయితే, ఆ దంపతులు 23 ఏళ్లకు పైగా వైవాహిక బంధాన్ని కొనసాగించడం లేదనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విడాకులు మంజూరు చేసింది. భార్య నుంచి విడాకులు ఇప్పించాలని విజ్ఞప్తి చేసిన పిటిషనర్ అందుకు రెండు కారణాలను పేర్కొన్నారు. అవి.. మానసికంగా వేధించడం, తనతో చెప్పకుండా స్వతంత్రంగా తరచూ బయటకు వెళ్లడం, పర్దా పాటించకపోవడం. వీరికి 1990లో పెళ్లి కాగా, 1992లో కాపురానికి వచ్చింది. 1995లో వీరికి ఒక కుమారుడు పుట్టాడు. అప్పుడప్పుడు కలిసి ఉంటున్నా 23 ఏళ్లకు పైగా వీరు సహజీవనం చేయలేదు. వీరి కుమారుడు ఇప్పుడు మేజర్. 'సుదీర్ఘకాలం భర్తను విడిచిపెట్టినందుకు ఆమె మానసిక హింసకు గురిచేసినట్లుగా పిటిషనర్ వాదించవచ్చు. అదీకాకుండా వీరిద్దరూ విడిపోయి ఇప్పటికే 23 ఏళ్లు గడిచిపోయాయి. ఉద్దేశపూర్వకంగానే ఆమె దూరంగా ఉండటం, భర్తతో వైవాహిక బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు సుముఖంగా లేకపోవడం వల్ల అంతిమంగా ఈ వివాహ బంధం రద్దవుతుంది'అని తెలిపిన ధర్మాసనం.. పిటిషనర్‌కు విడాకులు మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది.



మన్మోహన్‌కు ఖర్గే సహా ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ: దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. శుక్రవారం గురుద్వారా రకాబ్ గంజ్‌లో జరిగిన ప్రార్థనా కార్యక్రమం కీర్తన్, అంతిమ్ గర్దాస్‌లకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్, హరియాణా మాజీ సీఎం భూపేందర్ సింగ్ హుడా, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ తదితరులు హాజరయ్యారు. మన్మోహన్ నివాసంలో జరిగిన అఖండ్ పథ్‌లో గురుగ్రంథ్ సాహిబ్‌ను పఠించారు. మన్మోహన్ సతీమణి గురుశరణ్ కౌర్ పవిత్ర గ్రంథాల నుంచి శబద్ ఆలపించారు.

పెరియ జంట హత్యల కేసు.. 10 మందికి జీవిత ఖైదు

- మాజీ ఎమ్మెల్యే సహా నలుగురికి ఐదేళ్ల శిక్ష
- సీబీఐ కోర్టు సంచలన తీర్పు

కొచ్చి: కేరళ రాష్ట్రం కాసరగోడ్ జిల్లా పెరియలో ఐదేళ్ల క్రితం ఇద్దరు యువజన కాంగ్రెస్ కార్యకర్తల హత్య కేసులో సీబీఐ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. దోషులుగా తేలిన 10 మందికి జీవిత ఖైదును, సీపీఎంకు చెందిన మాజీ ఎమ్మెల్యే కున్హిరామన్ సహా నలుగురికి ఐదేళ్ల కారాగార శిక్షను విధించింది. 10 మందికి జీవిత ఖైదుతోపాటు రూ.2 లక్షల జరిమానాను, ఐదేళ్ల జైలు శిక్ష పడిన నలుగురికి రూ.10 వేల జరిమానాను సైతం విధించింది. 2019 ఫిబ్రవరి 17వ తేదీన పెరియ గ్రామ సమీపంలో కృపేశ్(19), శరత్‌లాల్(24)అనే వారిని సీపీఎం కార్యకర్తలు హత్య చేశారు. ఈ ఘటనకు పెరియ స్థానిక సీపీఎం కమిటీ మాజీ సభ్యుడు పీతాంబరం సూత్రధారిగా సీబీఐ దర్యాప్తులో తేలింది.

ఇజ్రాయెల్ దాడుల్లో మరో 50 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ భీకరదాడులు కొనసాగుతున్నాయి. గురు, శుక్రవారాల్లో జరిగిన దాడుల్లో కనీసం 50 మంది ప్రాణాలు కోల్పోయారు. గురువారం ఉదయం మువాసిలోని మానవతా జోన్‌లోని శరణార్థుల టెంట్లపై జరిగిన దాడిలో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు హమాస్ పోలీస్ అధికారులు సహా 10 మంది మృతి చెందారు. డెయిర్ అల్–బలాహ్‌పై జరిగిన మరో దాడిలో 8 మంది చనిపోయారు. వీరిలో అసోసియేటెడ్ ప్రెస్ జర్నలిస్ట్ కూడా ఉన్నట్లు ధ్రువీకరించారు. ఖాన్‌యూనిస్‌పై జరిగిన ఐదుగురు పోలీసులు మృతి చెందారు. సెంట్రల్ గాజాలోని మఘాజీలోని వీధిలో నడిచి వెళ్తున్న వారిపై జరిగిన దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు చనిపోయారు. అర్ధరాత్రి సమయంలో మఘాజీ, నుసెయిరత్ శరణార్థి శిబిరాలపై జరిగిన దాడుల్లో చిన్నారులు సహా 24 మంది అసువులు బాశారు.

బ్రహ్మపుత్ర నది విషయంలో దేశ ప్రయోజనాలు కాపాడుతాం

భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

న్యూఢిల్లీ: టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 17 బిలియన్ డాలర్లతో భారీ డ్యామ్ నిర్మాణానికి చైనా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే ప్రకటన చేసింది. ప్రాజెక్టు అమల్లోకి వస్తే భారత్ ప్రయోజనాలకు ముప్పు తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలో ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంతో ప్రతిపాదిత చైనా ప్రాజెక్టుపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం స్పందించారు. చైనా డ్యామ్ వ్యవహారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, మన దేశ ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మన జల అవసరాలను చైనాకు తెలియజేస్తున్నామని అన్నారు. బ్రహ్మపుత్ర నది నీటిపై కింది ప్రాంతాలకు కూడా హక్కు ఉందని స్పష్టంచేశారు. మన ఆందోళనను దౌత్య మార్గాల్లో చైనా దృష్టికి తీసుకెళ్తున్నట్లు రణధీర్ జైస్వాల్ వివరించారు.

ఢిల్లీలో దట్టమైన పొగమంచు

200 విమానాల రాకపోకలు ఆలస్యం • ఆలస్యంగా నడిచిన రైళ్లు



న్యూఢిల్లీ: ఉత్తర భారతాన్ని దట్టమైన పొగమంచు చుట్టుముట్టింది. నాలుగు రోజులుగా కొనసాగుతున్న చలి ఐదోరోజు మరింత తీవ్రమైంది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో.. కొన్ని మీటర్ల మేర దృశ్యమానత కనిపించలేదు. ఇది రైలు, విమాన రాకపోకలపై ప్రభావం చూపింది. ఢిల్లీలోని గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విజిబిలిటీ సున్నాకు పడిపోవడంతో 202 విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఢిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా 16 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 7.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఢిల్లీలో జనవరి 8 వరకు పొగమంచు ఉంటుందని, జనవరి 6న తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం..

ఉదయం 8 గంటలకు ఢిల్లీలోని పాలం విమానాశ్రయం 0 మీటర్ల విజిబిలిటీ నమోదైంది. న్యూఢిల్లీలోని సఫ్దర్ జంగ్ విమానాశ్రయం 50 మీటర్ల విజిబిలిటీని నివేదించింది. దీంతో స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిరిండియాతో సహా అనేక విమానయాన సంస్థల విమానాలు ప్రభావితమయ్యాయి. ప్రయాణికులు తమ విమాన షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు కోరాయి. విజిబిలిటీ సరిగా లేకపోతే విమానాలను రద్దు చేస్తామని ప్రకటించాయి. రైళ్ల రాకపోకలపైనా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ నుంచి బయలుదేరే, వచ్చే రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. అయోధ్య ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు, గోరఖ్‌దామ్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలకు పైగా, బీహార్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, శ్రమశక్తి ఎక్స్‌ప్రెస్ మూడు గంటలకు పైగా ఆలస్యంగా నడిచాయి. కొన్ని రూట్లలో టైమింగ్స్ మార్చి నడిపారు. ఈ నెల 8వ తేదీవరకు ఢిల్లీ, లక్నో, బెంగళూరు, అమృత్ సర్, గౌహతిలో పొగమంచు కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఢిల్లీ, రాజస్థాన్‌లోని కోటా, బుండి, సికార్, ఝున్‌ఝును, చురు, శ్రీ గంగానగర్, టోంక్, పంజాబ్లోని అమృత్సర్, గురుదాస్పూర్, తార్న్ తరణ్, కపుర్తలా, హర్యానాలోని కురుక్షేత్ర, అమాబల్, పంచకుల, యమునానగర్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్, లడఖ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, మంచు కురిసే అవకాశం ఉందని తెలిపింది. చలి తీవ్రత దృష్ట్యా 8వ తేదీ వరకు కొన్ని జిల్లాలోని పాఠశాలలను మూసివేయాలని యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది.

సింహాల ఆవాసంలో 5 రోజులు

ప్రాణాలతో బయటపడ్డ ఎనిమిదేళ్ల బాలుడు



అడవి మధ్యలో చిన్న పిల్లాడు.. చుట్టూ గర్జించే సింహాలు.. ఘీంకరించే ఏనుగులు. జంగిల్ బుక్‌లోని మోగ్లీ గుర్తొస్తున్నాడు కదూ! అది కల్పిత కథ. నిజ జీవితంలో అంతకు మించిన సాహసాన్ని చేశాడు జింబాబ్వేకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు. ఐదురోజులపాటు క్రూర మృగాల ఆవాసంలో బతికాడు. ఈ ఆధునిక మోగ్లీ పేరు.. టినోటెండా పుదు.

పండ్లు తింటూ.. చెలిమల్లో నీళ్లు తాగుతూ..

జింబాబ్వేలోని మాటుసడోనా గేమ్ పార్క్... టినోటెండా పుదు ఇంటికి 23 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎందుకు? ఎలా? వెళ్లాడో తెలియదు. ఒక్కసారి అడవిలోకి వెళ్లాక బయటపడటానికి మార్గం తెలియలేదు. అయితేనేం అధైర్య పడలేదు. బతికేందుకు అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అడవి పండ్లు తింటూ ఆకలి తీర్చుకున్నాడు. ఎండిపోయిన నదీ తీరాల వెంబడి.. కర్రలతో చిన్న చిన్న చెలిమెలు తవ్వి వచ్చిన నీటితో దాహం తీర్చుకుని ప్రాణాలు నిలుపుకొన్నాడు. రాత్రిపూట రాతి బండలపై నిద్రపోయాడు. మరోవైపు కనిపించకుండా పోయిన బాలుని కోసం ఊరంతా వెదికిన తల్లిదండ్రులు చివరకు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానిక బృందాలతో కలిసి సెర్చ్ పార్టీ ప్రతిరోజూ డ్రమ్ములు మోగిస్తూ బాలుడిని పట్టుకోవడానికి విఫల ప్రయత్నాలు చేసింది. నాలుగురోజులపాటు వెదికి ఆశలు వదులుకుంది. చివరి అవకాశంగా 5వ రోజు పార్క్ రేంజర్లు వాహనంపై అడవిమొత్తం గాలించడం మొదలుపెట్టారు. వాహనం శబ్దం విన్న బాలుడు అరుస్తూ పరుగెత్తుకుంటూ వచ్చాడు. కానీ అప్పటికే అక్కడినుంచి దూరంగా వచ్చేశారు. చివరకు తడిగా ఉన్న ఓ ప్రాంతంలో చిన్న చిన్న తాజా పాద ముద్రలు కనిపించడంతో బాలుడు ఇక్కడే ఉంటాడని భావించారు. వాహనాన్ని వెనక్కి తిప్పి వెళ్లారు. ఎట్టకేలకు పుదుని కనిపెట్టగలిగారు.

ప్రశంసల వర్షం..

జింబాబ్వే పార్క్స్ అండ్ వైల్డ్ లైఫ్ మేనేజ్ మెంట్ అథారిటీ ప్రకారం ఆఫ్రికాలో అత్యధిక సింహాలున్న పార్క్ అదే. ప్రస్తుతం అక్కడ 40 సింహాలున్నాయి. 1,470 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ఉద్యానవనం సింహాలతోపాటు జీబ్రాలు, ఏనుగులు, హిప్పోలు, జింకలకు నిలయంగా ఉంది. అలాంటి పార్క్ నుంచి ప్రాణాలతో బయటపడటం అసాధ్యం. కానీ ఎంతో ధైర్యంతో ప్రాణాలతో బయటపడ్డ బాలుని స్టోరీని.. స్థానిక ఎంపీ ముట్సా మురోంబెడ్జి ఎక్స్‌లో పంచుకున్నారు. పుదు ధైర్యసాహసాలపై సోషల్ మీడియాలో ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి?

రాజ్యాంగబద్ధ సంస్థలు

అటార్నీ జనరల్

భారత రాజ్యాంగంలోని ఐదో భాగం, ఒకటో అధ్యాయంలో అటార్నీ జనరల్ పదవి గురించి వివరించారు. ఆర్టికల్ 76 ప్రకారం ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి అటార్నీ జనరల్‌ను నియమిస్తారు. ఆర్టికల్ 76(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి ఉండాల్సిన అర్హతలన్నీ అటార్నీ జనరల్ నియామకానికి అవసరం. 'అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా' పదవిని బ్రిటన్ నుంచి గ్రహించారు. అటార్నీ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి మొదటి న్యాయాధికారి, భారతదేశంలోనూ తొలి న్యాయాధికారి. సుప్రీం కోర్టులో, దేశంలోని అన్ని హైకోర్టుల్లో వాదించే అధికారం ఉన్న ఏకైక వ్యక్తి అటార్నీ జనరల్. కేంద్రానికి సంబంధించిన అన్ని రకాల వివాదాంశాలపై న్యాయస్థానాల్లో వాదించే అధికారం ఉన్న ప్రధాన న్యాయాధికారి ఇతడే. విధి నిర్వహణలో అటార్నీ జనరల్‌కు ఇద్దరు సోలిసిటర్ జనరల్స్, నలుగురు అడిషనల్ సోలిసిటర్ జనరల్స్ సహాయం చేస్తారు.

అటార్నీ జనరల్స్

పేరు	పదవీకాలం
ఎం.సి. సెతల్వాడ్	1950-1963
సి.కె. దప్తరి	1963-1968
నిరిండె	1968-1977
ఎస్.వి.గుప్తా	1977-1979
ఎల్.ఎన్. సిన్హా	1979-1983
కె.పరాశరన్	1983-1989
సోలి జె. సొరాబ్జీ	1989-1990
జి.రామస్వామి	1990-1992
మిలాన్ కె. బెనర్జీ	1992-1996
అశోక్ కె. దేశాయ్	1996-1998
సోలీ జె. సొరాబ్జీ	1998-2004
మిలాన్ కె. బెనర్జీ	2004-2009
గులాం ఇ. వాహనవతి	2009-2014
ముకుల్ రోహిత్గి	2014-2017
కె.కె వేణుగోపాల్	2017-2022
ఆర్. వెంకట రమణి	2022 - ప్రస్తుతం

అటార్నీ జనరల్ పదవిలో ఉన్న వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించరాదు. ఆర్టికల్ 88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్‌లో సభ్యుడు కాకపోయినా ఉభయ సభల చర్చల్లో పాల్గొనే అధికారం ఉంది. కానీ ఓటు వేసే అధికారం లేదు. కేంద్రం అనుమతి లేకుండా అటార్నీ జనరల్ ఎవరి కేసుల్లోనూ వాదనలు వినిపించకూడదు. ఆర్టికల్ 76(4) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం చూరగొన్నంత వరకు అటార్నీ జనరల్ అధికారంలో ఉంటాడు. రాష్ట్రపతి నిర్ణయించిన జీతభత్యాలను పొందుతాడు. వేతనంతోపాటు ఇతర సౌకర్యాలను పొందుతాడు. అటార్నీ జనరల్ రాజీనామా లేఖను రాష్ట్రపతికి సమర్పించాలి. భారత రాష్ట్రపతి న్యాయపరమైన అంశాలపై సూచనలు, సలహాలు కోరితే వివరణాత్మకమైన సూచనలు, సలహాలు ఇచ్చే అధికారం అటార్నీ జనరల్‌కు ఉంది.

అడ్వకేట్ జనరల్ (ఎ.జి.)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 ప్రకారం సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన మేరకు అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ నియమిస్తారు.
రాష్ట్రంలో మొదటి న్యాయాధికారి అడ్వకేట్ జనరల్. గవర్నర్ విశ్వాసం చూరగొన్నంత వరకు ఎ.జి. పదవిలో కొనసాగుతాడు. రాష్ట్ర శాసనసభ చర్చల్లో అడ్వకేట్ జనరల్ పాల్గొంటాడు, కానీ ఓటువేసే అధికారం లేదు. అడ్వకేట్ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి హైకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలుండాలి. ఆర్టికల్ 165(1), 165(3)లో అడ్వకేట్ జనరల్ అర్హతలు, జీతభత్యాలను స్పష్టంగా ప్రస్తావించారు. గవర్నర్ నిర్ణయం మేరకు రాష్ట్ర సంఘటిత నిధి నుంచి అడ్వకేట్ జనరల్ వేతనాన్ని చెల్లిస్తారు. ఆర్టికల్ 194(4) ప్రకారం ఎమ్మెల్యేలకు వర్తించే హక్కులు, రక్షణలన్నీ అడ్వకేట్ జనరల్‌కు వర్తిస్తాయి. ఆయన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గంలో అంతర్భాగం. కానీ రాష్ట్ర మంత్రి మండలిలో అంతర్భాగం కాదు.

అడ్వకేట్ జనరల్స్

పేరు	పదవీకాలం
డి.నరసరాజు	1956-1963
బి.వి.సుబ్రమణ్యం	1964-1969
పి.రామచంద్రారెడ్డి	1969-1983
కె.సుబ్రమణ్యంరెడ్డి	1983-1986
ఇ.మనోహర్	1986-1988
వి.వెంకటరమణయ్య	1988-1990
ఆర్.వేణుగోపాల్‌రెడ్డి	1990-1990
వి.ఆర్.రెడ్డి	1991-1991
టి.అనంతబాబు	1991-1992
ఎస్.వెంకట్‌రెడ్డి	1992-1994
ఎస్.రామచంద్రారావు	1994-1995
వి.వెంకటరమణయ్య	1995-2000
టి.అనంతబాబు	2000-2004
డి.సుదర్శన్‌రెడ్డి	2004-2005
సి.వి.మోహన్‌రెడ్డి	2005-2009
డి.వి.సీతారామ్మూర్తి	2009-2011
ఎ.సుదర్శన్‌రెడ్డి	2011-2014
కె.రామకృష్ణారెడ్డి(టీజీ)	2014-2017
డి. ప్రకాశ్‌రెడ్డి(టీజీ)	2017-2018
బి. శివానంద ప్రసాద్(టీజీ)	2018-2023
ఎ. సుదర్శన్‌రెడ్డి (టీజీ)	2023 - ప్రస్తుతం

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

రాజ్యాంగంలోని ఐదో భాగం, ఐదో అధ్యాయంలో 148 నుంచి 151 వరకు ఉన్న అధికరణలు కాగ్ గురించి తెలుపుతున్నాయి. ఆర్టికల్ 148 ప్రకారం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 149 ప్రకారం కేంద్రం, రాష్ట్రాల ఖాతాలను కాగ్ నిర్వహిస్తాడు. ఆర్టికల్ 150 ప్రకారం కేంద్ర, రాష్ట్రాల ఖాతాలను కాగ్ తనిఖీ చేస్తాడు. ఆర్టికల్ 151 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆడిట్ వార్షిక నివేదికను కాగ్ రాష్ట్రపతికి సమర్పిస్తాడు. రాష్ట్రపతి పార్లమెంట్‌కు పంపిస్తారు.

రాష్ట్రాలకు సంబంధించిన ఖాతాలను కాగ్ తనిఖీ చేసి, వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తాడు. గవర్నర్ రాష్ట్ర శాసనసభకు సమర్పిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ కాలం ఆరేళ్లు లేదా ఆ పదవిని చేపట్టిన వ్యక్తికి 65 ఏళ్లు వచ్చే వరకు. కాగ్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే పార్లమెంట్ అభిశంసన ద్వారా రాష్ట్రపతి అతణ్ని పదవి నుంచి తొలగిస్తారు. ప్రభుత్వ ఖాతాల సంఘానికి కాగ్ కళ్లు, చెవుల్లాంటివాడు. భారత సంఘటిత నిధి నుంచి కేంద్రం ఖర్చు చేసిన ధనం చట్ట ప్రకారం ఉందా? లేదా అని కాగ్ తనిఖీ చేస్తాడు.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా కాగ్ పరిధి నుంచి అకౌంటింగ్ బాధ్యతలను వేరు చేశారు. కాగ్ ప్రభుత్వ కంపెనీల ఖాతాలను వ్యాపార పద్ధతిలో ఆడిట్ చేస్తాడు. భారత ప్రభుత్వంలో రాజ్యాంగం సృష్టించిన ముఖ్య అధికారి కాగ్ అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కాగ్ వేతనం, ఇతర సౌకర్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. కాగ్ వేతనాన్ని పార్లమెంట్ చట్ట ప్రకారం నిర్ణయిస్తారు. పదవిని స్వీకరించేటప్పుడు రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడతానని కాగ్ ప్రమాణం చేయాలి. కాగ్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తి ఏ ఇతర ప్రభుత్వ నియామకాలకు అర్హుడు కాదు.

కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ఆగంతుక నిధి, కేంద్ర పబ్లిక్ నిధి, రాష్ట్ర పబ్లిక్ నిధి, శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల ఖాతాలను కాగ్ పరిశీలించి నివేదిక ఇస్తాడు. కాగ్ పదవిని బ్రిటిష్ వ్యవస్థ నుంచి తీసుకున్నారు. బ్రిటన్‌లో ఈ పదవిని కాంప్ట్ అని పిలుస్తారు. ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, ఎల్ఐసీ, ఎఫ్‌సీఐ లాంటి సంస్థలు, కార్పొరేషన్లు పూర్తిగా ప్రైవేట్ ఆడిటర్‌లతో తమ ఖాతాలను ఆడిట్ చేయిస్తాయి. ఈ అంశంలో కాగ్‌కు సంబంధం ఉండదు. ఈ సంస్థలు తమ వార్షిక ఖాతాల నివేదికలను పార్లమెంట్‌కే సమర్పిస్తాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



కాగ్ వెలికితీసిన కుంభకోణాలు

- టెలికాం 2జీ (రెండోతరం) స్పెక్ట్రం వేలం.
- ముంబై ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణం, కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి, బొగ్గు గనుల కేటాయింపులో అవకతవకలు.
- ఓఎన్‌జీసీ(ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) నుంచి వేలం ప్రక్రియ నిర్వహించకుండానే గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసేందుకు రిలయన్స్ సంస్థకు అనుమతి ఇవ్వడం. దేవాస్ అనే ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చేలా అత్యంత విలువైన ఎస్-బ్యాండ్ ప్రసారాలకు రహస్యంగా అనుమతి మంజూరు చేయడం.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లోపాలు.
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ కంపెనీ హెలికాప్టర్ కొనుగోలు ఒప్పందం.

కాగ్ పదవిని చేపట్టిన వ్యక్తులు

పేరు	పదవీకాలం
నరహరి రావ్	1949-1954
ఎ.కె. చాంద్	1954-1960
ఎస్.హెచ్.ఎ.కె.రాయ్	1960-1966
ఎస్.రంగనాథన్	1966-1972
ఎ.భక్షి	1972-1978
జి.ప్రకాశ్	1978-1984
టి.ఎన్. చతుర్వేది	1984-1990
సి.జి. సోమయ్య	1990-1996
వి.కె. షుంగ్లు	1996-2002
వి.ఎన్. కౌల్	2002-2008
వినోద్‌రాయ్	2008-2013
శశికాంత్ శర్మ	2013-2017
రాజీవ్ మహర్షి	2017-2020
గిరిష్ చంద్రముర్ము	2020-2024
కె. సంజయ్ మూర్తి	2024 - ప్రస్తుతం

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీకాలం ?
ఎ) ఐదేళ్లు బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు డి) నాలుగేళ్లు
2. అటార్నీ జనరల్ ఆ పదవిలో ఎంత కాలం పాటు కొనసాగుతారు?
ఎ) నాలుగేళ్లు బి) ఆరేళ్లు
సి) ఏడేళ్లు
డి) రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు
3. కింద పేర్కొన్న ఏ బాధ్యతను భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వర్తించరు?
ఎ) భారత సంఘటిత నిధికి చెందిన వ్యయానికి సంబంధించి తనిఖీ, నివేదిక
బి) ఆగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ల తనిఖీ, నివేదిక
సి) అన్ని రకాల వాణిజ్యం, ఉత్పత్తి, లాభం, నష్టాలకు సంబంధించిన తనిఖీ, నివేదిక
డి) ప్రజా ధనానికి సంబంధించిన వసూళ్లు, విడుదల నియంత్రణ; కోశాధికారి వద్ద ప్రభుత్వ ఆదాయాన్ని నిల్వ చేసేలా చూడటం
4. ఏ నివేదికలను పార్లమెంట్‌కు సమర్పించేలా రాష్ట్రపతి చర్యలు తీసుకుంటారు?
ఎ) కేంద్ర ఆర్థిక సంఘం
బి) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
సి) జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్
డి) పైవన్నీ
5. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడిగా వర్తించే రాజ్యాంగ సంస్థలు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) అటార్నీ జనరల్
సి) సోలిసిటర్ జనరల్
డి) పైవన్నీ సరైనవే
6. అటార్నీ జనరల్‌కు సంబంధించి సరైంది?
ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హతలు ఉండాలి
బి) పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనవచ్చు
సి) పార్లమెంట్ సభ్యులకు ఉన్న అధికారాలు ఉంటాయి
డి) పైవన్నీ సరైనవే
7. ఏ రాజ్యాంగ బద్ధమైన పదవిని చేపట్టిన వారు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ నియామకాలకు అర్హులు కారు?
ఎ) కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్
బి) యూపీఎస్సీ చైర్మన్
సి) అటార్నీ జనరల్
డి) ఎ, బి
8. అటార్నీ జనరల్‌గా నియమితుడయ్యే వ్యక్తికి కింద పేర్కొన వారిలో ఎవరితో సమానమైన అర్హతలు ఉండాలి?
ఎ) హైకోర్టు న్యాయమూర్తి
బి) సుప్రీంకోర్టు న్యాయమూర్తి
సి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
9. భారతదేశంలో అత్యున్నత న్యాయాధికారి ఎవరు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) అటార్నీ జనరల్
సి) అడ్వకేట్ జనరల్
డి) సోలిసిటర్ జనరల్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) డి;
5) ఎ; 6) డి; 7) డి; 8) బి;
9) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో బాలకార్మికులు పనిచేయడాన్ని నిషేధించే ఆర్టికల్?
ఎ) ఆర్టికల్ 24 బి) ఆర్టికల్ 25
సి) ఆర్టికల్ 26 డి) ఆర్టికల్ 22
2. ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు న్యాయ సలహా కోరవచ్చు?
ఎ) 142 బి) 144 సి) 143 డి) 145
3. రాష్ట్రపతిగా ఎన్నికయ్యేందుకు గరిష్ట వయసు?
ఎ) 75 బి) 70
సి) 80 డి) పరిమితి లేదు
4. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతున్న ఆర్టికల్స్?
ఎ) 12-32 బి) 13-32
సి) 13-25 డి) 12-35
5. రాజ్యాంగ సవరణ గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్ 367 బి) ఆర్టికల్ 368
సి) ఆర్టికల్ 369 డి) ఆర్టికల్ 370
6. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం కల్పించే అంశాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
ఎ) ఫ్రాన్స్ బి) ఐర్లాండ్
సి) కెనడా డి) జర్మనీ
7. ప్రధానమంత్రి సమానుల్లో ప్రథముడు అని అభిప్రాయపడింది?
ఎ) లాస్కీ బి) లార్డ్‌మార్లీ
సి) ఐవర్ జెన్నీ డి) రామ్‌సే మ్యూర్
8. పార్లమెంట్‌కు ఏజెంట్‌గా వ్యవహరించేది?
ఎ) స్పీకర్ బి) అటార్నీ జనరల్
సి) కాగ్ డి) సొలిసిటర్ జనరల్
9. జాతీయ మహిళా కమిషన్ తొలి అధ్యక్షురాలు?
ఎ) మోహినిగిరి బి) పూర్ణిమా అద్వానీ
సి) విభా పార్థసారథి
డి) జయంతీ పట్నాయక్
10. పౌరహక్కుల రక్షణ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1951 బి) 1952
సి) 1953 డి) 1955
11. కనీస వేతనాల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1996 బి) 1980
సి) 1982 డి) 1948

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) డి;
5) బి; 6) డి; 7) బి; 8) సి;
9) డి; 10) డి; 11) డి.

గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?

మాదిరి ప్రశ్నలు

1. 'ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మామిడి బి) వేప
సి) మోదుగ డి) తుమ్మ
2. లెగ్యూమ్ మొక్కల్లో నత్రజని స్థాపన చేసే బ్యాక్టీరియా ఏది?
ఎ) రైజోబియం బి) అజటోబాక్టర్
సి) అజోస్పైరిల్లం డి) రోడోస్పైరిల్లం
3. వరి పొలాల్లో నత్రజని కోసం ఏ జీవ ఎరువును వాడతారు?
ఎ) రైజోబియం బి) గ్రీన్‌మాన్యూర్
సి) అజొల్లా డి) క్లాస్ట్రీడియం
4. శంకువు రూపంలో ఉండే పుష్పాలు వేటిలో ఉంటాయి?
ఎ) వివృత బీజాలు బి) ఆవృత బీజాలు
సి) టెరిడోఫైటా డి) బ్రయోఫైటా
5. కిందివాటిలో వేగంగా పెరిగే మొక్క ఏది?
ఎ) చిక్కుడు బి) మల్లె
సి) వెదురు డి) నందివర్ధనం
6. నత్తల ద్వారా జరిగే పరాగ సంపర్కం?
ఎ) కీరిస్టిరోఫిరి బి) మెలకోఫిలి
సి) సర్పెంటోఫిలి డి) ఎంటమోఫిలి
7. ఆధునిక జన్యు శాస్త్ర పితామహుడెవరు?
ఎ) మెండల్ బి) వాట్సన్
సి) హెచ్.జి. ఖొరానా
డి) టి.హెచ్. మోర్గాన్
8. వరిలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 12 బి) 24
సి) 36 డి) 46
9. చెరకులో ఎర్రకుళ్లు తెగులు దేని వల్ల సోకుతుంది?
ఎ) పైరిక్యులేరియా బి) పైటాప్‌రోరా
సి) కొలిటోట్రైఖం డి) పక్సీనియా
10. వైరస్ అంటే అర్థమేమిటి?
ఎ) స్పాంజ్ బి) విషం
సి) ఆమ్లం డి) ఏదీకాదు
11. పింఛ్ పక్షులపై పరిశోధనలు చేసినవారు?
ఎ) డార్విన్ బి) మెండెల్
సి) మోర్గాన్ డి) రాబర్ట్‌హుక్
12. రిసర్పిన్ దేని నుంచి లభిస్తుంది?
ఎ) రావుల్ఫియా బి) కేసియా
సి) ఆసిమం డి) కాల్షియా
13. మొదటి నిజమైన నేల మొక్కలేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) జిమ్నోస్పెర్మ్స్ డి) ఆంజియోస్పెర్మ్స్
14. C_3 పథంలో ఏర్పడే మొదటి పదార్థం ఏది?
ఎ) OAA బి) PGA
సి) PHB డి) RUBP
15. మొక్కలు వాతావరణంలోకి విడుదల చేసే O_2 దేని నుంచి లభిస్తుంది?
ఎ) CO_2 బి) సూర్యరశ్మి
సి) పత్రహరితం డి) H_2O
16. నీటి బిందువుల రూపంలో పత్రం శీర్షం నుంచి విడుదలవడాన్ని ఏమంటారు?
ఎ) ట్రాన్స్పిరేషన్ బి) ఎవాపరేషన్
సి) గట్టేషన్ (Guttation) డి) ట్రాన్స్‌క్రిప్షన్
17. ఫలాలు త్వరగా పక్వం చెందడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిన్లు బి) జిబ్బరిలిన్లు
సి) సైటోకైనిన్లు డి) ఇథిలిన్
18. ఏ కాంతిలో కిరణజన్య సంయోగక్రియ ఎక్కువగా జరుగుతుంది?
ఎ) నీలం బి) ఎరుపు
సి) ఆకుపచ్చ డి) ఇండిగో
19. 'కణ భాండాగారం' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మైటోకాండ్రియా బి) రైబోజోమ్స్
సి) రిక్తిక డి) హరిత రేణువు
20. ఏ మూలక లోపం వల్ల 'చిన్న ఆకుతెగులు' సంభవిస్తుంది?
ఎ) Mn బి) Zn సి) Fe డి) K
21. 'ప్రకృతి పారిశుధ్య కార్మికులు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) వైరస్ బి) బ్యాక్టీరియా
సి) ప్రోటోజోవా డి) ఫంగస్
22. కిందివాటిలో ఉప ఉత్పన్నం ఏది?
ఎ) జిగురు బి) లేటెక్స్
సి) రెజిన్లు డి) పైవన్నీ
23. గోల్డెన్‌రైస్‌లో ఉండే విటమిన్ ఏది?
ఎ) విటమిన్ -ఎ బి) విటమిన్ - సి
సి) విటమిన్ - డి డి) విటమిన్ -ఇ
24. కణజాలవర్ధనంలో పూర్తి మొక్కను/ మొక్కలను ఏర్పరచగలిగే కణ సామర్థ్యాన్ని ఏమంటారు?
ఎ) టొటిపొటెన్సీ బి) ఎఫిసియెన్సీ
సి) పార్థినోకార్పి డి) ఎఫినిటీ
25. సాధారణంగా శిలీంద్రాలు అనేవి?
ఎ) స్వయం పోషకాలు
బి) పరాన్నజీవులు సి) పూతికాహారులు
డి) సహజీవన జీవులు
26. ట్రైకోడెర్మా అనేది ఒక..?
ఎ) శిలీంద్రం బి) శైవలం
సి) బ్యాక్టీరియా డి) ప్రోటోజోవా
27. అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు నోబెల్ బహుమతి ఎప్పుడు లభించింది?
ఎ) 1928 బి) 1930
సి) 1919 డి) 1945
28. జంతు రాజ్యంలో అతి పెద్ద వర్గం ఏది?
ఎ) ప్రోటోజోవా బి) ఆర్థ్రోపొడ
సి) మొలస్కా డి) క్షీరదాలు
29. జీవితాంతం నీటిని తీసుకోని జీవి ఏది?
ఎ) డెవిల్ ఫిష్ బి) కటిల్ ఫిష్
సి) సిల్వర్ ఫిష్ డి) స్టార్ ఫిష్
30. 'గైనకోమాస్టిజం' దేనిలో కనిపిస్తుంది?
ఎ) ప్లాటిపస్ బి) ఎఖిడ్నా
సి) కంగారు డి) వానపాము
31. కుక్కలో క్రోమోజోముల సంఖ్య?
ఎ) 72 బి) 36
సి) 78 డి) 46
32. దయాఫ్రాం ఏ వర్గానికి చెందిన జీవుల్లో ఉంటుంది?
ఎ) క్షీరదాలు బి) సరీసృపాలు
సి) పక్షులు డి) ఉభయచరాలు
33. వానపాములో చలనాంగాలేవి?
ఎ) వాజాలు బి) పిచ్చాలు
సి) సీటాలు డి) ఈకలు
34. కీటకాల రక్తంలో ఉండేది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

ఎ) హీమోగ్లోబిన్ బి) హీమోసయనిన్
సి) హీమోక్లోరిబియం
డి) పైవన్నీ
35. ఉద్దయ కందరాలు వేటిలో ఉంటాయి?
ఎ) పక్షులు బి) కీటకాలు
సి) సరీసృపాలు డి) క్షీరదాలు
36. ఏనుగు గర్భావధి కాలం ఎంత?
ఎ) 330-350 రోజులు
బి) 630-660 రోజులు
సి) 270-280 రోజులు
డి) 150-160 రోజులు
37. చేపల ద్వారా లభించే విటమిన్లేవి?
ఎ) బి, సి బి) ఎ, ఇ
సి) ఎ, డి డి) బి, డి
38. రక్తవర్గం Bలో ఉండే యాంటీబాడీస్?
ఎ) A బి) B సి) AB డి) O
39. జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం PH విలువ ఎంత?
ఎ) 3.0 బి) 2.0
సి) 4.5 డి) 7.4
40. గాంబియా జ్వరం దేనివల్ల సంభవిస్తుంది?
ఎ) ట్రిపానోసోమా బి) ప్లాస్మోడియం
సి) లీష్మానియా డి) ఫైలేరియా
41. పాలలో ఉండే చక్కెర ఏది?
ఎ) లాక్టోస్ బి) కేసిన్
సి) సుక్రోస్ డి) ఫ్రక్టోస్
42. నాడీ వ్యవస్థలో ముఖ్యంగా ఉపయోగపడే మూలకం ఏది?
ఎ) Na బి) Ca
సి) P డి) I
43. తెలంగాణ రాష్ట్ర పక్షి ఏది?
ఎ) పావురం బి) పాలపిట్ట
సి) కోకిల డి) నెమలి
44. ఎముకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) కాంకాలజీ బి) అంకాలజీ
సి) ఆస్టియాలజీ డి) ఆప్తమాలజీ
45. ప్లనేరియాలో విసర్జకావయవాలు ఏవి?
ఎ) మాల్పీజియన్ నాళాలు
బి) ఫ్లేమ్ సెల్స్ సి) వృక్కాలు
డి) ట్రాఖియా
46. 'S' ఆకారంలో కేంద్రకం వేటిలో ఉంటుంది?
ఎ) అసిడోఫిల్స్ బి) న్యూట్రోఫిల్స్
సి) బేసోఫిల్స్ డి) లింఫోసైట్స్
47. పెరుగుదల హార్మోన్ లోపం వల్ల చిన్న పిల్లల్లో సంభవించే వ్యాధి?
ఎ) క్రిటినిజం బి) జిగాంటిజం
సి) ఆస్టియోమలేషియా
డి) ఆర్థ్రైటిస్
48. స్త్రీలలో ఉండే క్రోమోజోములు?
ఎ) XX బి) XY
సి) XXY డి) XYX

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) సి; 4) ఎ;
5) సి; 6) బి; 7) డి; 8) బి;
9) సి; 10) బి; 11) ఎ; 12) ఎ;
13) బి; 14) బి; 15) డి; 16) సి;
17) డి; 18) బి; 19) ఎ; 20) బి;
21) బి; 22) డి; 23) ఎ; 24) ఎ;
25) సి; 26) ఎ; 27) డి; 28) బి;
29) సి; 30) ఎ; 31) సి; 32) ఎ;
33) సి; 34) బి; 35) ఎ; 36) బి;
37) సి; 38) ఎ; 39) బి; 40) ఎ;
41) ఎ; 42) ఎ; 43) బి; 44) సి;
45) బి; 46) సి; 47) ఎ; 48) ఎ;

విద్య,ఉద్యోగ సమాచారం

ఎన్‌సీహెచ్ఎం జేఈఈ-2025 పరీక్ష

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్ఎం-సీటీ) ఆధ్వర్యంలో.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ-హెచ్‌హెచ్ఏ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్ఎం జేఈఈ)-2025 పరీక్షను నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు
బీఎస్సీ-హెచ్‌హెచ్ఏ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్).

అర్హత
అభ్యర్థులు 10+2 ఉత్తీర్ణులవ్వాలి.
తప్పనిసరిగా ఇంగ్లిష్ సబ్జెక్టులో ఉత్తీర్ణులై ఉండాలి.

పరీక్ష విధానం
కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మొత్తం 200 ప్రశ్నలు ఉంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్(30 ప్రశ్నలు), రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్(30 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(30 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(60 ప్రశ్నలు), ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్(50 ప్రశ్నలు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు.

దరఖాస్తు విధానం
ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది
15.02.2025.

దరఖాస్తు సవరణ తేదీలు
17.02.2025 నుంచి 20.02.2025.

హాల్ టికెట్‌ల డౌన్‌లోడ్ తేది
త్వరలో ప్రకటిస్తారు.

పరీక్షతేది
27.04.2025(ఆదివారం). ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు

వెబ్‌సైట్
https://exams.nta.ac.in

ఆధునికీకరణతోనే అదనపు నిల్వ సామర్థ్యం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

నిల్వ సామర్థ్యం (Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

1994–95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990–91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013–14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు - గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన వాటా మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది.

2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనేక అనుభవపూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.



నిల్వ సామర్థ్యం - ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం: గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.

కోల్డ్ స్టోరేజీలు

భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళాదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్తోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి. వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది.

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందు వల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతాల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్థత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి - బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

Understand the Author's Tone..

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important dthe author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle
   5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
    1) The queen who came to see
    2) The lady 3) The kid
    4) The tigress 5) The author
11. The synonym of **forward** is
    1) Rearward 2) Onward
    3) Inward 4) Review
    5) Rejoice
12. The antonym of '**stretched**' is
    1) Expand 2) Prolong
    3) Lengthen 4) Elongate
    5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
    1) The total population
    2) A large part of the population
    3) Some part of the population
    4) Half of the population
    5) Less than half of the population
14. What is the underlying theme of the paragraph?
    1) India is a great military power
    2) India is a backward country
    3) India is fast developing into a big power
    4) India has poor economy
    5) India can never develop
15. What is the meaning of the line "India is as great as France"?
    1) India is small as compared to France
    2) India is greater than France
    3) India is on the same level as France
    4) India cannot be compared with France
    5) No other country can be compared with India

ANSWERS:

1) 1	2) 1	3) 2	4) 3
5) 3	6) 5	7) 5	8) 5
9) 4	10) 4	11) 1	12) 5
13) 3	14) 3	15) 3	